ఈనాడు

విజయవాడ 5-2-2026 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 176

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

యమ స్పీడు!

వేగం కన్నా... ప్రాణం మిన్న...

...అనేక వాహనాలపై రాసి ఉండే ఈ మంచిమాట... చూసీ చూడనట్టు వెళ్లిపోతున్నాం. ఎవరో తరుముతున్నట్టు, పరిమితికి మించిన వేగంతో దూసుకుపోతున్న వారి వల్ల రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. రాష్ట్రంలో ప్రతి రెండు గంటలకు సగటున 4 రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా... వాటిలో 3 అతివేగం వల్లే చోటుచేసుకుంటున్నాయి. 18 మంది ప్రాణాలు కోల్పోతుంటే వారిలో 14 మంది మరణాలకు కారణం అదుపు తప్పిన వేగమే.

అసలు గమ్యస్థానానికి శాశ్వతంగా వెళ్లలేకపోవటం కంటే.. ఓ గంటో, రెండు గంటలో ఆలస్యంగా చేరుకోవటం వల్ల నష్టమేంటి?

మన రాష్ట్రంలో...

2019 నుంచి 2023 మధ్య అతి వేగం కారణంగా **81,747** ప్రమాదాలు చోటు చేసుకుంటే...


30,919 మంది బలైపోయారు.

83,076 మంది గాయాలపాలయ్యారు.

- మొత్తం ప్రమాదాల్లో అతివేగం వల్ల జరిగే ప్రమాదాల వాటా ఏటా పెరుగుతోంది. 2019 నాటికి ఇవి 69.94 శాతంగా ఉండగా.. 2023 నాటికి 86 శాతానికి పెరిగాయి. సమస్య తీవ్రతకు ఈ గణాంకాలు అద్దం పడుతున్నాయి.
- 2023-25 మధ్య రాష్ట్రంలో జరిగిన ప్రమాదాల్ని విశ్లేషించిన రవాణా శాఖ.. 79 శాతం ప్రమాదాలు అతివేగం వల్లే జరిగాయని తేల్చింది.

గతేడాది ఆగస్టు నుంచి నవంబరు మధ్య 4 నెలల వ్యవధిలో రాష్ట్రంలో 1.20 లక్షల వాహనాలను అతివేగంతో వెళుతున్నట్లు గుర్తించి చలానాలు వేశారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనం ప్రకారం వాహనాల సగటు వేగం 1 శాతం పెరిగితే ప్రాణాంతక ప్రమాదాల ముప్పు 4 శాతం, తీవ్రమైన ప్రమాదాల ముప్పు 3 శాతం మేర పెరుగుతుంది. సగటు వేగం 5 శాతం తగ్గిస్తే మరణాలు 20 శాతం తగ్గుతాయి.



కారు నడుపుతున్నప్పుడు 36 మీటర్ల దూరంలో ఓ వ్యక్తిని లేదా ఏదైనా అడ్డంకిని గుర్తించి బ్రేక్ వేస్తే వాహన వేగాన్ని బట్టి ప్రమాద ముప్పు ఎలా ఉంటుందో చూద్దాం...

గంటకు 50 కి.మీ వేగంతో ప్రయాణిస్తున్నప్పుడు బ్రేక్ వేస్తే వాహనం 27 మీటర్ల దూరంలో ఆగుతుంది. 36 మీటర్ల దూరంలో ఉన్న వ్యక్తిని ఢీకొట్టదు.

గంటకు 70 కి.మీ వేగంతో ప్రయాణిస్తున్నప్పుడు బ్రేక్ వేస్తే వాహనం 46 మీటర్ల దూరంలో ఆగుతుంది. గంటకు 43 కి.మీ వేగంతో వెళ్లి ఢీకొడుతుంది.

గంటకు 80 కి.మీ వేగంతో ప్రయాణిస్తున్నప్పుడు బ్రేక్ వేస్తే వాహనం 57 మీటర్ల దూరంలో ఆగుతుంది. గంటకు 62 కి.మీ వేగంతో వెళ్లి ఢీకొడుతుంది.

(ఆధారం: ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పీడ్ మేనేజ్‌మెంట్ నివేదిక)

మితిమీరితే.... యమపాశమే...

- మితిమీరిన వేగంతో వాహనం నడిపితే దాన్ని నియంత్రించటం కష్టమవుతుంది.
- ప్రమాదకర పరిస్థితి ఎదురైనప్పుడు దాన్నుంచి తప్పించుకోవటానికి, స్పందించటానికి డ్రైవర్‌కు తగినంత సమయం ఉండదు
- అకస్మాత్తుగా వాహనం అదుపు తప్పి డివైడర్లు వంటి వాటిని ఢీకొనే ముప్పు పెరుగుతుంది.
- ఇతర వాహనాల వేగాన్ని సరిగ్గా అంచనా వేసే సామర్థ్యం తగ్గిపోతుంది. దీని వల్ల ఓవర్‌టేకింగ్ లేదా లేన్ మార్పుల సమయంలో తీవ్ర ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువవుతుంది.
- వాహన వేగం పెరిగే కొద్దీ గతిశక్తి కూడా పెరుగుతుంది. ఫలితంగా చిన్న ప్రమాదమైనా ప్రాణాంతకమవుతోంది.
- అతివేగం వల్ల బ్రేక్ వేసినా ఆగాల్సిన చోట కాకుండా కొంత దూరం ముందుకు వెళ్లి వాహనం ఆగుతుంది. దీని వల్ల ముందున్న వాహనాన్ని వెనక నుంచి ఢీకొనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి.
- వేగంగా వాహనం నడపటం వల్ల ఆకస్మికంగా ఆపాలంటే కష్టమవుతుంది. ఒక్కోసారి కనురెప్ప మూసి తెరిచే లోపే ఘోరం జరిగిపోతుంది.

- ఈనాడు, అమరావతి

స్థానిక సంస్థల్లో బీసీల కోటా ఖరారుకు డెడికేటెడ్ కమిషన్

- వారం, పది రోజుల్లో ఏర్పాటు
- ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం
- కులగణన పైనా చర్చ..
- సమగ్ర సమాచారంతో రావాలని అధికారులకు నిర్దేశం

ఈనాడు, అమరావతి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 34% రిజర్వేషన్లకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వారం పది రోజుల్లో కమిషన్‌ను ప్రకటించనున్నారు. సచివాలయంలో ముఖ్యమంత్రి బుధవారం బీసీ సంక్షేమశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కులగణన చేపట్టాల్సిన ఆవశ్యకతపైనా చర్చ జరిగింది. దీనిపై మరింత సమగ్ర సమాచారంతో రావాలని అధికారులను సీఎం ఆదేశించారు. మరో ఎన్నికల హామీ అయిన బీసీల రక్షణ చట్టంపైనా చర్చ జరిగింది. దేశంలో మరే రాష్ట్రంలోనూ ఈ తరహా చట్టం అమలులో లేనందున ఈ ప్రతిపాదనను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుందని ఈ సందర్భంగా అధికారులు నివేదించారు. తానే కేంద్రంతో మాట్లాడతానని, న్యాయపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని పక్కాగా బిల్లును రూపొందించాలని చంద్రబాబు నిర్దేశించారు. తుది రూపు తర్వాత మంత్రివర్గ ఉపసంఘం ముందు కూడా దీన్ని పెట్టి చర్చించాలని సూచించారు. వెనుకబడిన వర్గాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, వారికి ప్రయోజనం కలిగేలా పథకాలను రూపొందించాలని దిశానిర్దేశం చేశారు.

మైక్రో ఆంత్రప్రెన్యూర్లుగా బీసీలు..

వెనుకబడిన తరగతులకు చెందిన వారికి మైక్రో ఆంత్రప్రెన్యూర్లుగా, ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఆదరణ-3 పథకం కింద కులవృత్తులవారీగా ఆధునిక పరికరాలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. రూ.60 కోట్ల సాస్కీ నిధులతో రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతిగృహాల నిర్మాణంతోపాటు సురక్షిత నీటి కోసం ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. 814 వసతి గృహాల్లో మార్చి నాటికి ఆర్వో ప్లాంట్ల నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఆహార నాణ్యతపైనా ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల ఆరోగ్యం, విద్య సహా అన్ని అంశాల్లోనూ బెస్ట్ ప్రాక్టీసెస్ అనుసరించాలని సూచించారు. బీసీ విద్యార్థులకు విద్యాపరమైన అంశాల పర్యవేక్షణకు అపార్ ఐడీలను నమోదు చేసి అనుసంధానించాలన్నారు.

బీసీ భవనాలను పూర్తి చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న బీసీ భవనాలను పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారు. 6 రెసిడెన్షియల్ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా మార్చాలన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ బీసీ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నామన్నారు. బీసీ స్టడీ సర్కిళ్లను తదుపరి స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు.


డ్వాక్రా సంఘాలు తయారు చేసిన 'స్వయం' బ్రాండ్ ఉత్పత్తులను సీఎంకు చూపిస్తున్న అధికారులు

డ్వాక్రా ఉత్పత్తులకు 'స్వయం' బ్రాండింగ్: సీఎం

ఈనాడు, అమరావతి: డ్వాక్రా ఉత్పత్తులకు బ్రాండింగ్ కోసం 'స్వయం' అనే పేరును ముఖ్యమంత్రి చంద్రబాబు ఖరారు చేశారు. డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించే అంశంపై బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు సమీక్షించారు. బ్రాండింగ్‌కు అధికారులు ప్రతిపాదించిన వివిధ పేర్లు, లోగోలను ఆయన పరిశీలించారు. లోగో ఖరారుకు డ్వాక్రా మహిళల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. మెజారిటీ అభిప్రాయం మేరకు ఖరారు చేయాలని చెప్పారు. 'డ్వాక్రా మహిళలు అద్భుతమైన ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. వాటికి మంచి మార్కెటింగ్ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. స్థానికంగా ఉండే మార్కెట్లే కాకుండా.. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లను కూడా ఆకర్షించేలా బ్రాండింగ్ ఉండాలి' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

నేడు సాగునీటి సంఘాలతో భారీ సమావేశం

హాజరుకానున్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి


పరేడ్ మైదానంలో సాగునీటి సంఘాల అధ్యక్షుల సమావేశం జరగనున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీపై జెండాల రెపరెపలు


సమావేశ ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని అన్ని సాగునీటి సంఘాల అధ్యక్షులతో రాష్ట్ర జలవనరులశాఖ గురువారం భారీ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 'అమరావతి రాజధానిలోని పరేడ్ మైదానంలో ఈ సమావేశం ఉంటుంది. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హాజరవుతారు. వైకాపా పాలనలో నీటిపారుదల వ్యవస్థ గాడి తప్పింది. రూ.18 వేల కోట్ల బకాయిలను ఉంచి వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం ఈ అంశాలన్నింటినీ దారిలో పెట్టింది. ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తూ ఒక్కొక్కటీ పూర్తి చేస్తూ వెళ్తోంది. నీటి భద్రత, భూగర్భజలాల పెంపుపై సాగునీటి సంఘాలకు ముఖ్యమంత్రి ఈ సమావేశంలో దిశా నిర్దేశం చేస్తారు' అని మంత్రి వివరించారు.

మీ ఎంపికే మీ భవిష్యత్తు



వ్యాయామం చేస్తున్నంత కాలం ఉత్సాహంగా ఉన్నవారు ఆపేశాక నీరసంగా మారతారు. దీనికి కారణం భౌతికశాస్త్రం. దీని ప్రకారం.. కదిలే వస్తువు కదులుతూనే ఉంటుంది. నిలకడగా ఉన్న వస్తువు అలాగే ఉండిపోతుంది. మీరు వ్యాయామం చేసేటప్పుడు అలసిపోయినా, శరీరంలో కదలిక ఉన్నందున ఉత్సాహంగా ఉంటారు. ఫోన్ చూస్తూ గడుపుతారా లేదా కష్టపడి కసరత్తులు చేస్తారా? అన్నది మీ చేతుల్లోనే ఉంది. చేసే ప్రతి చిన్న పనీ భవిష్యత్తులో మీరు ఎలా ఉండాలనుకుంటున్నారో తెలియజేస్తుంది.

– ఆర్నాల్డ్ ష్వార్జ్‌నెగర్, నటుడు

భారత్‌ను అతిపెద్ద డ్రోన్ మార్కెట్‌గా తీర్చిదిద్దాలి

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

ఈనాడు, దిల్లీ: భారత్‌ను 2030 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద డ్రోన్ మార్కెట్‌గా అభివృద్ధి చేయాలని పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు పిలుపునిచ్చారు. దిల్లీలోని తన కార్యాలయంలో పౌరవిమానయాన శాఖ అధికారులు, డ్రోన్ల రంగానికి సంబంధించిన పలువురు పారిశ్రామికవేత్తలతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. దేశంలో డ్రోన్లపై సాగుతున్న పరిశోధనలు, విడిభాగాల తయారీ పురోగతిపై సమీక్షించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా డ్రోన్ల అభివృద్ధి, విడిభాగాల తయారీలో సాధించిన సాంకేతిక పురోగతి, ఎదురవుతున్న సవాళ్లపై చర్చించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం కావాలనే విషయంపై ఆరా తీశారు. 2030 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద డ్రోన్ మార్కెట్‌గా భారత్‌ను తయారు చేయడంపై దృష్టి సారించాలని అధికారులకు నిర్దేశించారు. మేకిన్ ఇండియాలో భాగంగా స్వదేశీ డ్రోన్ల ఆవిష్కరణలు, తయారీకి కలిసికట్టుగా సాగాలని సూచించారు.

ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
విజయవాడ 5-2-2026 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 176
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


ఇద్దరు బాబాయ్‌ల కథ

వివేకా హత్య కేసు, కల్తీ నెయ్యి కేసు

రెండింటిలోనూ అసలు దోషులెవరో తేల్చకుండా అర్ధంతరంగా దర్యాప్తు ముగించేసిన సిట్

- ప్రధాన కుట్రదారులెవరో వెలికితీసే స్థాయి వరకూ విచారణ
- వారి ప్రమేయం, పాత్ర ప్రస్తావించకుండానే ఛార్జ్‌షీట్లు
- తెర వెనుక ఒత్తిళ్లా? మరేదైనా కారణమా?
- సీబీఐ నేతృత్వంలోని సిట్‌ల దర్యాప్తు తీరుపై సందేహాలు

ఈనాడు, అమరావతి: ఇది ఇద్దరు బాబాయ్‌ల కథ.. ఒక బాబాయేమో అత్యంత క్రూరంగా హత్యకు గురికాగా.. మరో బాబాయేమో దేవదేవుడి పాలిట జరిగిన మహాపాపానికి కారకులని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అత్యంత దారుణ హత్యకు గురైన బాధిత బాబాయ్ కుటుంబానికి అండగా నిలవాల్సిన అబ్బాయి ఆ కేసులో నిందితులను కాపాడటానికి ప్రభుత్వ యంత్రాంగాన్నంతా కదిలించేశారు. ఇప్పుడేమో శ్రీ వేంకటేశ్వరస్వామి పాలిట మహాపచారానికి కారకులయ్యారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బాబాయ్‌ను మాత్రం వెనకేసుకొస్తున్నారు. ఇద్దరూ బాబాయ్‌లే. కానీ ఒకరి కుటుంబానికి వ్యతిరేకంగా, మరో కేసులో మాత్రం ఆరోపణలు ఎదుర్కొంటున్న బాబాయ్‌కి మద్దతుగా ఆ అబ్బాయి నిలుస్తుండటం గమనార్హం.



వైఎస్ వివేకానందరెడ్డి

వాటిలో ఒకటేమో మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు, రెండోది వైకాపా పాలనలో తిరుమలకు లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసు. ఈ రెండు కేసుల్లోనూ సుప్రీంకోర్టే సీబీఐ ఆధ్వర్యంలో సిట్‌లు ఏర్పాటు చేసి, దర్యాప్తునకు ఆదేశించింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ రెండింటిలోనూ అసలు సూత్రధారులెవరో, అంతిమ లబ్ధిదారులెవరో తేల్చకుండానే సిట్‌లు దర్యాప్తును అర్ధంతరంగా, అసంపూర్తిగా ముగించేశాయి. ఈ కుట్రల వెనకున్న 'అదృశ్య' శక్తులెవరో ఛేదించకుండానే వదిలేశాయి.

సూత్రధారులను తేల్చకుండా వదిలేశారనేది నిజం



వైవీ సుబ్బారెడ్డి

సిట్ దర్యాప్తులో తేలినట్లుగా వైకాపా హయాంలో ఐదేళ్లపాటు తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేశారనేది, దాన్నే అత్యంత పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి వినియోగించారనేది కఠిన వాస్తవం. ఈ కుట్రలో తితిదేకు సంబంధించిన రూ.235 కోట్ల నిధులు దుర్వినియోగం చేసి, ఆ మేరకు అనుచిత లబ్ధి పొందారనేదీ నిజమే. కాకపోతే ఇదంతా ఆయా డెయిరీల ప్రతినిధులు, తితిదేలోని కొందరు ఉద్యోగులు మాత్రమే చేశారని తేల్చేయటమే విచిత్రం. ఈ కల్తీ నెయ్యి మహాపాతకం వెనకున్న అసలైన సూత్రధారులు, పెద్దల ప్రమేయంపై లోతైన దర్యాప్తే చేయకుండా సిట్ వదిలేసిందనేది నిజం. (మిగతా 2లో)



శ్రీశైలానికీ కల్తీ నెయ్యి!

2022 మే నుంచి 2023 మార్చి వరకు అదే తంతు

- తిరుపతికి చెందిన రాజేశ్ కార్పొరేషన్‌కు కాంట్రాక్టు
- అప్పటివరకు శ్రీశైలానికి విజయ డెయిరీ నెయ్యి
- రాజేశ్ కార్పొరేషన్ పంపింది 'భోలేబాబా నెయ్యే'!
- తితిదే వ్యవహారంలోనే దీన్ని గుర్తించిన సిట్

ఈనాడు, కర్నూలు: వైకాపా హయాంలో తిరుమలతో పాటు శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి దేవస్థానానికీ కల్తీ నెయ్యి సరఫరా జరిగినట్టు వెల్లడైంది. తితిదేకి కల్తీ నెయ్యి వ్యవహారంపై దర్యాప్తు చేసిన సిట్.. . మల్లన్న దేవాలయానికీ కల్తీ నెయ్యి సరఫరా చేసినట్టు గుర్తించింది. 2022 మే నుంచి 2023 మార్చి వరకు 11 నెలలపాటు కల్తీ నెయ్యి పంపినట్టు సమాచారం. ఎప్పుడూ విజయ డెయిరీ నుంచే నెయ్యి కొనే శ్రీశైలం దేవస్థానం... ఆ 11 నెలల్లో మాత్రం తిరుపతికి చెందిన రాజేశ్ కార్పొరేషన్ నుంచి 3,25,064 కిలోల నెయ్యి కొనుగోలు చేసి, రూ.15.89 కోట్లు చెల్లించింది.




అది భోలేబాబా 'నెయ్యే'!

శ్రీశైలం దేవస్థానానికీ భోలేబాబా డెయిరీ 'నెయ్యి కాని నెయ్యే' సరఫరా (మిగతా 2లో)

రాజమహేంద్రవరంలో బెంబేలెత్తిస్తున్న పెద్దపులి

జనావాసాల్లోకి రావడంతో ఆందోళన

మత్తుమందు ఇచ్చి బంధించేందుకు అనుమతులు 8లో



ఆంత్రోపిక్ ప్రకంపనలు

- ఐటీ కంపెనీల 'బిల్లబుల్ అవర్స్'కు గండం
- డిజిటల్ ఉద్యోగిగా ఏఐ
- దేశీయ కంపెనీలకు ఔట్ సోర్సింగ్ ప్రాజెక్టులు తగ్గుతాయని ఆందోళన
- ఇప్పటికే పలు కంపెనీల షేర్లు పతనం

ఈనాడు బిజినెస్ బ్యూరో: ఇప్పటివరకు కృత్రిమమేధ (ఏఐ) టూల్స్ అంటే ఉద్యోగులకు సహాయం చేసే సాఫ్ట్‌వేర్‌గా పరిగణిస్తున్నారు. కానీ తాము రూపొందించిన కొత్త ఏఐ టూల్, మానవ ప్రమేయం లేకుండానే, క్లిష్టమైన ఆఫీసు పనులను స్వతంత్రంగా పూర్తి చేస్తుందంటూ అమెరికాకు చెందిన 'ఆంత్రోపిక్' అనే సంస్థ చేసిన ప్రకటన, ప్రపంచ టెక్నాలజీ రంగంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఫలితంగా అంతర్జాతీయంగానూ, మనదేశంలోనూ ఐటీ కంపెనీల షేర్లు పతనమయ్యాయి. కొవిడ్ పరిణామాల నాటి 2020 మార్చి తర్వాత, ఐటీ కంపెనీల షేర్లు ఇంతగా నష్టపోవడం ఇప్పుడే. ప్రస్తుతం మదుపరులే కాదు.. అందరిలో తలెత్తుతున్న ప్రశ్న.. 'భవిష్యత్తులో కంపెనీలకు నిజంగా మానవ వనరుల అవసరం ఉండదా?' అనే.

చాట్‌జీపీటీకి దీనికి తేడా ఇదీ

అమెరికాకు చెందిన ఏఐ అంకురం.. ఆంత్రోపిక్ తన ప్లాట్‌ఫామ్‌ను విస్తరిస్తూ.. క్లాడ్ కోవర్క్‌ను జనవరి (మిగతా 2లో)

ఎలా పనిచేస్తుంది?

- క్లాడ్ కోవర్క్ స్వయంగా కంప్యూటర్ ఫోల్డర్లను తెరచి, అందులోని పత్రాలను చదివి, కావాల్సిన సరైన ఫైల్‌ను వెతికి పట్టుకోగలదు. అందులో మార్పులు చేసి, వాటన్నింటినీ క్రమ పద్ధతిలో ఆర్గనైజ్ చేయగలదు. 11 ప్లగిన్‌ల సాయంతో ఇది న్యాయవాది, మార్కెటింగ్ - ఆర్థిక నిపుణులు, డేటా ఎనలిస్ట్ లేదా పరిశోధకుడిగా తన పాత్రను మార్చుకుని, పనిచేయగలదని కంపెనీ చెబుతోంది.
- దీనికి ప్రతి చిన్న విషయాన్నీ వివరించాల్సిన అవసరం లేదు. ఉదాహరణకు ఈ 50 కాంట్రాక్టులను పరిశీలించి, వచ్చే నెలలో గడువు ముగిసే వాటి వివరాలు ఇవ్వు అని చెబితే చాలు. ఆ పనిని మొత్తం స్వయంగా పూర్తి చేసేస్తుందట.

క్షమించండి నాన్నా.. కొరియా అంటే ప్రాణం

ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలై ముగ్గురు అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య

గాజియాబాద్‌లో ఘోరం

గాజియాబాద్: కొరియన్ ఆన్‌లైన్ గేమ్ 'లవ్‌గేమ్'కు బానిసలై ముగ్గురు మైనర్ అక్కాచెల్లెళ్లు తమ ప్రాణాలు తీసుకోవడం కలకలం సృష్టించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌కు చెందిన చేతన్ కుమార్‌కు ఇద్దరు భార్యలు. వారిద్దరూ సొంత అక్కాచెల్లెళ్లే. వారికి ఐదుగురు పిల్లలు ఉన్నారు. అందులో నలుగురు అమ్మాయిలు. వీరిలో నిషిక (16), ప్రాచీ (14), పఖీ (12) అనే ముగ్గురు అమ్మాయిలు దాదాపు మూడేళ్లుగా ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలయ్యారు. పాఠశాలకు వెళ్లకుండా, ఎవరితోనూ మాట్లాడకుండా ఫోన్‌కే అతుక్కుపోయేవారు. ప్రాచీ మిగిలిన ఇద్దరికి గేమ్ ఎలా ఆడాలో, అందులోని టాస్కులు ఎలా పూర్తి చేయాలో తెలిపేది. తీవ్ర ఆందోళన చెందిన తల్లిదండ్రులు.. గేమ్‌ను ఆడొద్దంటూ కొన్నిరోజులుగా ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో ఒత్తిడికి లోనైన ముగ్గురు అక్కాచెల్లెళ్లు బుధవారం తెల్లవారుజామున తమ అపార్ట్‌మెంటు 9వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు (మిగతా 2లో)

పండ్లు, కూరగాయలపై సున్నా శాతమే

- 99% ఉత్పత్తులపై సుంకాలుండవ్
- అతి కొద్దివాటిపై భారత్‌కు నియంత్రణ

వాణిజ్య ఒప్పందంపై అమెరికా స్పష్టీకరణ

రష్యా చమురును నిలిపేస్తామని భారత్ అంగీకరించిందని వెల్లడి



న్యూయార్క్, వాషింగ్టన్: అమెరికా నుంచి దిగుమతి చేసుకునే 98% నుంచి 99% ఉత్పత్తులపై భారత్ సున్నా శాతం సుంకాలను అమలు చేయనుందని అమెరికా పేర్కొంది. పండ్లు, కూరగాయలు సహా వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులపై సుంకాలు ఉండబోవని స్పష్టం చేసింది. కొన్ని కీలక ఉత్పత్తులపై మాత్రం భారత్ నియంత్రణ ఉంటుందని వెల్లడించింది. మరోవైపు రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపేస్తామని భారత్ హామీ ఇచ్చిందని వివరించింది. మంగళవారం సీఎన్‌బీసీ కార్యక్రమంలో భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ స్పందించారు. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై శ్వేతసౌధం మీడియా కార్యదర్శి కరోలినా లీవిట్ మీడియాతోనూ, ఫాక్స్ న్యూస్‌తోనూ మాట్లాడారు. 'భారత్‌పై అమెరికా 18శాతం సుంకాలను కొనసాగిస్తుంది. ఆ దేశంతో మాకు వాణిజ్య లోటు ఉంది. వారు పలురకాల వ్యవసాయ ఉత్పత్తులు, తయారీ వస్తువులు, రసాయనాలు, వైద్య పరికరాలపై సుంకాలను తగ్గిస్తామని అంగీకరించారు. ప్రస్తుతం భారత్‌లో అమెరికా (మిగతా 2లో)

పల్లె వికాసానికి దన్ను

16వ ఆర్థిక సంఘంలో గతం కంటే రూ.6,397 కోట్ల అదనపు కేటాయింపులు

గ్రామాల్లో అభివృద్ధి పనులకు మరింత ఊతం

ఈనాడు, అమరావతి: గ్రామాల అభివృద్ధికి 16వ ఆర్థిక సంఘం నిధులు మరింత అండగా మారనున్నాయి. ఈ ఏడాది మార్చితో ముగియనున్న 15వ ఆర్థిక సంఘం కంటే అదనంగా 16వ ఆర్థిక సంఘం ద్వారా మరో రూ.6,397 కోట్లు రాష్ట్రానికి కేంద్రం కేటాయించింది. 2025-26తో ముగియనున్న 15వ ఆర్థిక సంఘం కింద రాష్ట్రంలోని గ్రామీణ (మిగతా 2లో)



పంచాయతీలకు రూ.11,639 కోట్లు

- 16వ ఆర్థిక సంఘం నిధుల్లోనూ పంచాయతీలకు ఇప్పటివరకు ఇస్తున్న ప్రాధాన్యం యథాతథంగా కొనసాగనుంది. మొత్తం నిధుల్లో 70శాతం పంచాయతీలకు కేటాయించనున్నారు. అంటే ఐదేళ్లకు కేటాయించిన రూ.16,627 కోట్లలో పంచాయతీలకు రూ.11,639 కోట్లు రానున్నాయి. మిగిలిన రూ.4,988 కోట్లలో మండల పరిషత్‌లకు 20శాతం, జిల్లా పరిషత్‌లకు 10శాతం నిధులు కేటాయిస్తారు.
- ఈసారి కూడా గ్రామాల్లో తాగునీటి సరఫరా, ప్రజారోగ్యం మెరుగయ్యే పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను విద్యార్థులు ప్రత్యక్షంగా చూడొచ్చు

పాఠశాలల నుంచి ప్రతిపాదనలు కోరిన ఏపీ శాసన వ్యవస్థ



ఈనాడు, అమరావతి: రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను రోజూ 30 మంది చొప్పున విద్యార్థులు గ్యాలరీ నుంచి వీక్షించేందుకు ఏపీ శాసన వ్యవస్థ ఏర్పాట్లు చేసింది. శాసన వ్యవస్థ పనితీరును ప్రత్యక్షంగా చూడడంతో పాటు.. ఈ వ్యవస్థ ప్రాధాన్యం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ నిర్ణయం తీసుకున్నారని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ బుధవారం పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థుల పేర్లు, వారి ఆధార్ నంబర్లతో కూడిన జాబితాలపై సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంతకం చేసి, స్టాంప్ వేసి పంపాలని సూచించారు. జాబితాను legis.passes@gmail.com కు మెయిల్ చేయాలని, మరిన్ని వివరాలకు 86324 49184, 86324 49185 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

మణిపుర్ సీఎంగా ఖేమ్‌చంద్ ప్రమాణం

రాష్ట్రపతి పాలనను ఎత్తివేసిన కొన్ని గంటల్లోనే కొలువు దీరిన సర్కారు

ఉప ముఖ్యమంత్రులుగా నెమ్చా కిప్‌గెన్, ఎల్ డిఖో 10లో

మీరు ద్రోహి.. మీరు దేశ శత్రువు

- రాహుల్ × కేంద్రమంత్రి రవ్‌నీత్ సింగ్
- గాంధీ కుటుంబంపైనా వాదులాట
- లోక్‌సభలో మాటల మంటలు
- నరవణె పుస్తకాన్ని ప్రదర్శించిన రాహుల్



లోక్‌సభలో ఆందోళన చేస్తున్న విపక్ష సభ్యులు 10లో

రాక్రీట్ అక్రమాలపై 13 మంది అధికారులకు తాఖీదులు 12లో

వైకాపా నేతలతో కలిసి అక్రమాలకు పాల్పడ్డ అధికారుల్లో అలజడి

ఇదీ సంగతి!



నన్నూ, నా పనులను చూసినా కూడా నీకు నవ్వు రావట్లేదా..?!

రాంబాబన్న చేసిన తప్పేంటి?

రెండు తిట్లు తిట్టారు

ఇంటికొచ్చాక ప్రెస్‌మీట్ పెట్టి అలా తిట్టకూడదని బాధపడిన పెద్దమనిషి

గుంటూరులో వైకాపా అధినేత జగన్

అంబటి రాంబాబు కుటుంబానికి పరామర్శ

ఈనాడు- అమరావతి, న్యూస్‌టుడే- గుంటూరు బృందం: 'అంబటి రాంబాబన్న మాజీ మంత్రి. కాపు కులంలో టైగర్. విలువలున్న వ్యక్తి. అలాంటి వ్యక్తిని వేధించిన పోలీసులను మా ప్రభుత్వం వచ్చాక యూనిఫామ్స్ విప్పించి, బొక్కలో పెట్టి వడ్డీతో సహా చెల్లిస్తాం. అంబటి రాంబాబన్న చేసిన తప్పేంటి? విడదల రజిని, జోగి రమేష్, భూమన కరుణాకరరెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు చేసిన తప్పేంటని అడుగుతున్నా.. చంద్రబాబుకు జ్ఞానం రావాలని రాంబాబు గుడిలో పూజ చేసి వస్తుంటే, మార్గమధ్యలో కర్రలు పట్టుకుని, పోలీసులను పెట్టుకుని తెదేపా వాళ్లు (మిగతా 12లో)



గుంటూరులోని అంబటి నివాసం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న జగన్. చిత్రంలో చెవిరెడ్డి భాస్కరరెడ్డి, విడదల రజని తదితరులు

జగన్ యాత్ర.. జనానికి యాతన

- తాడేపల్లి నుంచి గుంటూరుకు ఆరు గంటల ప్రయాణం
- పోలీసుల ఆంక్షలు తోసిరాజని భారీ కాన్వాయ్, జనసమీకరణ
- జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర స్తంభించిపోయిన ట్రాఫిక్

12లో

తిరుపతి గాజు పలకలు..

బార్క్‌లో మెరుపులు

ఎస్వీయూలోని లేజర్ ఆప్టికల్స్ ల్యాబ్‌లో తయారీ



ఈనాడు డిజిటల్, తిరుపతి: బయటి నుంచి చూస్తే విశ్వవిద్యాలయంలోని అది ఒక సాధారణ గది. కానీ లోపల మాత్రం భవిష్యత్తు సాంకేతికతకు సంబంధించిన అద్భుత ప్రయోగాలు జరుగుతున్నాయక్కడ. మనం నిత్యం వాడే ఇంటర్నెట్ వేగానికి, దేశ రక్షణలో వాడే రాడార్ల పటిష్ఠతకు, వైద్యరంగంలో శస్త్రచికిత్సలకు ఊపిరి పోసేది 'కాంతి' (లైట్/లేజర్). ఆ కాంతిని నియంత్రించే, నిర్దేశించే అత్యాధునిక 'గ్లాస్ మెటీరియల్స్' తయారీకి చిరునామాగా మారింది తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం. ఇక్కడి భౌతికశాస్త్ర విభాగంలోని



లేజర్ ద్వారా కాంతి ప్రసరించి గ్లాస్‌పై రంగు మారుతున్న దృశ్యాన్ని చూపుతున్న విభాగాధిపతి

లేజర్ ఆప్టికల్స్ లేబొరేటరీ దేశ ప్రతిష్ఠాత్మక సంస్థ 'భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్'కు కీలక భాగస్వామిగా మారింది.

రూ.3 కోట్లతో 'అణు' బంధం

డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ (డీఏఈ), ఎస్వీయూ ఫిజిక్స్ (మిగతా 2లో)

పల్లె వికాసానికి దన్ను

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక సంస్థలకు ఐదేళ్లకు మొత్తం రూ.10,230 కోట్లు కేటాయించారు. 16వ ఆర్థిక సంఘం కింద కేంద్ర బడ్జెట్‌లో తాజాగా రూ.16,627 కోట్లు కేటాయించారు. గ్రామాల్లో మరింతగా అభివృద్ధి పనులు చేసేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్రామ పంచాయతీల్లో ఆర్థిక సంఘం నిధులే కీలకం. ఐదేళ్లకోసారి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు వీటిని కేటాయిస్తుంది. ఆస్తి పన్ను, పన్నేతర ఆదాయం పంచాయతీలకు అంతంత మాత్రం కావడంతో ఆర్థిక సంఘం నిధులతో ప్రాధాన్యాంశాల మేరకు అభివృద్ధి పనులు చేస్తుంటారు. ఆర్థిక సంఘం సిఫార్సులపై కేంద్ర ప్రభుత్వం కేటాయింపులు పెంచడం శుభపరిణామమన్న అభిప్రాయం అధికారుల్లో వ్యక్తమవుతోంది.

15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపులు ఇలా ఉన్నాయి (రూ.కోట్లలో)

ఏడాది	కేటాయింపులు
2021–22	1,938
2022–23	2,011
2023–24	2,031
2024–25	2,151
2025–26	2,099
మొత్తం	10,230

నిధుల మళ్లింపునకు కళ్లెం

- ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలు విద్యుత్ ఛార్జీలు, ఇతరత్రా అవసరాలకు మళ్లించకుండా కూటమి ప్రభుత్వం తగు చర్యలు చేపట్టింది. గత 18 నెలల వ్యవధిలో పంచాయతీలకు దాదాపు రూ.4 వేల కోట్లు విడుదల చేసింది. వీటితో గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. వైకాపా ప్రభుత్వంలో కేంద్రం పంచాయతీలకు ఇచ్చే నిధులను విద్యుత్తు ఛార్జీల కింద రూ.3 వేల కోట్లకు పైగా మళ్లించేసింది. నిబంధనలకు విరుద్ధంగా చేసిన నిధుల మళ్లింపుపై అదే పార్టీకి చెందిన సర్పంచులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేసినా పట్టించుకోలేదు.
- నిధుల వ్యయంలోనూ దుర్వినియోగానికి ఆస్కారం లేకుండా కూటమి ప్రభుత్వం తగు చర్యలు తీసుకున్న కారణంగా పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో రూ.వెయ్యి కోట్లకు పైగా నిధులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. ప్రాధాన్యాల మేరకే ఖర్చు చేస్తున్నారు. అనవసర వ్యయానికి కళ్లెం వేశారు.

ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలై ముగ్గురు అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇద్దరు అమ్మాయిలు ఒకరి చేయి మరొకరు పట్టుకొని దూకేయగా, మరొకరు ఒంటరిగా దూకారని పోలీసులు చెప్పారు. బాలికలు వినియోగించిన ఫోన్లు, ఇతర డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకుని సైబర్ నిపుణుల సాయంతో విశ్లేషిస్తున్నట్లు వివరించారు. ఆత్మహత్య చేసుకున్న అక్కాచెల్లెళ్లు కొరియన్ సంస్కృతికి బాగా ప్రభావితమైనట్లు వారి ఇంట్లో లభించిన నోట్ ద్వారా తెలిసిందని డీసీపీ నిమిష్ పాటిల్ తెలిపారు. 'క్షమించండి నాన్న' అని అందులో రాసి ఉన్నట్లు చెప్పారు. 'నేను ఒంటరిదాన్ని' అంటూ గది గోడపై రాసి ఉన్నట్లు తెలుస్తోంది. తాము కొరియాను ఎంత ఇష్టపడుతున్నామో బాలికలు డైరీలోని 8 పేజీల్లో వివరించినట్లు సమాచారం. కొరియా గేమ్‌లను ఆడకుండా ఉండలేమని, కొరియానే తమ ప్రాణమని, అందుకే ప్రాణాలను తీసుకుంటున్నామని రాసుకొచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు, బాలికలు ఆడిన ఆన్‌లైన్ గేమ్‌లో ఆత్మహత్య చివరి టాస్క్‌గా ఉన్నట్లు సమాచారం. గేమ్‌లో ఆత్మహత్య టాస్క్ ఉంటుందని తనకు తెలియదని, తెలిస్తే ఇలా జరిగి ఉండేది కాదని చెబుతూ చేతన్ కుమార్ రోదించారు.


గాజియాబాద్‌లో ముగ్గురు అక్కాచెల్లెళ్లు పైనుంచి దూకిన భవనం

శ్రీశైలానికీ కల్తీ నెయ్యి!

(మొదటి పేజీ తరువాయి)

అయినట్టు సమాచారం. తితిదేకి భోలేబాబా డెయిరీ సరఫరా చేసిన నెయ్యి అసలు నెయ్యే కాదని... వెజిటబుల్ ఆయిల్స్, కొన్ని రసాయనాలు కలిపి తయారుచేసిన పదార్థాన్ని ఆ సంస్థ సరఫరా చేసిందని సిట్ నిగ్గుతేల్చిన విషయం తెలిసిందే. రాజేశ్ కార్పొరేషన్ ద్వారా శ్రీశైలం దేవస్థానానికి సరఫరా అయిన నెయ్యి కూడా... భోలేబాబా డెయిరీ నుంచి వచ్చిందేనని సమాచారం. రాజేశ్ కార్పొరేషన్‌కు సొంత డెయిరీ లేదు. భోలేబాబా సంస్థ తిరుపతికి చెందిన వేరే సంస్థల ద్వారా కూడా కల్తీ నెయ్యి విక్రయించేదని సిట్ దర్యాప్తులో తేలింది. రాజేశ్ కార్పొరేషన్ ఆ సంస్థల నుంచి నెయ్యి కొని శ్రీశైలం దేవస్థానానికి సరఫరా చేసినట్లు అనుమానిస్తున్నారు.

విజయ డెయిరీని కాదని..: శ్రీశైలం దేవస్థానం పాల సొసైటీల ఆధ్వర్యంలో నడిచే డెయిరీల నుంచే నెయ్యి కొనాలని ట్రస్ట్‌బోర్డు గతంలో నిర్ణయించింది. నెయ్యి కొనుగోలుకు దేవస్థానం పిలిచిన టెండర్లలో పాల సొసైటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న డెయిరీలే పాల్గొనేవి. నంద్యాలలోని విజయ డెయిరీనే తక్కువ ధరకు నెయ్యి సరఫరాకు ముందుకు రావడంతో, ప్రతిసారీ కాంట్రాక్ట్ ఆ సంస్థకే దక్కేది. వైకాపా హయాంలో 2022లో విజయ డెయిరీ ప్రతినిధులకు, దేవస్థానం అధికారులకు నెయ్యి ధర విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదు. ధర తగ్గించాలని దేవస్థానం అధికారులు ఒత్తిడి తేవడంతో... అంత తక్కువ ధరకు ఇవ్వలేమని విజయ డెయిరీ తేల్చిచెప్పింది. అదే అదనుగా రాజేశ్ కార్పొరేషన్ తెరపైకి వచ్చింది. ఆ సంస్థ కిలో రూ.489కి నెయ్యి ఇస్తామనడంతో.. సరఫరా కాంట్రాక్టును వాళ్లకే కట్టబెట్టారు. అప్పట్లో విజయ డెయిరీని వ్యూహాత్మకంగానే తప్పించారన్న ప్రచారం ఉంది. శ్రీశైలం దేవస్థానంలో సగటున రోజుకు లక్షకు పైగా లడ్డూలు విక్రయిస్తారు. 2023 ఏప్రిల్ నుంచి మళ్లీ విజయ డెయిరీ శ్రీశైలం దేవస్థానానికి నెయ్యి సరఫరా చేస్తోంది.

మహారాణి చికిత్సకు మహల్ కానుక



అనంతపురం జిల్లా ఉరవకొండలో ఉన్న శ్రీగవి మఠం సంస్థానంలోని రాజమహల్ ఇది. దీని నిర్మాణం వెనుక ఆసక్తికరమైన విషయం దాగి ఉంది. 1820-24 మధ్యకాలంలో మైసూర్ మహారాజుగా కృష్ణరాజా ఒడెయారు-3 పరిపాలించేవారు. ఆ సమయంలో ఆయన భార్యకు జబ్బు చేసింది. ఎంతో పేరుపొందిన వైద్యులు, స్వామీజీలను కలిసినా నయం చేయలేకపోయారు. చివరికి శ్రీగవి మఠం వ్యవస్థాపకుడు కరిబసవస్వామిని సంప్రదించగా వైద్యం చేశారు. కొన్నిరోజుల తర్వాత మహారాజు భార్యకు ఆరోగ్యం కుదుటపడింది. దీంతో కృతజ్ఞతగా తాను నివసించే రాజమహల్ తరహా భవనంలోనే కరిబసవస్వామి కూడా నివసించాలని రాజు భావించి ఇక్కడ నిర్మాణం చేపట్టారు. అంతేకాకుండా వంద కేజీల వెండి వస్తువులు బహూకరించారు. ప్రస్తుత పీఠాధిపతిగా చెన్న బసవ రాజేంద్రస్వామి వ్యవహరిస్తున్నారు. ఏటా శివరాత్రి పర్వదినం ముగిసిన తొమ్మిది రోజుల తర్వాత ఉత్సవాలు నిర్వహిస్తారు.

– ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, ఉరవకొండ



కలపతో నిర్మించిన మహల్ లోపలి భాగాలు

పండ్లు, కూరగాయలపై సున్నా శాతమే

(మొదటి పేజీ తరువాయి)

పారిశ్రామిక ఉత్పత్తులపై సగటున 13.5 శాతం సుంకాలున్నాయి. అవి సున్నాకు చేరతాయి. దాదాపు 98% నుంచి 99% అమెరికా ఉత్పత్తులపై సున్నా సుంకాలే అమలవుతాయి. ప్రపంచంలోని అన్ని దేశాల్లాగే భారత్‌కూ కొన్ని అంశాల్లో రక్షణ హక్కులుంటాయి. వాటిపై ఆ దేశానికే నియంత్రణ ఉంటుంది. కానీ బాదం, పిస్తా వంటి ఉత్పత్తులు, వైన్, ఆల్కహాల్ పానీయాలు, పండ్లు, కూరగాయలపై సున్నా శాతం సుంకాలే అమలవుతాయి. ఇది పెద్ద విజయం' అని గ్రీర్ పేర్కొన్నారు. '2022-23కు ముందు రష్యా నుంచి భారత్ ముడి చమురును దిగుమతి చేసుకోలేదు. కానీ ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమయ్యాక రష్యా ఇచ్చిన రాయితీల నుంచి లబ్ధి పొందేందుకు చమురు దిగుమతులు చేసుకుంది. అయితే ట్రంప్ హెచ్చరికలతో గత ఏడాది నుంచి చమురు దిగుమతులను తగ్గిస్తూ వస్తోంది' అని గ్రీర్ స్పష్టం చేశారు.

మోదీతో బంధాన్ని ట్రంప్ ఆస్వాదిస్తారు

ప్రధాని మోదీతో బంధాన్ని ట్రంప్ ఆస్వాదిస్తారని, ఆయనపై అధ్యక్షుడికి ఎంతో గౌరవముందని శ్వేత సౌధం మీడియా కార్యదర్శి లీవిట్ పేర్కొన్నారు. 'వాణిజ్య ఒప్పందం తర్వాత భారత్‌పై అమెరికా 18 శాతం సుంకాలను విధిస్తుంది. అమెరికా ఉత్పత్తులపై భారత్ సున్నా సుంకాలను అమలు చేస్తుంది. ఇదో గొప్ప ఒప్పందం. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపేస్తామని భారత్ హామీ ఇచ్చింది. దీంతోపాటు అమెరికాలోని కీలక రంగాల్లో 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడతామని మోదీ హామీ ఇచ్చారు' అని లీవిట్ వివరించారు.


అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియోతో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్

స్వాగతించిన జైశంకర్, రుబియో

త్వరలో కుదరనున్న భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని రెండు దేశాల విదేశాంగ మంత్రులు జైశంకర్, మార్కో రుబియో స్వాగతించారు. సరికొత్త ఆర్థిక అవకాశాలను అందిపుచ్చుకోవడానికి కలిసి పని చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. కీలక ఖనిజాలపై జరగనున్న సదస్సులో పాల్గొనేందుకు అమెరికా చేరుకున్న జైశంకర్.. రుబియోతో భేటీ అయ్యారు. వారిద్దరూ వాణిజ్యం, ఇంధనం, అణు, రక్షణ, కీలక ఖనిజాలు, టెక్నాలజీ రంగాల్లో ఇరు దేశాల సంబంధాలపై చర్చించారు. క్వాడ్ ద్వారా ద్వైపాక్షిక, బహుళపక్ష సహకారాన్ని విస్తరించుకోవడానికి కట్టుబడి ఉన్నామని వారు తెలిపారు.

(మొదటి పేజీ తరువాయి)

తితిదే అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ హోదాలో చిన్నప్పన్న తితిదే వ్యవహారాల్లో జోక్యం చేసుకున్నారని, నెయ్యి సరఫరా సంస్థల ఫోన్ నంబర్లు, వివరాలన్నీ నాటి ప్రొక్యూర్‌మెంట్ జీఎం నుంచి తీసుకున్నారని, కిలోకు రూ.25 చొప్పున లంచాలు డిమాండ్ చేశారని సిట్ తేల్చింది. ప్రీమియర్ డెయిరీ ప్రతినిధుల నుంచి చిన్నప్పన్న రూ.50 లక్షలు హవాలా ద్వారా లంచం తీసుకున్నారనీ తేల్చిచెప్పింది. కానీ ఇదంతా ఎవరి కోసం, ఎవరి ఆదేశాలతో చేశారనేది దర్యాప్తే చేయలేదు.

- వైకాపా హయాంలో తిరుమలకు ఐదేళ్లపాటు కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని సిట్ తేల్చిచెప్పింది. అప్పట్లో పాలకమండలి ఛైర్మన్లుగా వ్యవహరించిన వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, అప్పట్లో ఈవోలుగా పని చేసిన అనిల్‌కుమార్ సింఘాల్, కేఎస్ జవహర్‌రెడ్డి, ధర్మారెడ్డిలు ఎందుకు దాన్ని గుర్తించలేదు, కల్తీ గురించి వారికి తెలుసా, తెలిస్తే ఎందుకు అడ్డుకోలేదు, దీని వెనక ఏదైనా కుట్ర ఉందా అని నిగ్గు తేల్చలేదు.

ఇద్దరు బాబాయ్‌ల కథ

- కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నారని పరీక్షల్లో నిర్ధారణైన తర్వాత కూడా భోలేబాబా డెయిరీకి కిలో రూ.329 చొప్పున 1.07 లక్షల కిలోల సరఫరాకు 2022 ఆగస్టు 29న ఆర్డరు ఇవ్వటం, దాని ప్రకారం 2022 అక్టోబరు 28 వరకూ భోలేబాబా డెయిరీ తిరుమలకు నెయ్యి సరఫరా చేయటం వెనకున్న శక్తులెవరో సిట్ తేల్చలేదు.
- తితిదే పాలకమండలిలోని పెద్దతలకాయలు, ఉన్నతాధికారుల సహకారం లేకుండా తితిదేలోని చిరుద్యోగులు, డెయిరీ సంస్థల ప్రతినిధులే ఇంత పెద్ద కుంభకోణానికి పాల్పడటం అసాధ్యం. అయినా సరే వారెవరినీ సిట్ నిందితులుగా చేర్చలేదు. వారి ప్రమేయంపై లోతైన దర్యాప్తే చేయలేదు.

వివేకా హత్య కేసులోనూ..: వివేకా హత్య కోసం రూ.40 కోట్లు వెచ్చించటానికి నిర్ణయించుకుని, హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న నలుగురు నిందితులకు రూ.కోటి చొప్పున అడ్వాన్సు ఇచ్చారని సీబీఐ తేల్చింది. రూ.40 కోట్లు ఇవ్వటానికి సిద్ధమైన పెద్ద తలకాయలు ఎవరో బయటపెట్టకుండానే దర్యాప్తు ముగించేసింది.

- 'వివేకా హత్యకు ముందు, ఆ తర్వాత కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వాట్సప్‌లో యాక్టివ్‌గా ఉన్నారు. కాల్స్ కూడా చేశారు. హత్య సమాచారాన్ని జగన్‌కు చేరవేయటంలో ఆయన పాత్రపై మరింత లోతుగా విచారించాలి. ఈ హత్య కోసం పన్నిన భారీ కుట్రలో ఇంకా ఎవరెవరు ఉన్నారో తేల్చేందుకు దర్యాప్తు కొనసాగించాలి' అంటూ తెలంగాణ హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్లు, ట్రయల్ కోర్టులో వేసిన అనుబంధ ఛార్జ్‌షీట్లలో సీబీఐ పేర్కొంది. కానీ ఆ కోణంలో దర్యాప్తు చేయకుండానే ఆపేసింది.
- వివేకా హత్య తర్వాత నిందితుడు సునీల్‌యాదవ్ వైఎస్ అవినాష్‌రెడ్డి ఇంటికి వెళ్లినట్లు, అర్ధరాత్రి 1.58 గంటల సమయంలో అవినాష్ ఇంట్లో ఉన్నట్లు గూగుల్ టేకౌట్ విశ్లేషణ ద్వారా తేల్చిన సీబీఐ.. వేకువజామున 4.11 గంటల నుంచి అవినాష్‌రెడ్డి వాట్సప్‌లో కాల్స్, చాట్స్ చేసినట్లు గుర్తించింది. హత్యకు ముందు ఆ అర్ధరాత్రి వేళలో, హత్య తర్వాత తెల్లవారుజామున అవినాష్‌రెడ్డి ఎవరితో వాట్సప్‌లో టచ్‌లో ఉన్నారో తేల్చగలిగితే ఈ కేసులో ప్రధాన కుట్రదారు బయటకొచ్చే అవకాశముంది. కానీ సీబీఐ ఆ దిశగా దర్యాప్తు చేయలేదు. అవినాష్‌రెడ్డి ఫోన్ స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నమూ చేయలేదు. హత్య చేసిన తర్వాత సునీల్‌యాదవ్ అవినాష్‌రెడ్డి ఇంట్లో ఎందుకున్నాడో కూడా తేల్చలేదు.
- వివేకా కుమార్తె సునీత సీబీఐ, కోర్టుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా అసలు దోషుల్ని పట్టుకునేలా దర్యాప్తే సాగట్లేదు.

8న త్రిపురనేని రామస్వామిచౌదరి పురస్కారాల ప్రదానం

గుంటూరు (నెహ్రూనగర్), న్యూస్‌టుడే: కవిరాజు త్రిపురనేని రామస్వామిచౌదరి పురస్కారాల ప్రదాన సభ ఈ నెల 8న నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. విజయవాడలోని యూటీఎఫ్ హాల్లో పురస్కారాల ప్రదాన సభ ఆహ్వాన పత్రికలను బుధవారం ఆవిష్కరించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ నెల 8న సాయంత్రం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, జాషువా, పులే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో పురస్కారాల ప్రదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ పురస్కారాలను విశ్రాంత డీజీపీ, రచయిత ఏబీ వెంకటేశ్వరరావు, కవి, రచయిత్రి, నాగార్జున విశ్వవిద్యాలయం బుద్ధిస్ట్ విభాగాధిపతి ఆచార్యులు చల్లపల్లి స్వరూపరాణిలకు అందిస్తున్నట్లు తెలిపారు. సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్, వీసీకే పార్టీ ఏపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు జయసుధ, కవి విల్సన్‌లు ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.


ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, పాపినేని శివశంకర్, విల్సన్, జయసుధ

తల్లి కడుపులోనే పిండం గుండెకు చికిత్స

- **ఇమ్యూనోథెరపీ ద్వారా ఐదుగురు గర్భిణులకు పునర్జన్మ**

ఈనాడు, హైదరాబాద్: తల్లి కడుపులోనే పిండానికి అరుదైన చికిత్స అందించినట్లు హైదరాబాద్ రెయిన్‌బో హార్ట్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు తెలిపారు. ఇమ్యూనోథెరపీ ద్వారా ఈ చికిత్సలు విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ప్రపంచంలోనే ఈ తరహా చికిత్సలు తొలిసారిగా చేసినట్లు సీనియర్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డా.నాగేశ్వరరావు కోనేటి, డా.శ్వేత బఖ్రు, డా.భార్గవి ధూళిపూడి బుధవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. శస్త్రచికిత్స వివరాలు అమెరికా నుంచి వెలువడే జాక్ అసోసియేట్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. "సాధారణంగా 3 నుంచి 6 నెలల మధ్యలో జన్యుపరమైన సమస్యలు, గుండె జబ్బులు, మెదడు సంబంధిత లోపాలతో గర్భంలో శిశువులు మృతి చెందుతుంటారు. వీటితోపాటు ఆటోఇమ్యూన్ వ్యాధుల నివారణకు గర్భిణులు మందులు వాడే క్రమంలో ఉత్పత్తి అయ్యే యాంటీబాడీలు పిండానికి చేరతాయి. అక్కడ నుంచి గుండెలోని విద్యుత్తు సిస్టమ్ (కండక్షన్ సిస్టమ్)ను దెబ్బతీస్తాయి. దీంతో పిండం గుండెలో బ్లాకులు ఏర్పడటం, గుండె కండరాలు బలహీన పడటం లాంటి సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి సమస్యల్ని ఐదుగురు గర్భిణిల్లో గుర్తించి.. ఇమ్యూనోథెరపీ ద్వారా చికిత్స అందించాం" అని వైద్యులు పేర్కొన్నారు.


డా.నాగేశ్వరరావు కోనేటి

తిరుపతి గాజు పలకలు.. బార్క్‌లో మెరుపులు

(మొదటి పేజీ తరువాయి)

విభాగం మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంతో 2012లో ఈ ప్రయోగశాల ఏర్పాటైంది. దాదాపు రూ.3 కోట్ల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌లో ప్రధానంగా ఫైబర్ ఆప్టిక్ కమ్యూనికేషన్స్, లేజర్ డయోడ్ల తయారీకి అవసరమైన గ్లాస్ మెటీరియల్‌ను తయారు చేస్తున్నారు. ఇక్కడ తయారయ్యే గ్లాస్ మెటీరియల్స్ (రేర్ ఎర్త్ డిపెడ్ గ్లాస్) నేరుగా ముంబయిలోని బార్క్‌కు సరఫరా అవుతాయి. 6౹ 10 ఎంఎం వంటి నిర్దిష్ట కొలతలతో బార్క్ శాస్త్రవేత్తలు అడిగినట్లుగా వీటిని తయారు చేస్తారు. వీటిని అక్కడి శాస్త్రవేత్తలు డిఫెన్స్ రీసెర్చ్‌లో, రాడార్ అప్లికేషన్లలో, విమానయాన రంగంలో లేజర్ గ్రైడెన్స్ కోసం వినియోగిస్తున్నారు. ఎస్వీయూలో తయారవుతున్న ఈ చిన్ని గాజు పలకలు.. దేశ రక్షణ, సాంకేతిక రంగాల్లో వెలుగులు నింపుతుండటం విశేషం.

- ప్రస్తుతం మనం వాడుతున్న 5జీ నెట్‌వర్క్, ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్ పనితీరులో ఈ గ్లాస్ మెటీరియల్స్ పాత్ర కీలకం. చూడటానికి సాధారణ గాజు ముక్కలా కనిపించే వీటిపై యూవీ లైట్ పడగానే రంగులు మారుతాయి. ఉదాహరణకు 'యూరోపియం' డోప్ చేసిన గ్లాస్ ఎరుపు రంగును, 'సమేరియం' ఆరెంజ్ రంగును, 'డైస్ప్రోజియం' వైట్ లైట్‌ను వెదజల్లుతాయి.
- వైద్య రంగంలోనూ ఈ ల్యాబ్ కృషి ఉంది. 'బ్లడ్‌లెస్ సర్జరీ'లు, ఎండోస్కోపిక్ పరీక్షల్లో శరీరం లోపలికి పంపే లేజర్ డయోడ్ల తయారీలో ఈ మెటీరియల్స్ ఉపయోగిస్తున్నారు.


వివిధ పరిమాణాల్లో రూపొందించిన గ్లాసులు


ప్రయోగాల గురించి వివరిస్తున్న ఫిజిక్స్ విభాగాధిపతి దేవప్రసాద్‌రాజు

1,500 డిగ్రీల సెగలో కఠిన ప్రక్రియ

ఈ గ్లాస్ తయారీ సులభం కాదని పరిశోధకులు చెబుతున్నారు. 'సాలిడ్ స్టేట్ రియాక్షన్' పద్ధతిలో బోరిక్ యాసిడ్, హెవీ మెటల్ ఆక్సైడ్స్ వంటి రసాయనాలను కచ్చితమైన మోతాదులో (మాలిక్యులర్ వెయిట్) తీసుకొని గంటల తరబడి గ్రైండ్ చేస్తారు. అనంతరం 1,300-1,500 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండే ఫర్నేస్‌లో వేడిచేసి ద్రవ రూపంలోకి మారాక క్షణాల్లో బయటకు తీసి మౌల్డ్ చేస్తారు. ఏమాత్రం ఆలస్యమైనా ప్రయోగం విఫలమవుతుందని, ఎంతో ఓర్పు ఉంటేనే ఈ అద్భుత గ్లాస్ తయారవుతుందని, ఇప్పటి వరకు వివిధ పరిమాణాల్లో 180 వరకూ తయారు చేసి సరఫరా చేశామని హెచ్‌ఓడీ దేవప్రసాద్, రీసెర్చ్ స్కాలర్లు వివరించారు.

చంద్రబాబుతో పవన్‌కల్యాణ్ భేటీ

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఉండవల్లిలోని సీఎం నివాసంలో బుధవారం సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిస్థితులు, కల్తీ నెయ్యి వ్యవహారం, సిట్ రిపోర్టు తదితర అంశాలపై ఈ సందర్భంగా ఇరువురు నేతలూ చర్చించినట్లు సమాచారం. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సుమారు రెండున్నర గంటలు ఈ భేటీ సాగింది. గురువారం చంద్రబాబు, పవన్‌కల్యాణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సమావేశం కానున్నారు. అనంతరం కూటమి నేతలు సంయుక్తంగా విలేకరులతో మాట్లాడే అవకాశం ఉంది. మంగళవారం జరిగిన మంత్రిమండలి సమావేశానికి ముందు కూడా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సమావేశమయ్యారు.

గ్రహం అనుగ్రహం

5–2–2026 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, బహుళ పక్షం
చవితి: రా. 2-05 తదుపరి పంచమి
ఉత్తర: మ. 12-52 తదుపరి హస్త
వర్జ్యం: ఉ. 7-34 నుంచి 9-13 వరకు
అమృత ఘడియలు: సా. 5-27 నుంచి 7-06 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10-20 నుంచి 11-06 వరకు తిరిగి మ. 2-52 నుంచి 3-37 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6.35; **సూర్యాస్తమయం:** సా.5.53
సంకట హర చతుర్థి

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	15.0	28.0
అనంతపురం	17.3	34.0
శ్రీకాకుళం	18.0	30.0
కడప	18.0	31.0
తాడేపల్లిగూడెం	19.0	32.0
రాజమహేంద్రవరం	19.0	34.0
హైదరాబాద్	19.2	28.8
కర్నూలు	19.2	32.8
తిరుపతి	19.5	30.8
గుంటూరు	20.0	32.0
విశాఖపట్నం	20.6	30.4
విజయవాడ	21.2	30.0
నరసాపురం	21.5	32.0
ఒంగోలు	21.6	31.2
నెల్లూరు	21.8	31.5

ఆంత్రోపిక్ ప్రకంపనలు

(మొదటి పేజీ తరువాయి)

చివరివారంలో ఆవిష్కరించింది. వివిధ రంగాల్లోని పనులను నిర్వహించేందుకు వీలుగా 11 కొత్త ప్లగిన్‌లను విడుదల చేసింది. స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుని, పనులు నిర్వహిస్తాయన్నమాట.

- ఇప్పటివరకు అందుబాటులో ఉన్న ఏఐ టూల్స్.. చాట్‌జీపీటీ, జెమినై, గ్రోక్..వంటివన్నీ తెలివైన విద్యార్థుల వంటివి. మనం వాటిని ఏం అడిగితే, దానికి మాత్రమే సమాధానం ఇస్తాయి. కంటెంట్ రాయమంటే, అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా రాస్తాయి. కానీ, వాటికి మనమే మార్గనిర్దేశం చేయాల్సి ఉంటుంది. క్లాడ్ కోవర్క్ అలా కాదు.. ఇది పనులు ఎలా పూర్తి చేయాలో తెలిసిన ఒక అనుభవజ్ఞుడైన ఆఫీసు ఉద్యోగిలా ప్రవర్తిస్తుంది. ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడమే కాదు, నేరుగా రంగంలోకి దిగి, పనులను పూర్తి చేస్తుంది. ఒక్కమాటలో.. క్లాడ్ కోవర్క్ అనేది ఒక పూర్తిస్థాయి డిజిటల్ ఉద్యోగి అని చెప్పొచ్చు.

భవిష్యత్తు ఎలా?

సంప్రదాయ కోడింగ్, టెస్టింగ్ చేసే వారికంటే భవిష్యత్తులో కన్సల్టింగ్, ప్లాట్‌ఫామ్ ఆధారిత పరిష్కారాలు, అధిక విలువ కలిగిన పనులు చేసే ఉద్యోగులకే గిరాకీ అధికంగా ఉంటుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. భవిష్యత్తును అంచనా వేసే, స్టాక్ మార్కెట్లలో మదుపర్లు లావాదేవీలు నిర్వహిస్తుంటారు. బుధవారం ఐటీ షేర్ల పతనం ఏఐ ఆందోళనల ఫలితమే. మానవ వనరుల ఆధారిత ఐటీ కంపెనీల వ్యాపార నమూనాలు, ఎంతకాలం నిలకడగా ఉంటాయనే దానిపై అనిశ్చితి వల్లే, ఈ షేర్లను విక్రయించారు. కొన్నేళ్లలో సాంకేతిక మార్పులు మరింత వేగం పుంజుకుంటాయని.. దానికి అనుగుణంగా కంపెనీలు తమ వ్యూహాలను మార్చుకోవాల్సి ఉంటుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.


మన కంపెనీలకు ఎందుకు కష్టం?

మన ఐటీ కంపెనీల ఆదాయంలో సింహభాగం అమెరికా, ఐరోపా దేశాల సంస్థల నుంచే వస్తుంది. అక్కడి వాణిజ్య సంస్థల కోసం సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, టెస్టింగ్, నిర్వహణ సేవలను మన ఐటీ కంపెనీలు అందిస్తాయి. ఇందుకోసం భారీగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లను నియమించుకుంటున్నాయి. ఆంత్రోపిక్ టూల్స్ వల్ల ఔట్‌సోర్సింగ్ ప్రాజెక్టులు తగ్గే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. మన ఐటీ కంపెనీల బిల్లింగ్ 'లేబర్ బేస్డ్ మోడల్'పై ఉంటుంది. ఒక ప్రాజెక్టు కోసం ఎంతమంది ఇంజినీర్లు, ఎన్ని గంటలు పనిచేశారు అనే లెక్కన క్లయింట్లు డబ్బు చెల్లిస్తారు. దీన్నే 'బిల్లబుల్ హవర్స్' అంటారు. క్లాడ్ వంటి ఏఐ టూల్స్ కోడింగ్, టెస్టింగ్‌లాంటి పనులను ఎంతో వేగంగా చేసేస్తున్నాయి. పది మంది చేసే పనిని, ఏఐ సాయంతో ఒకే ఇంజినీర్ చేయగలిగితే.. క్లయింట్లు ఇచ్చే డబ్బులు తగ్గిపోతాయి. ఇది మన ఐటీ కంపెనీల వ్యాపార లావాదేవీల పరిమాణాన్ని, మార్జిన్లను దెబ్బతీసే ప్రమాదముంది. ఇంతేకాదు.. ఐటీ ఉద్యోగ మార్కెట్‌పైనా తీవ్ర ప్రభావం చూపొచ్చు. గ్లోబల్ టెక్ కంపెనీలు ఖర్చులు తగ్గించుకునేందుకు ఏఐని వేగంగా స్వీకరిస్తున్నాయి. అవి ఔట్ సోర్సింగ్ తగ్గిస్తే, విదేశీ క్లయింట్లపైనే ఎక్కువగా ఆధారపడిన భారతీయ ఐటీ సంస్థలు ఇబ్బందుల్లో పడతాయి.

ఉద్యోగాలు పోతాయా?

ఆంత్రోపిక్ విడుదల చేసిన ప్లగిన్‌లు.. గతంలో వ్యక్తులు లేదా ప్రత్యేక సాఫ్ట్‌వేర్లు చేసే పనులను చిటికెలో చేసేస్తాయని చెబుతున్నారు. వాటిలో

- **లీగల్ ప్లగిన్:** ఇది కాంట్రాక్టులను పరిశీలించడం, వాటిలో ఎన్‌డీఏ (రహస్య ఒప్పందాల)ను క్రమబద్ధీకరించడం, నష్టాలను గుర్తించడం, చట్టపరమైన నిబంధనలను సరిచూడటం వంటివి చేస్తుంది. ఈ ప్లగిన్ సామర్థ్యం బయటపడగానే లీగల్ టెక్నాలజీ కంపెనీలైన థామ్సన్ రాయిటర్స్, లీగల్ జూమ్ వంటి షేర్లు 15-20% పడిపోయాయి.
- **ఫైనాన్స్ ప్లగిన్:** ఎకౌంటింగ్ వివరాలను నమోదు చేయడం, ఖాతాల పరిశీలన, ఆర్థిక నివేదికలను సిద్ధం చేయడం వంటి పనులను నిర్వహిస్తుంది.
- **డేటా అనాలసిసస్:** డేటాబేస్‌ల నుంచి సమాచారాన్ని సేకరించేందుకు అవసరమైన ఎస్‌క్యూఎల్ క్వెరీలను రాయడం, ఆ డేటా తీసుకుని, అందమైన డాష్‌బోర్డులుగా మార్చడం దీని పని.
- **బయో రీసెర్చ్:** ల్యాబ్ డేటాకు అనుసంధానమై, శాస్త్రీయ పరిశోధనల ప్రారంభ దశలో కీలక సాయాన్ని అందిస్తుంది. ఇలా ఈ ప్లగిన్‌లు నిపుణులు, ఖరీదైన సాఫ్ట్‌వేర్లు, ఔట్ సోర్సింగ్ బృందాలు చేసే పనులను భర్తీ చేస్తాయని అంటున్నారు.



రాజేంద్రప్రసాద్‌కు చంద్రబాబు సత్కారం

ఈనాడు, అమరావతి: సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. రాజేంద్రప్రసాద్‌కు కేంద్ర ప్రభుత్వం ఇటీవల పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించిన నేపథ్యంలో చంద్రబాబు ఆయన్ను సాదరంగా ఆహ్వానించారు. పురస్కారం వచ్చినందుకు అభినందించి, సత్కరించారు. నాలుగు దశాబ్దాలుగా వెండితెరపై వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించడమే కాకుండా తెలుగు సినిమా ఖ్యాతిని పెంచినందుకు పురస్కారం లభించిందని హర్షం వ్యక్తం చేశారు.

ఉప ముఖ్యమంత్రి అభినందన

సినీనటుడు రాజేంద్రప్రసాద్ బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాజేంద్రప్రసాద్‌కు పద్మశ్రీ ప్రకటించిన నేపథ్యంలో పవన్‌కల్యాణ్ ఆయన్ను అభినందించారు.


రాజేంద్రప్రసాద్‌ను సత్కరించిన సీఎం చంద్రబాబు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

తిరుమలలో ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రయోగశాల సిద్ధం

మార్చి నుంచి అందుబాటులోకి

తిరుమల, న్యూస్‌టుడే: ఆహార నాణ్యతను తనిఖీ చేసేందుకు, అతితక్కువ మోతాదులోని కల్తీని సైతం గుర్తించడమే లక్ష్యంగా తిరుమలలో భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రయోగశాల అందుబాటులోకి రానుంది. కేంద్రం, రాష్ట్ర ఆరోగ్య భద్రతా విభాగం, తితిదేలు సంయుక్తంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేస్తున్నాయి. తితిదే నీరు, ఆహార పదార్థాల ల్యాబ్‌కు సమీపంలోనే ఈ ప్రయోగశాల ఏర్పాటవుతోంది. కేంద్ర ప్రభుత్వం రూ.20 కోట్లతో కొనుగోలు చేసిన సాంకేతిక పరికరాలు ఇందులో అమర్చుతున్నారు. గ్యాస్ క్రొమటోగ్రాఫ్ (జీసీ), హై పర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రోమెగ్రాఫ్ (హెచ్‌పీఎల్‌సీ), ఐసీపీఎంఎస్ తదితర 15 పరికరాలు ఇందులో ఉంటాయి. ఈ పరికరాల సహాయంతో అతి సూక్ష్మస్థాయిలోని కల్తీని సైతం గుర్తించవచ్చు. మార్చిలో ఈ ప్రయోగశాల అందుబాటులోకి రానుంది. ఇన్‌ఛార్జి ఈవో వెంకయ్య చౌదరి మంగళవారం ఈ ల్యాబ్‌ను పరిశీలించారు. ప్రారంభించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

16న రాష్ట్రానికి బిల్ గేట్స్

గేట్స్ ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమాలపై సీఎంతో సమీక్ష!

ఈనాడు, అమరావతి: మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఈ నెల 16న రాష్ట్రానికి రానున్నారు. తొలుత ఈ పర్యటన 18న ఉంటుందని భావించినా ముందుగానే వస్తున్నారు. ఆయన పర్యటన ఒక్క రోజే ఉంటుందా లేక రెండు రోజులు రాష్ట్రంలో ఉంటారా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ పర్యటనలో భాగంగా వివిధ అంశాలపై సీఎం చంద్రబాబుతో గేట్స్ సమీక్షల్లో పాల్గొంటారని తెలుస్తోంది. రాష్ట్రంలో ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, విద్యలో మెరుగైన ఫలితాలకు ఏఐ పరిజ్ఞానాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో బిల్, మెలిండా గేట్స్ ఫౌండేషన్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అత్యుత్తమ సాంకేతికత ద్వారా ఆరోగ్య అంశాలను పర్యవేక్షించేలా ప్రాజెక్టును చేపట్టింది. బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారంతో డిజిటల్ హెల్త్ రికార్డులను తయారు చేయనున్నారు. ఇప్పటికే చిత్తూరు జిల్లాలో సంజీవని ప్రాజెక్టును ప్రభుత్వం అమలు చేస్తోంది. వీటన్నింటిపైనా సీఎంతో జరిగే సమావేశంలో బిల్ గేట్స్ చర్చించే అవకాశం ఉంది. దీంతోపాటు అమరావతి క్వాంటమ్ వ్యాలీలో మైక్రోసాఫ్ట్ పెట్టుబడులపై స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. 19న దిల్లీలో జరగనున్న ఏఐ సమిట్‌లో గేట్స్ పాల్గొంటారు. సీఎం కూడా ఈ సదస్సుకు హాజరవుతారు.

పార్లమెంటు సాక్షిగా వైకాపా అబద్ధాలు

- రాష్ట్ర ప్రతిష్ఠపై దాడి
- తెదేపా ఎంపీ బీద మస్తాన్‌రావు ధ్వజం
- వారు అధికారంలో ఉంటే వైజాగ్ స్టీల్ ప్రైవేటీకరణ పూర్తయిపోయేదని ఎద్దేవా

ఈనాడు, దిల్లీ: వైకాపా ఎంపీలు రెండు రోజులుగా పార్లమెంటు సాక్షిగా అబద్ధాలు వల్లెవేస్తూ ఆంధ్రప్రదేశ్ గౌరవ, ప్రతిష్ఠలపై దాడి చేశారని తెదేపా రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు ధ్వజమెత్తారు. సభాధ్యక్షుడు హెచ్చరించినా పట్టించుకోకుండా రాజకీయ ప్రయోజనాల కోసం అబద్ధాలు, తప్పుడు సమాచారంతో వారు పార్లమెంటు ప్రతిష్ఠను దిగజార్చారని ఆరోపించారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన బుధవారం సాయంత్రం రాజ్యసభలో ప్రసంగించారు. వైకాపా ఎంపీలు చెప్పిన అబద్ధాలను విస్మరించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను గమనించాలని కోరారు. కేంద్రంతో పూర్తి సమన్వయంతో పని చేస్తూ సహకారపూర్వక సమాఖ్య వ్యవస్థ ఫలితాలను కూటమి క్షేత్రస్థాయిలో చూపుతోందన్నారు. రాష్ట్రంలో ప్రధాన ప్రాజెక్టులైన పోలవరం, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్లను ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర మంత్రులు తరచూ పరిశీలిస్తూ వాటిని సరైన పంథాలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. వారి పార్టీ (వైకాపా) నాయకుడు అసెంబ్లీకి హాజరై ఉంటే ఈ విషయాలన్నీ తెలిసేవని ఎద్దేవా చేశారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం రూ.11 వేల కోట్లకు పైగా ఆర్థిక ప్యాకేజీ అమలు చేసిందని గుర్తుచేశారు. వైకాపాయే అధికారంలో ఉంటే ఇప్పటికే ఆ సంస్థ ప్రైవేటీకరణ పూర్తయ్యేదని వ్యాఖ్యానించారు.


రాజ్యసభలో మాట్లాడుతున్న బీద మస్తాన్‌రావు

పోలవరం సాకారానికి పరుగులు

పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించడమే కాకుండా దాని నిర్మాణం వేగంగా పూర్తి చేసి రాష్ట్ర ప్రజల కలలను సాకారం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మస్తాన్‌రావు పేర్కొన్నారు. వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టులో 3.5% మాత్రమే పనులు చేయడంతోపాటు, తమ చేతకానితనంతో ఉన్న నిర్మాణాలూ దెబ్బతినడానికి కారణమైందని ధ్వజమెత్తారు. తాము అభివృద్ధి కోసం పని చేస్తుంటే వాళ్లు విధ్వంసం కోసం పని చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలు నిర్మిస్తామని వాగ్దానం చేసినా వాటికి కనీసం పునాదిరాయి కూడా వేయలేదన్నారు. ఆ పార్టీ ఇప్పుడు జాతీయ స్థాయిలో ఆమోదం తెలిపిన పీపీపీ విధానాన్ని వ్యతిరేకించడం విడ్డూరంగా ఉందన్నారు. వారు కనీసం పీపీపీ- ప్రైవేటీకరణ మధ్య తేడాను అర్థం చేసుకోలేకపోతున్నారని విమర్శించారు. పీపీపీ విధానంలో కళాశాలల నియంత్రణ పూర్తిగా ప్రభుత్వం చేతిలో ఉంటుందన్నారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు విశాఖపట్నంలో ఉన్న రుషికొండలాంటి సహజ అందాలను ధ్వంసం చేయడంలో బిజీగా ఉంటే తమ ప్రభుత్వం అంతర్జాతీయ పెట్టుబడులు తీసుకురావడంలో తలమునకలైందని మస్తాన్‌రావు పేర్కొన్నారు. వికాసమే సంకల్పం, సమగ్రతే సాధనం, అదే భారత భవిష్యత్తు అని చెప్పారు.

అమరావతిలో అంతర్జాతీయ క్రీడా నగరం

దోహాలో స్పోర్ట్స్ సిటీని సందర్శించిన మంత్రి నారాయణ

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో అంతర్జాతీయ క్రీడా నగరం నిర్మాణానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ అన్నారు. 4 రోజుల విదేశీ పర్యటనలో భాగంగా ఖతార్ రాజధాని దోహాలోని క్రీడా నగరాన్ని (స్పోర్ట్స్ సిటీ) అధికారులతో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. అందులోని ఖలీఫా అంతర్జాతీయ స్టేడియం, ఆస్పిటర్ స్పోర్ట్స్ హాస్పిటల్, అకాడమీలను పరిశీలించి ప్రత్యేకతలు అడిగి తెలుసుకున్నారు. 250 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న ఈ స్పోర్ట్స్ సిటీలో 2006లో ఆసియా క్రీడలు నిర్వహించారు. 2022 ఫిఫా వరల్డ్ కప్ నిర్వహించిన లుసైల్ స్టేడియంనూ చూశారు. అమరావతిలో అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి అవసరమైన ప్రణాళికపైనా దోహా అధికారులతో చర్చించారు. అంతకు ముందు లండన్‌లో పర్యటించిన నారాయణ బృందం.. అక్కడి స్ట్రాట్‌ఫోర్డ్‌లోని క్వీన్ ఎలిజబెత్ ఒలింపిక్ పార్కును పరిశీలించింది. 2012లో ఒలింపిక్ క్రీడల కోసం నిర్మించిన ఈ స్పోర్ట్స్ పార్కులోని పలు ప్లేజోన్ల గురించి అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రసిద్ధ లండన్ స్టేడియం, లండన్ ఆక్వాటిక్స్ సెంటర్, హైడ్ పార్కు, లీవ్యాలీ వేలో పార్కులను సందర్శించి అధ్యయనం చేశారు. మంత్రి వెంట పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్, అమరావతి గ్రోత్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాస్ ఉన్నారు.


దోహాలో స్పోర్ట్స్ సిటీని సందర్శించి స్టేడియంను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ బృందం

జేఈఈ మెయిన్ ప్రాథమిక కీ విడుదల

ఏపీ విద్యార్థికి 300కి 300 మార్కులు

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ మెయిన్ పేపర్-1 ప్రాథమిక కీ బుధవారం విడుదలైంది. దీనితోపాటు విద్యార్థుల రెస్పాన్స్ షీట్‌ను జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) వెబ్‌సైట్‌లో ఉంచారు. గత నెల 22, 23వ తేదీల్లో ఉదయం విడత నిర్వహించిన భౌతికశాస్త్రం పరీక్షలో ఒక్కో ప్రశ్నను డ్రాప్ చేశారు. అంటే వాటికి పూర్తి మార్కులు ఇస్తారు. 23వ తేదీ మధ్యాహ్నం విడత జరిగిన పరీక్షలో భౌతికశాస్త్రంలో మూడు సరైన జవాబులను ఇచ్చారు. అందులో ఏది గుర్తించినా మార్కులు ఇవ్వనున్నారు. ఈ కీపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి వరకు వెబ్‌సైట్ నుంచి పంపుకోవచ్చు. ఫలితాలను 12వ తేదీలోపు ప్రకటిస్తారు. ఫలితాల విడుదల నాడు ఇచ్చే తుది కీ ప్రకారం పర్సంటైల్ స్కోర్ ఖరారు చేస్తారు. ఎన్‌టీఏ విడుదల చేసిన ప్రాథమిక కీ ప్రకారం విజయవాడలోని ఓ కార్పొరేట్ కళాశాలలో చదువుతున్న కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన పసల మోహిత్‌కు 300కి 300 మార్కులు దక్కాయి. జనవరి 22వ తేదీన ఉదయం జరిగిన పరీక్షకు మోహిత్ హాజరయ్యాడు.

అర్ధ శతం.. ఆపైనా అదిరేలా...

☛ హైదరాబాద్‌కు చెందిన నవీన్ తన 50వ పుట్టిన రోజును కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి వేడుకగా చేసుకున్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు కూడా చేశారు. మంచి అలవాట్లతో నిండు జీవితాన్ని గడపాలని లక్ష్యంగా చేసుకున్నారు.

☛ మాజీ విశ్వసుందరి సుస్మితాసేన్ 50వ పుట్టిన రోజు వేడుకలను గత నవంబరులో ఘనంగా చేసుకున్నారు. ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదుర్కొన్నా యోగా, వ్యాయామం తనను కాపాడాయని అభిమానులతో పంచుకున్నారు.

- క్రికెట్లో హాఫ్ సెంచరీ ఆడుతూపాడుతూ పూర్తయినా, సెంచరీ కొట్టాలంటే మరింత ఉత్సాహం, ఏకాగ్రత అవసరం. ఆటలోనే అర్ధ శతకానికి అంత ప్రాధాన్యం ఉంటే జీవితంలో 50 ఏళ్ల మార్కును చేరడం ఒక మైలురాయి అనే చెప్పాలి. అందుకే ఇప్పుడు 50 ఏళ్ల బర్త్‌డే తీర్మానాలకు వేదికగా మారుతోంది.
- పుట్టినరోజులు కేవలం సంబరాలకే పరిమితం కావడంలేదు. దీర్ఘాయువు సొంతం చేసుకోవాలంటే ఇకపై ఆరోగ్యాన్ని మరింత కాపాడుకోవాలనే తీర్మానాలు చేయడం సరికొత్త హెల్త్ ట్రెండ్‌గా మారింది.
- కళాశాలల్లో ఫ్రెషర్స్ పార్టీ, సెండాఫ్ వేడుక, పెళ్లి చేసుకునే ముందు బ్యాచిలర్ పార్టీల్లాగే ఇప్పుడు 50వ పడిలోకి అడుగెట్టే సందర్భాన్ని ఆరోగ్యంతో ముడిపెడుతూ అప్రమత్తం అవుతున్నారు.
- ఈ వయసులో తగిన జాగ్రత్తలు తీసుకుంటే.. వృద్ధాప్యంలో హృద్రోగ సమస్యలు లేకుండా జీవిస్తారని 'న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్' అధ్యయనం వెల్లడించింది.

- ఇన్నాళ్లు ఇంట్లో, ఆఫీసులో టీలు, కాఫీలు లెక్కలేనన్నిసార్లు తాగేవాళ్లు.. ఇకపై ఒకటి, రెండుసార్లకు పరిమితం కావడం. సాయంత్రం గ్రీన్ టీ తాగాలని నిర్ణయం.
- స్నేహితులతో చేసుకునే వీకెండ్ పార్టీలు తగ్గించడం. మద్యపానం, ధూమపానాలకు పరిమితి.
- ఉదయం కనీసం అరగంటపాటు నడకకు వెళ్లడం. అప్పటి వరకు తరచూ రెస్టారెంట్లలో తినేవారు దాన్ని తగ్గించి, ఇంట్లో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం.
- ఆరు నెలలకోసారి తప్పనిసరిగా హెల్త్ చెకప్.

తీర్మానాలు ఇలా...

- మంచి నీరు ఎక్కువగా తాగడం. ఉప్పు, చక్కెరలను గణనీయంగా తగ్గించడం.
- ఇన్నాళ్లు ఆరోగ్య బీమా లేకుండా ఉన్నాం. తీసుకోవాలి.
- స్క్రీన్‌టైం తగ్గించి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి మాట్లాడడం.
- మానసిక ప్రశాంతత కోసం ధ్యానం, పుస్తక పఠనం, మొక్కల పెంపకం లాంటి వ్యాపకాలు.



ఈ దశలో చాలా అవసరం

- మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలంటే ఆరోగ్య సంరక్షణపై అప్రమత్తత చాలా అవసరం. ఇప్పుడు 50 ఏళ్లకు ముందే అనేక జబ్బులు దాడి చేస్తున్నాయి. ఈ క్రమంలో ఆరోగ్య సంరక్షణపై కచ్చితంగా దృష్టిసారించాలి.
- నిత్యం నడక అలవాటు చేసుకోవాలి. లేదంటే మోకాళ్ల నొప్పులతో తర్వాత నడవలేని స్థితికి చేరుకుంటాం. అధిక రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ తదితర రోగ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి.
- ఫ్యామిలీ హిస్టరీ ఉన్నవారు వైద్యుల సూచనలతో క్యాన్సర్ పరీక్షలు కూడా చేసుకోవాలి. మహిళలు పాప్‌స్మియర్ పరీక్ష చేయించుకోవాలి.
- మహిళలకు ఇది మెనోపాజ్ దశ. పలు జబ్బుల బారిన పడే అవకాశం ఉంది. గుండెపోటు ప్రమాదం పొంచి ఉంటుంది. అప్రమత్తంగా ఉండాలి.
- జంక్‌ఫుడ్, నూనె పదార్థాలకు దూరంగా ఉండి ప్రొటీన్, పీచు పదార్థాలు బాగా తినాలి.
- ఒత్తిళ్లు ఎక్కువగా ఉండే సమయం కూడా ఇదే... కాబట్టి ధ్యానం, యోగాలతో మానసిక ప్రశాంతత పొందాలి.

– డాక్టర్ జలగం తిరుపతిరావు, జనరల్ ఫిజీషియన్, నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి

- ఈనాడు, హైదరాబాద్

ఉగాది, కళారత్న పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రముఖులకు ఉగాది, కళారత్న పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు సమితి సీఈవో ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 20వ తేదీ లోపు పూర్తి బయోడేటా, దరఖాస్తును సీఈవో, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి కార్యాలయం, రెండో అంతస్తు, ఘంటశాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ, సంగీత, నృత్య కళాశాల, దుర్గాపురం, విజయవాడ చిరునామాకు పంపాలని కోరారు. లేదా apculture.ugadi2026@gmail.com కు పంపాలని సూచించారు. మార్చి 19న జరిగే శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకల్లో ఈ పురస్కారాలు అందజేయనున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ''సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, శిల్పం, నాటకం, జానపదం, మిమిక్రీ, అవధానం, వైద్యం, ఇంద్రజాలం-మూకాభినయం, హరికథ-బుర్రకథ, పాత్రికేయం, సామాజిక సేవ సహా కమిటీ సిఫార్సు చేసిన ఇతర సేవారంగాల్లో ఈ పురస్కారాలు అందజేస్తాం'' అని మల్లికార్జునరావు తెలిపారు.

మంత్రి కొండపల్లికి 'ది ప్రెసిడెంట్స్ వాలంటీర్ సర్వీస్' పురస్కారం

ఈనాడు, అమరావతి: యూఎస్-ఇండియా ఎస్ఎంఈ కౌన్సిల్ అందించే అంతర్జాతీయ పురస్కారం 'ది ప్రెసిడెంట్స్ వాలంటీర్ సర్వీస్' అవార్డు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు లభించింది. చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి ఆయన అందించిన సేవలకు గాను ఈ పురస్కారాన్ని కౌన్సిల్ ప్రకటించింది. వాషింగ్టన్ డీసీ ప్రధాన కేంద్రంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి కోసం ఈ కౌన్సిల్ పనిచేస్తోంది. అమెరికా అధ్యక్షుని పేరుతో ఇచ్చే పురస్కారాన్ని కౌన్సిల్ సీఈవో/ప్రెసిడెంట్ ఎలీషా బి. పులివర్తి మంత్రి శ్రీనివాస్‌కు అందజేశారు. రాష్ట్రంలో చిన్నతరహా పరిశ్రమల బలోపేతం, మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, సెర్ప్ ద్వారా గ్రామీణ ఉపాధి అవకాశాల పెంపు, స్థానిక పరిశ్రమలను అంతర్జాతీయ మార్కెట్‌తో అనుసంధానం చేయడం తదితర అంశాల్లో చేసిన కృషికి ఈ అవార్డు దక్కిందని మంత్రి కొండపల్లి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.


అవార్డును చూపుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

■ రాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు యూఎస్ ఇండియా ఎస్ఎంఈ కౌన్సిల్ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. తద్వారా అమెరికాలోని పెట్టుబడులు, సాంకేతికతను రాష్ట్రంలోని చిన్న పరిశ్రమలకు ఆ సంస్థ అందించనుంది. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సీఈవో/ప్రెసిడెంట్ ఎలీషా బి. పులివర్తి, వైస్ ఛైర్మన్ శ్రీహరి, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వమనోహరన్ పాల్గొన్నారు.

బిట్స్ హైదరాబాద్‌కు రూ.36 కోట్ల విరాళం

ఈనాడు, హైదరాబాద్: అమెరికాలో నివాసముంటున్న పూర్వవిద్యార్థులు, దంపతులైన చంద్ పి.గర్గ్, మంజు గర్గ్‌లు రూ.36 కోట్ల(4 మిలియన్ డాలర్లు) విరాళాన్ని బిట్స్- పిలానీ హైదరాబాద్‌కు అందించారు. ప్రపంచవ్యాప్తంగా బిట్స్ పిలానీ సంస్థలు అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందించాలని, ఇందుకోసం 100 మిలియన్ డాలర్ల ధార్మిక నిధిని సమీకరించుకోవాలని బిట్స్ కార్యవర్గం 18 నెలల క్రితం నిర్ణయించింది. ఇందుకోసం పూర్వ విద్యార్థులు తమవంతు సహకరించాలంటూ వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థించారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో నివాసముంటున్న పూర్వవిద్యార్థులు, స్వదేశంలో ఉంటున్నవారు కలిసి ఇప్పటివరకూ 34 మిలియన్ డాలర్లు విరాళంగా ఇచ్చారు. తాజాగా అమెరికాలో ఉంటున్న చంద్ గర్గ్ దంపతులు నాలుగు మిలియన్ డాలర్ల విరాళాన్ని బిట్స్ హైదరాబాద్‌కు బుధవారం పంపించారు. వీరిద్దరూ బిట్స్ పిలానీలో 1968లో మెకానికల్ ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తిచేశారు. అమెరికాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఇంటర్నేషనల్ ట్రేడ్, క్రెడిట్స్ వ్యాపారం చేస్తున్నారు. భూరి విరాళం అందించిన చంద్ దంపతులను బిట్స్ పిలానీ వీసీ వి. రామ్‌గోపాల్ అభినందించారు.


చంద్ గర్గ్ దంపతులు

మంత్రి లోకేశ్‌తో వివిధ పార్టీల యువ ఎంపీల భేటీ

ఈనాడు, దిల్లీ: దిల్లీ పర్యటనలో ఉన్న తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌తో వివిధ పార్టీలకు చెందిన యువ ఎంపీలు బుధవారం ఇక్కడ భేటీ అయ్యారు. తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు నివాసంలో జరిగిన ఈ విషయాన్ని భాజపా యువ నాయకుడు, బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వీ సూర్య సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పంచుకున్నారు. ''మధ్యాహ్న భోజన సమయంలో వివిధ పార్టీలకు చెందిన ఎంపీలం అంతా కలిసి ఆంధ్రప్రదేశ్ చురుకైన నాయకుడు, కార్యదక్షుడు నారా లోకేశ్‌తో కలవడం చాలా స్ఫూర్తినిచ్చింది. మా రాష్ట్రాలకు ఇంకా ఏం చేయగలమన్న అంశంపై మేం ఆలోచనలను పంచుకున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్న పరిపాలనా విధానాల గురించి లోకేశ్ నుంచి తెలుసుకున్నాం. పరస్పరం తరుచుగా కలుసుకొని ఒకరి నుంచి మరొకరు మరిన్ని విషయాలు తెలుసుకోవాలని సంకల్పించాం. భారత దేశాన్ని మరింత ముందుకు నడిపించడానికి యువ రాజకీయ నాయకత్వం చేయాల్సింది చాలా ఉంది. ఒక పటిష్ఠమైన, సంపన్నమైన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిస్తున్నందుకు లోకేశ్ అన్నకు శుభాకాంక్షలు. సంకల్పించిన పనులను వేగంగా పూర్తిచేయాలనే ఆయన తపనను నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను' అని తేజస్వీ సూర్య పేర్కొన్నారు.


దిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి కమలేశ్ పాసవాన్‌తోపాటు ఎంపీలు అక్షయ్ యాదవ్ (ఎస్పీ), బ్రిజేష్ చౌతా(భాజపా), అరుణ్ నెహ్రూ(డీఎంకే), తేజస్వీ సూర్య(భాజపా), అరుణ్ భారతి(ఎల్‌జేపీ), శాంభవి(ఎల్‌జేపీ), లావు శ్రీకృష్ణదేవరాయలు(తెదేపా), హిబీ ఈడన్ (కాంగ్రెస్)లతో మంత్రి లోకేశ్

కూటమి ఎంపీలతో..

ఉదయం లోకేశ్ కేంద్రమంత్రి పెమ్మసాని నివాసంలో రాష్ట్రానికి చెందిన కూటమి ఎంపీలతో సమావేశమయ్యారు. కేంద్రం నుంచి ప్రస్తుతం రాష్ట్రానికి సంపూర్ణ సహకారం అందుతున్నందున బడ్జెట్‌లో చెప్పిన అన్ని అంశాలనూ సాధించడానికి ఎంపీలు వ్యక్తిగతంగా చొరవ తీసుకొని పనిచేయాలని కోరారు. ఇందులో తెదేపా ఎంపీలతోపాటు జనసేన ఎంపీ బాలశౌరి, భాజపా ఎంపీ పాకా సత్యనారాయణ, మాజీ ఎంపీ గల్లా జయదేవ్ కూడా పాల్గొన్నారు.

సింహాచలం ఆలయ ఈవోగా వెంకటరావు

ఈనాడు, అమరావతి: సింహాచలం వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఈవోగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ జె.వెంకటరావుని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో)గా ఉన్నారు. అనంతపురంలోని కోనేరు రంగారావు కమిటీ (కేఆర్ఆర్‌సీ) స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న డి.వి.వెంకటేశ్వరరావును కాకినాడ డీఆర్వోగా బదిలీ చేశారు.


ఇదీ వాస్తవం

ఆరోగ్యం=	80 శాతం ఆహారం+ 20 శాతం వ్యాయామం
ఉద్యోగం=	80 శాతం నిలకడ+ 20 శాతం ఆలోచనలు
నాయకత్వం=	80 శాతం వినడం+ 20 శాతం సంభాషణ
సంతోషం=	80 శాతం అర్థవంతమైన జీవితం+ 20 శాతం సరదాలు
అభివృద్ధి=	80 శాతం క్రమశిక్షణ+ 20 శాతం వ్యూహాలు
అనుబంధాలు=	80 శాతం సహానుభూతి+ 20 శాతం ముచ్చట్లు
గెలుపు=	80 శాతం కార్యాచరణ+ 20 శాతం సంకల్పం

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

భవిష్యవాణి వినేందుకు పోటెత్తిన భక్తజనం

మైలార జాతరలో జనసందోహం

హొసపేటె, న్యూస్‌టుడే : కర్ణాటకలోని ప్రముఖ ధార్మిక క్షేత్రం విజయనగర జిల్లా హడగలి తాలూకా మైలారలో నిర్వహించిన మైలార జాతరకు భక్తజనం పోటెత్తారు. 15 రోజులుగా సాగుతున్న జాతరలో చివరి రోజైన బుధవారం 'భవిష్యవాణి' క్రతువు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు గొరవయ్య రామయ్య ప్రత్యేక విల్లు (పొడవైన కర్ర)పై ఎక్కి కూర్చొని 'సంపాయితలే పరాక్'(ఎల్లెడెలా సమృద్ధి) అని భవిష్యవాణి పలికారు. అది విని భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఉత్సవాల చివరి రోజు భక్తులు పెద్దఎత్తున వచ్చారు.


విల్లు ఎక్కి భవిష్యవాణి పలుకుతున్న గొరవయ్య రామయ్య


భవిష్యవాణి వినేందుకు తరలివచ్చిన భక్తజనం


ఈనాడు

ప్రజారోగ్యంపై టైఫాయిడ్ పంజా

దేశ జనాభాలో అధిక శాతానికి పరిశుభ్రమైన నీరు, ఆహారం, పరిసరాలు ఇంకా అందిరాకపోవడంతో కలరా, డయేరియా, హెపటైటిస్ వంటి వ్యాధులెన్నో కోరలు చాస్తున్నాయి. టైఫాయిడ్ కేసులూ కట్టుతప్పుతున్నాయి. 2023లో ఈ జబ్బు బారినపడి ప్రాణాలు కోల్పోయిన ప్రతి అయిదుగురు భారతీయుల్లో ఒకరు తెలంగాణ వాసి అన్న అధికారిక సమాచారం కలవరపరుస్తోంది. ఆ ఏడాది వ్యాధుల వల్ల సంభవించిన మరణాలపై భారత రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయ ఇటీవలి నివేదిక ఈ మేరకు చేదువాస్తవాలు వెల్లడించింది. దాని ప్రకారం టైఫాయిడ్‌తో ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎక్కువ మంది చనిపోతే, ఆ తరవాతి స్థానాల్లో తెలంగాణ, పంజాబ్ నిలిచాయి. ఏపీలో మరణాలు తక్కువగానే ఉన్నా, కేసులు విపరీతంగా వెలుగు చూస్తున్నాయి. తాజాగా రాజ్యసభలో కేంద్రం పేర్కొన్న వివరాల ప్రకారం గడిచిన అయిదేళ్లలో దేశవ్యాప్తంగా 23 లక్షలకు పైగా టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయి. ఏపీలో అవి 1.54 లక్షలు, తెలంగాణలో 64వేలకు పైగా బయటపడ్డాయి. నిర్ధారణ లోపాల వల్ల వాస్తవ కేసులు, మరణాలు పూర్తిగా అధికారిక లెక్కల్లోకి ఎక్కట్లేదు. ప్రజారోగ్యానికి టైఫాయిడ్ ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తం కావాలి. ఆ వ్యాధి వ్యాప్తికి కారణమవుతున్న వ్యవస్థాగత సమస్యల పరిష్కారానికి నడుంకట్టాలి!

పట్టణ భారతంలో పగుళ్లుబారిన పురాతన పైప్‌లైన్లు జనం బతుకులతో చెలగాటమాడుతున్నాయి. చాలా ప్రాంతాల్లో అవి మురుగు కాలువల కింద నుంచీ లేదా వాటి పక్కనే వెళ్తూ నిండు జీవితాలను బలిగొంటున్నాయి. తాగునీరు విషతుల్యమై ఇటీవల ఇండోర్‌లో పదుల సంఖ్యలో ప్రాణాలు పోగొట్టుకున్నారు. లోపభూయిష్ఠ తాగునీటి సరఫరా వ్యవస్థ వల్ల గతంలో గుంటూరు, హైదరాబాద్ వంటి చోట్ల ఎన్నో కుటుంబాల్లో కన్నీటి జ్వాలలు ఎగశాయి. రెండేళ్ల కిందట 485 పట్టణాల్లో కేంద్రం జరిపిన పరిశీలన ప్రకారం కేవలం 46 చోట్లే శుద్ధమైన నీరు నిత్యం సరఫరా అవుతోంది. పైప్‌లైన్లలో లీకేజీలు, నిర్వహణ లోపాలతో గ్రామీణ భారతంలోనూ తాగునీరు కలుషితమవుతున్న దుస్థితిని జలజీవన్ మిషన్ సర్వే వెలుగులోకి తెచ్చింది. ఇంకోపక్క చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేస్తుండటంతో జనావాసాల్లో దారుణ పరిస్థితులు నెలకొంటున్నాయి. చెరువులు, నాలాల ఆక్రమణల పుణ్యమా అని పట్టణాలు తీరూతెన్నూ లేకుండా విస్తరిస్తుండటంతో వానాకాలంలో వరదలు పోటెత్తుతున్నాయి. అవి నానా రోగాలను మోసుకొస్తున్నాయి!

పాలు మొదలు పప్పుదినుసుల దాకా దేశీయంగా అన్నీ కల్తీ మయమవుతున్నాయి. కాసుల కక్కుర్తితో కొన్ని హోటళ్ల యాజమాన్యాలు నాసిరకం, చెడిపోయిన పదార్థాలతో వంటలు వండి వడ్డిస్తున్నాయి. ఇక వీధుల వెంట విక్రయించే చిరుతిళ్లలో నాణ్యత మృగ్యమవుతోంది. బ్యాక్టీరియాతో నిండిన అలాంటి ప్రమాదకర ఆహారాలవల్ల టైఫాయిడ్, క్యాన్సర్ల వంటివెన్నో దాడిచేస్తున్నాయి. వినియోగదారుల ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్న కల్తీ ఆహార విక్రేతలను ఏమాత్రం ఉపేక్షించకూడదు. పారిశుద్ధ్యం, నీటి సరఫరాల పేరిట వసూలు చేస్తున్న సెస్సులు దుర్వినియోగం కాకుండా చూడటమూ ప్రభుత్వాల బాధ్యతే. 2015-18 మధ్యలో పరిసరాల పరిశుభ్రత పేరిట దేశవ్యాప్తంగా రాబట్టిన సొమ్ములో రూ.4891 కోట్లు సకాలంలో సంబంధిత నిధికి జమకాలేదని 'కాగ్' తేల్చింది. 2018-24 నడుమ ఖజానాకు జమ అయిన విద్యా వైద్య సెస్సు రూ.37,537 కోట్లు కూడా సంబంధిత అవసరాలకు బదిలీ కాలేదని నిరుడు వెల్లడైంది. ప్రజారోగ్య పరిరక్షణకు ఉద్దేశించిన నిధుల సక్రమ వినియోగం, తాగునీటి పైప్‌లైన్ల ఆధునికీకరణలపై ప్రభుత్వాలు చూపించే శ్రద్ధే జనజీవనానికి భద్రత కల్పిస్తుంది!



శాస్త్రవేత్తల మౌనమే కుట్రదారులకు వరమవుతుంది. మూఢనమ్మకాల వ్యాప్తికి మార్గం సుగమం చేస్తుంది. సమాజం మనమీద రుద్దే అహేతుకమైన వాదనలకూ విధానాలకూ లొంగకుండా హేతువాదిగా జీవించడం పెద్ద సవాలు.

– నరేంద్రనాయక్, హేతువాది, సామాజిక కార్యకర్త

భక్తి - ధర్మం

భక్తిభావం, ధర్మగుణం కలిగినవారే మనకు మార్గదర్శకులు, పురాణపురుషులు అయ్యారు. భక్తి వేరు, ధర్మగుణం వేరు. ధర్మగుణంలేని భక్తి శోభించదు, జయించదు. కానీ భక్తి లేకున్నా ధర్మగుణం సర్వత్రా విజయం సాధిస్తుంది. తల్లిపై ఎంతో ప్రేమతో, భక్తిభావంతో దుర్యోధనుడు యుద్ధారంభానికి ముందు గాంధారి ఆశీస్సులు కోరి నమస్కరించాడు. ఆమె 'యతోధర్మ-తతోజయః' అని దీవించింది. ధర్మం ఎక్కడ ఉంటుందో అక్కడ 'జయం' ఉంటుంది... అని ఆశీర్వదించింది. చివరికి ధర్మమే గెలిచింది. దాన్ని ఆశ్రయించిన పాండవులు భావితరాలకు ఆదర్శప్రాయులు అయ్యారు. నిండు సభలో వస్త్రాపహరణ సమయంలో ద్రౌపది భక్తితో వాసుదేవుణ్ని ప్రార్థించింది. ధర్మం ఆమె పక్షాన ఉండటం వల్ల కృష్ణుడు ఆమె భక్తికి ప్రతిస్పందించి, రక్షణగా నిలిచాడు.

దైవభక్తి, ధర్మగుణం రెండూ కలిగి ఉన్న వ్యక్తిలోనే దైవం ఉంటాడని అంబరీషుడి ఉదంతం చెబుతోంది. దుర్వాసుడి అనుచిత కోపాగ్నికి ప్రతిగా అతడి పైకి వచ్చిన సుదర్శన చక్రం బారినుంచి రక్షణ కోరినా బ్రహ్మ, సాక్షాత్తు శ్రీహరి కూడా అశక్తులయ్యారు. చివరికి అచంచల భక్తిపరుడైన అంబరీషుడే దుర్వాసుణ్ని రక్షించాడు. ధర్మగుణోపేతం, హరి భక్తిపూరితమైన అంబరీషోపాఖ్యానం ఆదర్శనీయమైనది.



అంతర్యామి

ఎంత దైవభక్తి కలిగి ఉన్నా ధర్మగుణం లేనివారికి అది నిరర్థకంగా మారుతుందనటానికి లంకాసురుడే నిదర్శనం. రావణాసురుడు పరమ శివభక్తుడు. సర్వకళాకోవిదుడు. కానీ పరస్త్రీని చెరబట్టడం ద్వారా ధర్మదూరుడయ్యాడు. అచంచలమైన భక్తి అతణ్ని రక్షించలేకపోయింది. దైవం భక్తులకు సులభంగా వశుడవుతాడు. కానీ, అధర్మపరుడైన భక్తుణ్ని రక్షించడంలో ఆ దైవం కూడా అశక్తుడవుతాడు. దీనికి గజాసుర, భస్మాసురుల ఉదంతాలే నిదర్శనాలు.

ధర్మగుణమే అంతిమ విజయాన్ని సాధిస్తుందని మహాభారతం స్పష్టంగా సందేశమిస్తుంది. ధర్మరాజు ధర్మగుణాన్నే అవలంబించాడు. అందుకు తగిన ప్రతిఫలాన్ని అందుకున్నాడు. అలాగే, కురు పితామహుడు శ్రీకృష్ణ భక్తుడు. విష్ణుసహస్ర నామాన్ని అందించిన ఘనతా భీష్ముడిదే. అయినప్పటికీ అధర్మవర్తనుడైన దుర్యోధనుడికి ఆయన అండగా నిలబడ్డాడు. మాయాజూదాన్ని వ్యతిరేకించలేదు. ద్రౌపది వస్త్రాపహరణాన్ని ఆపగలిగే శక్తి కలిగి ఉండీ మౌనం వహించాడు. అధర్మసహిత శక్తి- భక్తి ఆఖరికి నిర్వీర్యమయ్యాయి. ధర్మో రక్షతి రక్షితః అనే ఆర్యోక్తి ఇలా సర్వత్రా ప్రకటితమవుతుంది.

నేటి ఆధునిక కాలంలో ప్రజాబాహుళ్యంలో భక్తిభావం ఎక్కువగా కనిపిస్తోంది. అయితే, స్వచ్ఛమైన భక్తి మాత్రమే శక్తిమంతమైంది. ఇప్పటి రోజుల్లో అలాంటి ప్రతిఫలాపేక్ష లేని భక్తిని ఊహించడం కూడా కష్టమే! మానవసేవే మాధవసేవ అనే నానుడిని అనుసరించేవారు అరుదుగా తారసపడుతుంటారు. వారే ఈ కలియుగ ధర్మమూర్తులు. వారు దీర్ఘకాలిక విజయాలను అందుకుంటారు. పరుల పట్ల ఈర్ష్యాద్వేషాలు లేకపోవడం, సాటివారి శ్రేయస్సు కోరడం, ఆపన్నులను ఆదుకోవడం ఇవే ధర్మసూత్రాలు. ఆ ధర్మగుణాలే ప్రకాశిస్తాయి. సత్ఫలితాలను ఇస్తాయి.

– మోదుకూరు రాధాకృష్ణశర్మ

కేంద్ర బడ్జెట్ 2026-27

ఉద్గారాలపై పోరాటం...

నిధులే కీలకం



వాతావరణ మార్పులు భవిష్యత్తులో వచ్చిపడేవే తప్ప ఇప్పటికిప్పుడు వాటి గురించి ఆందోళన పడనక్కర్లేదని చాలామంది భావించవచ్చు. కేంద్ర ప్రభుత్వం మాత్రం అలా పొరబడటం లేదు. 2026-27 బడ్జెట్, 2025-26 ఆర్థిక సర్వేలను చూస్తే ఈ సంగతి అర్థమవుతుంది. వాతావరణ మార్పులు ఆర్థికానికీ, అభివృద్ధికీ నష్టం కలిగిస్తాయనీ, పరిపాలనాపరంగా సవాలు విసురుతాయని ప్రభుత్వం గ్రహించింది.

ప్రపంచ జనాభాలో ఆరో వంతుమంది నివసిస్తున్న భారతదేశంలో వాతావరణ వైపరీత్యాలు ఎప్పుడో భవిష్యత్తులో కాకుండా వర్తమాన కాలంలోనే అభివృద్ధినీ, ఆర్థిక స్థిరత్వాన్నీ, ఉపాధి అవకాశాలనూ దెబ్బ తీయగలవని నిరూపితమవుతోంది. దీన్ని నివారించడానికి హరిత ఇంధనాలకు, కర్బన ఉద్గారాల తగ్గింపునకు అమిత ప్రాధాన్యం ఇవ్వాలి. కానీ, అందుకు తగిన నిధులు కొరవడుతున్నాయి. అందుకే విధానాలను ఆచితూచి అమలు చేయాల్సి వస్తోంది.

తుపానులు, వరదల వంటి ప్రకృతి విపత్తుల వల్ల 2025లో మన దేశానికి 1200 కోట్ల డాలర్ల నష్టం వాటిల్లింది. వరదలు వ్యవసాయాన్నీ, మౌలిక వసతులను దెబ్బతీస్తుంటే- మండుటెండలు పట్టణాల్లో శ్రామికుల జీవితాన్ని దుర్భరం చేస్తున్నాయి. వారి జీవనాధారాలను కుంగదీస్తున్నాయి. సరిగా వానలు కురవకపోతే వ్యవసాయ దిగుబడులు పడిపోయి ఆహార ధరలు పెరిగిపోతాయి. భూతాపం వల్ల ధ్రువాల్లో మంచు కరిగి సముద్ర మట్టాలు పెరిగి తీరప్రాంత ప్రజలకు, పట్టణాలకు తీరనినష్టం వాటిల్లుతుంది. వాతావరణ వైపరీత్యాలు సంభవించినప్పుడల్లా నష్టాన్ని తట్టుకోవడానికి ప్రజాధనాన్ని ఖర్చు చేయాల్సి వస్తుంది. విద్యా వైద్యం, సామాజిక సంక్షేమాలకు వెచ్చించాల్సిన నిధులను ఇందుకు మళ్లించాల్సిన పరిస్థితి అనివార్యమవుతుంది. వైపరీత్యాలకు చెక్కుచెదరని గట్టి మౌలిక వసతులను నిర్మించాలనీ, ప్రజలకు భద్రత కల్పించాలనీ ఆర్థిక సర్వే ప్రతిపాదించింది. కానీ, ఈ దిశగా చెప్పుకోదగిన ప్రగతి కనిపించడం లేదు. వాతావరణ మార్పుల నిభాయింపునకు భారత్ ఓ జాతీయ కార్యాచరణ ప్రణాళికను చేపట్టినా దానికి నిధుల కొరత ఉంది. దాన్ని అధిగమించడానికి తాజా బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించలేదు. ముందస్తు సన్నద్ధత లేకుండా విపత్తులు ముంచుకొచ్చిన తరవాత పునరావాసం, కొత్త నిర్మాణాలు చేపట్టడం వల్ల శాశ్వత ఫలితాలు రావు.



కాలుష్య నివారణలో ముందడుగు

కర్బన ఉద్గారాల తగ్గింపునకు తాజా బడ్జెట్‌లో ప్రభుత్వం నిబద్ధత ప్రదర్శించడం ఒక ముందడుగే. 2030కల్లా మొత్తం విద్యుదుత్పాదనలో సగాన్ని శిలాజేతర పునరుత్పాదక ఇంధనాలతో సాధించాలనీ, కర్బన ఉద్గారాలను 45 శాతం తగ్గించాలనీ భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. కర్బనాన్ని పీల్చుకునే అడవులను విస్తరించి, 2070కల్లా ఉద్గారాల తటస్థతను సాధిస్తానని ప్రపంచానికి వాగ్దానం చేసింది. ఈ దిశగా పురోగతి కనబరుస్తోంది. ఒక్క 2025లోనే అదనంగా 39 గిగావాట్ల విద్యుత్తును పునరుత్పాదక ఇంధనాలతో సాధించగలిగింది. ఇవాళ మొత్తం స్థాపిత విద్యుదుత్పాదన సామర్థ్యంలో సగాన్ని శిలాజేతర ఇంధనాలతోనే సాధిస్తోంది. సౌర ఫలకాలు, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి రంగాల్లోకి అదనపు పెట్టుబడులు ప్రవహిస్తున్నాయి. కొత్త ఉద్యోగాల సృష్టి జరుగుతోంది. పునరుత్పాదక ఇంధనాల వల్ల చమురు దిగుమతి బిల్లు తగ్గి విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఆదా అవుతాయి.

ఆర్థికాభివృద్ధికి ఉక్కు, సిమెంటు, రసాయనాలు కీలకమే కానీ, వాటి ఉత్పత్తిలో విపరీతంగా కర్బన ఉద్గారాలు వెలువడుతున్నాయి. వాతావరణం నుంచి కార్బన్ డయాక్సైడ్‌ను ఒడిసిపట్టి నిల్వచేసి ఉపయోగించే కార్యక్రమం కోసం 2026 బడ్జెట్‌లో రూ.20వేల కోట్లు కేటాయించారు. వచ్చే అయిదేళ్లలో ఈ నిధిని వెచ్చిస్తారు. హరిత ఇంధనాలతో విద్యుదుత్పాదనకు కృషి చేస్తారు. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల నిరోధ శాఖకు బడ్జెట్‌లో రూ.3,759 కోట్లు దక్కాయి. ఇది గత బడ్జెట్ కన్నా 8-10శాతం ఎక్కువ. ప్రధానమంత్రి సూర్యఘర్ (ఇళ్ల పైకప్పుల మీద సౌర విద్యుదుత్పాదన) పథకానికి రూ.5వేల కోట్లు కేటాయించారు. బ్యాటరీ శక్తి నిల్వ వ్యవస్థలకు గ్రాంటును రూ.200 కోట్ల నుంచి వెయ్యి కోట్ల రూపాయలకు పెంచారు. అయితే దిల్లీతో పాటు ఉత్తర భారతాన్ని కమ్మేస్తున్న వాయు కాలుష్య నియంత్రణకు ప్రత్యేక చర్యలు లేకపోవడం పెద్ద లోటు. అయినా వాతావరణ మార్పుల నిరోధానికి కేంద్రం కర్బన క్రెడిట్ల వాణిజ్య పథకాన్ని చేపట్టనుంది. ఇది దేశంలో కర్బన ఉద్గారాల మార్కెట్‌ను సృష్టిస్తుంది. ప్రజలు నీటిని, విద్యుత్తు, ఇంధనాలను పొదుపుగా వాడాలనీ, చెత్తను అరికట్టాలనీ, తదనుగుణంగా దైనందిన ప్రవర్తనలో మార్పులు చేసుకోవాలని ప్రబోధించే మిషన్‌లైఫ్‌ను కేంద్రం ముందుకు తీసుకుపోతోంది.

ఉన్నంతలో సర్దుబాట్లు...

వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు ఉద్దేశించిన పథకాలకు నిధుల కొరతతో ఆశించినదానికీ అందుకుంటున్న ఫలితాలకూ తేడా వస్తోంది. 2030కల్లా కర్బన ఉద్గారాలను 45శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నా నిరుటికి 36 శాతమే తగ్గించగలిగాం. 2024కల్లా వాయు కాలుష్యాన్ని 30-40శాతం తక్కువకు తీసుకురావాలని, 2026కల్లా 40 శాతం తగ్గించాలన్నది మరో ఆశయం. కానీ, 2024 నాటికి దేశంలోని 42శాతం పట్టణాలు, నగరాల్లోనే అది సాధ్యపడింది. మిగిలినచోట్ల పరిస్థితి మరింత దిగజారింది. భారతావనిలో 33శాతం అటవీ విస్తీర్ణాన్ని సాధించాలని లక్షించినా 25.17శాతం భూభాగంలోనే అది నెరవేరింది. వాతావరణ మార్పుల నిరోధానికి 2035కల్లా జాతీయంగా తీసుకునే చర్యల గురించి 2025లో ప్రకటించాల్సి ఉన్నా, భారత్ ఆ పని చేయలేకపోయింది. వాతావరణ మార్పుల నిరోధానికీ, ఇప్పటికే సంభవించిన మార్పులను తట్టుకోవడానికీ మన దేశానికి 2030కల్లా 2.5 లక్షల కోట్ల డాలర్లు అవసరమవుతాయి. ఈ విషయంలో వర్ధమాన దేశాలకు ఏటా 10వేల కోట్ల డాలర్లను గ్రాంటుగా అందిస్తామని సంపన్న దేశాలు చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడం లేదు. దీంతో ఉన్నంతలో సర్దుబాట్లు చేసుకోక తప్పడం లేదు. ఈ ఏడాది బడ్జెట్‌లోనూ ఇదే కనిపిస్తోంది!



హరికృష్ణ నిబానుపూడి
సీనియర్ యూఎన్ క్లైమేట్ ఎమర్జెన్సీ అడ్వైజర్

జీవితం గురించి తెలుసుకోవడానికి మనం రకరకాల మార్గాలు వెతుక్కుంటాం. పెద్దల మాటలు వింటాం. పుస్తకాలు చదువుతాం. కొందరు అవేవీ పట్టించుకోకుండా జీవితం జీవిస్తేనే అర్థమవుతుంది అనీ అనుకుంటారు. ఎవరి పద్ధతి వారిదైనప్పటికీ జీవితం అంటే ఏంటో పూర్తిగా తెలియాలంటే ఈ మూడు ప్రదేశాలకు వెళ్లి చూడాలి... అంటూ సోషల్ మీడియాలో చిన్న సందేశం ఒకటి తిరుగుతోంది. ఆస్పత్రి, జైలు, శ్మశానాలే ఆ ప్రదేశాలని చెప్పే ఆ సందేశంలో నిజముందా? ఉంటే ఎందుకలా..? ఆ మూడూ ఏం చెబుతాయీ అంటే...

అనారోగ్యానికి పేదా గొప్పా తేడా ఉండదు. డబ్బున్నవాళ్లు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకోవచ్చు. పేదవాళ్లు ప్రభుత్వ ఆస్పత్రులనే ఆశ్రయించాల్సి రావొచ్చు.



మూడు ప్రదేశాలు

కానీ అనారోగ్యం తాలూకు బాధ ఇద్దరికీ ఒకటే. దానినుంచి బయటపడాలన్న కోరిక ఒకరికి ఎక్కువ ఒకరికి తక్కువ ఉండదు.. ఆస్పత్రిలో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడేవారిని చూసినప్పుడు మన ఆస్తి, అంతస్తు, హోదా, జాతి, కులం, మతం, ప్రాంతం... ఇవేవీ అక్కడ పనిచేయవని ఆరోగ్యం ముందు అన్నీ బలాదూర్ అనీ అర్థమవుతుంది.

జైలు బతుకుల గురించి సాధారణంగా ఎవరూ ఆలోచించరు. ఆఖరికి క్రూర నేరాలు చేసే వ్యక్తులు కూడా తాము పట్టుబడకుండా తప్పించుకోగలం అనుకుంటారే తప్ప దొరికిపోతే జైలు జీవితం అనుభవించాల్సి వస్తుందన్న ఆలోచన ఉండదు. ఉంటే ఎవరూ నేరాలే చేయరు. క్షణికావేశంలో చేసినా, కుట్రపన్ని పథకం ప్రకారం చేసినా నేరం నేరమే. ఒకసారి జైలుకు వెళ్లివచ్చిన వారి జీవితం అంతకుముందులా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండదు. సమాజం వారికి విలువ ఇవ్వదు. డబ్బుకో హోదాకో భయపడి ఎదురుగా ఏమీ అనకపోయినా వెనకాల వెక్కిరించక మానదు. వారు కూడా బయటికి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా లోలోపల అవమానంతో కుంగిపోతూనే ఉంటారు. జైలుకెళ్లాలంటే హత్యలూ దోపిడీలే చేయక్కరలేదు. ఇవాళా రేపూ ఆర్థిక నేరాలతో కటకటాల పాలవుతున్నవారూ ఎక్కువే. అత్యాశకు పోయి అవినీతికి పాల్పడి ఆ తరవాత జైలు ఊచలు లెక్కబెట్టుకునేవారికి కొదవలేని సమాజం మనది. ఒకసారి ఆ కారాగారానికి వెళ్లి చూస్తే... ఆస్పత్రిలాగే అక్కడా అందరూ సమానంగా శిక్ష అనుభవిస్తూ కనిపిస్తారు. పేరూ హోదా అన్నీ పోయి ఒక సంఖ్యగా మిగులుతారు.


ఇక, 'శ్మశానవాటి'లో మహాకవి జాషువా అన్నట్లు, రుద్రభూమికి ఎటువంటి భేదభావం ఉండదు. ధనవంతుడైనా, పేదవాడైనా అందరూ చివరికి ఒకే నేలలో కలిసిపోతారు. మిగిలేది చేసిన మంచీ చెడూ మాత్రమే. గాలీ నీరూ భూమీ అగ్నీ... అన్నీ ప్రాణులన్నింటినీ సమానంగా చూస్తున్నాయి. మనుషులెందుకు తమ తోటి వారిని సమానంగా చూడరు? అనారోగ్యంలో, కష్టాల్లో, ఆఖరికి చనిపోయినప్పుడు కూడా అక్కరకు రాని విషయాలను పట్టుకుని మనిషి జీవితకాలమంతా తాపత్రయపడుతుంటాడు. ఆ సత్యం తెలుసుకోవాలంటే ఈ మూడు ప్రాంతాలనూ ఒకసారి చూసిరాక తప్పదు!

– మధుకిరణ్

తమిళానికే ఎక్కువ!


తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం, ఒడియా వంటి భాషలకు కేంద్రం ప్రాచీన హోదా కల్పించింది. ఆయా భాషల్లో ప్రాచీన జ్ఞాన పరిరక్షణ, పరిశోధనలకు ఏటా నిధులు కేటాయిస్తోంది. ఇతర భాషలతో పోలిస్తే తమిళానికే ఎక్కువగా సొమ్ములు దక్కుతున్నాయి. ఆయా సంవత్సరాల్లో తెలుగు, తమిళాలకు కేంద్రం ప్రత్యేకించిన నిధులు... (కోట్ల రూపాయల్లో)

సంవత్సరం	తమిళం	తెలుగు
2020–21	12	1.47
2021–22	12	1.03
2022–23	12	1.71
2023–24	15.25	1.54
2024–25	14.30	0.86
2025–26	16.97	1.06



(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

భారతానికి బీమా భరోసా



(ఆధారం: ఐఆర్‌డీఏఐ వార్షిక నివేదిక)

రాగికి ఎందుకు రెక్కలొస్తున్నాయ్?

రాగి అనగానే తాతలనాటి చెంబులే ఎక్కువగా గుర్తొస్తాయి. కానీ, కొన్నేళ్లుగా భిన్న రంగాల్లో రాగి వాడకం అధికమైంది. గిరాకీకి తగినట్లు సరఫరాలు లేకపోవడం, ఇతర పరిణామాల వల్ల రాగి ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి.

పసిడి, వెండి కన్నా రాగి అత్యంత చౌక. కానీ గత పదిహేనేళ్లతో పోలిస్తే ఒక్క 2025లోనే అంతర్జాతీయ మార్కెట్‌లో రాగి ధర సుమారు 60శాతం పెరిగింది. బ్లూమ్‌బర్గ్ నివేదిక ప్రకారం- లండన్ మెటల్ ఎక్స్ఛేంజ్‌లో ఇప్పటికే రికార్డు స్థాయిలో టన్ను రాగి ధర రూ.11 లక్షలకు పైగా ఎగబాకింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియాలోనూ రాగి రేటు నిరుడు కేజీకి రూ.793 ఉంటే, ప్రస్తుతం పదమూడు వందలకు పైగా పెరిగి దాదాపు 67శాతం వృద్ధిని నమోదు చేసింది. ప్రపంచ ఆర్థిక వృద్ధి, చైనా వినియోగం, ఉత్పత్తి, సరఫరా, గిరాకీల్లో మార్పులు రాగి ధరను ప్రభావితం చేస్తున్నట్లు అంచనా. అయితే, పునరుత్పాదక ఇంధనాలకు పెరుగుతున్న ప్రాధాన్యం, ఇతర కారణాల వల్ల రాబోయే రోజుల్లో రాగి దూకుడుగా దూసుకుపోతుందన్న విశ్లేషణలూ వెలువడుతున్నాయి.



తగ్గిపోయిన ఉత్పత్తి

గనుల తవ్వకాల్లో ఆటంకాలు, సరఫరాలో అంతరాయాలే రాగి ధరలు పెరగడానికి ప్రాథమిక కారణం. పపువా న్యూగినీ, ఇండొనేసియాలలోని అతిపెద్ద గ్రాస్‌బర్గ్‌లో రాగి గనిలోకి బురద చేరింది. గతేడాది సంభవించిన భూకంపం కారణంగా ప్రపంచంలోనే భారీ రాగి గనుల్లో ఒకటైన చిలీలోని ఎల్ టెనియెంటెలో సొరంగాలు కూలిపోయాయి. పెరూలోని ఆంటామినా, లాస్‌బంబాస్, కాన్‌స్టాంటియా వంటి గనులు స్థానిక ఉద్రిక్తతలతో మూతపడ్డాయి. దానివల్ల రాగి సరఫరాకు ఆటంకం ఏర్పడింది. కొరత నేపథ్యంలో అమెరికా ప్రపంచ దేశాల నుంచి రాగిని పెద్దమొత్తంలో దిగుమతి చేసుకునే పనిలో పడింది. దీనికితోడు అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు, అమెరికా-చైనా, రష్యా ఉద్రిక్తతలు, ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా ఘర్షణలు లోహాలపై పెట్టుబడినే సురక్షితంగా భావించేలా చేస్తున్నాయి. వీటివల్లా రాగి ధరలకు రెక్కలొస్తున్నాయి.

రాగి అవసరం లేని పరిశ్రమలేవీ ఉండవు. రాగికి గిరాకీ ఉంటేనే పరిశ్రమలు, తద్వారా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి పథంలో ఉన్నట్లుగా పరిగణిస్తారు. ఉష్ణవాహకత, సాగేగుణం, తుప్పు నిరోధకత వంటివి రాగి ప్రత్యేక లక్షణాలు. ఈ క్రమంలో విద్యుత్ వైరింగ్, కేబుల్, ప్లంబింగ్, రేడియేటర్లు, మోటార్లు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ పరికరాలు, నిర్మాణ, రవాణా రంగాలన్నింటిలో రాగి బాగా అవసరపడుతోంది. ఫోన్, ఇయర్‌ఫోన్లు, ఛార్జర్ మనం వాడే ప్రతి ఎలక్ట్రానిక్ పరికరంలోనూ, వీడియో, ఆడియో వెనక శక్తి మార్పిడిలోనూ రాగి ఉంటుంది. కర్బన ఉద్గారాలను తగ్గించాలని ఇండియా సహా చాలా దేశాలు సంకల్పించాయి. ఈ నేపథ్యంలో సోలార్ ప్యానెళ్లు, పవన శక్తి టర్బైన్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, ఈవీ బ్యాటరీలతో పాటు 5జీ అవసరాలకీ కాపర్ కావాల్సిందే. ఏఐ సెమీ కండక్టర్లు, డేటా సెంటర్లు, రోబోటిక్స్... ఇలా అన్నింటా రాగి కీలకమే. ప్రస్తుతం అంతర్జాతీయంగా రాగి డిమాండ్ ఏటా 2.8 కోట్ల టన్నుల మేర ఉంటోంది. 2040 నాటికి అది 4.2 కోట్ల టన్నులకు చేరుతుందని అంచనా. రాగి ఉత్పత్తిని బాగా పెంచకుంటే అప్పటి అవసరాల్లో పావు వంతుకి పైగా కొరత ఏర్పడవచ్చని ఎస్ అండ్ పీ గ్లోబల్ సంస్థ నివేదిక హెచ్చరిస్తోంది.



దిగుమతులే ఆధారం


భారతీయ సంప్రదాయ వైద్యంలోనూ రాగికి విశేష స్థానముంది. రాగికి ఉన్న సహజ గుణాలు హానికర బ్యాక్టీరియాను నిర్మూలించి, రోగనిరోధక శక్తిని పెంచుతాయంటారు. అందుకే రాగి బాటిళ్లు, గ్లాసుల వాడకం మళ్లీ పెరిగింది. అయితే, మనదేశంలో రాగి నిల్వలు తక్కువే ఉన్నాయి. ప్రపంచ రాగి ఉత్పత్తిలో ఇండియా వాటా కేవలం రెండు శాతమే. దేశీయంగా 14 రాష్ట్రాల్లో కాపర్ నిక్షేపాల్ని గుర్తించారు. కానీ, తవ్వకాలు జరగడం లేదు. అందుకే దిగుమతులపైనే ఆధారపడుతున్నాం. రాజస్థాన్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్‌లలో ప్రధాన గనులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, సిక్కింలోనూ కొద్ది మొత్తంలో రాగి నిల్వలు నెలకొన్నాయి. భవిష్యత్తులో రాగి కొరతను నివారించాలంటే స్థానికంగా ఉత్పత్తిని పెంచుకోవడంతో పాటు విదేశాల నుంచి సరఫరాలకు లోటు లేకుండా చూసుకోవడం అత్యావశ్యకం!

– చెరుకూరి శాంతిశ్రీ

హాయ్! బుజ్జీ!!

పద్ధతి మార్చుకోవాలి

బొమ్మలు: శ్రీనివాస్ కథ: కూచిమంచి నాగేంద్ర







'ప్రపంచ క్యాన్సర్ డే' సందర్భంగా హెచ్‌సీజీ ఆసుపత్రి సహకారంతో 'ఈఎఫ్ఎం 91.9' ఆధ్వర్యంలో బుధవారం బీఆర్టీఎస్ రోడ్డులో నిర్వహించిన వాక్‌థాన్ కార్యక్రమాన్ని కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు చేపట్టిన ఈ ప్రదర్శనలో అధిక సంఖ్యలో విద్యార్థులు, హెచ్‌సీజీ వైద్య నిపుణులు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ.. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు.

– న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు

నయా.. నిలుపుదోపిడీ!

- సొమ్ము ప్రైవేటోళ్లకు.. నింద దేవస్థానానికి
- పార్కింగ్ దందాపై ప్రజల తీవ్ర అసహనం

'బస్సుకు మూడు గంటలకు.. రూ.200 పార్కింగ్ రుసుం ఎక్కడైనా ఉంటుందా.?, మల్టీప్లెక్స్ సినిమా థియేటర్లలోనూ ఉండదు. అలాంటిది.. దుర్గగుడి పైవంతెన కిందన నగరపాలిక పార్కింగ్‌లా ఈ ధర వసూలు చేస్తున్నారు. కారుకు రూ.100.. ద్విచక్ర వాహనానికి రూ.50. మూడు గంటలు దాటితే.. ప్రతి రెండు గంటలకు మళ్లీ రెట్టింపు బాదుడే.'

– ఈనాడు, అమరావతి


రూ.200 వసూలు చేశారని చూపిస్తున్న బస్సు డ్రైవర్


కారుకు రూ.30 ఉంటే.. రూ.100 తీసుకున్నారని వాపోతున్న భక్తుడు

కొండ పక్కనే ఉన్న రోడ్డుపైనే ఉన్న ఈ పార్కింగ్ వసూళ్లపై తీవ్రవిమర్శలు వస్తున్నాయి. ఇంత దారుణంగా దోచేస్తున్నా.. ఒక్కరికీ పట్టదా..? అని భక్తులు సామాజిక మాధ్యమాల్లో వీడియోల్లో వాపోతున్నారు. ఇక్కడ పార్కింగ్ స్థలమే లేదు. పైవంతెన కిందన రోడ్డునే పార్కింగ్‌గా.. దండుకోమని ఓ ప్రైవేటు వ్యక్తికి పాలిక అధికారులు కట్టబెట్టారు. భక్తుల బాధలు పట్టించుకునే సిబ్బంది ఎవరూ లేరు. ఈ రోడ్డు పార్కింగ్ దుర్గగుడి పరిధిలో ఉండడంతో.. భక్తులంతా దేవస్థానాన్ని విమర్శిస్తున్నారు.'

పాలకులేం చేస్తున్నట్టు?..

పార్కింగ్ పేరుతో నిలువునా దోచేస్తుంటే.. నగర ప్రజా ప్రతినిధులు ఏం చేస్తున్నారు? పాలిక అధికారులు ఏడాదికి కేవలం రూ.32 లక్షలకు.. కెనాల్ రోడ్డు నుంచి బొడ్డుబొమ్మ సెంటర్ వరకూ రోడ్డుపైనే ఈ పార్కింగ్‌ను ప్రైవేటు గుత్తేదారుకు కట్టబెట్టారు. ఎంత వసూలు చేయాలి? ఎక్కడి నుంచి ఎక్కడికి వాహనాలు ఆపడానికి పార్కింగ్‌కు ఇచ్చారనే.. బోర్డులు, సరిహద్దులు లేవు. దీంతో విచ్చలవిడిగా.. దారంతా ఆక్రమించి వాహనాలను నిలబెట్టి మరీ వసూళ్లు చేస్తున్నారు.

ప్రైవేటు సైన్యంతో..

రైల్వేస్టేషన్, బస్టేషన్ ఎక్కడైనా.. పార్కింగ్‌కు మూడు గంటలకు కారుకు రూ.30, ద్విచక్ర వాహనానికి రూ.10 ఉంది. కొన్ని ప్రాంతాల్లో ప్రీమియం పార్కింగ్ అయితే.. కారుకు రూ.50, బైక్‌కు రూ.20. కానీ.. ఇక్కడ మాత్రం స్థిర ధర లేదు. టికెట్‌పైన.. కారు, ట్యాక్సీకి.. మూడు గంటలకు రూ.30, తర్వాత రెండు గంటలకోసారి రూ.20 అని ఉంటుంది. ఈ ధరను కొట్టేసి.. వాళ్లకు నచ్చిన ధరను పెన్‌తో రాసి వసూళ్లు చేస్తున్నారు. బస్సులకు రూ.200 ఈ టిక్కెట్‌పైనే రాసి మరీ గుంజుతున్నారు. వారాంతాల్లో, రద్దీ రోజుల్లో.. ధరలు మరింత పెరిగిపోతున్నాయి. అడిగే వాళ్లు.. అడ్డుకునే వాళ్లు లేక.. ఓ ప్రైవేటు సైన్యం స్వైరవిహారం చేస్తోంది.


రామచంద్రాపురం- నున్న మధ్య రెయిలింగ్ పనులు వదిలేశారిలా...

కళ్లెదుటే ముప్పు... కలగదేం కనువిప్పు..?


జక్కంపూడి సమీపంలో తక్కువ ఎత్తులో వేలాడుతున్న హైటెన్షన్ వైర్లు

పశ్చిమ బైపాస్ నిర్మాణం తుది దశకు చేరుకున్నా అసంపూర్తి పనులు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. సంక్రాంతికి ముందే ప్రయాణాలు మొదలవగా రోజుకు 10 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రామచంద్రాపురం నున్న మధ్యలో రోడ్డుకు ఇరువైపులా రెయిలింగ్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో ఆదమరచి వాహనం నడిపితే అంతే సంగతులు. పై వంతెన నుంచి కిందకు సుమారు 20 అడుగుల ఎత్తు ఉండడంతో రోడ్డు పక్కకు వస్తే కింద పడే ప్రమాదం ఉంది. ఆ ప్రాంతంలో ప్రమాద సూచికలు, విద్యుత్తు దీపాలు లేవు. ★ జక్కంపూడి హైటెన్షన్ వైర్ల ఎత్తు పెంచేందుకు న్యాయస్థానం గత అక్టోబర్‌లోనే తీర్పు ఇచ్చినా ఇప్పటికీ పనులు చేయలేదు. దీంతో రహదారికి కొద్ది ఎత్తులోనే వైర్లు వేలాడుతున్నాయి. భారీ వాహనాలు అదే మార్గంలో ప్రమాదకరంగా వెళుతున్నాయి. - ఈనాడు, అమరావతి

పైపులు నాసి.. పైరవీలతో మేసి

గ్రామీణ నీటి సరఫరా శాఖలో అడ్డగోలు వ్యవహారాలు

ఈనాడు, అమరావతి

'వైకాపా పాలనలో గ్రామీణ నీటి సరఫరా శాఖలో అవినీతి కట్టలు తెంచుకుంది. అడిగేవారే లేరన్నట్లు ఇద్దరు అధికారులు అడ్డగోలు దందా నెరిపారు. కనీస నాణ్యత లేని పైపులు వేసి భారీగా దోచుకున్నారు. ప్రభుత్వానికి జీఎస్టీ ఎగ్గొట్టేందుకు గుత్తేదారులతో కుమ్మక్కయి దొంగ బిల్లులతో మాయ చేశారు.'

రూ.లక్షలు స్వాహా...

★ గంగూరులో తాగునీటి సరఫరాకు 15 ఏళ్ల కిందటే మూసేసిన కంపెనీ పేరు వాడుకొని నకిలీ జీఐ పైపులను వేశారు. ఒక్కో పైపు 34.66 కిలోలు ఉండాలి. అమర్చినవి 24 కిలోలైనా లేవు. ఒక్కో పైపునకు రూ.300 చొప్పున రూ.15 లక్షలు స్వాహా చేశారు. వణుకూరులోనూ ఇదేతరహాలో దోచేశారు. ★ గొల్లపూడి... 2022లో పెనమలూరు నుంచి మైలవరం సబ్‌డివిజన్‌లో కలిసినా సాంకేతిక లొసుగులతో పెనమలూరులోనే పనులు చేయించి భారీగా వెనకేశారు. ★ పైడూరుపాడులో భూమి ఉపరితలంపై పైపులేసి... భూమి లోపల వేసినట్లు చూపించారు. 4 కిమీ మేర గుంతలు తవ్వి పైపులు వేసినట్లు తప్పుడు బిల్లులతో భారీగా కొట్టేశారు. ★ రాయనపాడు, గొల్లపూడిలో వాడిన జీఐ పైపులు, చేతిపంపులూ నాసివే. క్వాలిటీ కంట్రోల్ పరీక్షలైనా చేయకుండా కప్పిపుచ్చారు.


గంగూరులో నాసిరకం పైపులు

ఇద్దరూ ఇద్దరే...

★ అప్పటి పెనమలూరు సబ్‌డివిజన్ డీఈ, జేఈలు కథ నడిపారు. జేఈ 14 ఏళ్లు ఒకేచోట పాతుకుపోయి.. అవినీతిలో కూరుకుపోయారు. ★ గుత్తేదారులతో కుమ్మక్కయి పైపుల నాణ్యతకు నీళ్లొదిలి కనీస ప్రమాణాలు లేని పైపులు పెట్టించి కమీషన్లు కొల్లగొట్టారు. వీరి హయాంలో 200 కిమీపైగా నాసిపైపులు వేసిన ఆరోపణలున్నాయి. ★ గుత్తేదారులు జీఎస్టీ చెల్లించకుండా తప్పుడు బిల్లులు పెట్టినా మామూళ్లు తీసుకుని బిల్లులు చేసేవారు. వర్క్ ఆర్డర్ పొందిన గుత్తేదారు పేరిట ఇన్వాయిస్ లేకున్నా బిల్లులు చేశారు. ★ పైపులు వేయడానికి చిన్న గుంతలు తీసి.. భారీగా బిల్లులు చేసుకోవడం, ఎంబుక్ సరిలేకున్నా అడ్డగోలుగా బిల్లులు ఇచ్చేసినా వీరిపై చర్యలు శూన్యం.

క్వాంటమ్ వ్యాలీ శంకుస్థాపనకు ఏర్పాట్లు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధానిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మాణాలకు ఈనెల 7న శంకుస్థాపన జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరవనున్నారు. ఉద్దండరాయుని పాలెం సమీపంలో శంకుస్థాపన నిర్వహించనున్న ప్రాంతంలో జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం ప్రభుత్వ కార్యదర్శి ప్రద్యుమ్న, గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్డీఏ అదనపు కమిషనర్ భార్గవ తేజ, జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లపై చర్చిస్తున్న ప్రద్యుమ్న, తమీమ్ అన్సారియా, కన్నబాబు తదితరులు

ప్రవంతిని భారత్‌కు రప్పించే యత్నాలు

ఈనాడు, అమరావతి: పలు రాష్ట్రాల్లో కేసులతో ముడిపడిన అద్దె ఖాతాల వ్యవహారంలో కీలక నిందితురాలు ప్రవంతిని భారత్‌కు రప్పించేందుకు పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఫిలిప్పీన్స్ దేశస్థుడిని పెళ్లిచేసుకుని.. అక్కడే స్థిరపడిన ఆమెను లోతుగా విచారిస్తేనే కీలక అంశాలు తేలేవీలుంది. విజయవాడలో తెరిచిన ఖాతాలను సూర్య, పార్వతి ఫిలిప్పీన్స్‌కు పంపేవారు. ప్రవంతి నుంచి ఎవరెవరికి వెళ్లాయనేది తేలలేదు. ✪ ఈ కేసులో ఆమెను నిందితురాలిగా చేర్చినందున ప్రశ్నించాల్సి ఉందనీ, తప్పనిసరిగా భారత్‌కు పిలిపించాలని ఆమె తల్లిదండ్రులకు పోలీసులు చెప్పగా... అంగీకరించినట్లు తెలిసింది. నిందితురాలు వస్తే.. ఈ ముఠా సేకరించిన ఖాతాలు ఎవరికిచ్చారు? మోసగాళ్ల ఏ అవసరాలకు వాడారో తేలే వీలుంది. నిందితులు సూర్య, పార్వతి, ప్రవంతి గతంలో విజయవాడలో ఏవియేషన్ కోర్సు చేశారు. అప్పుడు వీరు పరిచయమవగా.. తర్వాత ప్రవంతి ఫిలిప్పీన్స్ వెళ్లిపోయింది. ✪ సూర్య ముఠా సుమారు 300 బ్యాంకు ఖాతాలు సేకరించి ఫిలిప్పీన్స్ పంపింది. ఈ ఖాతాలతో రూ.111 కోట్ల లావాదేవీలు జరిగినట్లు తేలింది. బెట్టింగ్, సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టు మోసాలకు వీటిని ఉపయోగించారు. కేసులో 10 మందిని పోలీసులు నిందితులుగా చేర్చారు. నల్లమేకల వేణుగోపాల్, గోపీకృష్ణ, మౌలాలి ఎక్కువ ఖాతాలు సమకూర్చినట్లు తేలగా.. వీరు పరారీలో ఉన్నారు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని... విజయవాడ కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.

మనీలాండరింగ్ కేసు పేరుతో టోకరా

వృద్ధురాలి నుంచి రూ.5 లక్షలు కొట్టేసిన నేరగాళ్లు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: మనీలాండరింగ్ కేసులో ప్రధాన నిందితుడైన సదఖత్ ఖాన్‌తో సంబంధాలున్నాయని.. మిమ్మల్ని అరెస్టు చేస్తామంటూ భయపెట్టి సైబర్ నేరగాళ్లు ఓ వృద్ధురాలి నుంచి రూ.5లక్షలు కొట్టేశారు. నగరానికి చెందిన ఒక విశ్రాంత ఉపాధ్యాయురాలికి 2025, డిసెంబరు 17న గుర్తు తెలియని వ్యక్తి పోలీస్ అంటూ ఫోన్ చేశాడు. ఆమె ఆధార్ కార్డుతో బెంగళూరులో సిమ్ తీసుకుని, దాన్ని మనీ లాండరింగ్ కేసులో ఉపయోగించారని చెప్పాడు. సదఖత్‌ఖాన్ అనే ప్రధాన నిందితుడితో మీకు సంబంధాలున్నాయని.. దీనిపై సీబీఐ కేసు నమోదు చేసి అరెస్టు చేస్తుందని భయపెట్టాడు. ఈ అరెస్టు నుంచి తప్పించుకోవాలంటే.. డబ్బులు చెల్లించాలన్నాడు. దీంతో అతడు చెప్పిన బ్యాంకు ఖాతాకు 2025, డిసెంబరు 23న వృద్ధురాలు రూ.5 లక్షలు పంపారు. మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేశారు. బాధితురాలు పంపిన నగదు బెంగళూరులో కోరమంగళలోని ఉత్కర్ష్ స్మాల్ ఫిన్ బ్యాంకు శాఖకు వెళ్లినట్లు తేలింది.

సికింద్రాబాద్-అనకాపల్లి ప్రత్యేక రైలు పొడిగింపు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: ప్రయాణికుల సౌకర్యార్థం సికింద్రాబాద్-అనకాపల్లి మధ్య నడుపుతున్న ప్రత్యేక రైలును పొడిగిస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 07041/07042 ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 22, 23 తేదీల్లో విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తుందని చెప్పారు.

అంతు చూడమంటే.. అంత లేదన్నారు!

★ దోచింది రూ.13 కోట్లు.. తేల్చింది కోటిన్నరే ★ మూడు పంచాయతీల్లో అక్రమాలపై విచారణ

రామవరప్పాడు, పెనుగంచిప్రోలు, ముక్త్యాల పంచాయతీల్లో జరిగిన అక్రమాలపై ప్రాథమిక విచారణ నివేదిక ఉన్నతాధికారులకు చేరింది. మూడు పంచాయతీల్లో రూ.13 కోట్ల మేర స్వాహాపై ఆధారాలతో ఫిర్యాదులు వెల్లువెత్తినా... కేవలం రూ.1.5 కోట్ల మేరకే అవినీతి జరిగిందని తేల్చేశారు. బాధ్యులైన సర్పంచులు, కార్యదర్శులకు నోటీసులు ఇస్తామనీ.. అక్రమాలను బట్టి చెక్‌పవర్ రద్దు, సస్పెండ్, సొమ్ము రికవరీ చేస్తామంటున్నారు.

పన్నులు మింగేసి.. నిధులు బొక్కేసి.. ✪ మూడు పంచాయతీల్లో వసూలు చేసిన ఇంటి పన్నులను పంచాయతీ ఖాతాలో జమ చేయకుండా మింగేశారు. ✪ అభివృద్ధి పనుల కోసం నిధులు గుత్తేదారులకు, ఏజెన్సీలకు చెల్లించినట్లు చూపిస్తున్నా... క్షేత్రంలో పనులు జరగలేదు. ✪ కొన్ని పనుల విషయంలో... మంజూరు చేసిన నిధులకు, చేసిన పనులకు చాలా తేడా ఉన్నాయి. ✪ 2014-19 తెదేపా పాలనలో జరిగిన అభివృద్ధి పనులు వైకాపా పాలనలో చేసినట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు దోచేశారు.

హతవిధీ..

పెనుగంచిప్రోలు పంచాయతీలో 30 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉండగా.. వీరిలోనే 16 మందిని హరిత రాయబారులుగా నియమించారు. హరిత రాయబారులకు నెలకు రూ.6 వేలు చొప్పున రూ.96 వేలు చెల్లించాల్సి ఉండగా పైసా ఇవ్వకుండా రూ.లక్షల్లో దోచేశారు.

కొండను తవ్వి.. ఎలుకను పట్టి..

✪ మూడు పంచాయతీల్లో రూ.13 కోట్లకు పైగా అక్రమాలు జరిగాయని పలువురు ఆధారాలు ఇచ్చారు. రామవరప్పాడు పంచాయతీలోనే రూ.4 కోట్లకుపైగా అక్రమాలను గుర్తించినట్లు కొందరు అధికారులు బాహాటంగానే చెప్పారు. ✪ తాజాగా మూడు పంచాయతీలపై వచ్చిన ప్రాథమిక నివేదికలో మాత్రం అక్రమాలు రూ.1.5 కోట్లు అని తేల్చేయడం గమనార్హం. అక్రమాలను కప్పిపుచ్చేలా విచారణ సాగిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. - ఈనాడు, అమరావతి



24 మంది రెవెన్యూ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు

ఈనాడు, అమరావతి: నందిగామ మండలంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న 24 మంది రెవెన్యూ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలకు రంగం సిద్ధమవుతోంది. 2021లో నందిగామ రెవెన్యూ కార్యాలయంలో అనిశా అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. అస్తవ్యస్తంగా రికార్డులు, నిధుల నిర్వహణలో లోపాలు, మంజూరైన పాస్‌పుస్తకాలు రైతులకు ఇవ్వకపోవడం, విధుల్లో నిబంధనల అతిక్రమణలను గుర్తించారు. దానిపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశాలిస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అప్పటి తహసీల్దార్ వీఆర్వోలు, జూనియర్ అసిస్టెంట్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, స్టాటిస్టికల్ అధికారులు తదితరులు ఉన్నారు. అప్పటి తహసీల్దార్ చంద్రశేఖర్ బయోమెట్రిక్ నిర్వహణలో అక్రమాలు, వీఆర్ఏ స్థానంలో ఆయన మనవడు విధులకు రావడం, సాధారణ నిధుల ఖాతాలు సవ్యంగా నిర్వహించకపోవడం, జాబ్‌చార్ట్ నిర్వహణలో వైఫల్యమైనట్లు పేర్కొన్నారు. దీనిపై ఉద్యోగులు ఉత్తర్వులు అందిన 10 రోజుల్లో రాతపూర్వక వివరణ ఇవ్వాలనీ, లేదంటే చర్యలు తప్పవని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మీ భూమి.. మా హామీ..!

మైలవరం, న్యూస్‌టుడే

వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలకు, ప్రభుత్వ రాయితీలకు పంటల నమోదు తప్పనిసరి. గత కొన్నేళ్లుగా ఈ క్రాప్ విధానం అమల్లో ఉండగా, దాని స్థానంలో ఈ ఏడాది కూటమి ప్రభుత్వం 'ఈ పంట' విధానాన్ని అమల్లోకి తెచ్చింది. సరికొత్త యాప్‌లో పంటల వివరాలతో పాటు, సాగు చేయని భూముల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశాలిచ్చింది. దాని ద్వారా విక్రయాల సమయంలో అసలైన రైతుకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదనేది ప్రభుత్వం లక్ష్యం కాగా, వ్యవసాయశాఖ, నవీకరించిన యాప్ ద్వారా జిల్లాలో ఈ పంట నమోదు కొనసాగుతోంది. ఏటా సాగయ్యే పంటల వివరాలను మాత్రమే నమోదు చేస్తుండగా, ప్రస్తుతం ల్యాండ్ పార్సిల్స్ పేరిట పంట సాగుచేయని ఖాళీ భూముల వివరాలనూ నమోదు చేయాలని వ్యవసాయశాఖ క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించింది. ప్రస్తుతం జిల్లాలో వరి, మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఫిబ్రవరిలో ఆయా పంట ఉత్పత్తుల దిగుబడి ప్రారంభమయ్యే అవకాశం ఉండగా, అమ్మకాలకు వీలుగా అదే నెలలో పూర్తి చేయాలని నిర్దేశించారు.

వడివడిగా ఈ–పంట నమోదు

ఇదీ పరిస్థితి..

పంటల సాగు మండలాలు	– 17
భూ విస్తీర్ణం (ఎకరాలు)	– 3,62,277
నమోదు	– 1,08,126
మొత్తం ల్యాండ్ పార్సిల్స్	– 3,06,115
నమోదు	– 82,606
వరి	– 58,010
మొక్కజొన్న	– 40,787
నమోదు శాతం	– 83.5


క్షేత్రస్థాయిలో నమోదు చేస్తున్న సిబ్బంది

నమోదు ఇలా..: రైతు చరవాణికి వారి పంటల వివరాల నమోదు తేదీని ముందుగానే సందేశం ద్వారా పంపుతారు. ఆ సమయానికి రైతు నుంచి వివరాలు సేకరించగానే ప్రక్రియ పూర్తయినట్లు మరో సందేశం వస్తుంది. ఈ పంట వెబ్‌లింక్ ద్వారా లేదా క్యూఆర్ కోడ్‌తో రైతులు పరిశీలించుకునే అవకాశం ఉంది. పంటల అమ్మకాలు, బీమా, విపత్తుల వేళ పరిహారానికి, రుణాలకు సైతం ఈ పంట నమోదునే ప్రామాణికంగా తీసుకుంటున్న నేపథ్యంలో ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఫిబ్రవరి 20 లోగా పూర్తి

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ పంట నమోదు వేగంగా సాగుతోంది. నమోదుకు చివరి తేదీగా నిర్ణయించిన ఫిబ్రవరి 20 లోగా అన్ని పంటల నమోదు పూర్తి చేస్తాం. - విజయకుమారి, వ్యవసాయాధికారి



క్యాన్సర్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

ఇంటింటికీ వెళ్లి 18 లక్షల మందికి పరీక్షలు చేస్తాం ● 'ఈఎఫ్ఎం 91.9' వాక్‌థాన్‌లో కలెక్టర్ లక్ష్మీశ

ఈనాడు, అమరావతి - విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే

ఎన్టీఆర్ జిల్లాను క్యాన్సర్ రహిత జిల్లాగా నిలపడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు కలెక్టర్ జి. లక్ష్మీశ వెల్లడించారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేస్తున్నామన్నారు. 'ఈఎఫ్ఎం 91.9' ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు బుధవారం 'గులాబీ అడుగు' పేరుతో బీఆర్‌టీఎస్ రోడ్డులోని భానునగర్ సిగ్నల్ నుంచి హెచ్‌సీజీ ఆసుపత్రి వరకూ వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. 'ప్రపంచ క్యాన్సర్ డే'ని పురస్కరించుకొని హెచ్‌సీజీ ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన వాక్‌థాన్‌ను కలెక్టర్ ఆరంభించారు. ఎన్టీఆర్ జిల్లా ఆశాలు, ఏఎన్ఎంలు, విజయ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. 18 లక్షల మందిని స్క్రీనింగ్ చేసే దిశగా వైద్య బృందం కృషి చేస్తోందన్నారు. జిల్లాలో తొలి మూడు దశలు పూర్తయ్యాయని, ప్రస్తుతం నాలుగో దశ స్క్రీనింగ్ జరుగుతోందన్నారు. క్యాన్సర్‌ను ఆరంభంలోనే గుర్తించడం ద్వారా మెరుగైన చికిత్స అందిస్తున్నామన్నారు. అందరూ వైద్య పరీక్షలు చేయించుకుంటే.. తొలి దశలోనే వ్యాధిని గుర్తించొచ్చని ఆయన సూచించారు.



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో సుహాసిని. వేదికపై ఈనాడు యూనిట్ ఇన్‌ఛార్జి కిశోర్ కుమార్, డా.గోపీచంద్, డా.వి.ఎస్.ఎన్.రావు, డీహెచ్‌వో ఇందుమతి



గులాబీ రంగు రిబ్బన్లతో విద్యార్థినులు

సరైన అవగాహన అవసరం

హెచ్‌సీజీ ఆసుపత్రి వద్ద జరిగిన ముగింపు సభలో డీఎంఅండ్‌హెచ్‌వో సుహాసిని మాట్లాడుతూ.. క్యాన్సర్‌పై సరైన అవగాహన లేకపోవడం వల్ల అది మరణం అంచుల వరకు తీసుకెళ్తుందని చెప్పారు. దీనికి తొలి దశలోనే అడ్డుకట్ట వేసేందుకు ప్రతి ఒక్కరూ.. సరైన అవగాహన పెంచుకోవాలని సూచించారు. మహిళల్లో అధిక శాతం బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడుతున్నారని, త్వరగా పరీక్షల ద్వారా గుర్తిస్తే.. మెరుగైన వైద్యం అందించే వీలుందని చెప్పారు. ● హెచ్‌సీజీకి చెందిన ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ వి.ఎస్.ఎన్. రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏటా 15 లక్షల మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. అత్యధికంగా కాకినాడ ప్రాంతం వారు ఉండగా.. అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా వాసులు ఉన్నారన్నారు.



సెల్ఫీ స్టాండ్ వద్ద ఫొటోలు దిగుతున్న మహిళలు

● హెచ్‌సీజీ రీజనల్ డైరెక్టర్, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎం.గోపీచంద్ మాట్లాడుతూ.. పొగ తాగడం, గుట్కాలు, ఆల్కహాల్, జంక్ ఫుడ్ తీసుకోవడం ద్వారా ఊబకాయం పెరిగి.. అత్యధిక మందిలో క్యాన్సర్‌కు దారితీస్తోందన్నారు. నోటిలో పుండ్లు, ఆహారం తీసుకోవడంలో ఇబ్బందులు, రక్తహీనత, ఛాతిలో నొప్పి, కణితులు ఉంటే.. వీలైనంత త్వరగా వైద్యులను సంప్రదించాలని సూచించారు. 40 సంవత్సరాలు పైబడిన వారు రెండేళ్లకోసారి, 50 ఏళ్లు దాటితే.. ఏటా క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా ఈఎఫ్ఎం 91.9 ఆర్జేలు లహరి, తేజస్వి వ్యవహరించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో ఇందుమతి, 'ఈనాడు' విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్‌కే కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన జీవనశైలితో క్యాన్సర్ నిరోధం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ రాజు నాయుడు, గణేష్‌బాబు, విజయ ప్రకాష్, సతీష్‌బాబు, సుబ్బారావు తదితరులు

రాఘవయ్యపార్కు కూడలి (కృష్ణలంక), న్యూస్‌టుడే : మెరుగైన జీవనశైలితో క్యాన్సర్ వ్యాధిని సమర్థంగా ఎదుర్కోవచ్చని ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ డి.వి.ఎస్.రాజు నాయుడు అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని ప్రజారోగ్య వేదిక ఎన్టీఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాలోత్సవ భవన్‌లో బుధవారం 'క్యాన్సర్- ముందుగా గుర్తించే పద్ధతులు-నివారణ మార్గాలు' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆహారపు అలవాట్లలో జాగ్రత్తలు తీసుకుంటే 85 శాతం కేసులను నివారించవచ్చన్నారు. శారీరక వ్యాయామం, పౌష్టికాహారం, తగినంత నిద్ర, మానసిక ఒత్తిడికి లోనుకాకుండా చూసుకోవాలని చెప్పారు. మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు అధికంగా వస్తున్నాయని చెప్పారు. హ్యూమన్ పాపిలోమా వైరస్ కారణంగా వస్తున్న క్యాన్సర్లను వ్యక్తిగత పరిశుభ్రత, వ్యాక్సిన్‌తో నివారించవచ్చన్నారు. పురుషుల్లో వస్తున్న నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్లకు పొగాకు వినియోగమే ప్రధాన కారణమని చెప్పారు. ధూమపానం మానుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటే ముప్పును ప్రారంభ దశలోనే గుర్తించవచ్చని తెలిపారు. నిమ్స్ మాజీ డైరెక్టర్, ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ డి.రఘునాథ రావు, డాక్టర్ డి.లీల, డాక్టర్ ఎం.వి.రమణయ్యలు సంయుక్తంగా రచించిన క్యాన్సర్-ముందుగా గుర్తించే పద్ధతులు-నివారణ మార్గాలు అనే పుస్తకంలో మంచి సమాచారం అందించారని, ప్రతి ఒక్కరూ చదవాలని కోరారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు సంస్థ చేస్తున్న కృషిని వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.విజయప్రకాష్ వివరించారు. సతీష్ బాబు, బీవీఆర్ గణేష్ బాబు, యార్లగడ్డ సుబ్బారావు, పిన్నమనేని విజయ, కాట్రగడ్డ స్వరూపరాణి, మోతుకూరి వెంకటేశ్వరరావు, జె.దుర్గ, పి.స్టాలిన్, ప్రేమ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో 1,810 టన్నుల యూరియా

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలో రబీ పంటల సాగు నేపథ్యంలో ఈ నెల 4వ తేదీ నుంచి రాబోవు 24 రోజులకు 4,729 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. ప్రస్తుతం 1,810 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి డి.ఎం.ఎఫ్. విజయకుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని ఆమె వివరించారు.

మాదకద్రవ్యాలకు నో చెబుదాం

డ్రగ్స్ ఫ్రీ విజయవాడ సాధిద్దాం



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న సీపీ రాజశేఖరబాబు, ఎమ్మెల్యే ఉమా, డీసీపీ షిరీన్‌బేగం, ఏడీసీపీ రామకృష్ణ తదితరులు

మధురానగర్, న్యూస్‌టుడే : 'మాదకద్రవ్యాలను తరిమికొడదాం... పిల్లల బంగారు భవిష్యత్తును కాపాడుకుందాం...' అంటూ యువత నినదించారు. మహిళా పోలీసుల సైకిల్‌యాత్రకు జేజేలు పలికారు. గంగిరెద్దుల విన్యాసాలు, చిన్నారుల నృత్యాలతో అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 9వ రోజు సైకిల్ యాత్ర ప్రారంభమైంది. కేదారేశ్వరపేట కూడలి నుంచి. . అడుగడుగునా జనం నీరాజనం పలికారు. మహిళా పోలీస్ సిబ్బందితో కలిసి విద్యార్థులు యాత్రలో పాల్గొన్నారు. ఎర్రకట్ట, పాత రాజరాజేశ్వరీపేట మీదుగా న్యూరాజరాజేశ్వరీపేటకు చేరుకుంది. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, డీసీపీ షిరీన్‌బేగం, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు హాజరయ్యారు. సీపీ మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా చేపట్టిన సైకిల్‌యాత్రకు విశేష స్పందన లభించిందని, ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తున్నారన్నారు. మాదకద్రవ్య రహిత నగరంగా విజయవాడను చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేస్తున్నారని కితాబుఇచ్చారు. మాదకద్రవ్యాలపై ఎలాంటి సమాచారం అయినా 112 లేదా 1972కు తెలియజేయాలని కోరారు. ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. పోలీసులు చేపట్టిన ఈ కార్యక్రమానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కేర్ అండ్ షేర్ పాఠశాలలో బహిరంగ సభ నిర్వహించి.. స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసులకు సహకరిస్తామని స్థానికులు పేర్కొన్నారు. మహిళా పోలీస్ సిబ్బందితో పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్షల ప్యాడ్‌లు అందించారు. కార్యక్రమంలో ఏడీసీపీ జి.రామకృష్ణ, ఏసీపీ స్రవంతిరాయ్, అజిత్‌సింగ్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు, తెదేపా నాయకులు నవనీతం సాంబశివరావు, ఎరుబోతు రమణారావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల పవిత్రతకు భంగం కలిగిస్తే ఉపేక్షించం



చర్మకారుడు వెంకటరమణను సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న మాధవ్

విజయవాడ (గవర్నర్ పేట), న్యూస్‌టుడే : తిరుమల పవిత్రతకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ పేర్కొన్నారు. లడ్డూ విషయంలో సిట్ పూర్తి స్థాయి నివేదికను త్వరలో ఇవ్వబోతోందన్నారు. దీనిపై విచారణ జరిపి అక్రమార్కులు ఎంతటి వారైనా అరెస్టు చేస్తామని స్పష్టం చేశారు. బుధవారం భాజపా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో గురు సంత్ రవిదాస్ జయంతి సందర్భంగా విజయవాడలో చెప్పులు కుట్టే కార్మికులను సత్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమలతో పాటు ఇతర ఆలయాల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ సాధనకు కేంద్ర బడ్జెట్ దోహదపడుతుందని చెప్పారు. ఈ నెల 7న కేంద్రమంత్రి జితేంద్రసింగ్ విజయవాడకు వస్తున్నారని తెలిపారు. విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, విజయనగరం, కర్నూలు, తిరుపతి, నెల్లూరులో బడ్జెట్ అవగాహన సదస్సులు నిర్వహిస్తామని వెల్లడించారు.

★ గురు సంత్ రవిదాస్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా 500 ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఆయన గొప్ప ఆధ్యాత్మిక కవి అని, సంఘ సంస్కర్త, భక్తి ఉద్యమకారుడని కొనియాడారు. కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడారని, విదేశీ దురాక్రమల సమయంలో మత మార్పిడులను వ్యతిరేకించారని గుర్తు చేశారు. వృత్తిరీత్యా చర్మకారుడు అయినా.. ఏ వృత్తి అయినా తక్కువ కాదని నిష్కామకర్మతో చేసే ప్రతి పని భగవంతుడికి చేరువ చేస్తుందన్నారు. ఆయన రాసిన 41 శ్లోకాలు సిక్కుల పవిత్ర గ్రంథమైన గురు గ్రంథ్ సాహిబ్‌లో చేర్చారని.. ఇది ఆయన ఆధ్యాత్మిక లోతుకు నిదర్శనమన్నారు. అనంతరం ప్రదర్శనగా వెళ్లి గవర్నర్‌పేటలోని ఒక చర్మకారుడికి గురుసంత్ రవిదాస్ చిత్రపటం ఇచ్చి సత్కరించారు.

బాధిత మహిళలకు న్యాయం.. గౌరవం..



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : వన్ స్టాప్ సెంటర్లతో మహిళల భద్రతకు భరోసా కల్పిస్తున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. బాధిత మహిళలకు న్యాయం, గౌరవం కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లోని ఇగ్నైట్ సెల్‌లో బుధవారం జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ నేతృత్వంలో స్టాల్ ఏర్పాటు చేశారు. సఖి వన్ స్టాప్ సెంటర్‌కు కేటాయించిన ప్రత్యేక వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సదరు ప్రత్యేక వాహనంతో బాధితులకు త్వరితగతిన కౌన్సెలింగ్, వైద్య సేవలు, పోలీసు న్యాయం, న్యాయ సహాయం వంటి సేవలను వేగవంతంగా అందించేందుకు వీలవుతుందని వివరించారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ రుక్సానా సుల్తానా బేగం, అర్బన్ సీడీపీవో జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

నూతన క్వారీ లీజు దరఖాస్తులపై దృష్టి

ఎన్టీఆర్ కలెక్టరేట్: అంతర్జాతీయ ప్రమాణాలు, డిజైన్లతో రాజధాని అమరావతి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పర్యావరణ హితంగా రహదారుల నిర్మాణాలకు విశేష కృషి జరుగుతోంది. వీటికి సంబంధించి గనుల శాఖతో పాటు, అటవీ, రెవెన్యూ, పర్యావరణ వంటి సమన్వయ శాఖల కృషి కీలకమని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ప్రత్యేక కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాజధాని పనులకు గ్రావెల్ కొరత లేకుండా చూడాలని చెప్పారు. ప్రస్తుత క్వారీల లీజులను సమీక్షించుకుంటూ.. నూతన లీజుల దరఖాస్తుల పరిష్కారానికి చొరవ చూపాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో సంయుక్త తనిఖీలు చేపట్టాలన్నారు. నిరభ్యంతర పత్రాల (ఎన్.ఓ.సి.) జారీపై ప్రత్యేకదృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలు, చట్టాలు, పర్యావరణ నిబంధనలను పూర్తిగా పాటించాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో అత్యంత ముఖ్యమైన కార్యాచరణగా పరిగణించి అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, గనుల శాఖ డీడీ ఎ.శ్రీనివాస్ కుమార్, సీఆర్డీఏ ఇంజినీరింగ్ అధికారి బి.శ్రీనివాసరావు, పీసీబీ ఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ధర వరలు

వంకాయలు-22, టమాటా-16, బెండ-30, పచ్చిమిర్చి-34 కాకర-38, బీర-28/32, క్యాలీ ఫ్లవర్-15/20, క్యాబేజి-16, క్యారెట్-30, దొండ-42, బంగాళదుంప-21, ఉల్లిపాయలు-23, గోరుచిక్కుళ్లు-30, దోస-24/34, సొర-12/10, పొట్ల-30, అరటి కాయ-7/6, చామదుంప-22, అల్లం-72, మునగ-10/12, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-38, (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. - **న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు**

కండువా వేయలేదని సిబ్బందిపై దుర్భాషలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: కండువా వేయలేదని దుర్గగుడి సిబ్బందిని ట్రస్టుబోర్డు సభ్యురాలు పార్వతి భర్త హుస్సేన్ దుర్భాషలాడడం బుధవారం ఉద్రిక్తతకు దారి తీసింది. ఆరుగురు వ్యక్తులకు అమ్మవారి దర్శనం చేయించిన ట్రస్టుబోర్డు సభ్యురాలు పార్వతి ఆశీర్వచనం చేయించేందుకు ఆశీర్వచన మండపానికి తీసుకొచ్చారు. అందరికి కండువాలు వేయక పోవడంతో అక్కడ ఉన్న సిబ్బందిని దుర్భాషలాడాడు. ప్రొటోకాల్ ఉన్న వ్యక్తులకు మాత్రమే కండువాలు వేస్తామని సిబ్బంది చెబుతున్న పట్టించుకోకుండా ఆయన బూతులు తిట్టారు. గతంలో హుస్సేన్ దంపతులపై గృహహింసకు సంబంధించిన కేసు ఉన్నప్పటికీ సభ్యురాలిగా నియమించడం వివాదాస్పదమైంది. ఈ విషయంపై ట్రస్టుబోర్డు ఛైర్మన్ రాధాకృష్ణను సంప్రదించగా ట్రస్టుబోర్డు సభ్యులు ఆలయ ప్రాంగణంలో క్రమశిక్షణగా ఉండాలని సిబ్బంది, భక్తులతో గౌరవంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. దుర్భాషలాడిన విషయాన్ని విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



సిబ్బందిని దుర్భాషలాడుతున్న ట్రస్టుబోర్డు సభ్యురాలు పార్వతి భర్త హుస్సేన్

సామరస్యానికి ప్రతీక.. మేరీమాత పుణ్యక్షేత్రం



దివ్యసత్ప్రసాద ఆరాధనతో కొండపైకి వెళ్తున్న గురువులు

గుణదల (పటమట), న్యూస్‌టుడే: గుణదల మేరీమాత పుణ్య క్షేత్రం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని నిడమానూరు రీజనల్ సుపీరియర్ ఫాదర్ బాలాజీ అన్నారు. గుణదల మేరీమాత మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఐదో రోజు నిర్వహించిన నవ దిన ప్రార్థనలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై భక్తులకు సందేశం ఇచ్చారు. విజయవాడ కథోలిక పీఠం మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ మాట్లాడుతూ.. మతాలు వేరైనా మానవులంతా ఒక్కటేనని, ప్రజలందరూ సహోదర భావంతో జీవించాలని సూచించారు. గుణదల పుణ్య క్షేత్రం రెక్టర్ యేలిటి విలియం జయరాజు తదితర గురువులు దివ్యసత్ప్రసాద ఆరాధనతో కొండపై పూజ పీఠం వద్దకు చేరుకున్నారు. అనంతరం సమిష్టి దివ్య పూజాబలి సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏకాంత జంటలే లక్ష్యంగా దాడులు?

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ ప్రాంతంలో ఏకాంత జంటలే లక్ష్యంగా కొందరు యువకులు దాడులకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఆరుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. రెండు రోజుల క్రితం కంచికచర్ల మండలంలోని ఒక గ్రామానికి చెందిన వ్యక్తిపై విచక్షణా రహితంగా దాడి చేసి కొట్టారు. నందిగామలో ఎన్ఎస్పీ కాలువకు సమీపంలో యువకుడిపై దాడికి పాల్పడ్డారు. ఒంటరిగా ఉన్న ఆ వ్యక్తి వద్దకు మూకుమ్మడిగా ఎందుకు వెళ్లారు? ఘర్షణపడి ఎందుకు కొట్టారు? ఈ మొత్తం సంఘటనపై ఎందుకు వీడియో తీసుకున్నారనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ దృశ్యాలు సదరు యువకుల్లో ఒకరి ఫోన్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బాధితుడి వివరాలు తెలుసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితులైన యువకులు ముందుగా వీడియోలు తీసి డబ్బులు ఇవ్వమని బెదిరిస్తున్నట్లు సమాచారం. ఇవ్వకపోతే దౌర్జన్యం చేస్తున్నారు. ఈ విషయాలు ఎవ్వరికైనా చెబితే పరువు పోతుందనే ఉద్దేశంతో బాధితులు మౌనంగా ఉంటున్నారు. ఇదిలా ఉండగా ఈ వ్యవహారాన్ని నీరుగార్చేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో పోలీసు అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై సీఐ లచ్చునాయుడును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. దీనిపై బాధితులెవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. వీడియో ఆధారంగా విచారణ చేస్తున్నామన్నారు. దీనిప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -133 రిటైల్ ధర 160 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 264. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 150, 159, 170 చికెన్ విత్ స్కిన్ - 290 చికెన్ స్కిన్‌లెస్ - 300.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్



అరెస్టు చేసిన నిందితుడితో రైల్వే పోలీసులు

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం జరిగిన హత్య కేసులో నిందితుడికి న్యాయమూర్తి రిమాండ్ విధించారు. నగరానికి చెందిన పలగాని సాయి తారాపేట రైల్వేస్టేషన్ సమీపంలో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తుండగా తన బ్యాగును దొంగిలించాడని అనుమానంతో పొట్టి రాము మద్యం సీసాతో దాడి చేసి హత్య చేయడం తెలిసిందే. దీంతో జీఆర్పీ సీఐ జె.వి.రమణ, ఆర్పీఎఫ్ సీఐ ఫతేఅలీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం నిందితుడిని అరెస్టు చేసి విచారించారు. అనంతరం రైల్వే కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండు విధించారు.

పకడ్బందీగా ఇంటర్ ప్రయోగ పరీక్షలు



కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఇంటర్ బోర్డు కార్యదర్శి రంజిత్ బాషా

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : స్థానిక లబ్బీపేటలోని సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షల నిర్వహణ తీరును ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి పి. రంజిత్ బాషా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరు, లైవ్ మానిటరింగ్ వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయోగ పరీక్షల్లో ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ జరగకుండా పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. నిబంధనలను విస్మరించిన కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 23వ నుంచి ఇంటర్ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆర్ఐవో ప్రభాకర్ ఉన్నారు.

పాత నేరస్థుల అరెస్టు

రూ.7.68 లక్షల సొత్తు రికవరీ



అరెస్టు చేసిన నిందితులతో రైల్వే పోలీసులు. స్వాధీనం చేసుకున్న నగలు (అంతర చిత్రంలో)

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: రైళ్లలో ప్రయాణిస్తూ మహిళల మెడలో బంగారాన్ని దొంగిలించే పాత నేరస్థులను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. జనవరి 17న రైలు నంబరు 17250 కాకినాడ-తిరుపతి రైల్లో వరుసగా రెండు చోరీలు జరిగాయి. కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు సీసీ కెమెరాల సహాయంతో నిందితులను బీహార్ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ సీఐలు జె.వి. రమణ, ఫతేఅలీ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. విచారణలో భాగంగా పోలీసులు బీహార్ వెళ్లి ముగ్గురు నిందితులు లక్ష్మణ్‌కుమార్(22), అంకిత్‌కుమార్(25), చందన్‌సాహు(24)లను అదుపులోకి తీసుకున్నారు. వారిని విజయవాడ తీసుకొచ్చి బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పండిట్ నెహ్రూ బస్టాండ్ వద్ద ఉన్న అండర్ బ్రిడ్జి కింద దాచిన చోరీ చేసిన బంగారం వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన మొత్తం బంగారం విలువ సుమారు రూ.7.68 లక్షలు ఉంటుందని జీఆర్పీ సీఐ రమణ తెలిపారు. ముగ్గురు నిందితులను రైల్వే కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండు విధించారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
రెడ్డిగూడెం: 80085 74707 జి.కొండూరు: 9063144762

? కొండపల్లి ఖిల్లా రోడ్డు సాయిబాబా ఆలయ కూడలిలో ట్రాఫిక్ పెరిగిపోతోంది. దుకాణాల వద్ద వచ్చే కొనుగోలుదారులు వాహనాలను ఫుట్‌పాత్ నుంచి రహదారి వరకూ నిలుపుతున్నారు. వాటిని తప్పించుకొని వెళ్లే ద్విచక్ర వాహనదారులను వెనుక నుంచి వచ్చే పెద్ద వాహనాలు ఢీకొంటున్నాయి. డిసెంబర్ 31 జరిగిన ఇటువంటి సంఘటనలో ఒకరు మృతి చెందారు. ఒకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై చర్యలు తీసుకోండి. **-మహాలక్ష్మి, కొండపల్లి**
✓ రద్దీ సమయాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- లక్ష్మణరావు, ట్రాఫిక్ ఎస్సై – న్యూస్‌టుడే, కొండపల్లి.**



స్పందన: ✦ స్థానిక బీసీ కాలనీ మూడో బజారులోని కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగు పారక అవస్థలు పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా తెలిపిన సమస్యను కార్యదర్శి బసవలింగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**
✦ విస్సన్నపేట మండలం తాతకుంట్ల గ్రామంలో ప్రధాన రహదారికి ఇరువైపులా చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని గ్రామ ప్రజలు మేమున్నాం మీకు తోడుగా ద్వారా పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయగా ఈవో గోపాలకృష్ణ స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయించారు. **-న్యూస్‌టుడే, విస్సన్నపేట**
✦ పట్టణంలోని 6వ వార్డులో గల డ్రెయిన్లలో మట్టి, చెత్త, పేరుకుపోయి మురుగు ప్రవాహానికి ఆటంకంగా ఉందని స్థానికుడు సోమశేఖర్ 'మేమున్నాం మీకు తోడుగా'కు చేసిన ఫిర్యాదును మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా మున్సిపల్ కమిషనర్ అధికారి సంతోష్ స్పందించారు. సిబ్బంది పంపి శుభ్రం చేయించారు.
✦ పట్టణంలోని 8వ వార్డులోని కాలువల్లో మట్టి, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుపడి మురుగు పారుదలలేదని స్థానికుడు ప్రకాశరావు చేసిన ఫిర్యాదుపై శానిటరీ అధికారులు స్పందించారు. సిబ్బంది పంపి శుభ్రం చేయించారు. **-న్యూస్‌టుడే, తిరువూరు**

పంట పొలాలకు సాగర్‌జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలో మదిర బ్రాంచి కెనాల్‌కు బుధవారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి 1250 క్యూసెక్కుల సాగర్‌జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్‌బాబు తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 497 క్యూసెక్కులు చేరగా దిగువన మేజర్ వారీగా గంపలగూడెం 30, ఊటుకూరు-1కి 60, పెదకొమిర 30, మదిర 50, నిడానపురం 60 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయకట్టులో సాగు చేసిన పంటలకు నీటి తడులు అందించేందుకు కాల్వలకు విడుదల చేసిన జలాలను రైతులు వినియోగించుకోవాలని ఏఈ కోరారు.

8న ఉచిత వైద్య శిబిరం

తిరువూరు, న్యూస్‌టుడే: నడింం తిరువూరు సొసైటీ, వీవీఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఈ నెల 8న స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు సొసైటీ ఛైర్మన్ కంది రామ బుధవారం తెలిపారు. శిబిరంలో రక్తపోటు, మధుమేహం, గుండె, మెదడు, వెన్నెముక, నరాలు, ఎముకలు, జీర్ణకోశ వ్యాధులు, కిడ్నీ సమస్యలు వంటి వ్యాధులకు పరీక్షలు చేసి మందులు అందజేస్తారని వివరించారు. అనంతరం తమ వద్ద కాలం పొడిగించినందుకుగాను కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక ఎల్‌రెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.రంగారావు, సంస్థ జిల్లా అధికారి శ్రీనివాసరావు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత నుంచి పీజీ వరకు చదివిన నిరుద్యోగులైన వారు ఈ నెల 9వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెండు నెలల పాటు నిర్వహించే శిక్షణ కోసం నేరుగా గానీ, 82477 66718, 95027 57755 నంబర్లను సంప్రదించాలని సూచించారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చూసుకోరు.. అడిగేవారు లేరు..
రహదారుల వెంట ఉన్న బంకుల బయట నిత్యం ప్రమాదాలు

☛ ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్ బంకు నుంచి ద్విచక్ర వాహనంతో ఎన్‌హెచ్-30పైకి వచ్చిన మహిళను అటుగా వచ్చిన ఆటో ఢీ కొట్టగా ఆమె తలకు తీవ్రగాయమైంది. నెలలుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.
☛ నవంబరు 22న కొండపల్లి సాయిబాబా ఆలయం వద్ద ఉన్న బంకుకు ఆయిల్ కోసం వెళ్తున్న ఆటో బస్సు కోసం ఉన్న ప్రయాణికురాలిని ఢీ కొట్టడంతో ఆమెకు, ఓ బాలుడికి గాయాలయ్యాయి.

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

నేరుగా వస్తుండడంతో: అప్ప పంకర్లు.. అనేక ప్రమాదాలుగా మారింది కొండపల్లి పురపాలిక పరిధిలోని పెట్రోల్ బంకుల వద్ద పరిస్థితి. పుర పరిధిలో ఉన్న బంకుల వద్ద నిత్యం ఏదో ఒక ప్రమాదం సంభవిస్తూనే ఉంది. దీని వల్ల కొందరు ప్రాణాలు కోల్పోతుంటే, అనేక మంది క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు. ఎన్‌హెచ్-30లో 6 ఉండగా, ఎన్‌హెచ్-65లో మరో నాలుగు ఉన్నాయి. వీటిల్లోకి వెళ్లడానికి వాహనదారులు యూటర్న్‌లు తీసుకోవడంతో పాటు బంకుల్లో నుంచి నేరుగా జాతీయ రహదారిపైకి రావాల్సి ఉండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి.


పశ్చిమ ఇబ్రహీంపట్నం బంకు వద్ద రహదారికి అడ్డంగా వెళుతున్న టిప్పర్

గత సంవత్సరంలో: ఈ పెట్రోల్ బంకుల వద్ద 2025లో సంబంధించి 32 ప్రమాదాలు సంభవించినట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా ఎన్టీటీపీఎస్ బంకు, కొండపల్లి అర్జున్ స్ట్రీట్ ఎదురుగా ఉన్నది, ఆప్పిల్ వద్ద, పశ్చిమ ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ వద్ద ఉన్న బంకు, ఇబ్రహీంపట్నం కేరళ హోటల్ సమీపంలో ఉన్న బంకుల వద్దనే అధికంగా ప్రమాదాలు సంభవించినట్లు ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు.

కారణాలివే: దాదాపు పెట్రోల్ బంకులన్నీ జాతీయ రహదారులు 30, 65ల నిర్మాణం జరిగిన తర్వాత ఏర్పాటయ్యాయి. అవన్నీ రహదారులకు సమీపంగానే ఉండడంతో జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలు బంకుల్లోకి రాకపోకలు సాగించే వాహనాలను ఢీ కొంటున్నాయి. దీంతో పాటు బంకుల సమీపంలోని రెస్టారెంట్, బస్టాపుల్లో నిలబడిన ప్రయాణికులను ఆయిల్ కోసం వచ్చే వాహనాలు తాకిడికి గురవుతున్నారు. అదే సమయంలో ఆయిల్ కొనుగోలు చేసిన వాహనదారులు నేరుగా జాతీయ రహదారిపైకి రావడంతో వెనుక నుంచి వస్తున్న వాహనాలు ఢీ కొడుతున్నాయి.

అవగాహన కల్పిస్తాం..: ఎస్సై లక్ష్మణరావు
పెట్రోల్ బంకుల నుంచి బయటకు వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవ్వడం ఎక్కువగా జరుగుతుంది. ఆయా బంకుల యాజమాన్యాలు దీనిపై దృష్టి సారించాలి. బంకు దిగువ భాగంలో వేగ నియంత్రణలు, ప్రమాద హెచ్చరికలు తప్పనిసరిగా ఉండాలి. ఈ విధంగా వారికి సూచిస్తాం.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి


పదో తరగతి విద్యార్థులకు సూచనలిస్తున్న డీవైఈవో శ్యామ్‌సుందరరావు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని డీవైఈవో ఎ.శ్యామ్‌సుందరరావు బుధవారం సందర్శించారు. విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలును తనిఖీ చేశారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని దిశానిర్దేశం చేశారు. చదువులో వెనుకబడినట్లు గుర్తించిన విద్యార్థులపై సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

నేత్రాలు దానం


శ్రీనివాసరెడ్డి (పాత చిత్రం)

కొత్తపల్లి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపల్లికి చెందిన ఉప్పెల శ్రీనివాసరెడ్డి(50) బుధవారం మృతి చెందగా ఆతని నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడ అగర్వాల్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధి జి.కృష్ణారెడ్డి నేత్రదానంపై అవగాహన కల్పించడంతో కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఆసుపత్రి నుంచి నిపుణులు వచ్చి శ్రీనివాసరెడ్డి కళ్లలోని కార్నియాను సేకరించి తీసుకెళ్లారు.

భూ హక్కు పత్రాలతో భరోసా


రైతులతో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియా, ఆర్డీవో మాధురి

గుళ్లపూడి (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని గుళ్లపూడిలో రైతులకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీని జేసీ ఎస్.ఇలక్కియ బుధవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన భూ హక్కు పత్రాలతో తమ సాగు భూములపై భద్రతకు భరోసా ఏర్పడిందని యజమానులు ఆమెకు తెలిపారు. కొత్త పుస్తకాల్లో భూములకు సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేశామని రైతులకు ఆమె వివరించారు. కూటమి ప్రభుత్వం తాజాగా అందజేస్తున్న పాస్‌పుస్తకాలపై భూ యజమానులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్డీవో కె.మాధురి, తహసీల్దార్ వి.రాజకుమారి, ఆర్ఐ ఎం.వీరభద్రరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక మండల తెదేపా కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు మండల పార్టీ అధ్యక్షుడు రాయల సుబ్బారావు ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. విస్సన్నపేట, చండ్రుపట్ల, నరసాపురం, కలగర, వేమిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన 8 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.4,22,649 విలువైన చెక్కులు అందజేశారు.


చెక్కుల పంపిణీలో కూటమి శ్రేణులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 16 మంది లబ్ధిదారులకు బుధవారం తోటమూల తెదేపా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రూ.10,03,357 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను నాయకులు పంపిణీ చేశారు. తెదేపా మండలాధ్యక్షుడు ఎం.రామకృష్ణ, తెలుగు రైతు జిల్లాధ్యక్షుడు సీహెచ్.రాజేశ్వరరావు, ఏఎంసీ ఛైర్‌పర్సన్ ఆర్.లక్ష్మీఅనిత పాల్గొన్నారు. తమకు వైద్య చికిత్స కోసం ఆర్థిక సాయం అందించిన సీఎం చంద్రబాబుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.


తోటమూలలో చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో తెదేపా నాయకులు

గ్రామీణాభివృద్ధే పల్లెపండగ లక్ష్యం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చడమే పల్లె పండగ లక్ష్యమని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం కూనపరాజుపర్వ గ్రామంలో రూ.46 లక్షలతో నిర్మాణం చేయనున్న సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రహదారుల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదన్నారు. నియోజకవర్గంలో రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎ.రామ్మోహనరావు, నాయకులు పాల్గొన్నారు.


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వసంత

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ప్రజాదర్బారుతో ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం రెడ్డిగూడెం మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి సమస్యల పరిష్కారం కోసం అధికారులను ఆదేశించారు. సమస్య తీవ్రతను బట్టి వెంటనే పరిష్కరించే అవకాశం ఉన్నవాటిని తక్షణం పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పడిపోతున్నాయ్.. పట్టించుకోండి

కొత్తూరుతాడేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని వాగుపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ లేకపోవడంతో వాహనాలు పడిపోతున్నాయి. ఇటీవల టిప్పర్, గతంలో కార్లు కూడా వాగులో పడిపోయాయి. వాస్తవానికి రెండులైన్లుగా వంతెన నిర్మించాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు. ఒకలైను మార్గం కావడం, ప్రమాదకరంగా మలుపు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రెండు లైన్లు వంతెనగా అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గొల్లపూడి**


వంతెనపై నుంచి పడిపోయిన టిప్పర్

గుంతపడినా గుర్తించరా..?

వెల్లటూరు గ్రామ శివారులో ఆర్‌అండ్‌బీ రహదారిపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి కింద బండ్ చెరువుకు నీరు వెళ్లే తూములు ఉన్నాయి. భారీ వాహనాల రాకపోకలతో అవి విరిగిపోయి రంధ్రం పడి గుంత ఏర్పడింది. దీంతో కొందరు స్థానికులు గుంతలో చిన్నపాటి కర్రలు అడ్డుగా పెట్టారు. పగలు గుంత ఉన్నట్లు కనిపిస్తున్నా.. రాత్రి సమయంలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రహదారి గుంతను పూడ్చి ప్రమాదాలను తగ్గించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**



రోడ్డుపై మురుగు.. శుభ్రత కనుమరుగు

పట్టణంలోని శాంతినగర్ చివర బైపాస్ రోడ్డు దగ్గర మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనతోపాటు, దోమల బెడద ఎక్కువైందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డుకిరువైపులా ఉన్న మాంసం దుకాణాల వ్యర్థాలను వేస్తుండడంతో మురుగు ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోందని అధికారులకు ఫిర్యాదులు చేసినా నామమాత్రంగా శుభ్రం చేయడం తప్ప శాశ్వత పరిష్కారం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా కాలువలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తిరువూరు**



బీసీల గొంతుక వినిపించాలి

కొండపల్లి, న్యూస్‌టుడే: వెనుకబడిన తరగతుల గొంతుకను వినిపించాల్సిన సమయం ఆసన్నమైందని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ చిట్టిబాబు అన్నారు. బీసీల ఆత్మగౌరవ సభకు సంబంధించిన గోడ పత్రికను బుధవారం కొండపల్లిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలందరూ వేలాదిగా ఏకమై జాతి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అత్యధిక మంది బీసీలు ఉన్న నియోజకవర్గంలో మైలవరం ఒకటని గుర్తు చేశారు. గోడప్రతికను ప్రతి పల్లెలో ఏర్పాటు చేసి వేలాది మంది ఆత్మగౌరవ సభకు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పురపాలిక సంఘ వైస్ ఛైర్మన్ శ్రీను, జి.కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం బీసీ నాయకులు పాల్గొన్నారు.


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ బీసీ నాయకులు

ప్రకటన

నా క్లయింటు అయిన ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ, చిట్టినగర్, సిండికేట్ బ్యాంక్ కాలనీ, భీమన్న వారి పేట, ప్లాటు నెం.28, డో.నెం.5-7/8-106రు కాపురస్థులు **కనమర్లపూడి (లేటు) కోదండరామయ్య గారి కుమారుడు కనమర్లపూడి శ్రీనివాసరావు గారి** సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా...
నా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని, Australia, Vitoria-3012, Melbourne, 44 Cathcart Street, Maidstone కాపురస్థులైన అబ్బూరి వరప్రసాదరావు గారి కుమారుడు అబ్బూరి వంశీదీప్ వీరి తరఫున డి.18-04-2023వ తేదీన వ్రాయబడిన ఆస్ట్రేలియాలో నోటరీ చేయబడిన దరిమిలా శ్రీ విజయవాడ జిల్లా రిజిస్ట్రార్ వారి ఆఫీస్‌లో నెం. ఇ1/1497/2023రుగా డి.28-04-2023వ తేదీన ఎండార్స్‌మెంట్ చేయబడి ఇంకనూ అమలులో ఉండి ఉన్న జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ఏజెంట్ అబ్బూరి వెంకటేశ్వరరావు గారి కుమారుడు అబ్బూరి శ్రీనివాసరావు అను వారి నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొని కొంత సొమ్మును బయానాగా ఇచ్చి నా క్లయింటు విక్రయ ఖరారు పడివున్నారు. సదరు షెడ్యూలు దాఖలా స్థిరాస్తి అబ్బూరి వంశీదీప్ గారికి వారి తాతగారైన వల్లూరు నరసయ్య (లేటు) గారి కుమారుడు వల్లూరు వెంకటేశ్వరరావు గారు వారి జీవిత కాలములో వారి యొక్క స్థిరాస్తుల విషయమై వారి తదనంతరం జరగవలసిన ఏర్పాట్ల గురించి డి.22-11-2018వ తేదీన ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో బుక్ నెం.3గా డాక్యుమెంట్ నెం. 92/2018 ఒక వీలునామాను వ్రాయించి ఎటువంటి మార్పులు, చేర్పులు చేయకుండా సదరు వీలునామానే వారి ఆఖరి వీలునామాగా ఉంచి డి. 22-04-2020వ తేదీన పరమపదించినారు. దరిమిలా సదరు వీలునామాలోని 6వ అయిటం అనగా విజయవాడ రూరల్ మండలం, గొల్లపూడి గ్రామ రీసర్వే నెం. 479/2బి దాఖలా య.1.00 సెంట్లు స్వాధీనపరచుకొని రెవెన్యూ రికార్డులో ఖాతా నెం. 2134రుగా నమోదు చేసుకొని సర్వసంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములతో నిర్వివాదముగా అనుభవించుచున్నారని తెలిపియున్నారు. సదరు వల్లూరు వెంకటేశ్వరరావు గారు డి.29-06-2018వ తేదీన ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు ఆఫీస్ దస్తావేజు నెం. 50/2018రుగా ఒక వీలునామాను రిజిస్టర్ చేయించి మరియు డి. 30-10-2018వ తేదీన ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీస్‌లో 3వ పుస్తకం, దస్తావేజు నెం. 54/2010రుగా ఒక వీలునామాను రిజిస్టర్ చేయించి ఉన్నారు. సదరు రెండు వీలునామాలలో విషయములు అమలు జరుపుటకు ఇష్టం లేకపోవుటచే సదరు వీలునామాలను రద్దుపరచుకొని పై తెలిపిన అనగా డి.22-11-2018వ తేదీన ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో బుక్ నెం.3గా డాక్యుమెంట్ నెం. 92/2018 ఒక వీలునామాను వ్రాయించి ఎటువంటి మార్పులు, చేర్పులు చేయకుండా సదరు వీలునామానే వారి ఆఖరి వీలునామాగా ఉంచి డి.22-04-2020వ తేదీన పరమపదించినారు. కావున షెడ్యూలు దాఖలా స్థిరాస్తిపై ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు, తనఖాలు, కోర్టు జప్తులు, భాగలబ్ధ తగాదాలు, హామీలు, బ్యాంక్ ష్యూరిటీలు వగైరాలు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులలో తగు ఆధారాలతో వ్రాతపూర్వకంగా ఈ దిగువ అడ్రస్‌నకు రిజిస్టర్ పోస్టు తిరుగు రశీదు ద్వారా తెలుపగలరు. సదరు గడువులోపు ఎవరినుండైనా ఏవిధమైన అభ్యంతరములు రాని యెడల నా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని నిర్వివాద ఆస్తిగా భావించి పై తెలిపిన వారు అనగా అబ్బూరి వంశీదీప్ గారి తరఫున జీపీఏ ఏజెంట్ అయిన అబ్బూరి శ్రీనివాసరావు అను వారి నుండి రిజిస్టర్డ్ దస్తావేజు పొందగలరు. గడువు అనంతరము వచ్చు అభ్యంతరములు వగైరాలు నా క్లయింటును గానీ, సదరాస్తిని గాని బైండు చేయజాలవు.
షెడ్యూలు: ఎన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి పరిధిలోని ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, గొల్లపూడి గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన గొల్లపూడి గ్రామ రీ సర్వే నెం. 479/2బి రు దాఖలా య.0.28 సెంట్లు వెరశి మెరక బాపతు పల్లం భూమికి **హద్దులు: తూర్పు:** అబ్బూరి వంశీదీప్ కొంత భూమి, అబ్బూరి తేజశ్రీ గారి కొంత భూమి, **దక్షిణం:** చిట్టినేని శ్రీనివాసరావు గారి భూమి, **పడమర:** డొంక రోడ్డు, **ఉత్తరం:** చిట్టినేని శ్రీనివాసరావు గారి కొంత భూమి, చిట్టినేని నాగలక్ష్మి పార్వతి గారి కొంత భూమి. ఈ నాలుగు హద్దుల మధ్య గల భూమి.
ఇట్లు: యం.డి.హైదర్, యం.డి. అబ్దుల్ రహీమ్, అడ్వకేట్స్, డి.నెం. 41-9-18, కృష్ణలంక, విజయవాడ-13. సెల్ నెం. 94401 74135

విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పిద్దాం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా శాఖల సూచనల మేరకు 'ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం.. ఊరి బడిని కాపాడుకుందాం' అనే నినాదంతో త్వరలో చేపట్టే ఎన్‌రోల్మెంట్ డ్రైవ్ సంబంధిత గోడపత్రికలను విస్సన్నపేట ఎంపీడీవో చినరాట్నాలు, ఎంఈవో-1 కె.శంకరరావు, ఎంఈవో-2 ఈ.సుధాకర్‌లు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో.. మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేస్తున్న యూటీఎఫ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి బి.సి.హెచ్.వి సూర్యనారాయణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్. చంటిబాబు, ఎ.మురళీకృష్ణ, పి.రామకృష్ణారెడ్డి, కె.చైతన్య, కె.రవిబాబు తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రులు ప్రదర్శిస్తున్న ఎంపీడీవో, ఎంఈవోలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పిస్తే అందే సంక్షేమ పథకాల గురించి ఎంపీడీవో చేకు చినరాట్నాలు ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీపీ స్కూల్ చంద్రుపట్ల పి.ఎల్.టి పాఠశాలలో బుధవారం బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచి ధారావత్ బోడి, సూర్య, డిప్యూటీ ఎంపీడీవో రామ్మోహన్ రావు, ఎంఈవో కె.శంకరరావు, ప్రధానోపాధ్యాయులు జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

చాలీచాలని జీతంతో ఇబ్బందులు


నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

మైలవరం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ వర్కర్లకు యాప్‌ల భారం తగ్గించాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్‌లో వేతనాలకు సరిపడా నిధులను కేటాయించాలన్నారు. చాలీచాలని జీతాలతో ఇబ్బంది పడుతున్నారని, అధికారంలోకి వస్తే కేంద్రంతో కలిసి వేతనాలు పెంచుతామని ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాన్ని ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ సుధాకర్, ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శి ఆర్‌ఆర్‌వీ పుష్పకుమారి, శారదకుమారి, మాణిక్యం, పద్మ, రమాదేవి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేయించుకోండి


మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసరావు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రైతులంతా తాము సాగు చేసిన పంటల వివరాలు ఈనెల 20 తేదీ నాటికి నమోదు చేయించుకోవాలని రెడ్డిగూడెం మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం రుద్రవరం గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. సేంద్రియ వ్యవసాయ విధానం ద్వారా పంటల సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచి బి.కృష్ణారెడ్డి, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

ఎన్‌పీటీఈఎల్ పరీక్షల్లో ఏ గ్రేడ్

మైలవరం: ప్రఖ్యాత సంస్థ ఎన్‌పీటీఈఎల్ నిర్వహించిన ఆన్‌లైన్ కోర్సుల ఉత్తీర్ణతలో సత్తా చాటడం ద్వారా లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల లోకల్ చాప్టర్‌కు ఏ గ్రేడ్ వచ్చినట్లు ప్రిన్సిపల్ కె.అప్పారావు తెలిపారు. వివిధ కోర్సుల పరీక్షలు రాసిన వారిలో 1737 మంది ఉత్తీర్ణులవగా, అందులో 13 మంది టాపర్లుగా నిలిచినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిభ చాటడం ద్వారా సంస్థ నుంచి షీల్డ్, ధ్రువీకరణ పత్రాలను అందుకున్నట్లు చెప్పారు. కళాశాల అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్, ఉప ప్రిన్సిపల్ రమేష్‌రెడ్డి, డీన్లు తదితరులు అభినందించారు.

చదువుతోనే ఉన్నత స్థానం

జి.కొండూరు: చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం సాధించవచ్చని, విద్యార్థులు ఒత్తిడిని జయించి పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ ప్రొఫెసర్ ఎ.కోటిరెడ్డి సూచించారు. కట్టుబడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం కొండపల్లి పారిశ్రామికవాడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కెరియర్ గైడెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రఘునాథరెడ్డి, హెచ్‌ఎం టి.భాగ్యలక్ష్మి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

లారీ ఢీ.. ఒకరి దుర్మరణం

ఇబ్రహీంపట్నం గ్రామీణం: గుంటుపల్లి గ్రామ సమీపంలో జాతీయరహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందారు. పోలీసుల సమాచారం మేరకు తుమ్మలపాలేనికి చెందిన దువ్వాపు గణపతినాగరాజు(36) గుంటుపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై తుమ్మలపాలెం వస్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పి కిందపడ్డ అతని తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్పెల్ బీ పోటీల్లో ప్రతిభ

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని చెగిరెడ్డిపాడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పి.అఖిల్, ఎం.మహేష్‌నందా, ఎస్.శ్రీరామ్ అఖిల్, జి.జస్వంత్‌లు విభా లీప్ ఫర్ వర్డ్ వారు నిర్వహించే స్పెల్ బీ పోటీల్లో జోనల్ స్థాయిలో గత నెల కాకినాడలో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటారు. దీంతో గ్రామ సర్పంచి దంపతులు నెల్లూరు శ్రీదేవి, లీలా శ్రీనివాస్‌లు బుధవారం విద్యార్థులకు నగదు ప్రోత్సాహాన్ని, వారు సాధించిన ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.విజయ్‌కుమార్, ఎం.ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

హైకోర్టులో కాకాణి వ్యాజ్యాలు

ఈనాడు, అమరావతి: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు, దర్గామిట్ట పోలీసులు తనపై నమోదుచేసిన కేసులను కొట్టేయాలని కోరుతూ వైకాపా నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. శ్రీవారి లడ్డూ నెయ్యి కల్తీ విషయంలో కులమతాల మధ్య విద్వేషాలు రగిల్చేలా మాట్లాడానంటూ తెదేపా నేతలు మస్తాన్‌బాబు, రామిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు తనపై కేసు నమోదు చేశారన్నారు.


భూ కేటాయింపు పాలసీపై హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాలు

ప్రతివాదులకు న్యాయస్థానం నోటీసులు

ఈనాడు, అమరావతి: ఏపీ భూకేటాయింపు పాలసీకి విరుద్ధంగా వివిధ సంస్థలకు ప్రభుత్వం భూములు కేటాయిస్తోందని, ప్రాజెక్టులు ప్రారంభించకముందే భూవిక్రయానికి ఒప్పందం చేసుకుంటోందంటూ దాఖలైన పలు ప్రజాహిత వ్యాజ్యాలపై బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. ఆయా సంస్థలకు నోటీసులు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని ఆదేశిస్తూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు నోటీసులు జారీచేసిన వాటిలో అదానీ ఇన్‌ఫ్రా, ఇండిచిప్ సెమీకండక్టర్స్, రహేజా కార్పొ రియల్ ఎస్టేట్, ఆమోద పబ్లికేషన్స్ (ఆంధ్రజ్యోతి) సంస్థలు ఉన్నాయి. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈమేరకు ఉత్తర్వులిచ్చింది. భూకేటాయింపు పాలసీకి విరుద్ధంగా వివిధ సంస్థలకు రాష్ట్రప్రభుత్వం భూములను కట్టబెడుతోందని పేర్కొంటూ సివిల్ ప్రాపర్టీ, ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ రైట్స్ సంస్థ ప్రతినిధులు ఎన్.నాగేశ్వరరావు, వి.చిన్నచెన్నప్ప, నిమ్మిగ్రేస్ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాలు వేశారు. వారి తరఫున న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వం కొన్ని సంస్థలకు ఉచితంగా, మరికొన్ని సంస్థలకు రూ.99 పైసలకు భూములు కేటాయిస్తోందన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం కౌంటర్ వేయాలని ప్రతివాదులకు నోటీసులిచ్చింది.

విద్వేషాలను రెచ్చగొట్టేలా జోగి రమేష్ వ్యాఖ్యలు

- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు
- జోగిపై తొమ్మిది కేసులున్నాయి
- ఇలాంటి వ్యక్తి అరెస్టు నుంచి రక్షణ పొందేందుకు అనర్హుడు
- పోలీసుల తరఫున హైకోర్టులో పీపీ వాదనలు



ఈనాడు, అమరావతి: వైకాపా నేత, మాజీమంత్రి జోగి రమేష్ కులాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టడమే కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) ఎం.లక్ష్మీనారాయణ బుధవారం హైకోర్టులో వాదనలు వినిపించారు. "కల్తీ మద్యం కేసులో నిందితుడిగా ఉన్న ఆయన బెయిలుపై బయటకొచ్చి పత్రికా సమావేశాలు నిర్వహించి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. జోగికి నేరచరిత్ర ఉంది. ఆయనపై తొమ్మిది కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అసభ్యకర పదజాలంతో దూషణలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తున్నారు. ఇలాంటి వ్యక్తి అరెస్టు నుంచి రక్షణ పొందేందుకు అనర్హుడు. ఫిర్యాదుదారుకు నోటీసు ఇవ్వకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీచేయొద్దు" అని కోర్టును కోరారు. బుధవారం విచారణలో ఇరువైపుల వాదనలు ముగియడంతో మధ్యంతర ఉత్తర్వులిచ్చే వ్యవహారాన్ని వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రకటించారు.

✦ తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీని పక్కదోవ పట్టించేలా జోగి రమేష్ జనవరి 31న మీడియాతో మాట్లాడారని, ఈ సందర్భంగా మంత్రి లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని, విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించారని పేర్కొంటూ తిరుపతి గ్రామీణ మండల తెదేపా అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో జోగి రమేష్‌పై తిరుపతి గ్రామీణ పోలీసులు ఈ నెల 1న కేసు నమోదు చేశారు.

✦ జోగి రమేష్, ఆయన అనుచరులు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల ప్రతిష్ఠకు భంగం కలిగేలా మీడియాతో మాట్లాడారంటూ ఎన్టీఆర్ జిల్లా మూలపాడుకు చెందిన కాకి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు జోగి రమేష్‌పై కేసు నమోదుచేశారు.

ఈ రెండు కేసులను కొట్టేయాలని, అరెస్టు విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోకుండా పోలీసులను నిలువరించాలని జోగి రమేష్ బుధవారం అత్యవసరంగా వ్యాజ్యాలు దాఖలుచేశారు. ఈ వ్యాజ్యాలపై హైకోర్టు న్యాయమూర్తి విచారణ జరిపారు.

అవి రాజకీయ విమర్శలే

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది శ్రీరామ్ వాదనలు వినిపించారు. జోగి రమేష్ చేసిన వ్యాఖ్యలు విద్వేషాన్ని రెచ్చగొట్టేవి కాదన్నారు. రాజకీయ విమర్శలే చేశారన్నారు. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు ఏడేళ్లలోపు జైలుశిక్షకు వీలున్నవేనని, కనీసం ప్రాథమిక విచారణ చేయకుండా కేసులు నమోదు చేశారని చెప్పారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలని కోరారు.

పోలీసులు, మేజిస్ట్రేట్లకు శిక్షణ ఇవ్వాలంటూ దాఖలైన పిల్ కొట్టివేత

- న్యాయవాది శివప్రసాద్‌రెడ్డి తీరుపై హైకోర్టు తీవ్ర అసహనం
- దూకుడు తగ్గించుకోవాలని హితవు
- తమ ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని స్పష్టీకరణ

ఈనాడు, అమరావతి: ఏడేళ్లలోపు జైలు శిక్షకు వీలున్న కేసుల్లో నిందితులను పోలీసులు అరెస్టు చేస్తున్నారని, మేజిస్ట్రేట్‌లు యాంత్రికంగా రిమాండ్ విధిస్తున్నారని, ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు అర్నేశ్‌కుమార్ కేసులో ఇచ్చిన ఆదేశాలను పాటించేలా పోలీసులు, మేజిస్ట్రేట్లకు శిక్షణ ఇప్పించేలా ఆదేశించాలంటూ దాఖలైన పిల్‌ను హైకోర్టు కొట్టేసింది. బుధవారం ఈ పిల్ హైకోర్టులో విచారణకు రాగా.. కౌంటర్ వేసేందుకు మరికొంత సమయం ఇవ్వాలని ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థించారు. దీంతో సమయం ఇస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించగానే పిటిషనర్ తరఫు న్యాయవాది గుండాల శివప్రసాద్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వడానికి తాను అంగీకరించనన్నారు. తన పిల్‌ను వేరే ధర్మాసనం ముందుకు బదిలీ చేయాలని, సాధ్యం కాకపోతే ఉత్తర్వులిస్తే వాటిని సుప్రీంకోర్టులో సవాలు చేస్తానని స్వరం పెంచి మాట్లాడారు. ఏడేళ్లలోపు జైలు శిక్షకు వీలున్న కేసులో మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబును పోలీసులు అరెస్టు చేశారని, మేజిస్ట్రేట్ ఆయనకు రిమాండ్ విధించారన్నారు. ఈ వాదనలపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. అంబటి రాంబాబు కోర్టును ఆశ్రయించలేదని, ఆయన దాఖలుచేసిన వ్యాజ్యం తమ ముందు విచారణకు రాలేదని, ఈ విషయాన్ని ఎందుకు ప్రస్తావిస్తున్నారని ప్రశ్నించింది. పద్ధతి మార్చుకోవాలని, దూకుడు తగ్గించుకోవాలని హితవు పలికింది. కోర్టు విచారణకు అంతరాయం కలిగించొద్దని, చట్టం ఆదేశాలన్నీ పాటించాలని హెచ్చరించింది. అయినా న్యాయవాది తన తీరును మార్చుకోకపోవడంతో.. పిల్‌ను కొట్టేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. ఈ ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే సుప్రీంకోర్టుకు వెళ్లాలని తేల్చిచెప్పింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌ల ధర్మాసనం బుధవారం ఈమేరకు ఉత్తర్వులిచ్చింది.

✦ ఈ పిల్‌ను న్యాయవాది పామర్తి రత్నాకర్ హైకోర్టులో వేశారు. ఆయన తరఫున న్యాయవాది గుండాల శివప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపిస్తున్నారు.

నిందితులతో వీధుల్లో పరేడ్ ఏమిటి?

- నేర నిరూపణ కానంత వరకు నిరపరాధులే
- పోలీసుల తీరుపై హైకోర్టు వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: నిందితులతో వీధుల్లో పరేడ్ ఎందుకు నిర్వహిస్తున్నారని పోలీసులను హైకోర్టు ప్రశ్నించింది. నేర నిరూపణ కానంతవరకు నిందితులు నిరపరాధులేనని వ్యాఖ్యానించింది. నిబంధనలు పాటించి పోలీసులు శాంతిభద్రతలను కాపాడాల్సిన అవసరం ఉందని తెలిపింది. రాష్ట్రంలో నమోదు చేసిన వివిధ కేసుల్లో నిందితులను పోలీసులు పరేడ్ నిర్వహిస్తున్నారంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంలో కౌంటర్ దాఖలు చేయాలంటూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, తూర్పుగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల ఎస్పీలకు నోటీసులు ఇచ్చింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈమేరకు ఉత్తర్వులిచ్చింది. నిందితులను పోలీసులు వీధుల్లో నడిపిస్తూ పరేడ్ నిర్వహించడం, మీడియా ముందు ప్రవేశపెట్టడం సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులకు విరుద్ధమని పేర్కొంటూ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ ప్రాపర్టీ, ఎన్విరాన్‌మెంటల్ రైట్స్ సంస్థ అధ్యక్షుడు పరస సురేశ్‌కుమార్ హైకోర్టులో పిల్ వేశారు. ఆయన తరఫున న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ హైకోర్టు తీర్పునకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ప్రణతి స్పందిస్తూ.. కొవ్వూరులో ఓ కేసులో నిందితుణ్ని తీసుకెళ్లే క్రమంలో వాహనం పాడవడంతో రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారని, ఆ ఘటనను ఫొటోలు తీసి ప్రచారం చేశారన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయం కావాలని కోరారు. దీంతో విచారణ నాలుగు వారాలకు వాయిదా పడింది.

కోర్టు ఆదేశాలను విస్మరిస్తే మూల్యం చెల్లించుకోవాల్సిందే

- కోర్టులేం చేస్తాయిలే అనుకునే అధికారులను ఎవరూ కాపాడలేరు
- ప్రజాసేవకులమని మర్చిపోయి పాలకుల్లా వ్యవహరిస్తున్నారు
- హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) పార్ట్ టైం పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్ల(పీజీటీ)/పిటిషనర్ల సేవలను కొనసాగిస్తామంటూ హైకోర్టుకు ఇచ్చిన హామీని అధికారులు ఉల్లంఘించడంపై ధర్మాసనం మండిపడింది. కోర్టులు ఏం చేస్తాయిలే అనుకునే అధికారులను ఎవరూ కాపాడలేరని హెచ్చరించింది. కొందరు అధికారులు ప్రజాసేవకులమనే విషయాన్ని మర్చిపోయి పాలకుల్లా వ్యవహరిస్తున్నారని ఘాటుగా వ్యాఖ్యానించింది. కోర్టు ఆదేశాలను విస్మరిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని తేల్చిచెప్పింది. మాట వినని దిగువస్థాయి అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలంది. కోర్టుకిచ్చిన హామీని అమలు చేసేందుకు తీసుకున్న చర్యలను అఫిడవిట్ రూపంలో తమ ముందు ఉంచాలని సర్వశిక్షాభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావును ఆదేశించింది.

పథకాల అమలును పర్యవేక్షించాల్సింది కేంద్రమే

కేజీబీవీల విషయంలో కేంద్రప్రభుత్వ వైఖరిని ధర్మాసనం తప్పుపట్టింది. కేంద్రం తమ వాటా నిధులను విడుదల చేసి చేతులు దులిపేసుకుంటే సరిపోదని, ఆ పథకాలను రాష్ట్రప్రభుత్వాలు సక్రమంగా అమలు చేస్తున్నాయా.. లేదా అనే విషయాన్ని పర్యవేక్షించాల్సిన బాధ్యత కేంద్రానిదేనని తేల్చిచెప్పింది. రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని ప్రచారం కోసమే వాడుకుంటున్నారని ఆక్షేపించింది. పథకాల అమలు బాధ్యతల నుంచి ప్రభుత్వాలు తప్పుకొన్నా.. న్యాయస్థానాలు తమ బాధ్యతల నుంచి తప్పుకోవని తేల్చిచెప్పింది. సర్వశిక్షాభియాన్ పథకం అమలు విషయంలో అఫిడవిట్ వేయాలని కేంద్రాన్ని ఆదేశిస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మలతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

✦ కేజీబీవీలలో పీజీటీలుగా పనిచేస్తున్న తమను తొలగించారంటూ పలువురు 2023లో హైకోర్టులో వ్యాజ్యం వేశారు. తొలగింపును తప్పుపడుతూ సింగిల్ జడ్జి ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులపై అధికారులు ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. దీనిపై విచారణ సందర్భంగా పిటిషనర్లను కొనసాగిస్తామని అధికారులు కోర్టుకు హామీ ఇచ్చారు. ఆ మేరకు వ్యవహరించకపోవడంతో సర్వశిక్షాభియాన్ పీడీపై హైకోర్టు సుమోటోగా కోర్టుధిక్కరణ చర్యలు తీసుకొని నోటీసులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో పీడీ శ్రీనివాసరావు ధర్మాసనం ముందు హాజరయ్యారు. కిందిస్థాయి అధికారుల తీరుతో తన ఆదేశాలు అమలు కాలేదన్నారు. ఈ వివరణపై ధర్మాసనం మండిపడింది.

రాజమహేంద్రవరంలో బెంబేలెత్తిస్తున్న పెద్దపులి

- జనావాసాల్లోకి రావడంతో ఆందోళన
- మత్తుమందు ఇచ్చి బంధించేందుకు అనుమతులు

రాజానగరం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం శివారు గ్రామాల్లో పెద్దపులి సంచారం గుబులు రేపుతోంది. మంగళవారం రాత్రి నగర శివారు దివాన్‌చెరువు.. అక్కడి నుంచి బీజాపూర్ టౌన్‌షిప్, శ్రీరాంపురం మీదుగా రఘునాథపురం చేరుకుంది. ఆ ప్రాంతంలో ఓ గేదెను చంపినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. బుధవారం ఉదయానికి రాజమహేంద్రవరం గ్రామీణ మండలం అంకాలమ్మతల్లి కొండ వద్ద పాదముద్రలు ఉన్నాయన్న సమాచారంతో అటవీశాఖ అధికారులు వెళ్లి పరిశీలించారు. కొండకు మరోవైపు గుబురుగా ఉన్న జీడిమామిడి తోటలో పులి సేదతీరి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

15 రోజుల్లో దాదాపు 600 కిలోమీటర్లు

పులికి మత్తు ఇచ్చి, అటవీ ప్రాంతంలో విడిచిపెట్టేందుకు అవసరమైన అన్ని అనుమతులూ ఇచ్చామని స్టేట్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ పి.వి.చలపతిరావు తెలిపారు. పుణె, దిల్లీ నుంచి ప్రత్యేక బృందాలు వస్తున్నాయని, ప్రస్తుతం 12 బృందాలు పని చేస్తున్నాయన్నారు. మత్తు ఇచ్చేందుకు ట్రాంక్విలైజర్, బోను సిద్ధం చేసినట్లు తెలిపారు. సీసీఎఫ్ మూర్తి మాట్లాడుతూ పులి 15 రోజుల్లో దాదాపు 600 కిలోమీటర్లు ప్రయాణించినట్లు అంచనా వేస్తున్నామన్నారు.



మంగళవారం రాత్రి దివాన్‌చెరువు ప్రాంతంలో సంచరిస్తున్న పులి

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వినతి



సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న రఘురాం

గవర్నర్‌పేట, మచిలీపట్నం కార్పొరేషన్: కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. బ్యాంకు పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఉద్యోగుల సమస్యలు, పరిపాలనా ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. పలు సంఘాల్లో సీఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన ఉద్యోగులకు ఒకసారి ప్రత్యేక పదోన్నతులు ఇవ్వాలని అభ్యర్థించారు. పలు గ్రామీణ సంఘాలు రోజు వారి వేతనంతో పని చేసే సిబ్బందిపై ఆధారపడి పని చేస్తున్నాయని.. వారికి అర్హత పరీక్ష నిర్వహించి, అర్హులైన వారికి పూర్తిస్థాయి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కేడీసీసీ, సహకార సంఘాల ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. ఈ తరహా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా.. ఆయన శ్రద్ధగా విని సాధ్యమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని రఘురాం వెల్లడించారు.

యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ్ కౌసల్య యోజన, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు మూడు నెలల పాటు ఉచిత నైపుణ్య శిక్షణ, ఉచిత వసతి, భోజన సదుపాయం, 100 శాతం ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు స్థానిక హైటెన్షన్ రోడ్డులోని ఆరా ఎడ్యుకేషనల్ సొసైటీ ఒక ప్రకటనలో బుధవారం పేర్కొంది. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులు కావాలని తెలిపారు. వయసు 18-26 ఏళ్ల మధ్య ఉండాలని, తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో సీఎన్‌సీ ట్యూనింగ్, మెషిన్ ఆపరేటింగ్‌తో పాటు ఎం.ఎస్.ఆఫీస్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూలకు సన్నద్ధత తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని చెప్పారు.

పీజీ మెడికల్ అభ్యర్థులకు ఫ్రీ ఎగ్జిట్ అవకాశం

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: పీజీ మెడికల్ మొదటి, రెండో విడత కౌన్సెలింగ్‌లో కన్వీనర్, యాజమాన్య కోటా కింద సీటు పొందిన విద్యార్థులకు 'ఫ్రీ ఎగ్జిట్' అవకాశాన్ని విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం కల్పించింది. అభ్యర్థులు ఈ నెల 4వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 6వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా ఫ్రీ ఎగ్జిట్ కావొచ్చు. సంబంధిత దరఖాస్తు పత్రాన్ని నోటిఫికేషన్‌లో పొందుపర్చింది.

'నవోదయ' పరీక్ష అడ్మిట్ కార్డుల జారీ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: 2026-27 విద్యా సంవత్సరంలో వేలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి వీలుగా ఈ నెల 7న నిర్వహించనున్న ప్రవేశపరీక్ష రాసే అభ్యర్థులకు అడ్మిట్‌కార్డులు జారీ చేసినట్లు ప్రిన్సిపల్ డి.ఎదునందన తెలిపారు. ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు అడ్మిట్ కార్డులను cbseitms.rcil.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

బీపీడీ, డీపీడీ ఫలితాల విడుదల

మచిలీపట్నం(కోనేరు సెంటరు), న్యూస్‌టుడే : కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన బీపీడీ, డీపీడీ మూడో సెమిస్టర్ పరీక్షా(రెగ్యులర్, సప్లిమెంటరీ) ఫలితాలను విడుదల చేసినట్టు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.వీరబ్రహ్మచారి తెలిపారు. ఫలితాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో పొందుపరిచామని చెప్పారు. పునఃమూల్యాంకనం కోసం ఈ నెల 11వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇందుకు సంబంధించిన రుసుము, ఇతర వివరాలు వెబ్‌సైట్‌లో ఉన్నట్టు ఒక ప్రకటన ద్వారా స్పష్టం చేశారు.

నేటి నుంచి విజ్ఞాన్ మహోత్సవ్ 2కే26

పొన్నూరు, న్యూస్‌టుడే : గుంటూరు జిల్లా చేబ్రోలు మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో విజ్ఞాన్ మహోత్సవ్- 2కే26 గురువారం ప్రారంభమవుతుందని ఇన్‌ఛార్జి ఉపకులపతి కేవీ.క్రిష్ణకిషోర్ బుధవారం తెలిపారు. శుక్ర, శనివారాల్లోనూ కొనసాగుతుందని చెప్పారు. 80 రకాల జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. వివిధ రాష్ట్రాల నుంచి 50 వేల మంది హాజరవుతున్నారన్నారు.

దుర్గగుడి హుండీ ఆదాయం రూ.2.91 కోట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. మల్లికార్జున మహా మండపం ఆరో అంతస్తులో గత 16 రోజులుగా వచ్చిన కానుకలను లెక్కించగా రూ.2,91,82,998 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. కానుకలతోపాటు 251 గ్రాముల బంగారం, 3.255 కిలోల వెండి వస్తువులు భక్తులు మొక్కుల రూపంలో చెల్లించారు. 785 అమెరికా డాలర్లు, 25 ఇంగ్లాండ్ పౌండ్లు, 365 ఆస్ట్రేలియా డాలర్లు, 300 కెనడా డాలర్లు, 12 సింగపూర్ డాలర్లు, 10 కువైట్ దీనార్లు భక్తులు హుండీల్లో సమర్పించినట్లు పేర్కొన్నారు. కానుకల లెక్కింపును దేవస్థానం ఈవో శీనానాయక్ పర్యవేక్షించారు.

బ్యాటరీ కారు బహూకరణ



ఈవో శీనానాయక్‌కు వాహన తాళాలు అందిస్తున్న ఎస్‌బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు, రాజేష్‌కుమార్ పటేల్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గగుడికి రూ.9.13 లక్షలు విలువ చేసే బ్యాటరీ కారును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గాంధీనగర్ శాఖ అధికారులు దేవస్థానానికి బుధవారం అప్పగించారు. ముఖ్య అతిథిగా ఎస్‌బీఐ ఛైర్మన్(ముంబై) శ్రీనివాసులు శెట్టి, హైదరాబాద్ సర్కిల్ సీజీఎం రాజేష్‌కుమార్ పటేల్ బ్యాటరీ వాహనం తాళాలను ఈవో శీనానాయక్‌కు అప్పగించారు. భక్తుల సౌకర్యార్థం గతేడాది కరూర్ వైశ్యా బ్యాంక్, కెనరా బ్యాంక్‌లు రెండు బ్యాటరీ కార్లు అందజేసినట్లు దేవస్థానం అధికారులు పేర్కొన్నారు.

బెస్ట్ యూనివర్సిటీ మెన్‌గా భార్గవ్



దేహదారుఢ్యం ప్రదర్శిస్తున్న క్రీడాకారులు

వేటపాలెం, న్యూస్‌టుడే: బాపట్ల జిల్లా వేటపాలెంలోని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం జేఎన్‌టీయూ కాకినాడ ఆధ్వర్యంలో ఇంటర్ కళాశాలల పురుషుల బెస్ట్ ఫిజిక్ (అత్యుత్తమ దేహదారుఢ్యం) పోటీలు నిర్వహించారు. పోటీలకు తూర్పు, పశ్చిమ గోదావరి, గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాలోని 24 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో బెస్ట్ యూనివర్సిటీ మెన్‌గా విజయవాడ పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన భార్గవ్, బెస్ట్ స్ట్రాంగ్ మెన్‌గా సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థి రాఘవ నిలిచారు. వీరిద్దరిని అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపిక చేసినట్లు యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రతినిధి డాక్టరు కె.శ్యాంకుమార్ పేర్కొన్నారు. విజేతలను కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టరు వనమా దొర నాగసాయినాథ్, ప్రధానాచార్యుడు కె.జగదీష్, పీడీ అన్నం శ్రీనివాసరావు అభినందించారు.

2 రాష్ట్రాలు.. 5 రోజుల రెక్కీ..

చరవాణుల చోరీ కేసులో నిందితుల పంథా

బిహార్ దొంగల అరెస్టు, కోర్టులో హాజరు



వివరాలు వెల్లడిస్తున్న క్రైం ఏడీసీపీ రాజారావు. పక్కన సీఐ అబ్దుల్ సలాం, సిబ్బంది

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : పటమటలోని ఎలక్ట్రానిక్ షోరూంలో రూ.18 లక్షల విలువైన చరవాణుల చోరీ కేసులో ఇద్దరు నిందితులను సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసి, విజయవాడ న్యాయస్థానంలో హాజరుపరిచారు. నయీం మియా, సూరజ్‌కుమార్ సహానిలను ఈ నెల 1న బిహార్ రాష్ట్రంలోని సీతామరి జిల్లా చాక్‌రాజిపట్టి వద్ద అరెస్టు చేశారు. ట్రాన్సిట్ వారెంట్‌పై ఇక్కడికి తీసుకువచ్చారు. వీరిని 4 ఏసీజేఎం కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి రిమాండ్ విధించారు. మిగిలిన నలుగురు నిందితులను త్వరలో పట్టుకుంటామని క్రైం ఏడీసీపీ ఎం.రాజారావు పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితులను గుర్తించామని బుధవారం ఆయన మీడియాకు వెల్లడించారు.

12 గంటల్లోనే నిందితుల గుర్తింపు

చోరీ జరిగిన ఎలక్ట్రానిక్ షోరూంలో సీసీ కెమెరాలు లేవు. దీంతో పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని జల్లెడ పట్టారు. నిందితులు ఎక్కిన ఆటోను గుర్తించి డ్రైవర్‌ను విచారించారు. రైల్వేస్టేషన్‌లో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కుతున్న ముఠా ఫొటోలు సేకరించారు. 12 గంటల వ్యవధిలోనే.. ఇది బిహారీ ముఠా పనిగా తేల్చారు. వారిని పట్టుకునేందుకు మూడు బృందాలను రంగంలోకి దించారు. విశాఖపట్నంలో టీసీతో మాట్లాడారు. స్లిప్ మీద రాసి.. సీట్లు కేటాయించటంతో నిందితుల వివరాలు తెలియలేదు. బొకారో ఎక్స్‌ప్రెస్ ఎక్కి మార్గమధ్యంలో ముగ్గురు నిందితులు దిగిపోయినట్లు గుర్తించారు. పోలీసులు చివరకు పట్నాకు చేరుకున్నారు.

తెలంగాణ, ఏపీల్లో చోరీలకు యత్నం

సేకరించిన ఫొటోలను ఒక బృందం న్యాట్‌గ్రిడ్‌కు పంపి.. నిందితుల వివరాలు తెలుసుకుంది. మరో బృందం.. సెల్ టవర్ డంప్‌ను విశ్లేషించి బిహారీ ముఠా కాల్స్ గుర్తించింది. ఈ ముఠా వరంగల్, ఖమ్మం, కృష్ణాజిల్లాలోని మచిలీపట్నంలో రెక్కీ చేసినట్లు తేల్చారు. ఎక్కడా వీలు కుదరకపోవడంతో విజయవాడకు వచ్చారు. జనవరి 16వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత పటమటలో చోరీ చేసి పారిపోయారు.

నేపాల్‌లో ప్రధాన సూత్రధారులు

బిహార్ ముఠాలోని గోవింద్ చౌదరి, రోమన్ కుమార్ యాదవ్ అలియాస్ ముస్కాన్ కన్నాలు సూత్రధారులు. జితేంద్ర సహాని, ఫిరోజ్ అన్సారీ, నయీం మియా, సూరజ్‌కుమార్ సహానిలతో కలిసి విజయవాడలో నేరం చేశారు. తర్వాత బిహార్‌లోని మోతిహారీకి చేరుకున్నారు. అక్కడి నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న నేపాల్‌కు వెళ్లి చరవాణులు అమ్మేశారు. నయీం మియా, సూరజ్‌కుమార్ సహానిలకు చెరో రూ.30వేలు ఇవ్వడంతో.. వీరిద్దరూ సొంత ఊరికి తిరిగి వచ్చేశారు. సీసీఎస్ పోలీసులు వారిని అరెస్టు చేసి నగరానికి తీసుకొచ్చారు.

అధికారులకు ప్రశంసలు

ఈ ముఠా గుట్టురట్టులో కీలకపాత్ర పోషించిన క్రైం డీసీపీ తిరుమలేశ్వర్‌రెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావు, ఏసీపీ సి.హెచ్.వెంకటేశ్వర్లు, సీఐ అబ్దుల్ సలాం, హెడ్ కానిస్టేబుళ్లు వి.రవికుమార్, ఎం.సురేష్, కానిస్టేబుళ్లు కె.శ్రీను, ఎ.లక్ష్మణరావు, ఎ.దుర్గాకుమార్‌లను సీపీ రాజశేఖరబాబు ప్రత్యేకంగా అభినందించారు. నేపాల్‌లో ఉన్న ముఠా కదలికలపైనా నిఘా ఉంచారు. వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని ఏడీసీపీ వెల్లడించారు.

సృజనాత్మకతతో కూడిన విద్య అవసరం



మాట్లాడుతున్న జయప్రకాశ్ నారాయణ

బెంజి సర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : బట్టీ విధానానికి స్వస్తి పలికి సృజనాత్మకతతో కూడిన విద్య నేటి సమాజానికి అవసరమని ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ అన్నారు. బెంజి సర్కిల్‌లోని ఓ హోటల్లో విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యావిధానంలో అవకతవకలు లేకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. పరీక్షలు నిజాయతీగా నిర్వహించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలని అన్నారు. విశ్వం ఎడ్యుటెక్ మేధాశక్తిని పెంచేందుకు ప్రత్యేక పరీక్ష నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు తులసీకృష్ణ మాట్లాడుతూ... ప్రస్తుత విద్యావిధానంలో పరీక్షల నిర్వహణ విధానంలో లోపాలు ఉన్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇండిపెండెంట్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌బాబు, విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్ అసోసియేషన్ ప్రతినిధి మోహన్‌రెడ్డి, మామిడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి బాలుడి దుర్మరణం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: వేడుకకు వచ్చిన ఓ బాలుడు చెరువులో పడి దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. గన్నవరం మండలం చిన్నఅవుటపల్లికి చెందిన కాండ్రు హనీష్(7) మండలంలోని బూతిమిల్లిపాడులో ఓ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ నిమిత్తమై తల్లిదండ్రులతో కలిసి బంధువుల ఇంటికి వచ్చాడు. వరుసకు సోదరుడైన ఆగిరిపల్లికి చెందిన మరో బాలుడు నున్నం లూక్‌తో హనీష్ ఆడుకుంటున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు ఇద్దరూ జారి చెరువులో పడిపోయారు. గమనించిన స్థానికులు ఇద్దరినీ బయటకు తీశారు. అప్పటికే హనీష్ మృతి చెందాడు. మరో ఆరేళ్ల బాలుడు లూక్ గన్నవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలుడి పరిస్థితి నిలకడగా ఉందని బంధువులు తెలిపారు. హనీష్ తండ్రి విజయవాడలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తుండగా.. తల్లి గృహిణి. వేడుకకు వచ్చి.. కుమారుడు విగత జీవిగా మారడాన్ని చూసిన తల్లిదండ్రుల రోదన చూపరులను కంటతడి పెట్టించింది.

సీఎం సమావేశానికి సాగునీటి సంఘాల సమాయత్తం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు తదితరులతో సీఎం చంద్రబాబు ఈనెల 5వ తేదీ మధ్యాహ్నం అమరావతి హైకోర్టు సమీపంలోని పరేడ్ గ్రౌండులో భేటీ కానున్నారు. ఈక్రమంలో ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులు అమరావతికి తరలి వెళ్లడానికి సమాయత్తం అవుతున్నారు. 5న ఉదయం 11.30 గంటల కల్లా సభా ప్రాంగణానికి చేరుకోవాలని ఏపీ సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు సూచించారు. పార్లమెంటు వారీగా రిజిస్ట్రేషన్ ఉంటుందని, అంతా తరలిరావాలని పిలుపునిచ్చారు.

జినేష్, శిబుల బెయిల్ పిటిషన్లపై ముగిసిన వాదనలు

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో ఇద్దరు నిందితులు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై వాదనలు పూర్తయ్యాయి. తమకు బెయిల్ మంజూరు చేయాలని జినేష్ (ఏ24), శిబు (ఏ25) పిటిషన్లు దాఖలు చేసుకున్నారు. ఇవి బుధవారం విజయవాడ ఎక్సైజ్ కోర్టులో విచారణకు వచ్చాయి. పిటిషన్లపై ఇరుపక్షాల వాదనలు జరిగాయి. అనంతరం తీర్పు నిమిత్తం ఈనెల 11కు న్యాయాధికారి వాయిదా వేశారు.

వసుంధర

vasundhara@eenadu.in

శోధిత

వారాంతంలో హాయిగా నిద్రపోండి!



పిల్లల పెరుగుదలలో కౌమారదశ అత్యంత కీలకం. హార్మోన్లలో మార్పులు, స్కూలు ముగించుకుని కాలేజీలోకి అడుగు పెట్టడం... వంటి కారణాలతో వీళ్లలో ఒకలాంటి గందరగోళం నెలకొంటుంది. ఒక్కసారిగా పెద్దవాళ్లమైపోయినట్లు ఫీలవుతారు. చదువుతో పాటు సామాజిక కార్యకలాపాలూ ఎక్కువవుతాయి. ఆ వయసులో జీవగడియారం కూడా మారడంతో నిద్ర వేళలూ మారతాయి. ఆలస్యంగా పడుకుని లేవడం చేస్తుంటారు. ఇవన్నీ కలిసి వీళ్లని డిప్రెషన్‌కి గురిచేస్తున్నాయట. ముఖ్యంగా అమ్మాయిలు సోషల్‌మీడియా, రీల్స్‌తో అతిగా సమయం గడుపుతోంటే వాళ్లలో ఈ సమస్యలు ఇంకా అధికంగా ఉంటున్నాయట. అందుకే టీనేజర్లు వారాంతంలో నిద్రపోవడానికి ఎక్కువ సమయం కేటాయించాలి అంటున్నారు ఆరెగాన్, న్యూయార్క్ అప్‌స్టేట్ మెడికల్ యూనివర్సిటీ నిపుణులు. 16-24 ఏళ్లలోపు యువతీ యువకుల్ని పరిశీలించగా ఇలా వీకెండ్స్‌లో ఎక్కువగా నిద్రపోయేవాళ్లలో డిప్రెషన్ లక్షణాలు సగానికి సగం తక్కువగా కనిపించాయట. అంతేకాదు, కౌమారదశలో ఉన్నవాళ్లు రోజూ కనీసం ఎనిమిది నుంచి పది గంటలు నిద్రపోతే ఎలాంటి మానసిక సమస్యలూ లేకుండా ఉన్నట్లు గుర్తించారు. కాబట్టి, ఈ విషయమై తల్లితండ్రులే వాళ్ల నిద్రవేళల గురించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు!

'మనం'గా మారితేనే!



సంసార బంధంలో సమస్యలు సాధారణమే. అలాగని ఒక్కటిగా నడవాల్సిన చోట... ఎవరికివారు తామే గొప్ప అన్నట్లు వ్యవహరిస్తే ఆ బంధం ప్రమాదంలో పడుతుంది. మరేం చేయాలి?

పక్కదోవ పట్టనివ్వొద్దు...

గొడవ జరిగినప్పుడు సమస్య ఏదో దాని గురించి మాత్రం మాట్లాడితే సరిపోతుంది. అలాకాకుండా అనవసరంగా అరవడం, ఎప్పటి విషయాలో తెచ్చి నిందించడం మొదలు పెడితే అది పక్కదారి పడుతుంది. దీంతో అది మరింత ముదిరిపోయే ప్రమాదం ఉంది. అందుకే, వాదన మొదలైతే... ఇద్దరిలో ఒక్కరైనా కోపాన్ని నిగ్రహించుకోగలగాలి. అలాకాకుండా రెట్టించుకుంటే... ఇంటి వాతావరణమే మారిపోతుంది. అది మానసికంగా మిగతావారిపై ఒత్తిడినీ పెంచుతుంది. ఏదైనా భేదాభిప్రాయం వస్తే కొంతసేపు నిశ్శబ్దంగా ఉండి, అక్కడి నుంచి బాల్కనీ లేదా తోటలో పది నిమిషాలపాటు నడవడం నేర్చుకోవాలి. మనసు కుదుటపడిన తరువాతే లోపలికి అడుగుపెట్టాలి. ఆ తరువాత ఇద్దరూ కూర్చుని మాట్లాడుకుంటే అసలు సమస్యకు కారణమేంటో తెలుస్తుంది.

దూరంగా వెళ్లండి...

ఒక ఇంట్లోనే కలిసున్నా... అన్నీ మనకు నచ్చినట్లే జరగాలనుకోవడం పొరపాటు. ఎవరు పెరిగిన వాతావరణాన్ని బట్టి వారి అలవాట్లు ఉంటాయి. వాటిని ఇద్దరూ గౌరవించాలి, సర్దుకుపోవాలి. అలాకాకుండా మీరు చెప్పినట్లు చేయడం లేదని నీకు మీ ఇంట్లో వాళ్లు ఇంతే నేర్పారా? ఒక్కపనీ రాదా? అంటూ చిన్న చిన్న పనులకు కూడా... అరవడం, కోప్పడటం, నలుగురిలోనూ నిందించడం కూడదు. బదులుగా... ఆ పనిని ఇలా చేస్తే బాగుంటుంది... నాకు నచ్చుతుంది అని చెప్పి చూడండి. అర్థం చేసుకుంటారు.

ఆరోపించొద్దు...

ఏదైనా సమస్య ఎదురైనప్పుడు దంపతుల్లో ఎవరో ఒకరు ఇదంతా నీవల్లే ఇలా జరిగిందంటూ ఇతరులపై నెపం వేస్తారు. మరికొందరైతే నేను మాత్రమే ఇంటిని సరైన రీతిలో నడిపిస్తున్నా అని చెబుతారు. ఇలా అన్నింటికీ నేను అని అంటుంటే ఆ అనుబంధం బలంగా ఉండదు. ఇద్దరూ తలో బాధ్యతనూ పంచుకుంటూ... ఇంటిని నడిపించాలి. ఇద్దరూ కలిస్తేనే కుటుంబం అనే విషయాన్ని గ్రహించి ఒకరికొకరు తోడుగా నిలిస్తే ఆ సంసారం సంతోషంగా సాగుతుంది

పరేడ్‌ను సవాలుగా స్వీకరించా!



సుస్మిత

రైతు కుటుంబంలో పుట్టారు... సాగు నష్టాల్నీ, అమ్మానాన్నల కష్టాన్నీ చూస్తూ పెరిగారు... చదువే తలరాతల్ని మార్చగలదనీ, ప్రజాసేవకు ప్రభుత్వోద్యోగం అవసరమనీ నాన్న చెప్పిన మాటల్ని బలంగా నమ్మారు. సోదరితో కలిసి సివిల్స్ ప్రయత్నాలు చేసి ఒకరి తర్వాత మరొకరు లక్ష్యాన్ని చేరుకున్నారు. ఇది ఐపీఎస్ సుస్మిత రామనాథన్ కథ. ఇటీవల అమరావతిలో తొలిసారి నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పోలీస్ పరేడ్‌కు సారథ్యం వహించారీ యువ పోలీస్ అధికారిణి. జంగారెడ్డిగూడెం ఏఎస్పీగా పనిచేస్తోన్న ఆమెతో వసుంధర మాట్లాడింది.

మాది తమిళనాడులోని కడలూరు జిల్లా. నాన్నది వ్యవసాయం. అమ్మ విద్యాశాఖలో చిరుద్యోగి. అమ్మానాన్నలకు మేం ముగ్గురు సంతానం. చెల్లి 2020లో ఐఏఎస్ సాధించి తూత్తుకుడి జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా పనిచేస్తోంది. తమ్ముడు సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. మా బాల్యంలో సునామీ వల్ల జరిగిన విధ్వంసాన్ని చూశాం. ఆ సమయంలో కలెక్టర్లూ, ఎస్పీలూ... మా ప్రాంతానికి వచ్చి చేపట్టిన రక్షణ, పునరావాస చర్యలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ప్రజలు వారికిస్తోన్న గౌరవం, అధికారుల హుందాతనం చూసి మేమూ అలాంటి హోదాలో ఉద్యోగాలు చేయాలనుకున్నాం. నాన్న కూడా చదువే తలరాతల్ని మారుస్తుందని చెప్పేవారు. ఇవన్నీ మాపై ప్రభావం చూపించాయి. దీంతో పాటు చెన్నైలోని అన్నా యూనివర్సిటీలో అగ్రికల్చర్ అండ్ ఇరిగేషన్‌లో బీఈ చేశా. కళాశాలలో జరిగిన స్పోర్ట్స్ డే, యాన్యువల్ డేలతో పాటు ప్రత్యేక కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా జిల్లా ఎస్పీలు, కలెక్టర్లు వచ్చేవారు. అలా నా కోరిక మరింత బలంగా మారింది.

అంత సులువేం కాదు...

సివిల్స్‌కు సిద్ధం కావడం అంత తేలికైన విషయం కాదు. అయిదుసార్లు విఫలమయ్యా, దీంతో నేను సాధించగలనా అనే ఒత్తిడి నాలో క్రమేపీ పెరిగింది. కానీ అమ్మానాన్నలు, చెల్లి ఇచ్చిన ప్రోత్సాహమే నన్ను ముందుకు నడిపించింది. ఆరో ప్రయత్నంలో ఐపీఎస్ సాధించా. ట్రైనింగ్ పూర్తయ్యాక కాకినాడలో శిక్షణ ఏఎస్పీగా, తరవాత గ్రేహౌండ్స్‌లో అసాల్ట్ కమాండర్‌గా చేరా. అక్కడ నుంచి గతేడాది నవంబర్‌లో జంగారెడ్డిగూడెం ఏఎస్పీగా మొదటి పోస్టింగ్ ఇచ్చారు. ఏజెన్సీ, మెట్ట మండలాలకు జంగారెడ్డిగూడెం ప్రధాన పట్టణం. అయితే, ఇక్కడి ప్రజలకి అంతగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేదు. దీంతో వీరికి అవగాహన కల్పించాలని శిరస్త్రాణం ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపే వారిని గుర్తించాం. వారికి జరిమానాలు విధించకుండా వారితోనే హెల్మెట్ కొనుగోలు చేయించి నియమం పాటించేలా చర్యలు తీసుకున్నా. నంబర్ ప్లేట్ల మార్పు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన వంటివాటిని చూసీ చూడనట్లు వదిలేయడమో, జరిమానాలు విధించడమో చేయడం లేదు. వారిలో సత్ప్రవర్తన తీసుకువచ్చేలా కృషి చేస్తున్నా. ప్రస్తుతం ఇవి మంచి ఫలితాలు ఇస్తున్నాయి. అలాగే చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, పడుతున్న ఇబ్బందులపై పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు కౌన్సెలింగ్ సైతం ఇస్తున్నా.

ఎప్పటికీ మరిచిపోను...

గణతంత్ర వేడుకల్లో పోలీస్ పరేడ్ కమాండర్‌గా నడవడం ఓ సవాలుగా భావించా. ఉత్తమ ప్రతిభతో కవాతు పూర్తిచేయడంతో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ప్రత్యేకంగా అభినందించారు. ఇది నా జీవితంలో మరచిపోలేని విషయం. చదువుకుంటే మహిళలు సాధించలేనిది ఏదీ లేదని నిరూపించేందుకు ఇది ఓ నిదర్శనం. అలాగే వృత్తిలో ఎదురయ్యే సవాళ్లను ఎలా అధిగమించాలో నా భర్త విబూ కృష్ణ నుంచి నేర్చుకున్నా. ఆయన 2021 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వారే. ప్రస్తుతం ఆయన ప్రొద్దుటూరు ఏఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. కిరణ్‌బేడీ అంటే చాలా ఇష్టం. విధి నిర్వహణలో ఆమె చూపిన తెగువ, కర్తవ్య నిర్వహణ నాకు స్ఫూర్తి.

– నండూరి కిషోర్‌బాబు, జంగారెడ్డిగూడెం

అలాంటి భారత్‌ని చూడాలని



మృదు గుప్తా

సర్వైకల్ క్యాన్సర్ ముక్త్ భారత్... లక్ష్యంగా పనిచేస్తోంది క్యాపెడ్(క్యాన్సర్ అవేర్‌నెస్, ప్రివెన్షన్ అండ్ ఎర్లీ డిటెక్షన్) సంస్థ. హరియాణాలోని గురుగ్రామ్ కేంద్రంగా పనిచేసే ఈ సంస్థ దేశవ్యాప్తంగా తన సేవల్ని విస్తరించింది. 'క్యాన్సర్ నివారణలో సరైన సమాచారం తెలుసుకోవడం మొదటి అడుగు' అంటారీ సంస్థ సీఈఓ మృదు గుప్తా. ఈమె తల్లి ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో మరణించాక ఈ విభాగంలో పనిచేయాలనుకున్నారు మృదు. భారత్‌లో ఎక్కువగా సర్వైకల్ క్యాన్సర్ మరణాలు ఉండటంతో అటుగా అడుగులు వేశారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో గ్రామ స్థాయిలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తుందీ సంస్థ. సర్వైకల్ క్యాన్సర్‌తోపాటు నోటి, రొమ్ము క్యాన్సర్‌లకూ స్క్రీనింగ్ చేస్తారు. కొన్నిచోట్ల బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్లను వేయిస్తున్నారు. 'ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించినట్లు 90 శాతం బాలికలకు వ్యాక్సిన్లు వేయడం, 35-65 ఏళ్ల మధ్యవాళ్లలో 70 శాతం స్క్రీనింగ్ చేసుకోవడం, క్యాన్సర్ లక్షణాలను గుర్తించినవాళ్లకు తక్షణమే చికిత్స అందించడంద్వారా ఒక్కతరంలోనే సర్వైకల్ క్యాన్సర్‌ను అంతం చేయొచ్చు' అంటారు మృదు.

తింటున్నా... ఆకలంటున్నాడు!

మా బాబుకి 12ఏళ్లు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలా తింటున్నా ఇంకా ఆకలి వేస్తోంది అంటున్నాడు. ఇదేమైనా సమస్యా? తన ఆకలి తగ్గించేందుకు ఎలాంటి డైట్ పాటించాలి? – సుధ

డియర్ వసుంధర



డాక్టర్ లతాశశి
పోషకాహార నిపుణులు

పిల్లలకి ఈ వయసులో కౌమారదశ ప్రారంభం అవుతుంది, కాబట్టి వాళ్ల శరీరంలో చాలా మార్పులు జరుగుతాయి. అంతేకాదు ఇది ఎదిగే వయసు కూడా. కాబట్టి శరీరానికి తగినంత పోషకాహారంతోపాటు కెలోరీలూ కావాల్సి ఉంటుంది. దాంతో ఆకలి ఎక్కువ వేయడం సహజమే. కాబట్టి తనకి రోజూ సమతులాహారం అందించాలి. అల్పాహారం, లంచ్, డిన్నర్‌కి మధ్యలో రెండుసార్లు స్నాక్స్ పెట్టాలి. ఆహారంలో ప్రొటీన్ తప్పక ఉండాలి. ఉదయం అల్పాహారంతోపాటు అదనంగా గుడ్డూ, పాలు చేర్చాలి. ఉదయం స్కూల్‌కి పండ్లు లేదా పెరుగులో నట్స్, ఫ్రూట్స్ కలిపి చిరుతిండిగా పెట్టొచ్చు. ఇక మధ్యాహ్న భోజనంలో పప్పు, కాయగూరలతో కిచిడి, మిక్స్‌డ్ వెజిటబుల్ రైస్ చేసి పెడితే తనకి కడుపు నిండుతుంది. అలానే తన భోజనంలో పెరుగు తప్పక ఉండేలా చూడాలి. శనగలు, పెసలు, రాజ్మా, బొబ్బర్లను కూరలా చేసి పెట్టొచ్చు. లేదా చాట్‌లా చేసి సాయంత్రం చిరుతిండిగానూ ఇవ్వొచ్చు. వీటితోపాటు ఉడికించిన కాయగూరలతో చపాతీ రోల్ చేసి ఇచ్చినా మంచిదే. డిన్నర్‌లో అన్నం, కూర సమపరిమాణంలో తినాలి. వీటితోపాటు ప్రొటీన్ కోసం... పనీర్, చేప, చికెన్... వంటి వాటిలో ఒకదాన్ని రాత్రి భోజనంలో తప్పక తినిపించాలి. అలాగే రోజూ పాలు, పాల పదార్థాలు 150-200మి.లీ.కు తక్కువ కాకుండా చూసుకోవాలి. వీటితోపాటు ఉప్పు, పంచదార ఎక్కువున్న ఆహారం బేకరీ ఉత్పత్తులు తగ్గించి తింటే మేలు. ఈ వయసులో శరీరంలో వీటి మోతాదులు పెరిగితే ఒక్కసారిగా బరువు పెరిగే ఆస్కారం ఉంది.

తొలి మహిళ

భయపడిన చోటే... ఎదిగారు!



రుక్మిణి

ఉద్యోగంలో చేరి అప్పటికి కొన్ని రోజులే! భార్యను కిరోసిన్ పోసి చంపిన కేసు ఒకటి **రుక్మిణి కృష్ణమూర్తి** వద్దకు వచ్చింది. మృతదేహాన్ని చూసి భయపడ్డారామె. రెండు వారాలు నిద్రనే ఎరుగరు. ఆమెనలా చూసిన పై అధికారి 'ఇలాగైతే నువ్విక్కడ పని చేయలేవు. ఇంతకన్నా దారుణమైన కేసులు మన దగ్గరికి వస్తాయి' అన్నారట. అప్పుడు భయాన్ని పక్కనపెట్టి, పనిని సవాలుగా చూడటం మొదలుపెట్టారు. దేశంలో తొలి మహిళా ఫోరెన్సిక్ శాస్త్రవేత్త ఆమె. నిజానికి ప్రభుత్వ లెక్చరర్, ఆర్‌బీఐలో క్లర్క్, ఫోరెన్సిక్ సైన్స్ లెబొరేటరీలో సైంటిస్ట్... మూడు అవకాశాలు వస్తే, సమాజానికి ఉపయోగపడే పనిచేయాలి అనుకున్న ఆమె ఫోరెన్సిక్ సైంటిస్ట్ ఉద్యోగాన్ని ఎంచుకున్నారు. తొలిరోజు చీరకట్టు, ఎర్రబొట్టుతో వచ్చిన రుక్మిణిని చూసి సహోద్యోగులు గేలి చేశారు. ఇది చాలదన్నట్టు భయపెట్టే కేసు. పారిపోతారనే అనుకున్నారంతా. కానీ ఆమె ధైర్యాన్ని తెచ్చుకున్నారు. ఆపై హై ప్రొఫైల్ కేసులెన్నింటికో ఆధారాలు కనిపెట్టి, అవి పూర్తవ్వడంలో సాయం చేశారు. ఒక్కో మెట్టూ ఎదుగుతూ మహారాష్ట్రలోని డైరెక్టరేట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్ లెబొరేటరీస్‌కి డైరెక్టర్‌గానూ మారారు. డీఎన్ఏ అనాలిసిస్, సైబర్ ఫోరెన్సిక్స్, స్పీచ్ ఐడెంటిఫికేషన్, నార్కో అనాలిసిస్ వంటి ఎన్నో అదనపు సేవలను చేర్చారు. ప్రస్తుతం ఆమెకు 74 ఏళ్లు. పదవీ విరమణా పొందారు. ఇప్పటికీ కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడంలో బిజీగా గడిపేస్తున్నారామె. 'హెలిక్ అడ్వైజరీ' అనే సంస్థను ప్రారంభించి... ఎకనామిక్, డిజిటల్, ఇతర నేరాలకు ఆధారాలు అందించడంలో పోలీసులకు సాయపడుతున్నారీ 'మిసెస్ ఫింగర్ ప్రింట్స్'.

ఆ పుస్తకాలు చదివారా?



'కొత్త ఆలోచనలు రావట్లేదు'... కెరియర్‌లో మనకే చాలాసార్లు ఇలా అనిపిస్తుంది. లేదా ఏదో రోజు బాస్ నుంచి 'మీ నుంచి ప్రొడక్టివిటీ తగ్గింది' అన్న కామెంట్ రావొచ్చు. ఇలాంటప్పుడు మనసుకి కాస్త ప్రశాంతత కావాలి అనిపిస్తుంది. రోజులో కొత్త మార్పు జరగాలనీ ఆశిస్తాం. అవి పర్యటనలతోనే సాధ్యమనీ భావిస్తాం. కానీ... బడ్జెట్, సెలవులు, పిల్లల స్కూళ్లు... మనల్ని అడుగు కదలనీయకుండా చేసే కారణాలెన్నో? అలాగని ఊరకే కూర్చోవడానికీ లేదు. అలాంటప్పుడు ఓ పుస్తకం చేతిలోకి తీసుకోండి... కొత్త ఆలోచనలెన్నో పుట్టుకొస్తాయి.

అయితే చిన్నమాట! పెద్ద వాళ్ల సాహిత్యం, నవలలు, కథలు కాదు... పిల్లల పుస్తకాలు ఎంచుకోండి. చిట్టి చిట్టి కథలు... కానీ బోధించే నీతి మాత్రం చాలా ఎక్కువ. చదువుతుంటే చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తొస్తాయి. ఎవరో వచ్చి తలమీద మెత్తగా తట్టినట్టు ఆత్మీయతను మోసుకొస్తాయి. దీంతో మనసులోని భారమంతా బయటకు పోయి విశ్రాంతి పొందుతాం. చెట్లు, జంతువులు, రాళ్లు... ప్రతిదీ మాట్లాడుతుంటాయా కథల్లో. అవి కేవలం పిల్లల్లోనే సృజనాత్మకతను తట్టి లేపవు. మన ఊహాశక్తినీ పరుగులు పెట్టిస్తాయి. స్నేహం, దయ, ధైర్యం గురించి చెబుతూ... మనం మరిచిపోయిన కనీస విలువలను మనకు తిరిగి గుర్తుచేస్తాయి. పైగా చిన్ని చిన్ని పుస్తకాలు... ఇలా తెరవగానే అయిపోతాయి. దీంతో ఏకాగ్రత తప్పుతామన్న భయమూ ఉండదు. దుఃఖం, సంతోషం, భయం... చిన్న చిన్న విషయాలే తిరిగి నేర్పుతాయి. మునుపటి కన్నా బలమైన ముద్ర వేస్తాయి. అంతేనా, పిల్లల కోణం నుంచి ప్రపంచం చూస్తాం కదా! అది మరింత కొత్తగా తోస్తుంది. సహనం, అర్థం చేసుకునే తత్వం, భావోద్వేగాలను గమనించడం వంటి ఎన్నో అంశాలు స్ఫురణకు వస్తాయి. కాబట్టి, పరుగులా సాగుతున్న జీవితం కాస్త నెమ్మదించాలన్నా... ఆలోచనల భారం తగ్గి తేలికపడాలన్నా పుస్తకం తీసుకోండి. అదీ పిల్లల పుస్తకం సుమీ! తిరిగి మీకు మీరు కొత్తగా పరిచయం అవుతారు... కావాలంటే ప్రయత్నించి చూడండి.

వ్యవసాయం... నీ వల్ల కాదన్నారు..!



కావ్య

అనారోగ్యాలు వచ్చాక చికిత్స తీసుకోవడం కంటే... వ్యాధులు రాకుండా నివారించడమే మంచిది అంటారు కావ్య ధోబలే. ఇందుకు ప్రధాన కారణం కలుషిత ఆహారం తినడమే అని గుర్తించి దాన్ని నివారించడానికి సేంద్రియ సాగులోకి అడుగుపెట్టారు. ఇందుకోసం ప్రభుత్వోద్యోగాన్ని సైతం వదులుకున్నారు.

నలుగురికీ సహాయపడాలనే మనస్తత్వం కావ్యది. ఈ క్రమంలోనే ఆరోగ్య రంగంలోకి రావాలనుకున్నారామె. దాంతో ముంబయిలోని 'లోకమాన్య తిలక్ మున్సిపల్ మెడికల్ కాలేజీ' నుంచి నర్సింగ్‌లో డిప్లొమా చేశారీమె. చదువయ్యాక అదే కాలేజీలో ట్యూటర్‌గానూ పనిచేశారు. టాటా ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేసే అవకాశమూ వచ్చింది. 2019లో నర్సుగా ప్రభుత్వోద్యోగం సంపాదించారు. అదే సమయంలో కొవిడ్ విజృంభించడంతో ఎంతో మంది కొవిడ్ బాధితులకు సేవలందించి కరోనా వారియర్‌గానూ పేరు తెచ్చుకున్నారు కావ్య. 'ఆ సమయంలోనే నాకూ వైరస్ సోకింది. దాదాపు మరణపు అంచుల వరకూ వెళ్లొచ్చా. అప్పుడే జీవితం ఎంత విలువైందో తెలిసింది. నిజానికి మన రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటం వల్ల వైరస్ బారిన పడ్డాం. మార్కెట్లో దొరికే పండ్ల దగ్గర నుంచి కాయగూరల వరకూ ప్రతిదీ రసాయన ఎరువులతో పండినవే. అవి మన ఇమ్యూనిటీపై దాడి చేయడంతో... రోగనిరోధక శక్తి బలహీనం అవుతుంది. అందుకే సేంద్రియ ఎరువుల తయారీ మొదలుపెట్టా. దీనికోసం కష్టపడి తెచ్చుకున్న ప్రభుత్వ ఉద్యోగాన్నీ వదిలేశా'నంటారు కావ్య.

ఉద్యోగం వదలొద్దన్నారు...

'మంచి జీతం. ప్రభుత్వ ఉద్యోగం. మానేస్తానంటే ఇంట్లో ఒప్పుకోలేదు. 'వర్మీ కంపోస్ట్ తయారీకి ముంబయి నుంచి పుణెలోని దత్‌కిల్‌వాడీ గ్రామం వచ్చా. అక్కడ మా భూమిలో దీన్ని మొదలుపెట్టా. మా కుటుంబంతో సహా ఇరుగుపొరుగు వాళ్లు ఇది నీ వల్ల కాదంటూ నిరాశపరిచారు. ఆ సమయంలో మావారే నన్ను ప్రోత్సహించారు. రూ.5లక్షల పెట్టుబడితో చిన్న షెడ్డులో తక్కువ మొత్తంలో మొదలుపెట్టా. ఆవుపేడ, వానపాములు, పంట, కాయగూరల వ్యర్థాలతో సేంద్రియ ఎరువుని తయారుచేశా. అంతేకాదు, వర్మీ కంపోస్ట్ ఉపయోగించడం వల్ల కలిగే లాభాలను స్థానిక రైతులకి వివరించా. మొదట్లో కాస్త ఇబ్బంది పడ్డా క్రమంగా మంచి స్పందన వచ్చింది. దాంతో మా ఉత్పత్తి పెరిగింది. ప్రస్తుతం మహారాష్ట్రతోపాటు పలు రాష్ట్రాల్లో ఎరువుల్ని విక్రయిస్తూ సంవత్సరానికి రూ.30 లక్షలు సంపాదిస్తున్నా. మరోవైపు 'కృషి కావ్య ఆగ్రో వర్మీ కంపోస్ట్ ట్రైనింగ్ సెంటర్'ను ఏర్పాటుచేసి సేంద్రియ వ్యవసాయంపై స్థానిక రైతులకు అవగాహన కల్పిస్తున్నా'నంటారామె. మహారాష్ట్ర, కర్ణాటక, పశ్చిమబెంగాల్, గోవా వంటి ప్రాంతాల్లో మహిళా రైతులకు శిక్షణ తరగతులు, వర్క్‌షాపులు నిర్వహిస్తున్నారు. 'సేంద్రియ పంటలు భూమిని కలుషితం చేయవు. మనం నేలను కాపాడగలిగితే, అది మన ఆరోగ్యాన్ని సంరక్షిస్తుంది. అందుకే ప్రతి రైతూ సేంద్రియ వ్యవసాయం వైపు సాగాల'ని చెప్పే కావ్య ప్రయత్నానికి అనేక అవార్డులూ, రివార్డులూ అందుకున్నారు.





విరబూసే బెలూన్ పూల మొక్క

ఆహ్లాదకరమైన రంగులూ, చిత్రమైన ఆకారంలో అందంగా విచ్చుకుంటుందీ బెలూన్ ఫ్లవర్. మరి ఈ మొక్కని ఎలా పెంచుకోవాలో తెలుసా?

బెలూన్ పూల మొక్క... శాస్త్రీయ నామం ప్లాటికోడాన్ గ్రాండీఫ్లోరస్. ఇది కాంపానులేసియా కుటుంబానికి చెందినది. తక్కువ నిర్వహణతో పెంచుకోగలిగే బహువార్షిక మొక్క ఇది. దీనికి బుడగల్లాంటి మొగ్గలు, నక్షత్ర ఆకారంలో పూలు పూస్తాయి. ఇవి నీలం, గులాబీ, తెలుపు రంగుల్లో వికసిస్తాయి. మొగ్గలు వచ్చే తీరుని బట్టే దీనికి బెలూన్ పూల మొక్కగా పేరొచ్చింది. తూర్పు ఆసియాలోని పలు దేశాల్లో విరివిగా కనిపిస్తుందీ మొక్క. ఆర్నమెంటల్ ప్లాంట్‌గా ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. కొరియాలో దీని వేరుని సలాడ్‌లు, టీలు, ఔషధాల్లో ఉపయోగిస్తారు.

సంరక్షణ సులువే...

బెలూన్ ఫ్లవర్ మొక్కని పెంచడం సులువే. ఒక్కసారి నాటుకుంటే చాలా ఏళ్లపాటు నిలదొక్కుకుంటుంది. పూర్తి ఎండలో... అంటే కనీసం ఆరేడు గంటలైనా దీనికి ప్రత్యక్ష సూర్యకాంతి అందేలా చూసుకోవాలి. నేలలోనే కాదు... కుండీల్లోనూ సులువుగా పెంచుకోవచ్చు. అయితే, తరచూ మార్చడం, మొదలు చుట్టూ తవ్వడం వంటివి చేస్తే బతకదు. అందుకే, దీన్ని నాటేందుకు పెద్ద కుండీని ఎంచుకోవాలి. నీరు నిలవని సారవంతమైన మట్టిలో నాటుకోవాలి.

బెలూన్ ఫ్లవర్ ప్లాంట్‌కి నీళ్లు క్రమం తప్పకుండా పోయాలి. కానీ, అవి ఎక్కువగా నిలవకుండా చూసుకోవాలి. లేదంటే ఫంగల్ వ్యాధులు సోకి మొక్క ఎదుగుదల దెబ్బతింటుంది. ఇక, దీనికి పూలు ఎక్కువగా పూయాలంటే... నెమ్మదిగా విడుదల అయ్యే బ్యాలెన్స్‌డ్ ఫెర్టిలైజర్‌ని అందించాలి. ముఖ్యంగా నీళ్లలో కరిగే ఎన్‌పీకే సమగ్ర ఎరువును 10:10:10 నిష్పత్తిలో ఇవ్వాలి. ఈ పూల మొక్కకు పేను బంక, సాలీడు, బూడిద తెగుళ్లు వస్తుంటాయి. అందుకే, ఎక్కువ తడి లేకుండా చూసుకోవడం, వేపనూనెను స్ప్రే చేయడం వంటి పనుల వల్ల అవి నియంత్రణలో ఉంటాయి. ఈ బెలూన్ పూల మొక్కని పెంచాలంటే.. విత్తనాలు లేదా నారు నాటుకోవచ్చు. దీని చిగుళ్లు గిల్లితే గుబురుగా పెరుగుతుంది. పూలు వాడిపోయాక తీసేయాలి. అప్పుడే నిండుగా పూస్తాయి. ఈ మొక్క తేనెటీగలు, సీతాకోకచిలుకలను ఎక్కువగా ఆకర్షించి... పెంచుకునే ప్రదేశానికి కొత్తందాన్ని తెచ్చిపెడుతుంది.

చదువుపై తపనతో.. గిరిజన బాలిక సాహసం



పశ్చిమబెంగాల్‌లోని జల్పాయిగురి జిల్లాలో గల బుధరామ్ బన్‌బస్తి ఓ మారుమూల గిరిజన కుగ్రామం. టౌనుకు వెళ్లాలంటే మార్గ మధ్యంలో ఏనుగులు, అడవి దున్నలు, ఖడ్గ మృగాల వంటి వన్యప్రాణులు సంచరించే అత్యంత ప్రమాదకరమైన అడవిని దాటాలి. గ్రామంలో వ్యవసాయం ఆధారంగా జీవనం సాగిస్తున్న మంచల్ ఒరాన్, రూపాలి దంపతులు పెద్దగా చదువుకోలేదు. వీరి కుమార్తె సుమిలా (15). తమ బిడ్డనైనా ఉన్నత చదువులు చదివించి ప్రయోజకురాలిని చేయాలని తల్లిదండ్రులు భావించారు. అమ్మానాన్నల ఆశయానికి తగ్గట్టుగా సుమిలా నిత్యం 7 కి.మీ. అటు.. 7 కి.మీ. ఇటూ అటవీమార్గంలో సైకిలుపై ప్రయాణిస్తూ శ్రద్ధగా పాఠశాలకు వెళుతూ వచ్చింది. ఇప్పుడు పదో తరగతి పరీక్షలు రాస్తోంది. కూలి పనులతో జీవనం సాగిస్తున్నవారు ఎక్కువగా ఉన్న ఆ గ్రామంలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న మొదటి విద్యార్థి సుమిలానే కావడం విశేషం.

సంప్రదాయ ఆహారం, జీవనశైలి @ 126

పంజాబ్‌లోని తరన్ తారన్ జిల్లాకు చెందిన బుర్‌సింగ్ తన కుటుంబంలోని ఆరు తరాలను చూశారు. 126 ఏళ్ల వయసులోనూ ఎలాంటి రుగ్మతలు లేకుండా ఆరోగ్యంగా ఉన్నారు. లాహోర్ జైలులో ఉన్న స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్‌ను తన పెద్దన్న ద్వారా కలిశానని అంటున్న బుర్‌సింగ్ 1947 నాటి దేశ విభజన సంగతులను ఇప్పటికీ చక్కగా విడమరచి చెబుతున్నారు. "ఉదయాన్నే నిద్రలేచి పంజిరి (గోధుమ, దేశీ నెయ్యి, ఎండుఫలాల మిశ్రమం), పాలు తీసుకుంటా. నువ్వులు తింటా. చాలాకాలం పింక్ టీ తాగా. ఇప్పుడు బ్లాక్ టీ తీసుకొంటున్నా" అంటూ తన ఆహార అలవాట్లను వివరించిన బుర్‌సింగ్ స్నేహితులు అందరినీ కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. "ఇప్పటికీ ఆయన కళ్లద్దాలు వాడరు. మందులు తీసుకోరు. పళ్లు కూడా దృఢంగా ఉన్నాయి". అని బుర్‌సింగ్ సమీప బంధువు దర్బారా సింగ్ తెలిపారు.





బుర్‌సింగ్ ఆధార్ కార్డు ప్రకారం ఆయన వయసు 118. ఇందులో పుట్టిన తేదీ 1908 జనవరి 1గా ఉంది. అయితే.. తాను 1900లో జన్మించానని, ఆధార్ కార్డులో తప్పుగా నమోదైందని బుర్‌సింగ్ అంటున్నారు.



మీరు నవ్వినట్లు ఎప్పుడూ చూడలేదు

మహిళా జర్నలిస్ట్‌పై ట్రంప్ ఆగ్రహం

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా అధ్యక్ష భవనంలోని ఓవల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీఎన్ఎన్ ఛానల్‌కు చెందిన ఓ మహిళా రిపోర్టర్‌పై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణంలో కొత్తగా విడుదలైన పత్రాల గురించి కైట్లాన్ కొలిన్స్ అనే రిపోర్టర్ ట్రంప్‌ను ప్రశ్నించారు. దీంతో ఆగ్రహించిన ట్రంప్ 'నువ్వో చెత్త రిపోర్టర్‌వి' అంటూ ఆమెను విమర్శించారు. "నేను పదేళ్లుగా మిమ్మల్ని చూస్తున్నాను. ఇప్పటివరకు ఒక్కసారి కూడా నవ్వినట్లు చూడలేదు. మీలాంటి వాళ్ల వల్లే సీఎన్ఎన్ ఛానల్ రేటింగ్ పడిపోతోంది. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో నాతో సహా ఇతరుల పేర్లను కుట్రపూరితంగా విడుదల చేశారు. ఇప్పుడు ఇటువంటి విషయాల గురించి కాకుండా దేశం గురించి ఆలోచిస్తే అందరికీ మంచిది" అని ట్రంప్ రిపోర్టర్‌ని ఉద్దేశించి అన్నారు.



మిమ్మల్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దేదే ఓటమి


కొన్నిసార్లు మీరు ఓడిపోయినంత మాత్రాన మీకు సామర్థ్యం లేదని కాదు. ఓటమి.. మీరు ఎక్కడ మెరుగుపడాలో చెప్పే సమాచారం. తప్పు ఎలా జరిగిందో తెలుసుకొని దాన్ని సరిదిద్దుకునేందుకు వచ్చిన ఓ అవకాశం. సరిగ్గా పనిచేస్తున్నారో లేదో గుర్తించి, కొత్త దారిని వెతుక్కునేలా ప్రోత్సహించే అంశం. మిమ్మల్ని నిరుత్సాహపరిచేందుకు కాదు మరింత మెరుగ్గా తీర్చిదిద్దేందుకు వచ్చిందే ఓటమి.

– లెవిస్ హోవెస్, రచయిత

మీరు ద్రోహి.. మీరు దేశ శత్రువు

- రాహుల్ X రవ్‌నీత్ సింగ్ బిట్టూ
- లోక్‌సభలో మాటల మంటలు

దిల్లీ: రైల్వేశాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూను 'ద్రోహి'గా లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ అభివర్ణించడం, దానికి బదులుగా ఆయన రాహుల్‌ను 'దేశానికి శత్రువు' (దేశ్ కే దుష్మన్) అని విరుచుకుపడటం బుధవారం లోక్‌సభలో వాతావరణాన్ని వేడెక్కించింది. సిక్కులందరినీ కించపరిచేలా రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని, ఆయనపై సభాపతి చర్యలు తీసుకోవాలని అధికారపక్షం డిమాండ్ చేసింది. ఇలాంటి వేర్వేరు అంశాలపై మాటల మంటల మధ్య చర్చలు చేపట్టకుండానే సభ గురువారానికి వాయిదా పడింది.



పార్లమెంటు వద్ద నరవణె పుస్తకంతో రాహుల్



పార్లమెంటు ఆవరణలో మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ

ఇలా మొదలైంది..

సస్పెండైన కాంగ్రెస్ ఎంపీలకు సంఘీభావంగా పార్లమెంటు మకరద్వారం వద్ద రాహుల్ నిలబడినప్పుడు బిట్టూ అటువైపు వచ్చారు. యుద్ధంలో విజయం సాధించినట్లు కూర్చొన్నారని ఎద్దేవా చేశారు. రాహుల్ స్పందిస్తూ.. 'ఒక వంచకుడు మన ముందునుంచి వెళ్తున్నారు. ఆయన మొహం చూడండి. ఎలా ఉందో!' అని అంటూనే ఆయనతో కరచాలనానికి చేయి ముందుకు చాపారు. 'హలో సోదరా! నా వంచక స్నేహితుడా!! మీరు మళ్లీ వెనక్కి (కాంగ్రెస్‌లోకి) వస్తారులే' అని వ్యంగ్యంగా అన్నారు. కరచాలనానికి మంత్రి నిరాకరిస్తూ రాహుల్‌ని వేలుతో చూపించి.. 'దేశ్ కే దుష్మన్' అని అన్నారు. మెట్లను దాటుకుంటూ ఆ వ్యాఖ్యను పునరుద్ఘాటించారు.

మీతో చేతులు కలపను

"పెడదారిపట్టిన తనయుడు మీరు. మీ తండ్రి (రాజీవ్‌గాంధీ) ప్రాణార్పణ చేయడంతో మీరు అతిపెద్ద దేశ భక్తులమని అనుకుంటారు. గాంధీ కుటుంబం రేపిన చిచ్చు వల్ల మా తాత బియాంత్‌సింగ్ (పంజాబ్ మాజీ సీఎం) ప్రాణత్యాగం చేయాల్సి వచ్చింది. స్వర్ణ దేవాలయంపై మీరు దాడి చేశారు. అనేకమంది పంజాబీలను చంపారు. మీరొక చక్రవర్తి అని, ఈ దేశం మీదని అనుకుంటున్నారా? మీలాంటి కుటుంబంతో ఈ సర్దార్ ఎప్పుడూ చేతులు కలపడు" అంటూ బిట్టూ వీడియో ప్రకటన విడుదల చేశారు.

దుబె వ్యాఖ్యలతో ఆజ్యం

గాంధీ కుటుంబాన్ని ఉద్దేశించి భాజపా సభ్యుడు నిశికాంత్ దుబె చేసిన కొన్ని వ్యాఖ్యలు సభలో వాగ్వాదాలకు దారితీశాయి. ఇంకా ప్రచురితం కాని పుస్తకంలోని అంశాలపై మాట్లాడాలని రాహుల్ భావిస్తున్నారని, గాంధీల కుటుంబం గురించి ఎండగట్టడానికి తనవద్ద ఓ పుస్తకాల సంకలనమే ఉందని దుబె చెప్పి.. వాటి పేర్లను చదవడం ప్రారంభించారు. సభా వ్యవహారంతో సంబంధంలేని ఏ అంశాన్నీ చదవడానికి వీల్లేదని స్పీకర్ ఇప్పటికే రూలింగ్ ఇచ్చారని ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ స్పష్టంచేశారు. ఎవరూ వెనక్కి తగ్గకపోవడంతో సభను వాయిదా వేశారు. నరవణె పుస్తకంపై సభలో వాదోపవాదనలు చోటుచేసుకున్నాయి. ఆ పుస్తకాన్ని రాహుల్ ప్రదర్శిస్తూ.. ముద్రణ కాలేదంటున్న పుస్తకం ఇదేనని చెప్పారు. 'ఈ రోజు లోక్‌సభకు వచ్చే ధైర్యం ప్రధానికి లేదు. ఆయన వస్తే ఈ పుస్తకాన్ని ఇస్తాను' అని తెలిపారు.

ఉమ్మడిగా నిర్ణయం తీసుకుంటాం

సీఈసీ అభిశంసనపై కాంగ్రెస్

దిల్లీ: సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అభిశంసనపై ప్రతిపక్షం మొత్తం కలిసి ఉమ్మడిగా నిర్ణయం తీసుకుంటుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఈ విషయంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సూచనపై సానుకూలంగా ఆలోచిస్తున్నామని వెల్లడించారు. బుధవారం పార్లమెంటు ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఈసీని అభిశంసించాలన్న మమత అభిప్రాయంతో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఏకీభవించారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ స్పందించలేదు. ఈ నేపథ్యంలో వేణుగోపాల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సీఈసీ అభిశంసనకు మంగళవారం మమతా బెనర్జీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. 'తృణమూల్ ఇప్పటికే మమ్మల్ని సంప్రదించింది. దీనిపై ప్రతిపక్షం మొత్తం కలిసి ఒక నిర్ణయం తీసుకుంటుంది' అని వేణుగోపాల్ పేర్కొన్నారు.

నైజీరియాలో తీవ్రవాదుల ఘాతుకం

162 మంది గ్రామీణుల ఊచకోత

సొకొటో: పశ్చిమ నైజీరియాలోని రెండు గ్రామాల్లో సాయుధులైన తీవ్రవాదులు రక్తపాతం సృష్టించారు. విచక్షణా రహితంగా దాడులకు దిగి 162 మందికిపైగా స్థానికుల ప్రాణాలను హరించారు. క్వారా రాష్ట్రంలోని వొరో, నుకు అనే రెండు గ్రామాల్లో మంగళవారం రాత్రి ఇస్లామిక్ స్టేట్ అనుబంధ సాయుధ మూకలు ఈ దారుణానికి పాల్పడ్డాయని రెడ్‌క్రాస్ అధికారి ఒకరు వెల్లడించారు.

రేపు ఒమన్‌లో అమెరికా, ఇరాన్ చర్చలు

దుబాయ్: అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు శుక్రవారం ఒమన్‌లో జరగనున్నాయి. బుధవారం ఇరాన్ మీడియా ఈ విషయాన్ని వెల్లడించింది. అయితే అటు ఒమన్‌గానీ, ఇటు అమెరికాగానీ చర్చలపై అధికారికంగా స్పందించలేదు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించండి

- 'సర్'ను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో స్వయంగా వాదించిన మమత



దిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై జోక్యం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని సుప్రీంకోర్టుకు ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ విజ్ఞప్తి చేశారు. తమ రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకున్నారని, అర్హులైన ప్రజలను ఓటర్ల జాబితాల్లో చేర్చడం లేదని ఆరోపించారు. సర్ కసరత్తును వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కోర్టులో బుధవారం ఆమె స్వయంగా వాదనలు వినిపించారు. ఈ ధర్మాసనంలో జస్టిస్ జోయ్‌మల్యాబాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలి కూడా సభ్యులుగా ఉన్నారు. ఎన్నికల సంఘానికి ఇప్పటికే ఆరు లేఖలు రాశానని, తమకు ఎక్కడా న్యాయం జరగలేదని త్రిసభ్య ధర్మాసనానికి మమతా బెనర్జీ తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయం చేయాలని అభ్యర్థించారు. సర్ కసరత్తును భాజపా పాలిత అస్సాంలో ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. వాదనల అనంతరం ఎన్నికల సంఘంతో పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్య ఎన్నికల అధికారికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ఈ నెల 9వ తేదీకల్లా సమాధానం ఇవ్వాలని ఆదేశిస్తూ అదే రోజుకు కేసు విచారణను వాయిదా వేసింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్‌దివాన్ కూడా వాదనలు వినిపించారు.

మణిపుర్ సీఎంగా ఖేమ్‌చంద్ ప్రమాణం

ఇంఫాల్: మణిపుర్‌లో ఎట్టకేలకు ప్రజాప్రభుత్వం కొలువుదీరింది. భాజపా నేత యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ (62) రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణం చేశారు. కుకీ సామాజిక వర్గానికి చెందిన నెమ్చా కిప్‌గెన్ (భాజపా), నాగా సామాజిక వర్గానికి చెందిన నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) శాసనసభ్యుడు ఎల్ డిఖో ఉప ముఖ్యమంత్రులుగా నియమితులయ్యారు. జాతుల మధ్య ఘర్షణలతో మణిపుర్ 2023 మే 3 నుంచి అట్టుడికింది. ఈ ఘర్షణల్లో దాదాపు 260మంది మృత్యువాతపడ్డారు. తర్వాతి పరిణామాల నేపథ్యంలో నిరుడు ఫిబ్రవరి 9న అప్పటి సీఎం బీరెన్‌సింగ్ రాజీనామా చేశారు. అదే నెల 13 నుంచి మణిపుర్ రాష్ట్రపతి పాలనలో ఉంది. తాజాగా రాష్ట్ర ఎన్డీయే భాగస్వామ్య పక్షాల ఎమ్మెల్యేలు దిల్లీలో మంగళవారం సమావేశమై ఖేమ్‌చంద్‌ను తమ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. ఈ క్రమంలో మణిపుర్‌లో రాష్ట్రపతి పాలనను ఎత్తివేస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం- ఖేమ్‌చంద్ నేతృత్వంలో ఎన్డీయే బృందం గవర్నర్ అజయ్‌కుమార్ భల్లాను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతివ్వాలని కోరింది. రాష్ట్రపతి పాలనను ఎత్తివేసిన కొన్ని గంటల్లోనే సీఎంగా ఖేమ్‌చంద్‌తో గవర్నర్ ప్రమాణం చేయించారు. గోవిందాస్ కొంథౌజమ్ (భాజపా), కె.లోకెన్‌సింగ్ (ఎన్‌పీపీ) కూడా మంత్రులుగా ప్రమాణం చేశారు.



ఖేమ్‌చంద్ సింగ్‌ను అభినందిస్తున్న గవర్నర్ అజయ్‌కుమార్ భల్లా

■ ఖేమ్‌చంద్‌కు తైక్వాండోలో బ్లాక్‌బెల్ట్ ఉంది. భారత తైక్వాండో సమాఖ్యకు గతంలో ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 2012లో తృణమూల్ కాంగ్రెస్ టికెట్‌పై అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. 2013లో భాజపాలో చేరారు. 2017లో సింగ్‌జేమీ నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొంది 2022 వరకు అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022లోనూ శాసనసభ ఎన్నికల్లో గెలిచి.. మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

జపాన్‌లో భారీ హిమపాతం.. 35 మంది మృతి

టోక్యో: ఉత్తర జపాన్‌లోని దాదాపు 15 ప్రాంతాలను రెండు వారాలుగా భారీ హిమపాతం ముంచెత్తుతోంది. మంచు ధాటికి దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 35 మంది మరణించగా, 300 మందికి పైగా గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. తమ ఇంటిపై పేరుకుపోయిన మంచును తొలగించే క్రమంలో కిందికి జారిపడటం, హఠాత్తుగా గుండెపోటుకు గురవడం లాంటి కారణాలతో పలువురు ప్రాణాలు కోల్పోయారని, మరికొందరు గాయపడ్డారని పేర్కొన్నారు. సుమారు 2 మీటర్ల మేర మంచు పేరుకుపోవడంతో దేశవ్యాప్తంగా రైళ్లు, రవాణా వ్యవస్థతో పాటు ఇతర ప్రజాసేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. 1,700కు పైగా ఇళ్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయినట్లు చెప్పారు. ఇంత అధికంగా మంచు కురవడం గత 40 ఏళ్లలో ఇదే మొదటిసారని.. రానున్న రోజుల్లో హిమపాతం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని తెలిపారు.



ఆమోరీలో పేరుకుపోయిన మంచును తొలగిస్తున్న స్థానికులు

24న ఎన్నికల సంఘాల జాతీయ సదస్సు

దిల్లీ: దేశంలోని అన్ని రాష్ట్రాల ఎన్నికల సంఘాలతో మరింత సమన్వయం ఏర్పరచుకునే లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఈ నెల 24న దిల్లీలో జాతీయ సదస్సు నిర్వహించనుంది. రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులతో పాటు వారి న్యాయనిపుణులు కూడా హాజరవుతారని ఈసీఐ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్, కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అధ్యక్షత వహిస్తారు. దాదాపు 27 ఏళ్ల విరామం తర్వాత రాష్ట్రాల ఎన్నికల సంఘాల జాతీయ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ తరహా కార్యక్రమం చివరిగా 1999లో జరిగింది.

ముంబయి-పుణె ఎక్స్‌ప్రెస్‌వేపై గ్యాస్ ట్యాంకర్ బోల్తా

- 30 గంటలకుపైగా వాహనాల రాకపోకలకు అంతరాయం

దిల్లీ: ముంబయి-పుణె ఎక్స్‌ప్రెస్ వేపై గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడడంతో 30 గంటలకు పైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో రాయ్‌గఢ్ జిల్లా అదోషి టన్నెల్ సమీపంలో ఖండాలా ఘాట్ ప్రాంతంలో వేగంతో ప్రయాణిస్తున్న ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడింది. దాన్నుంచి ప్రమాదకర ప్రొపైలిన్ భారీగా గ్యాస్ లీక్ అవుతుండడంతో అధికారులు ఎక్స్‌ప్రెస్ వేపై వాహనాలను నిలిపివేశారు. బుధవారం రాత్రి వరకూ పరిస్థితి ఇలాగే కొనసాగింది. దీంతో 30 గంటలకు పైగా మహిళలు, చిన్నారులు సహా ప్రయాణికులు ఆహారం, నిద్ర, టాయిలెట్ సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భారత్ పెట్రోలియం (బీపీసీఎల్) బృందాలు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాయి. పుణె-ముంబయి ఎక్స్‌ప్రెస్‌వేను మూసివేయడంతో ట్రాఫిక్‌ను పాత రహదారికి మళ్లించినట్లు చెప్పారు.




ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడటంతో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

అమెరికా ఒత్తిడికి భారత్ తలొగ్గిందా?

ప్రశ్నించిన కాంగ్రెస్

దిల్లీ: వాణిజ్య ఒప్పందంలో అమెరికా ఒత్తిడికి భారత్ తలొగ్గిందా అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. పార్లమెంటు జరుగుతున్న సమయంలో ఈ ప్రకటన రావడం అనుమానాలకు తావిస్తోందని వ్యాఖ్యానించారు. అమెరికా ఉత్పత్తులపై సున్నా సుంకాలకు భారత్ అంగీకరించిందా అని నిలదీశారు. రైతులకు రక్షణ కల్పించే చర్యలున్నాయా అని బుధవారం ఎక్స్‌లో ఖర్గే ప్రశ్నించారు. 'మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో అమెరికాతో కుదిరిన అణు ఒప్పందం ద్వారా రెండు దేశాల మధ్య సంబంధాల బలోపేతానికి కట్టుబడి ఉన్నామని యూపీఏ ప్రభుత్వం నిరూపించింది. అంతే కాకుండా కీలకమైన ఆ డీల్‌కు సంబంధించిన పలు ఒప్పందాల విషయంలో పార్లమెంటు అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నాం. కానీ ప్రస్తుత ఒప్పందం గురించి దేశంలో ఎవరికీ ఏమీ తెలియదు. ఏకంగా అమెరికా అధ్యక్షుడు ఏకపక్షంగా ప్రకటన చేశారు. పార్లమెంటు జరుగుతున్న సమయంలో బయట ప్రకటన రావడం తగదు' అని ఖర్గే వ్యాఖ్యానించారు.



హరిద్వార్ పారిశుధ్య ప్రచారకర్తగా ట్రాన్స్‌జెండర్

ఈటీవీ భారత్: ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ నగర పాలిక పారిశుధ్యం గురించి ప్రజల్లో అవగాహన పెంచడానికి ప్రత్యేక చొరవ చూపుతోంది. ఇందులో భాగంగా నగరంలో పారిశుధ్య ప్రచారానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ట్రాన్స్‌జెండర్ల వర్గం నుంచి ఒకరిని నియమించింది. ఈ నియామకం ద్వారా సమాజంలోని ప్రతి వర్గానికి పారిశుధ్య సందేశం చక్కగా చేరుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు సోనియా బువా అనే ట్రాన్స్‌జెండర్‌కు హరిద్వార్ మున్సిపల్ కమిషనర్ నందన్ కుమార్ బుధవారం నియామక పత్రం అందజేశారు. నగర పరిధిలో 'క్లీన్ హరిద్వార్' ప్రచార కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి పారిశుధ్య సందేశాన్ని తీసుకువెళతామని ఈ సందర్భంగా సోనియా బువా చెప్పారు.



ఆహార, వ్యవసాయ ఉత్పత్తులకు రక్షణ

- పార్లమెంటులో పీయూష్ గోయల్ ప్రకటన



దిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందంలో మన ఆహార, వ్యవసాయ ఉత్పత్తులకు పూర్తి రక్షణ ఉంటుందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పష్టంచేశారు. ఈ ఒప్పందం ద్వారా అమెరికా మార్కెట్లో మన పోటీ అవకాశాలు మెరుగుపడతాయని వెల్లడించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై మంగళవారం తొలుత లోక్‌సభలో, ఆ తర్వాత రాజ్యసభలో ఆయన ప్రకటన చేశారు. ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్యే ఆయన ఈ ప్రకటన చేయడం గమనార్హం. 'ఒప్పందంపై చర్చల సమయంలో తమ కీలక రంగాలకు రక్షణ కోసం రెండు దేశాలు ప్రయత్నిస్తాయి. ఈ విషయంలో భారత్ అనుకున్నది సాధించింది. వ్యవసాయ, పాల ఉత్పత్తుల విషయంలో మన ప్రయోజనాలను రక్షించుకోనున్నాం. ఒప్పందంపై కేవలం పేపర్ వర్కే మిగిలింది. ఒప్పందంలోని వివరాలు త్వరలో పూర్తిగా వెల్లడవుతాయి' అని గోయల్ పేర్కొన్నారు.

అమెరికా ప్రకటనకు పూర్తి భిన్నం: కాంగ్రెస్

పార్లమెంటులో మంత్రి గోయల్ ప్రకటన అమెరికా వెల్లడించిన వివరాలకు పూర్తి భిన్నంగా ఉందని కాంగ్రెస్ విమర్శించింది. ఒప్పందం వివరాలు వెల్లడయ్యాక రైతులకు కలగనున్న అసలైన నష్టం తెలియనుందని స్పష్టం చేసింది. ఉభయ సభల్లో గోయల్ చేసింది ప్రకటన కాదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. అందులో వివరాలేమీ లేదని స్పష్టం చేశారు.

బిహార్‌లో పడవ దర్గా



బిహార్ రాష్ట్రంలోని ముజఫర్‌పుర్ జిల్లా కాంటీ పట్టణంలో గల 'పడవ దర్గా' ఈ నెల 7, 8 తేదీల్లో జరగనున్న ఉర్సు వేడుకలకు సిద్ధమవుతోంది. ఈ ఉర్సుకు లక్షల్లో భక్తులు వస్తారు. దాదాపు 300 అడుగుల పొడవు, 200 అడుగుల వెడల్పు కలిగిన ఈ పడవ ఆకారపు దర్గా చుట్టూ నీళ్లు ఉంటాయి. కోరియా షరీఫ్ మజార్ పేరుతో ప్రసిద్ధమైన మూడు అంతస్తుల ఈ దర్గాలో హజ్రత్ ఇస్మాయిల్ షా వార్సీ సమాధి ఉంది. ఈయన కాలం నాటికి కాంటీ పట్టణం ఒక ద్వీపంలా ఉండేదని.. తన శిష్యులు, ప్రజలను కలవడానికి ఇస్మాయిల్ షా వార్సీ పడవలోనే వెళ్లి వచ్చేవారని స్థానికుడైన జావేద్ వార్సీ తెలిపారు. 1968లో ఇస్మాయిల్ షా వార్సీ కన్నుమూశాక, ఆయన శిష్యులు పడవ ఆకారంలో దర్గాను నిర్మించారని చెప్పారు. దాదాపు అర్థై ఏళ్లుగా దర్గాలో ఏటా రెండు రోజులపాటు ఉర్సు వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని మతాలకు చెందిన పలు రాష్ట్రాల భక్తులు ఈ దర్గాకు వస్తుంటారని, మత సామరస్యానికి ఇది ప్రతీకగా కాంటీ పట్టణవాసులు చెబుతున్నారు.

జబల్‌పుర్‌లో నాణేల రాజు



మధ్యప్రదేశ్‌లోని జబల్‌పుర్‌కు చెందిన సత్యనారాయణ సేన్ పురాతన కాలం నాటి అరుదైన నాణేలను సేకరించి భద్రపరుస్తున్నారు. ఆయన దగ్గర 1500 ఏళ్ల క్రితం నాటి నాణేలు కూడా ఉన్నాయి. స్థానికులు సత్యనారాయణను 'నాణేల రాజు'గా పిలుస్తారు. సత్యనారాయణ బాల్యంలో ఆయన కుటుంబం జబల్‌పుర్‌లోని గురండి బజార్ సమీపంలోని నివసించేది. గురండి బజార్ 200 ఏళ్ల పురాతనమైన మార్కెట్. అక్కడ పాత వస్తువులను విక్రయిస్తారు. సత్యనారాయణ ఈ బజారుకు నాణేల సేకరణకు వెళ్లేవారు. ఇలా సేకరించిన వాటిలో చంద్రగుప్త మౌర్యుల కాలంనాటి నాణెం కూడా ఉందన్నారు. "బ్రిటిష్ కాలంలో క్వీన్ విక్టోరియా, జార్జ్ చక్రవర్తి ఫొటోలతో రాగి, ఇత్తడి నాణేలను ఉపయోగించేవారు. మొగలుల కాలంనాటి నాణేలపై పర్షియన్/అరబ్బీ భాష ఉంటుంది. ఉజ్జయినిలో నాణేలు వాడుకలోకి వచ్చినప్పుడు వాటిపై మహాకాల్ త్రిశూలం ఉండేది. మొగలుల నాటి నాణేలు చాలా బరువుగా ఉండేవి. అందుకే తర్వాతి కాలంలో వాటిని పాత్రలు తయారుచేయడానికి వాడేశారు. భారత్‌కు చెందిన నాణేలు మాత్రమే కాకుండా.. నేపాల్, భూటాన్, థాయిలాండ్, చైనా, అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి 100 దేశాల నాణేలు సేకరించాను" అని సత్యనారాయణ సేన్ వివరించారు.

నీట్ పీజీ కటాఫ్ తగ్గింపుపై కేంద్రానికి సుప్రీం నోటీసు

దిల్లీ: నీట్ పీజీ (2025-26) పరీక్షలో ఉత్తీర్ణతకు అర్హత మార్కులను (క్వాలిఫైయింగ్ కటాఫ్ పర్సంటైల్) జాతీయ వైద్య శాస్త్రాల పరీక్ష బోర్డు (ఎన్‌బీఈఎంఎస్) గణనీయంగా తగ్గించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై స్పందన కోరుతూ కేంద్ర ప్రభుత్వం, సంబంధిత పక్షాలకు సుప్రీంకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. కటాఫ్ పర్సంటైల్‌ను తగ్గించడం రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు భంగకరమనీ, దీర్ఘకాలం శ్రమించి పరీక్షలో ఉత్తీర్ణులైన ప్రతిభావంతుల పాలిట అన్యాయమని పిటిషన్‌దారులు పేర్కొన్నారు. పిటిషన్‌పై విచారణను సుప్రీం శుక్రవారానికి వాయిదా వేసింది. దేశంలో 18 వేలకు పైగా పీజీ మెడికల్ సీట్లు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయడం కోసమని బోర్డు రిజర్వుడు అభ్యర్థులకు క్వాలిఫైయింగ్ కటాఫ్ పర్సంటైల్‌ను 40 నుంచి సున్నాకు తగ్గించింది. జనరల్ కేటగిరీకి 50వ పర్సంటైల్ నుంచి 7కు తగ్గించింది. వైద్య విద్య అంటే వ్యాపారం కాదనీ, సీట్ల భర్తీ కోసం నాణ్యతా ప్రమాణాలకు నీళ్లు వదలకూడదని పిటిషనర్లు వాదించారు.



వాంగ్‌చుక్ నిర్బంధం నిర్ణయాన్ని పునఃపరిశీలించండి

కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు మౌఖిక సూచన

దిల్లీ: పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఆయన నిర్బంధం నిర్ణయాన్ని వీలైతే పునఃపరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు మౌఖికంగా సూచించింది. వాంగ్‌చుక్ భార్య గీతాంజలి ఆంగ్మో దాఖలుచేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ జస్టిస్ అరవింద్‌కుమార్, జస్టిస్ పి.బి.వరాలే ధర్మాసనం ముందు బుధవారం కూడా కొనసాగింది. ఐదు నెలలుగా జైలులో ఉన్న వాంగ్‌చుక్ ఆరోగ్యం సరిగాలేదని వైద్యుల నివేదిక చెబుతోందని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వాన్ని సంప్రదించి ఏ విషయమూ తమకు తెలపాలని అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజ్‌ను ఆదేశించింది. బెయిల్ పిటిషన్‌పై గురువారం కూడా విచారణ కొనసాగనుంది.

ఛాంపియన్

పెద్ద జట్లను వెనక్కి నెట్టి సెమీస్ చేరినా సరే, అఫ్గానిస్థాన్ జట్టు భారత్‌కు ఏమాత్రం పోటీ ఇస్తుందిలే అనుకుంటే.. ఆ చిన్న జట్టు కఠిన సవాలే విసిరింది. ఏకంగా 311 పరుగుల లక్ష్యాన్ని భారత్ ముందు నిలిపి విజయంపై గురి పెట్టింది. కానీ బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై అఫ్గానే అంత స్కోరు కొడితే.. భారత కుర్రాళ్లు తగ్గుతారా? అంత పెద్ద లక్ష్యాన్ని 41.1 ఓవర్లలోనే ఛేదించి రికార్డు నెలకొల్పారు. ఫామ్‌తో తంటాలు పడుతున్న ఓపెనర్ ఆరోన్ జార్జ్ సరైన సమయంలో జోరందుకుని సెంచరీ కొడితే.. యువ సంచలనాలు వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మాత్రే మెరుపు ఇన్నింగ్స్‌లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. తుది పోరులో యువ భారత్.. ఇంగ్లాండ్‌ను ఢీకొనబోతోంది.

అండర్-19 వన్డే ప్రపంచకప్

కుర్రాళ్లు కుమ్మేశారు


ఆరోన్ జార్జ్ 115

- రికార్డు విజయంతో ఫైనల్లో భారత్
- రేపు ఇంగ్లాండ్‌తో టైటిల్ పోరు

311 భారత్ ఛేదించిన పరుగులు. అండర్-19 ప్రపంచకప్‌లో ఇదే అతి పెద్ద ఛేదన.

హరారే

అండర్-19 ప్రపంచకప్‌లో భారీ అంచనాలతో అడుగు పెట్టి, వరుస విజయాలతో దూసుకెళ్తున్న యువ భారత్.. ఫైనల్లో అడుగు పెట్టింది. బుధవారం సెమీఫైనల్లో ఆయుష్ మాత్రే బృందం 7 వికెట్ల తేడాతో అఫ్గానిస్థాన్‌పై ఘనవిజయం సాధించింది. టోర్నీ చరిత్రలోనే అతి పెద్ద ఛేదనతో భారత్ ముందంజ వేయడం విశేషం. ఆరోన్ జార్జ్ (115; 104 బంతుల్లో 15×4, 2×6) సూపర్ సెంచరీకి.. వైభవ్ సూర్యవంశీ (68; 33 బంతుల్లో 9×4, 4×6), ఆయుష్ మాత్రే (62; 59 బంతుల్లో 5×4, 4×6) మెరుపు అర్ధశతకాలు తోడవడంతో 311 పరుగుల లక్ష్యాన్ని భారత్ 41.1 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ప్రత్యర్థి బౌలర్లలో నూరిస్తాని 2 వికెట్లు తీశాడు. మొదట అఫ్గాన్ 4 వికెట్లకు 310 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఫైజల్ షినోజాదా (110; 93 బంతుల్లో 15×4), ఉజైరుల్లా (101 నాటౌట్; 86 బంతుల్లో 12×4, 2×6) సెంచరీలతో అదరగొట్టారు. కనిష్క్, దీపేశ్ తలో 2 వికెట్లు పడగొట్టారు. భారత్ కప్పు కోసం శుక్రవారం ఇంగ్లాండ్‌తో తలపడుతుంది. తొలి సెమీస్‌లో ఇంగ్లాండ్ 27 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాపై విజయం సాధించింది.


సూర్యవంశీ 68

దంచేశారు: మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన అఫ్గాన్‌కు ఉస్మాన్ సాదత్ (39), ఖాలిద్ అహ్మద్ జాయ్ (31).. 53 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యంతో శుభారంభం అందించారు. వీళ్లిద్దరూ వెనుదిరిగాక షినోజాదా, ఉజైరుల్లా సూపర్ బ్యాటింగ్‌తో జట్టును తిరుగులేని స్థితికి తీసుకెళ్లారు. ఒక దశలో ఆ జట్టు 265/2తో నిలిచింది. సెంచరీ పూర్తి చేశాక షినోజాదా ఔటవడంతో.. 148 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. చివరి వరకు క్రీజులో నిలిచిన ఉజైరుల్లా స్కోరును 300 దాటించాడు. సెమీఫైనల్లో 311 పరుగుల ఛేదన అంటే కష్టమేమో అనుకుంటే.. భారత టాప్-3 బ్యాటర్లు చెలరేగిపోవడంతో అంత లక్ష్యం చిన్నదై పోయింది. ఆరోన్ జార్జ్ కీలక మ్యాచ్‌లో మేటి ఇన్నింగ్స్ ఆడాడు. మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ తనదైన శైలిలో ఫోర్లు, సిక్సర్లతో చెలరేగిపోవడంతో భారత్ 6వ ఓవర్లోనే 50 మార్కును అందుకుంది. 24 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసిన వైభవ్.. పదో ఓవర్లో ఔటయ్యాడు. అప్పటికే స్కోరు 90కి చేరుకుంది. తర్వాత కెప్టెన్ ఆయుష్ మాత్రేతో కలిసి ఆరోన్ శతక భాగస్వామ్యం (114) నమోదు చేశాడు. భారత్ 27వ ఓవర్లోనే 200 దాటేసి లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. అర్ధసెంచరీ తర్వాత మాత్రే ఔటైనా.. విహాన్ (38 నాటౌట్)తో కలిసి మూడో వికెట్‌కు 96 పరుగులు జోడించిన ఆరోన్ విజయాన్ని ఖాయం చేశాడు. 95 బంతుల్లో శతకం పూర్తి చేసిన అతను.. విజయానికి 11 పరుగుల దూరంలో ఔటయ్యాడు. వేదాంత్ (5 నాటౌట్)తో కలిసి విహాన్ లాంఛనాన్ని పూర్తి చేశాడు.

- అండర్-19 క్రికెట్లో ఇది 16వ వన్డే ప్రపంచకప్ కాగా.. భారత జట్టు ఫైనల్ చేరడమిది పదోసారి.
- ఈసారి అండర్-19 ప్రపంచకప్‌లో ఫైనల్ చేరిన భారత్, ఇంగ్లాండ్ రెండూ అజేయ జట్లే. అవి టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు.

అఫ్గానిస్థాన్ ఇన్నింగ్స్: ఉస్మాన్ సాదత్ (సి) దీపేశ్ (బి) కనిష్క్ 39; ఖాలిద్ అహ్మద్‌జాయ్ (సి) కుండు (బి) దీపేశ్ 31; షినోజాదా (బి) దీపేశ్ 110; ఉజైరుల్లా నాటౌట్ 101; అజీజుల్లా (సి) ఖిలాన్ (బి) కనిష్క్ 12; అబ్దుల్ అజీజ్ నాటౌట్ 7 ఎక్స్‌ట్రాలు 10 **మొత్తం:** (50 ఓవర్లలో 4 వికెట్లకు) **310; వికెట్ల పతనం:** 1-53, 2-117, 3-265, 4-293; **బౌలింగ్:** అంబ్రిష్ 9-0-65-0; హెనిల్ పటేల్ 10-0-56-0; దీపేశ్ దేవేంద్రన్ 10-0-64-2; ఖిలాన్ పటేల్ 10-0-49-0; కనిష్క్ చౌహాన్ 9-0-55-2; ఆయుష్ మాత్రే 2-0-14-0

భారత్ ఇన్నింగ్స్: ఆరోన్ జార్జ్ (సి) నజీవుల్లా (బి) వహిదుల్లా 115; వైభవ్ (సి) సాదత్ (బి) నూరిస్తాని 68; మాత్రే సాదత్ (బి) నూరిస్తాని 62; విహాన్ నాటౌట్ 38; వేదాంత్ నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 23 **మొత్తం:** (41.1 ఓవర్లలో 3 వికెట్లకు) **311; వికెట్ల పతనం:** 1-90, 2-204, 3-300; **బౌలింగ్:** అబ్దుల్ అజీజ్ 10-0-70-0; వహిదుల్లా 7.1-0-67-1; నూరిస్తాని 10-0-64-2; స్టానిక్‌జాయ్ 9-0-52-0; రూహుల్లా 4-0-35-0; ఉజైరుల్లా 1-0-8-9



జెమీమా, స్మృతి మంధాన

రాత్రి 7.30 నుంచి

దిల్లీ పంతమా.. ఆర్సీబీ సొంతమా

నేడే డబ్ల్యూపీఎల్ ఫైనల్

వడోదర


డబ్ల్యూపీఎల్‌లో వరుసగా మూడుసార్లు ఫైనల్ చేరి ఆఖరి మెట్టుపై బోల్తా పడింది దిల్లీ క్యాపిటల్స్! అయినా పట్టు వదలకుండా మరోసారి టైటిల్ సమరానికి అర్హత సాధించింది. మరోవైపు అదిరే ఫామ్‌తో డబ్ల్యూపీఎల్-4 ఫైనల్ చేరింది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు. 2024 ఫైనల్లో మాదిరే దిల్లీని ఓడించి మళ్లీ కప్పు కొట్టాలని చూస్తోంది. మరి ఈసారి దిల్లీ పంతం నెగ్గుతుందా.. బెంగళూరు రెండోసారి ట్రోఫీ సాధిస్తుందా! గురువారమే పతాక పోరు.

కల తీరేనా: డబ్ల్యూపీఎల్ ఆరంభమైన నాటి నుంచి మెగ్ లానింగ్ సారథ్యంలో దిల్లీ క్యాపిటల్స్ వరుసగా మూడుసార్లు (2023, 24, 25) ఫైనల్‌కు వచ్చింది. కానీ అన్నిసార్లూ ఆ జట్టుకు నిరాశే ఎదురైంది. ఈసారి లానింగ్ లేదు.. జట్టు మారింది. కానీ దిల్లీ జోరు తగ్గలేదు. కొత్త కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్ సారథ్యంలో సత్తా చాటి మరోసారి ఆఖరి పోరుకు అర్హత సాధించింది. లీగ్ దశలో 8 మ్యాచ్‌ల్లో నాలుగింట్లో గెలిచి.. నాలుగు ఓడిన దిల్లీ.. ఎలిమినేటర్‌లో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించి ఫైనల్ చేరింది. బౌలింగ్‌తో పోలిస్తే బ్యాటింగ్‌లో దిల్లీ బలంగా ఉంది. లిజెలీ లీ, షెఫాలి వర్మతో కూడిన ఓపెనింగ్ ద్వయం ఆ జట్టుకు ప్రధాన బలం. ఈ జంట ఇచ్చే మెరుపు ఆరంభాలే దిల్లీకి కీలకం. ఎలిమినేటర్‌లో లిజెలీ అటు బ్యాటింగ్‌లోనూ ఇటు కీపింగ్‌లోనూ అదరగొట్టింది. డిపెండబుల్ బ్యాటర్ లారా వోల్వార్ట్, జెమీమా, మరిజేన్ కాప్‌లతో ఆ జట్టు బ్యాటింగ్ పటిష్టంగా కనబడుతోంది. బౌలింగ్‌లో యువ కెరటాలు నందని శర్మ, శ్రీచరణి సత్తా చాటుతున్నారు. నందని కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ దిల్లీకి బ్రేక్ ఇస్తోంది. మరిజేన్ కాప్, షినెలి హెన్రీ కూడా బంతితో రాణిస్తే ఆ జట్టుకు తిరుగుండదు.

మరోసారి అందుకుంటుందా!: 2024లో టైటిల్ గెలిచిన స్మృతి మంధాన సారథ్యంలోని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కల నెరవేర్చుకుంది. గతేడాది లీగ్ దశలోనే ఇంటిముఖం పట్టిన ఆర్సీబీ.. ఈసారి అదిరే ప్రదర్శన చేసింది. తొలి అయిదు మ్యాచ్‌ల్లోనూ గెలిచి నేరుగా ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. తర్వాత రెండు మ్యాచ్‌ల్లో ఓడినా.. మళ్లీ యూపీపై నెగ్గడం ద్వారా ఫైనల్ బెర్తు సొంతం చేసుకుంది. కెప్టెన్ స్మృతి (290 పరుగులు)నే ఆ జట్టుకు ప్రధాన బలం. ఫైనల్లో స్మృతి చెలరేగాలని జట్టు కోరుకుంటుంది. ఆర్సీబీ తరఫున ఈ సీజన్లో అత్యధిక స్కోర్లు చేసిన గ్రేస్ హారిస్ (228), రిచా ఘోష్ (183) ఆఖరి పోరులో అదరగొడతారేమో చూడాలి. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేస్తున్న నదైన్ డిక్లెర్క్ రాణించడం ఆర్సీబీకి కీలకం. ఆమె ఈ సీజన్లో 8 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసింది. పవర్ ప్లేలో ప్రత్యర్థిని దెబ్బ కొడుతున్న లారెన్ బెల్.. మిడిల్ ఓవర్లలో బ్యాటర్లకు కళ్లెం వేస్తున్న శ్రేయాంక పాటిల్, రాధ యాదవ్ తుది పోరులో ఎలా రాణిస్తారో చూడాలి. ముఖ్యంగా ఈ సీజన్లో 116 డాట్ బాల్స్ వేసిన లారెన్ బెల్ నుంచి ఆర్సీబీ ఫైనల్లో ఉత్తమ ప్రదర్శన ఆశిస్తోంది.

- బెంగళూరు-దిల్లీ ఇప్పటిదాకా తొమ్మిది సార్లు తలపడగా.. ఆరుసార్లు దిల్లీ విజేతగా నిలిచింది. అయితే 2024 ఫైనల్లో మాత్రం దిల్లీపై ఆర్సీబీనే పైచేయి సాధించింది. డబ్ల్యూపీఎల్-4లో రెండుసార్లు ఢీకొన్న దిల్లీ, బెంగళూరు.. చెరో మ్యాచ్ నెగ్గాయి.

మీరా.. 3 రికార్డులు బద్దలు కొట్టి



మీరాబాయి చాను

మోదీనగర్: భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను సత్తా చాటింది. బుధవారం జాతీయ వెయిట్‌లిఫ్టింగ్‌లో ఆమె మూడు రికార్డులు బద్దలుకొట్టి పసిడి గెలుచుకుంది. మహిళల 48 కేజీల విభాగంలో స్నాచ్‌లో 89 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 116 కేజీలు ఎత్తిన మీరా.. మొత్తంగా 205 కేజీలు లిఫ్ట్ చేసి అగ్రస్థానంలో నిలిచింది. ఈ క్రమంలో తన పేరిటే ఉన్న స్నాచ్ (88 కేజీలు), క్లీన్ అండ్ జెర్క్ (115 కేజీలు), టోటల్ (203 కేజీలు) జాతీయ రికార్డులను అధిగమించింది. స్నాచ్‌లో 90 కేజీలు ఎత్తేందుకు మీరా గట్టిగానే ప్రయత్నించినా.. ఆఖర్లో బరువును మోయలేక వదిలేసింది.

ఆసియా షూటింగ్

మెరిసిన ఇషా

వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో స్వర్ణాలు


ఇషా

దిల్లీ: ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో హైదరాబాదీ షూటర్ ఇషా సింగ్ సత్తా చాటింది. బుధవారం ప్రారంభమైన ఈ టోర్నీలో మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో పసిడి పతకం గెలిచిన ఇషా.. టీమ్ విభాగంలోనూ స్వర్ణాన్ని దక్కించుకుంది. వ్యక్తిగత విభాగం ఫైనల్లో ఇషా (239.8) అగ్రస్థానంలో నిలిచింది. చైనీస్ తైపీ అమ్మాయిలు చెంగ్ యెన్ చెంగ్ (235.4) యీ అయ్ వెన్ (217.7) వరుసగా రజత, కాంస్య పతకాలు అందుకున్నారు. డబుల్ ఒలింపిక్ పతక విజేత మను బాకర్ ఏడో స్థానంలో నిలిచింది. మహిళల టీమ్ విభాగంలో సురుచి (576), ఇషా (575), మను (575)లతో కూడిన భారత జట్టు (1726) పసిడి కైవసం చేసుకుంది. వియత్నాం (1713) రజతం, చైనీస్ తైపీ (1711) కాంస్యం గెలిచాయి. పురుషుల 10 మీటర్ల పిస్టల్‌లో సామ్రాట్ రాణా కాంస్యం నెగ్గాడు. ఫైనల్లో 220.3 పాయింట్లతో అతడు మూడో స్థానంలో నిలిచాడు. వెచ్నికోవ్ (ఉజ్బెకిస్థాన్, 242), రకీమ్‌జాన్ (కజకిస్థాన్, 241) తొలి రెండు స్థానాలు సాధించారు. టీమ్ విభాగంలో సామ్రాట్ (581), శ్రవణ్ (578), వరుణ్ తోమర్ (573)లతో కూడిన భారత్ బృందం (1732) రెండో స్థానంలో నిలిచింది. ఉజ్బెకిస్థాన్ (1732) కూడా అన్నే పాయింట్లు సాధించినా.. మధ్య వృత్తానికి సమీపంగా ఎక్కువ పదులు స్కోరు చేయడంతో స్వర్ణాన్ని గెలుచుకుంది. కజకిస్థాన్ (1731) మూడో స్థానంలో నిలిచింది.

క్వార్టర్స్‌లో భారత జట్లు


శ్రీకాంత్

కింగ్‌డావో (చైనా): ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత పురుషులు, మహిళల జట్లు సత్తా చాటాయి. గ్రూప్ దశలో మరో మ్యాచ్ మిగిలుండగానే క్వార్టర్‌ఫైనల్ బెర్తును సొంతం చేసుకున్నాయి. బుధవారం మహిళల గ్రూపు-వై తొలి పోరులో భారత్ 5-0తో మయన్మార్‌పై విజయం సాధించింది. తన్వి శర్మ 21-13, 21-16తో తుజార్‌పై, రక్షిత శ్రీ 21-12, 21-6తో ఇయాంట్ చిట్‌పై, మాళవిక బాన్సోద్ 21-19, 21-12తో లిన్ టెట్‌పై గెలుపొందారు. ప్రియ- శ్రుతి 21-15, 21-16తో సు లాట్- తుజార్‌పై, గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ 21-8, 21-6తో పూ- టెట్‌పై నెగ్గి భారత్‌కు విజయాన్ని అందించారు. పురుషుల గ్రూప్-సి తొలి మ్యాచ్‌లో భారత్.. సింగపూర్‌ను ఓడించింది. మొదట సింగిల్స్‌లో లక్ష్యసేన్ 21-16, 19-21, 16-21తో లో కీన్ యూ చేతిలో ఓడగా.. డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జంట 21-10, 21-8తో వెస్లీ-కుబో జోడీపై గెలిచి స్కోరు సమం చేసింది. తర్వాత ఆయుష్ శెట్టి 21-17, 21-15తో జియా హెంగ్‌పై నెగ్గడంతో భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో డబుల్స్‌లో పృథ్వీ-సాయి ప్రతీక్ జంట 21-8, 21-23, 20-22తో డొనోవాన్-జో జీ జోడీ చేతిలో ఓడడంతో మళ్లీ స్కోర్లు సమమయ్యాయి. నిర్ణయాత్మక సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ 21-15, 21-16తో జియా వీయ్‌ను ఓడించి భారత్‌ను గెలిపించాడు.

ప్రాక్టీస్ అదిరిపోయింది


ఇషాన్ కిషన్

ముంబయి: దక్షిణాఫ్రికాతో టీ20 ప్రపంచకప్ ప్రాక్టీస్ మ్యాచ్‌లో టీమ్ఇండియా చితక్కొట్టింది. దాదాపు బ్యాటర్లంతా బ్యాట్లు ఝుళిపించారు. దీంతో బుధవారం భారత్ 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ (53; 20 బంతుల్లో 2×4, 7×6), తిలక్ వర్మ (45; 19 బంతుల్లో 3×4, 3×6) విరుచుకుపడడంతో మొదట భారత్ 5 వికెట్లకు 240 పరుగుల భారీ స్కోరు సాధించింది. నోకియా వేసిన ఓ ఓవర్లో ఇషాన్ వరుసగా 6, 6, 4, 6 బాదేశాడు. అక్షర్ పటేల్ (35 నాటౌట్; 23 బంతుల్లో 2×4, 2×6), సూర్యకుమార్ (30; 16 బంతుల్లో 2×4, 2×6), హార్దిక్ (30; 10 బంతుల్లో 2×4, 3×6), అభిషేక్ (24; 18 బంతుల్లో 3×4, 1×6) కూడా చెలరేగిపోయారు. ఇషాన్ కిషన్ రిటైర్డ్ ఔట్‌గా.. మరో ఓపెనర్ అభిషేక్ రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగారు. ఛేదనలో దక్షిణాఫ్రికా 7 వికెట్లకు 210 పరుగులు చేసింది. స్టబ్స్ (45 నాటౌట్; 21 బంతుల్లో 1×4, 4×6) టాప్ స్కోరర్. రికిల్‌టన్ (44; 21 బంతుల్లో 4×4, 3×6) రాణించాడు. అభిషేక్ శర్మ రెండు వికెట్లు పడగొట్టాడు.

రోహిత్, కోహ్లి ఆడితే తప్పేంటి


ధోని

దిల్లీ: భారత స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్‌శర్మల భవిష్యత్తుపై దిగ్గజ క్రికెటర్, మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఆటగాళ్ల వయసు కంటే ఫిట్‌నెస్, ప్రదర్శనే ప్రామాణికమని ధోని స్పష్టం చేశాడు. ప్రదర్శన బాగుంటే 2027 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్, కోహ్లీలు ఆడటంలో తప్పేంటని ప్రశ్నించాడు. "నా వరకైతే వయసు కాదు.. ప్రదర్శన, ఫిట్‌నెస్‌లే ప్రామాణికం. ఎవరికీ ఏమీ చెప్పాల్సిన పనిలేదని నేనెప్పుడూ భావిస్తా. అయితే అందరినీ ఒకేలా చూస్తారన్న స్పష్టత ఉండాలి. నేను అరంగేట్రం చేసినప్పుడు నా వయసు 24 ఏళ్లు. అప్పుడు నాకు ఎవరూ ఏమీ చెప్పలేదు. ఇప్పుడు నేను 10 ఏళ్లుగా, 20 ఏళ్లుగా లేదా ఎంత కాలమైనా భారత్ తరపున ఆడుతున్నప్పుడు ఎవరూ వచ్చి నా వయసు గురించి నాకు చెప్పాల్సిన అవసరం లేదు. రోహిత్, విరాట్ లేదా రాబోయే అయిదేళ్లలో వచ్చే ఇతర ఆటగాళ్లు తర్వాతి ప్రపంచకప్‌లో ఆడతారా? లేదా? అన్నది నిర్ణయించాల్సింది మనం కాదు. అది వారే నిర్ణయించుకోవాలి. వారి ప్రదర్శన బాగుంటే.. దేశం తరపున బాగా చేయాలనే తపన వాళ్లలో ఉంటే ఆడటంలో తప్పేముంది. అనుభవజ్ఞులైన ఆటగాళ్లు దొరకరు. సచిన్‌లా 20 ఏళ్లకే అనుభవమున్న ఆటగాళ్లు లభించరు. 16-17 ఏళ్లప్పుడు ఆట మొదలుపెడితేనే అది సాధ్యం. ఆటగాడు కెరీర్‌లో సుదీర్ఘకాలం ఒత్తిడిని ఎదుర్కొని ఉంటే తప్ప అతడిని అనుభవజ్ఞుడిగా పరిగణించలేం. 20, 25 మ్యాచ్‌లు ఆడితే అనుభవంగా తీసుకోలేం. ఆ అనుభవం సంపాదించడానికి నేను 80, 85 మ్యాచ్‌లు ఆడాల్సివచ్చింది. ఆ తర్వాతే హృదయ స్పందనను ఎలా అదుపులో ఉంచుకోవాలో.. భావోద్వేగాల్ని ఎలా నియంత్రించుకోవాలో.. ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో తెలుసుకున్నా. కాబట్టి అనుభవం, యువ ఉత్సాహం కలిపి జట్టు ఉండటం చాలా ముఖ్యం. ఆటగాళ్లందరినీ సమానంగా చూడాలి. రాణించే వాళ్లు జట్టులో ఉంటారు. లేకపోతే చోటు దక్కదు. కాబట్టి జట్టు ఎంపికలో ఏ ఒక్క వ్యక్తి గురించి ప్రశ్నలు తలెత్తకూడదు. ఆటగాడు రాణిస్తున్నాడు.. ఫిట్‌నెస్‌గా ఉన్నాడు అంటే ఆడుతూనే ఉంటాడు. అదొక్కటే ప్రామాణికం కావాలి. టీ20 ప్రపంచకప్‌లో అత్యంత ప్రమాదకర జట్లలో భారత్ ఒకటి. మంచి జట్టుకు అవసరమైనవన్నీ ఈ బృందంలో ఉన్నాయి. ఈ ఫార్మాట్లో భారత జట్టుకు అపారమైన అనుభవం ఉంది" అని ధోని చెప్పాడు.

పంకజ్‌కు రజతం

దిల్లీ: ఆసియా స్నూకర్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ ఆటగాడు పంకజ్ అడ్వాణీ రజత పతకం సాధించాడు. ఖతార్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో బుధవారం ఫైనల్లో పంకజ్ 1-4తో డెంగ్ హావోహుయ్ (చైనా) చేతిలో పరాజయం చవిచూశాడు. తొలి ఫ్రేమ్‌లో గెలిచిన పంకజ్.. తర్వాతి నాలుగు ఫ్రేమ్‌లను కోల్పోయాడు. అంతకుముందు సెమీస్‌లో పంకజ్ 4-1తో షాహిన్ సాబ్జి (ఇరాన్)పై నెగ్గి ఫైనల్ చేరుకున్నాడు.

ఏ గ్రూపులో ఏముంది?

అభిమానులను అలరించడానికి టీ20 ప్రపంచకప్ వచ్చేస్తోంది. ఇంకో రెండు రోజుల్లోనే ధనాధన్ సమరం షురూ! 20 జట్లు.. నాలుగు గ్రూపులు. మరి ఏ గ్రూపు ఎలా ఉందో చూద్దామా!

టీ20 ప్రపంచకప్ మరో 2 రోజుల్లో

గ్రూప్–ఎ: భారత్, పాకిస్థాన్, నమీబియా, నెదర్లాండ్స్, అమెరికా


సూర్య కుమార్

ఈ గ్రూపులో మామూలుగానే టీమ్ఇండియా తిరుగులేని ఫేవరెట్. ఇప్పుడు పాకిస్థాన్ వాకోవర్ ఇవ్వడంతో కనీస పోటీ కూడా లేకుండా పోయింది. పసికూనలు నమీబియా, నెదర్లాండ్స్, అమెరికాల నుంచి పెద్దగా పోటీ ఎదురయ్యే అవకాశం లేదు. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమ్ ఇండియా అన్ని విభాగాల్లో బలంగా ఉంది. టీ20, వన్డే క్రికెట్లో ప్రపంచ నంబర్‌వన్ జట్టయిన భారత్.. ఇటీవల న్యూజిలాండ్‌తో సిరీస్‌ను 4-1తో గెలవడంతో రెట్టించిన ఉత్సాహంతో సమరానికి సిద్ధమవుతోంది. రెండు పాయింట్లతో టోర్నీలో అడుగుపెడుతున్న రెండు సార్లు ఛాంపియన్ భారత్.. అగ్రస్థానంతో సూపర్ ఎయిట్స్‌కు చేరడం లాంఛనమే. గ్రూపు నుంచి ముందంజ వేసే రెండో జట్టు ఏదన్నది ప్రశ్న. ఓ మ్యాచ్‌ను వదులుకున్నప్పటికీ పాకిస్థాన్ ముందంజ వేసే అవకాశాలే ఎక్కువ. కానీ సంచలనాలను కొట్టిపారేయలేం. గత టీ20 ప్రపంచకప్‌లో పాక్‌కు షాకిచ్చిన అమెరికా.. తనదైన రోజు ఎలాంటి జట్టునైనా ఇబ్బంది పెట్టగలనని నిరూపించుకుంది. ఆ జట్టులో ఎక్కువగా భారత సంతతి ఆటగాళ్లున్నారు. వరుసగా నాలుగో టీ20 ప్రపంచకప్ ఆడుతోన్న నమీబియా మిగతా చిన్న జట్లపై అయినా నెగ్గి ఉనికిని చాటుకోవాలనుకుంటోంది. ఇక నెదర్లాండ్స్ జట్టు రెండు సార్లు టీ20 ప్రపంచకప్‌లో రెండో రౌండ్లో అడుగుపెట్టగలిగింది. ఆ జట్టును మరీ తేలికగా తీసుకునే పరిస్థితి లేదు. 2023 వన్డే ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికాకు నెదర్లాండ్స్ షాకిచ్చింది.

గ్రూప్–బి: ఆస్ట్రేలియా, ఐర్లాండ్, ఒమన్, శ్రీలంక, జింబాబ్వే


మిచెల్ మార్ష్

ఈ గ్రూపులో కచ్చితంగా ఆస్ట్రేలియానే టాప్ జట్టు అనడంలో సందేహం లేదు. ఇటీవల పాకిస్థాన్‌లో ఆ జట్టు క్లీన్ స్వీప్ అయ్యుండొచ్చు. కానీ ఐసీసీ టోర్నీ అనగానే.. అంతకుముందు ఫామ్‌తో సంబంధం లేకుండా ఆధిపత్యాన్ని ప్రదర్శించడం ఆ జట్టుకు అలవాటే. ప్రపంచ టీ20 ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న మిచెల్ మార్ష్ నేతృత్వంలోని కంగారూ జట్టు గ్రూపులో ఆధిపత్యాన్ని ప్రదర్శించొచ్చు. అదే సమయంలో శ్రీలంక నుంచి ఆ జట్టుకు ముప్పు పొంచి ఉంది. సొంతగడ్డపై ఆడుతుండడం శ్రీలంకకు కలిసొచ్చే విషయమే. హసరంగ లాంటి మేటి స్పిన్నర్, ధాటిగా ఆడగల బ్యాటర్లు జట్టులో ఉన్న శ్రీలంక.. సొంత పిచ్‌లపై కంగారూలను దెబ్బతీస్తే ఆశ్చర్యం లేదు. లంక, ఆసీస్ కాకుండా మరే పెద్ద జట్టు లేదు కాబట్టి.. 'బి' తేలికైన గ్రూప్ అనుకుంటే అది పొరపాటే అవుతుంది. జింబాబ్వే, ఐర్లాండ్‌లకు సంచలనాలు సృష్టించే సత్తా ఉంది. 2022 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌కు జింబాబ్వే, ఇంగ్లాండ్‌కు ఐర్లాండ్ షాకిచ్చాయి. ఒమన్‌కు 2016లో ఐర్లాండ్‌ను ఓడించిన అనుభవం ఉంది.

గ్రూప్–సి: ఇంగ్లాండ్, వెస్టిండీస్, స్కాట్లాండ్, ఇటలీ, నేపాల్


బ్రూక్

మాజీ ఛాంపియన్లున్న గ్రూప్-సి ఆసక్తికరంగా ఉంది. రెండేసి సార్లు టీ20 ప్రపంచకప్‌ను గెలిచిన ఇంగ్లాండ్, వెస్టిండీస్ ఈ గ్రూపులో ప్రధాన జట్లు. ఇటీవలే శ్రీలంకలో పొట్టి సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసిన ఉత్సాహంతో ఇంగ్లాండ్ ఉంది. అంతకు ముందు న్యూజిలాండ్, ఐర్లాండ్‌లపైనా సిరీస్‌లు గెలిచింది. టేబుల్ టాపర్‌గా ఇంగ్లాండ్ సూపర్ ఎయిట్స్‌కు చేరొచ్చు. వెస్టిండీస్ మాత్రం పేలవ ఫామ్‌తో టోర్నమెంట్లో అడుగుపెడుతోంది. గత మూడు టీ20 సిరీస్‌ల్లోనూ ఆ జట్టు ఓడిపోయింది. గ్రూప్ నుంచి ముందంజ వేసే రెండో జట్టు విండీసే కావొచ్చు. కానీ భిన్నమైన ఫలితం వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. స్కాట్లాండ్, నేపాల్ మరీ తీసిపారేసే జట్లేమీ కావు. గతంలో ఐసీసీ ఈవెంట్లో ఇంగ్లాండ్‌కు షాకిచ్చిన చరిత్ర స్కాట్లాండ్‌కు ఉంది. ఇటీవల నేపాల్ అదిరిపోయే ఫామ్‌లో ఉంది. గత 24 టీ20 మ్యాచ్‌ల్లో 16 గెలిచింది. చిన్న జట్లనే కాదు వెస్టిండీస్‌ను కూడా నేపాల్ ఓ సిరీస్‌లో 2-1తో ఓడించడం విశేషం. ఇక తొలిసారి ప్రపంచకప్ ఆడుతోన్న ఇటలీ.. కనీస పోటీ ఇచ్చినా గొప్పే.

గ్రూప్–డి: అఫ్గానిస్థాన్, కెనడా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, యూఏఈ


మార్క్రమ్

ఈ టోర్నీలో అత్యంత ప్రమాదకరమైన గ్రూప్.. 'డి'నే. మిగతా గ్రూపుల్లోలా ఈ గ్రూపులో బలమైన జట్లు రెండుకు పరిమితం కాదు. దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌తో పాటు అఫ్గానిస్థాన్ ఈ గ్రూప్ నుంచి బరిలో ఉంది. దక్షిణాఫ్రికా గత టోర్నీలో రన్నరప్. తన చివరి సిరీస్‌లో 2-1తో వెస్టిండీస్‌పై విజయం సాధించింది. ఇక న్యూజిలాండ్.. భారత్‌తో సిరీస్‌లో దెబ్బతిన్నప్పటికీ ఐసీసీ టోర్నీల్లో ఎప్పుడూ మెరుగైన ప్రదర్శనే చేస్తుంది. కిందటిసారి గ్రూప్ దశలోనే నిష్క్రమించినా.. అంతకుముందు మూడు ప్రపంచకప్పుల్లో కనీసం సెమీఫైనల్ చేరుకోగలిగింది. అయితే ఈ గ్రూప్ నుంచి సూపర్ ఎయిట్స్‌కు చేరే జట్ల జాబితాలో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ ముందున్నా.. అఫ్గానిస్థాన్ అవకాశాలను కొట్టిపారేసే పరిస్థితి లేదు. అది ఇంకెంత మాత్రం పసికూన కాదు. ఆ జట్టు తనదైన రోజున ఎలాంటి టీమ్‌నైనా ఓడించగలదు. గత ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌లను అఫ్గాన్ ఓడించడం విశేషం. కెనడా, యూఏఈ ఏ మేర రాణిస్తాయో చూడాలి.

నిందితుణ్ని కోర్టులో అరెస్ట్ చేయడంపై వివరణ ఇవ్వండి

పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: కర్నూలు జిల్లా పత్తికొండ కోర్టులోకి మఫ్టీలో వెళ్లి ఓ నిందితుణ్ని అరెస్ట్ చేసిన వ్యవహారంపై వివరణ ఇవ్వాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. కోర్టులో లొంగిపోవడానికి వచ్చిన ఓ నిందితుణ్ని మఫ్టీలో వచ్చిన పోలీసులు అరెస్ట్ చేయడమే కాకుండా, అడ్డుకోవడానికి యత్నించిన న్యాయవాదులతో దురుసుగా ప్రవర్తించారని, ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పత్తికొండ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మధుబాబు హైకోర్టులో పిల్ వేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.. మేజిస్ట్రేట్ అనుమతి లేకుండా కోర్టు హాలులోకి చొరబడి నిందితుడిని అరెస్ట్ చేయడం చట్ట విరుద్ధమన్నారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం హోంశాఖ ముఖ్య కార్యదర్శి, కర్నూలు ఎస్పీ, చిప్పగిరి ఎస్సై సతీష్, పత్తికొండ ఎస్సై విజయకుమార్ నాయక్ తదితరులకు నోటీసులిచ్చింది. విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది.

జగన్ యాత్ర.. జనానికి యాతన

ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-గుంటూరు బృందం: పోలీసులు ఆంక్షలు విధించారు. ర్యాలీలు, సమావేశాలకు అనుమతి లేదని ముందే చెప్పారు. అయినా వాటిని ఉల్లంఘించి వైకాపా అధినేత జగన్ భారీ యాత్ర చేపట్టడంతో జనం పాట్లు అన్నీ ఇన్నీ కావు. జాతీయ రహదారిపై వాహనాలు ఆగిపోవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవించారు. వాస్తవానికి, జగన్ బుధవారం ఉదయం 10గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి 11గంటలకు గుంటూరు సిద్ధార్థనగర్‌లోని అంబటి నివాసానికి చేరుకోవాలి. 12 గంటలకు తిరిగి ప్రయాణమై ఒంటిగంటకల్లా తాడేపల్లికి చేరుకుంటారని ఆ పార్టీవర్గాలు వెల్లడించాయి. 10.40 గంటలకు జగన్ భారీ కాన్వాయ్‌తో గుంటూరుకు బయలుదేరారు. తాడేపల్లిలో బ్యారికేడ్లు ఏర్పాటుచేయగా, వాటిని తోసుకుని కాన్వాయ్‌లోకి ద్విచక్ర వాహనాలతో ప్రదర్శనగా వెళ్లారు. పార్టీ జెండాలు చేతపట్టి హంగామా చేశారు. పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉన్నందున అంబటి నివాసం వద్దకు వెళ్లొద్దని వైకాపా ముఖ్య నేతలకు పోలీసులు నోటీసులిచ్చినా పట్టించుకోలేదు.



గుంటూరు నగరంలో అంబటి రాంబాబు ఇంటి వద్ద జనానికి అభివాదం చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

కాజ టోల్‌ప్లాజా వద్ద బారులు

జగన్ పర్యటన కోసం ఆ పార్టీ నాయకులు కాజ టోల్‌ప్లాజా వద్ద 50కి పైగా వాహనాలను నిలిపేయడంతో గుంటూరు-విజయవాడ రహదారిపై భారీగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. దీంతో కిలోమీటర్ల మేర వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. వాటిలోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 4.30 గంటలకు అంబటి నివాసానికి జగన్ రాగా.. సుమారు 35 కి.మీ. దూరం రావడానికి సుమారు 6గంటల పాటు చాలా నెమ్మదిగా యాత్ర సాగించడం జనాన్ని అవస్థలకు గురిచేసింది.

రప్పా రప్పా అంటూనే..

దారిపొడవునా వైకాపా కార్యకర్తలు రప్పారప్పా అంటూ కేకలు వేస్తూ.. ప్రజలను, వాహనదారులను ఇబ్బందులకు గురిచేశారు. అంబటి రాంబాబు ఇంటి చుట్టూ పోలీసులు బారికేడ్లు ఏర్పాటుచేసి కట్టడి చేసినా వారిని తోసుకుంటూ గుమిగూడారు. అంబటి కార్యాలయం వద్ద ఉన్న ప్లాస్టిక్ రేకుల షెడ్డుపైకి కొందరు చేరగా, పోలీసులు వారిని కిందకు దింపారు. ఓ ఇంటి గోడపైకి చేరడంతో అక్కడి కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి.



కంకరగుంట వంతెన చివర ట్రాఫిక్ జామ్‌తో వాహనదారుల ఇబ్బందులు

బూతులు మాట్లాడే వారికి సంఘీభావమా?

- జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడి విమర్శలు



ఈనాడు, అమరావతి: బూతులు మాట్లాడిన వారికి మద్దతుగా రాష్ట్ర బంద్ చేస్తానంటూ వైకాపా అధినేత జగన్ అనడం సిగ్గుచేటని మంత్రి అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. గుంటూరు పర్యటనలో జగన్ అడుగడుగునా ట్రాఫిక్ నిబంధనల్ని ఉల్లంఘించి ప్రజల్ని ఇబ్బంది పెట్టారని, పార్టీ శ్రేణుల్ని రెచ్చగొట్టేలా నానాయాగీ చేశారని బుధవారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'జగన్ తన మంది మార్బలంతో గుంటూరు ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేశారు. బూతులు మాట్లాడిన నేతను చీవాట్లు పెట్టాల్సింది పోయి సంఘీభావం తెలుపుతున్నారు. 34 కి.మీ. 30 నిమిషాల్లో వెళ్లొచ్చు. కానీ జగన్ కొన్ని గంటలపాటు ప్రయాణించారు. తిరుగు ప్రయాణాన్ని మాత్రం 30 నిమిషాల్లో పూర్తి చేశారు' అని వరుస విమర్శలు చేశారు.

అరాచకవాదుల పరామర్శలకు జగన్ పర్యటించడం సిగ్గుచేటు

మంత్రి సత్యకుమార్ యాదవ్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, పక్కన ఎమ్మెల్యేలు మాధవి, నసీర్ తదితరులు

గుంటూరు (నగరంపాలెం), న్యూస్‌టుడే: వైకాపా నేతల అరాచకాలను సమర్థిస్తూ.. వారి పరామర్శకు జగన్ పర్యటనలు చేయడం సిగ్గుచేటని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు. గుంటూరులో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'వైకాపా నేతల తీరు చూస్తుంటే.. రాజకీయాలన్నా, రాజకీయ నేతలన్నా ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోంది. అరాచకవాదులను పరామర్శించేందుకు జగన్ వెళ్తున్నారు. దళిత, మైనారిటీలను చంపి డోర్ డెలివరీ చేసే నాయకులను, బాలుడిని చంపిన వ్యక్తులను పరామర్శించే పనిలో జగన్ బిజీగా ఉన్నారు. బూతులు మాట్లాడేవారిని, విచ్ఛిన్నకర శక్తులను ప్రోత్సహిస్తున్నారు. అంబటి రాంబాబు అసభ్యంగా మాట్లాడడంతోనే కార్యకర్తలు అడిగేందుకు వెళ్లారు. మంత్రివర్గ సమావేశంలో తిరుమల నెయ్యి విషయంలో దిగ్భ్రాంతికర విషయాలు తెలిశాయి. కల్తీ నెయ్యి విషయం నుంచి దృష్టి మళ్లించేందుకే జగన్ ఇలాంటి పరామర్శలు చేస్తున్నారు. వైకాపా అరాచకాలను భరించలేక ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా వైకాపా నేతల తీరులో మార్పు రాకపోవడం సిగ్గుచేటు'.. అని ఎద్దేవా చేశారు.

ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీయడమే జగన్ లక్ష్యం

మంత్రి సత్యప్రసాద్, చీఫ్ విప్ ఆంజనేయులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా వైకాపా అధినేత జగన్ పనిచేస్తున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మండిపడ్డారు. వారిద్దరూ బుధవారం వేర్వేరుగా విలేకర్లతో మాట్లాడారు. దండయాత్రకు వెళ్లినట్టు జగన్ గుంటూరు వెళ్లారని, అంబులెన్స్‌కూ దారి ఇవ్వకుండా ప్రజల్ని వేధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పరామర్శల పేరుతో జగన్ డ్రామాలు: మంత్రి దుర్గేష్

ఈనాడు, అమరావతి: పరామర్శల పేరుతో జగన్ డ్రామాలాడుతున్నారని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ బుధవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడటం క్షమించరాని నేరమని, కోట్ల మంది హిందువుల మనోభావాలతో ముడిపడిన ఈ వ్యవహారంలో దోషులు ఎంతటివారైనా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

రాయిని చీల్చి.. రాజసంగా ఎదిగి!



అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం గుర్రాయికి వెళ్లే మార్గంలో ఓ పెద్ద రాయి మధ్యలో మొలకెత్తిన మామిడి మొక్క.. దాన్ని చీల్చుకుంటూ భారీ వృక్షంగా ఎదిగింది. ప్రస్తుతం పచ్చని ఆకులతో విస్తరించి.. నీడ, ఫలాలు ఇస్తోంది.గతంలో రాయి ఒకటిగానే ఉండేదని, మామిడి చెట్టు ఎదుగుతుండడంతో రెండుగా విడిపోయిందని స్థానికులు పేర్కొన్నారు.

\- జి.మాడుగుల, న్యూస్‌టుడే

రాంబాబన్న చేసిన తప్పేంటి?



అంబటి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న జగన్

(మొదటి పేజీ తరువాయి)

కారు అడ్డగించారు. కారును బాదుతూ బూతులు తిట్టారు. ఆ సమయంలో ఒక్కడే ఉండటంతో ఆయనా రెండు తిట్లు తిట్టారు. అయినా పెద్దమనిషి, సంస్కారం ఉన్న వ్యక్తి కాబట్టి ఇంటికొచ్చి ప్రెస్‌మీట్ పెట్టి తాను అలా తిట్టకూడదని బాధపడి చెప్పారు. అంతటి సంస్కారం ఉన్న వ్యక్తిని చేతనైతే పొగడాలి' అని వైకాపా అధినేత జగన్ వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన గుంటూరు సిద్ధార్థనగర్‌లోని అంబటి రాంబాబు నివాసానికి వచ్చారు. పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉన్నప్పటికీ తాడేపల్లి నుంచి భారీ కాన్వాయ్‌తో బయలుదేరి, షెడ్యూలు సమయం కంటే ఆరు గంటలు ఆలస్యంగా చేరుకున్నారు. అంబటి కుటుంబసభ్యులను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, జంగిల్‌రాజ్‌తో భయానక పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. తిరుమల లడ్డూ నెయ్యిలో జంతువుల కొవ్వు, చేపనూనె కలిసిందంటూ చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణ్ ఏడాదిన్నరపాటు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేశారన్నారు.

దాడి చేసిన తెదేపా ఎమ్మెల్యే, ఆమె భర్తపై చర్యలేవి?

'ముఖ్యమంత్రి చంద్రబాబును తిట్టినందుకు రాంబాబును అరెస్ట్ చేస్తే ఆయన కార్యాలయంపై దాడి చేసిన ఎమ్మెల్యే గల్లా మాధవి, ఆమె భర్తపై ఏం చర్యలు తీసుకున్నారు? వారికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపడం సబబేనా? జోగి రమేష్ ఇంటిపైకి పోలీసుల సమక్షంలోనే పెట్రోల్ బాంబులు విసరడం, విడదల రజిని గుడికి వెళ్లి వస్తుంటే ఆమెను దుర్భాషలాడి, తిరిగి ఆమెపైనే కేసు పెట్టడం.. బొల్లా బ్రహ్మనాయుడిపై దౌర్జన్యం.. ఇవన్నీ ఏమిటి' అని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు ఆధ్వర్యంలో తెదేపా ఎమ్మెల్యేలు వైన్‌షాపులు, బెల్ట్‌షాపులు నడుపుతూ.. పర్మిట్ రూమ్‌ల్లో అధిక ధరలకు విక్రయిస్తూ ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని పంచుకుంటున్నారని జగన్ విమర్శించారు. ప్రతి ఐదు బాటిళ్లకు ఒకటి వీళ్లే చీప్‌లిక్కర్ తయారు చేస్తూ కల్తీ మద్యాన్ని ప్రోత్సహిస్తున్నారని.. ఇటీవల ఆ కల్తీ మద్యం తాగి నలుగురు చనిపోయారని జగన్ ఆరోపించారు. తంబళ్లపల్లెలో తెదేపా నుంచి పోటీ చేసిన జయచంద్రారెడ్డి ఎక్సైజ్ అధికారులకు దొరికిపోతే వైకాపా నాయకుడు జోగి రమేష్‌పై తప్పుడు కేసు పెట్టారని విమర్శించారు.

ఏం జరుగుతుందో ఆలోచించుకోండి

'ఈ ప్రభుత్వంలో 200 మంది పోలీస్ అధికారులు వీఆర్‌లో ఉన్నారు. వారికి కావల్సినవారినే సీఐ, డీఎస్పీ, డీఐజీలుగా వేసుకున్నారు. ఎస్పీలు మీకు ఊడిగం చేస్తున్నారు. కళ్లు మూసుకుంటే రెండేళ్లు అయిపోయాయి. ఇంకోసారి కళ్లు మూసుకుంటే మూడేళ్లు అయిపోతాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు చెబుతున్నా.. మీకు మొట్టికాయలు పడతాయి. వైకాపా నాయకులు దెబ్బతిని ఉన్నారు. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత మీకు ఏం జరుగుతుందో ఆలోచించుకోండి' అని జగన్ హెచ్చరించారు.

రాష్ట్ర బంద్‌లకు పిలుపునిస్తాం

రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే స్పందనలు వేరేలా ఉంటాయని, రాష్ట్రవ్యాప్తంగా బంద్‌లకు పిలుపునిస్తామని జగన్ చెప్పారు. దిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్సీ, సుప్రీంకోర్టుల తలుపు తడతామన్నారు. తిరుమల నెయ్యి విషయంలో చంద్రబాబు తప్పులు జనానికి తెలిసిపోయాయని, అందుకే ఆయనకు కావాల్సిన విధంగా నివేదిక ఇచ్చేలా ఓ కమిటీ వేస్తామంటూ కొత్తపల్లవి అందుకున్నారని విమర్శించారు.

గైర్హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు సీజనల్ వసతిగృహాలు

ఈనాడు, అమరావతి: పదో తరగతిలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు విద్యార్థులకు సీజనల్ వసతిగృహాలు ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఎక్కువ కాలం తరగతులకు గైర్హాజరవుతున్న విద్యార్థులను వీటిల్లో ఉంచనున్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా పాఠశాలల్లో రోజువారీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. 600 మంది విద్యార్థులు ఇప్పటివరకు ఒక్క పరీక్షా రాయలేదు. కొన్ని పరీక్షలు మాత్రమే రాసిన వారు మూడు వేల మంది వరకు ఉన్నారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 20 వేలకు పైగా విద్యార్థులు ఈ పరీక్షలకు సరిగా హాజరు కావడం లేదు. వీరిని ప్రత్యేకంగా వసతిగృహాల్లో ఉంచి, తరగతులకు హాజరయ్యేలా చూడనున్నారు. బాలికలకు ఆయా పాఠశాలలకు సమీపంలోని ఆదర్శ పాఠశాలలు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లోని వసతిగృహాల్లో వసతి కల్పించనున్నారు. బాలురకు డివిజన్‌కు ఒక ప్రత్యేక వసతిగృహాన్ని ఏర్పాటు చేస్తారు.

పోలీసింగ్‌కు కృత్రిమ మేధ

- 'ఏఐ4 ఏపీ పోలీస్' పేరిట మూడు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు
- 8 మాడ్యుల్స్ అమలు ప్రారంభించిన డీజీపీ
- 6 నెలల్లో అన్ని జిల్లాలకూ విస్తరణ

ఈనాడు, అమరావతి: పోలీసింగ్‌లో కృత్రిమ మేధ వినియోగాన్ని మరింత విస్తృతం చేసేందుకు వీలుగా.. 'ఏఐ4 ఏపీ పోలీస్' పేరిట రాష్ట్రంలోని చిత్తూరు, గుంటూరు, అన్నమయ్య జిల్లాల్లో ప్రయోగాత్మక ప్రాజెక్టుల అమలును డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా బుధవారం ప్రారంభించారు. పిటిషన్ ఏఐ, డిజిటల్ ఎవిడెన్స్ ఏఐ, కాగ్నెటివ్‌నెట్ ఏఐ, ఇన్వెస్టిగేషన్ కో-పైలట్, డాక్స్ 2 డేటా, సోషల్ ఇంటెలిజెన్స్ ఏఐ, న్యూస్ 360 ఏఐ, ఏఐ ఫౌండేషన్ పేరిట మొత్తం 8 రకాల ఏఐ టూల్స్‌ను ఈ మూడు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా వినియోగించనున్నారు. ఇవి ఫిర్యాదుల స్వీకరణ, వాటి పరిష్కారం, డిజిటల్ సాక్ష్యాల విశ్లేషణ, ఆధార సహిత దర్యాప్తు, దర్యాప్తు అధికారికి సాంకేతిక సహకారం, సామాజిక మాధ్యమాలపై నిఘా తదితర అంశాలకూ ఉపయోగపడనున్నాయి. గతేడాది జూన్‌లో 'ఏఐ4 ఏపీ పోలీస్' పేరిట హ్యాకథాన్ నిర్వహించి.. అందులో రాష్ట్రంలో అమలు చేసేందుకు అనువుగా ఉన్న పలు ఏఐ టూల్స్‌ను గుర్తించారు. వాటిని మరింత అభివృద్ధి పరిచి ఇప్పుడు ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో బుధవారం ఈ కార్యక్రమాన్ని డీజీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాంకేతికత అమల్లో ఏపీ పోలీసులు ఎప్పుడూ ముందున్నారని, ఆరు నెలల్లో అన్ని జిల్లాల్లో దీన్ని అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సాంకేతిక సేవల విభాగం ఐజీ సీహెచ్.శ్రీకాంత్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎనిమిది మాడ్యూల్స్‌తో..

- 'ఏఐ4 ఏపీ పోలీస్' ప్రాజెక్ట్‌లో ఎనిమిది మాడ్యూల్స్ కీలకం కానున్నాయి.
- ప్రజల నుంచి వచ్చిన పిటిషన్లపై అధికారులు సమీక్ష చేసినప్పుడు పిటిషన్ ఏఐని వినియోగిస్తారు. దీనివల్ల సమీక్ష సమయం 30-45 నిమిషాల నుంచి 5-10కి తగ్గుతుంది.
- టెలికాం ఆపరేటర్లు, బ్యాంకులు, పేమెంట్ గేట్‌వేలకు నోటీసుల జారీ, వాటి ట్రాకింగ్‌ను ఆటోమేషన్ చేసేందుకు డిజిటల్ ఎవిడెన్స్ ఏఐని వినియోగిస్తారు.
- కాగ్నెటివ్‌నెట్ ఏఐ.. అనేది కాల్ డేటాలను, బ్యాంకు స్టేట్‌మెంట్లను ఎనలైజ్ చేసి, ఆ వివరాలను దర్యాప్తు అధికారులకు తెలియజేస్తుంది.
- ఇన్వెస్టిగేషన్ కో-పైలట్ అనే మాడ్యూల్.. బీఎన్ఎస్, పోక్సో, ఐటీ యాక్ట్‌లకు సంబంధించి సెక్షన్లను సూచిస్తుంది. కేస్ డైరీలను వాలిడేట్ చేస్తుంది.



'ఏఐ4 ఏపీ పోలీస్' ప్రాజెక్టును ప్రారంభిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, చిత్రంలో సాంకేతిక సేవల విభాగం ఐజీ పాలరాజు

- పేపర్ ఆధారిత పర్సనల్ రికార్డులను ఏఐ పవర్డ్ ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నైజ్ చేసి డిజిటల్ నాలెడ్జ్ బేస్‌గా మార్చేందుకు డాక్స్ 2 డేటా అనే మాడ్యూల్ సహకరిస్తుంది.
- నాయిసీ వాట్సప్ గ్రూప్ చాటర్‌లపై చర్య తీసుకోదగిన ఇంటెలిజెన్స్‌గా మార్చేందుకు సోషల్ ఇంటెలిజెన్స్ ఏఐ మాడ్యూల్ ఉపకరిస్తుంది.
- రాష్ట్ర స్థాయి, జిల్లాల్లో అన్ని పత్రికల్లో వచ్చే వార్తలను ట్రాక్ చేసేందుకు న్యూస్360 ఏఐ మాడ్యూల్‌ని వినియోగిస్తారు. ఇది వార్తలను అనువదించి, సమ్మరైజ్ చేస్తుంది.
- ఏఐ ఫౌండేషన్ అనే మాడ్యూల్ డేటా సెక్యూరిటీని, కన్సిస్టెంట్ అవుట్‌పుట్స్‌ను నిర్ధారిస్తుంది.

పశు ఔషధి కేంద్రాల్లో తక్కువ ధరకు నాణ్యమైన మందులు

సహకార సంఘాల ద్వారా ఏర్పాటు!

ఈనాడు, అమరావతి: కేంద్ర పశుసంవర్ధక-పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జాతీయ పశు వ్యాధుల నియంత్రణ పథకం కింద పశు ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ రాష్ట్ర సంచాలకుడు డాక్టర్ టి.దామోదర్‌నాయుడు బుధవారం ప్రకటించారు. వీటితో నాణ్యమైన జనరిక్ పశు ఔషధాలు చౌక ధరలకే అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కేంద్రాలను ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలు(పీఎం-కేఎస్‌కేలు), సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేస్తారని, జిల్లా, మండల కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్నవారు https://pashuaushadhi.dahd.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు పొందవచ్చని లేదా, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిని సంప్రదించాలని సూచించారు. ఈ కేంద్రాలకు ఆపరేటింగ్ మార్జిన్‌గా 20శాతం ఇస్తారని తెలిపారు.

స్టాక్ మార్కెట్‌లో రూ.36 లక్షలు నష్టపోయి.. రైలు కిందపడి చీఫ్ ఇంజినీర్ బలవన్మరణం



హర్షవర్ధన్

విశాఖపట్నం (కూర్మన్నపాలెం), న్యూస్‌టుడే: ఓ ప్రైవేటు షిప్పింగ్ సంస్థలో చీఫ్ ఇంజినీరుగా పనిచేస్తున్న వ్యక్తి స్టాక్ మార్కెట్‌లో భారీగా నష్టపోయి బలవన్మరణానికి పాల్పడ్డారు. చిత్తూరు జిల్లా కాణిపాకం సమీపంలోని బొమ్మసముద్రానికి చెందిన చల్లగుండ్ల హర్షవర్ధన్ (36) విశాఖలోని ఓ షిప్పింగ్ సంస్థలో చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తూ పెదగంట్యాడ వుడా నగర్‌లో కుటుంబంతో కలిసి నివాసముంటున్నారు. ఆయనకు ఓ పాప కూడా ఉంది. బుధవారం తెల్లవారుజామున హర్షవర్ధన్ కాకినాడ వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిపోయారు. తర్వాత కొంతసేపటికి ఆయన ఫోన్ నుంచి 'అన్నింటా విఫలమయ్యాను. మీకు అన్యాయం చేసి వెళ్లిపోతున్నాను. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడంతో ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. పాప జాగ్రత్త' అంటూ భార్య ఫోన్‌కు సంక్షిప్త సందేశం వచ్చింది. కంగారుపడిన కుటుంబ సభ్యులు స్నేహితులను వాకబు చేసినా జాడ తెలియకపోవడంతో పెదగంట్యాడ న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఈలోపే రైలు పట్టాలపై ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో హర్షవర్ధన్ కుటుంబ సభ్యులు కూడా అక్కడకు వెళ్లి చూసి.. చనిపోయింది ఆయనే అని గుర్తించి నిర్ఘాంతపోయారు. హర్షవర్ధన్ సుమారు రూ.36 లక్షల వరకు స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టి నష్టపోయినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్సీకి వైకాపా ఎంపీల ఫిర్యాదు



ఎన్‌హెచ్‌ఆర్సీ ఛైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్‌కు వినతి పత్రం ఇస్తున్న వైకాపా ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి తదితరులు

ఈనాడు, దిల్లీ: రాష్ట్రంలో తమ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని వైకాపా ఎంపీలు, నాయకులు బుధవారం దిల్లీలోని జాతీయ మానవ హక్కుల సంఘానికి (ఎన్‌హెచ్‌ఆర్సీ) ఫిర్యాదు చేశారు. ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి, మద్దిల గురుమూర్తి, పిల్లి సుభాష్ చంద్రబోస్, గొల్ల బాబూరావు, మేడా రఘునాథ్‌రెడ్డి, అయోధ్య రామిరెడ్డి, తనూజారాణి తదితరులు ఎన్‌హెచ్‌ఆర్సీ ఛైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం పార్టీ నాయకుడు జూపూడి ప్రభాకర్‌రావు విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా నాయకులపై తెదేపా చేస్తున్న దాడులపై దర్యాప్తు చేయాలని కోరినట్లు చెప్పారు. అందుకు ఎన్‌హెచ్‌ఆర్సీ ఛైర్మన్ అంగీకరించారని, డీజీపీ ద్వారా నివేదిక తెప్పించుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఎంపీ తనూజారాణి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంపై గౌరవంతో తమ పార్టీ మౌనంగా ఉందని, అధికారంలోకి వచ్చిన తర్వాత చర్యకు ప్రతి చర్య ఉంటుందని హెచ్చరించారు. ఆ తర్వాత వీరంతా ఇదే అంశంపై జాతీయ ఎస్సీ కమిషన్‌కూ ఫిర్యాదు చేశారు.

రాక్రీట్ అక్రమాలపై 13 మంది అధికారులకు తాఖీదులు

- వైకాపా నేతలతో కలిసి అక్రమాలకు పాల్పడ్డ అధికారుల్లో అలజడి

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణశాఖలో జరిగిన అక్రమాలపై 13 మంది అధికారులకు తాఖీదులు ఇచ్చారు. రాక్రీట్ సంస్థ గృహ నిర్మాణాల్లో చేసిన అవినీతిపై విచారణకు విజిలెన్స్ అధికారులను ప్రభుత్వం నియమించింది. వారు పాక్షికంగా నివేదిక అందజేశారు. ఈ నేపథ్యంలో గృహనిర్మాణ సంస్థ ఎండీ కార్యాలయం నుంచి అప్పట్లో పనిచేసిన డీఈలు, ఏఈలకు వ్యక్తిగతంగా నోటీసులు జారీ చేసింది. వారం క్రితమే తాఖీదులు పంపారు. అయితే ఈ అంశాన్ని ఆ శాఖలోని అధికారులు గుట్టుగా ఉంచారు. అప్పట్లో వైకాపాతో అంటకాగిన అధికారులు ప్రస్తుతం అనంతపురం, శ్రీసత్యసాయితో పాటు కర్నూలు, ఇతర జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో కొందరు గతంలో అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నిబంధనలు అతిక్రమించి బిల్లులు చేశారు. ఈ క్రమంలో ఒక డీఈ, ఏఈ సస్పెండ్ కావడంతో పాటు ఇద్దరు ఏఈలను విధుల నుంచి తొలగించారు. ఇంకొందరిపై చర్యలకు సిఫార్సు చేశారు.

అంటకాగిన అధికారుల్లో దడ: రాప్తాడుకు చెందిన వైకాపా నేత బంధువుకు సంబంధించిన రాక్రీట్ సంస్థ ఆధ్వర్యంలో ఆలమూరు, సిద్దరాంపురం, ఉప్పరపల్లితో పాటు పలు ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించారు. ఇందులో భారీగా అక్రమాలు సాగాయని విజిలెన్స్ గుర్తించింది. ఇళ్ల నిర్మాణాల స్థాయి, బిల్లుల చెల్లింపునకు ఏమాత్రం పొంతన లేదు. అప్పట్లో వైకాపాతో అంటకాగిన అధికారులు ఓ స్థాయిలో ఉంటే నిర్మాణ వ్యయాన్ని పెంచి బిల్లులు చేశారని తేల్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం విజిలెన్స్ విచారణ చేపట్టగా, ఇంకా పూర్తి స్థాయిలో నిర్ణయం తీసుకోలేదు. ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని అప్పట్లో అంటకాగిన పలువురు అధికారులకు భయం పట్టుకుంది.

పని దినాలుగా పీహెచ్‌సీ వైద్యుల సమ్మె కాలం

ఈనాడు, అమరావతి: పీహెచ్‌సీ వైద్యులు గతేడాది సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 24వ తేదీ వరకు చేపట్టిన సమ్మె కాలాన్ని పనిదినాలుగా ప్రభుత్వం పరిగణించింది. విధుల్లో తిరిగి చేరేందుకు ఒక రోజు బఫర్‌ను అనుమతించింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ప్రత్యేక నిర్ణయం ఒక్కసారికి మాత్రమే పరిమితమని, ఈ నిర్ణయాన్ని భవిష్యత్తులో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉదాహరణగా చూపకూడదని ప్రభుత్వం పేర్కొంది. భవిష్యత్తులో పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలు, ఆందోళనల్లో పాల్గొంటే ఏపీ సివిల్ సర్వీసెస్ నిబంధనలు, సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేసింది.

పీహెచ్‌సీల వైద్యుల సంఘం హర్షం: పీహెచ్‌సీ వైద్యుల సమ్మెకాలాన్ని ఆన్‌డ్యూటీగా పరిగణిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఏపీ పీహెచ్‌సీ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బి.రవీంద్రనాయక్ హర్షం వ్యక్తంచేశారు. ప్రభుత్వానికి, వైద్యారోగ్యశాఖ మంత్రి, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

22న బీసీ సింహగర్జన



పోస్టర్‌ను ఆవిష్కరించిన రామచంద్ర యాదవ్ తదితరులు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: నాగార్జున యూనివర్సిటీకి ఎదురుగా ఉన్న పులే అంబేడ్కర్ ప్రాంగణంలో ఈ నెల 22న బీసీ సింహగర్జన సభ నిర్వహిస్తున్నట్లు బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని బీసీవై పార్టీ కార్యాలయంలో బీసీ సింహగర్జన పోస్టర్‌ను ఆయన బుధవారం ఆవిష్కరించారు. 'బీసీల రక్షణ చట్టం, రాజధాని ప్రాంతంలో బీసీలకు వెయ్యి ఎకరాల భూమి కేటాయింపు, బీసీ కులాల కార్పొరేషన్లకు నిధులు, సమగ్ర కులగణన, విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలు, చట్టసభల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే నినాదంతో ఈ సభను ఏర్పాటు చేస్తున్నాం' అని వెల్లడించారు.

EENADU Vol: 52, Issue: 176 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

మకరందం

■ makarandam@eenadu.in

గురువారం ఫిబ్రవరి 5, 2026 — ఈనాడు

13 మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512



మాతృప్రేమకు నిదర్శనం యశోద


ఫిబ్రవరి 7 యశోద జయంతి

లోకంలో తల్లి ప్రేమ మహత్తరమైంది.. పెంచిన ప్రేమ ఇంకా గొప్పది- అంటారు పెద్దలు. వెన్నముద్దలు తినిపిస్తూ కన్నయ్యను అపురూపంగా పెంచింది యశోదాదేవి. అందుకే యశోదమ్మ జన్మించిన మాఘ బహుళ షష్ఠి తిథిని వేడుక చేసుకుంటారు. ఈ రోజున మధుర, బృందావనం, గోకులం తదితర ప్రాంతాల్లో బాలకృష్ణుడితో ఉన్న యశోదమ్మ రూపాన్ని పూజించడం ఆచారం. తమ పిల్లలు క్షేమంగా ఉండాలని కోరుకుంటూ యశోదాదేవిని పూజిస్తారు. దేవకి వసుదేవులు కంసుడి చెరలో ఉండటం వల్ల వారి సంతానమైన కృష్ణుడిని యశోద పెంచింది. ఆమె మాతృవాత్సల్యం వర్ణించనలవి కానిది. భగవత్ స్వరూపుడైన బాలగోపాలుణ్ణి పెంచి పెద్దచేసే అదృష్టం ఆమెకు దక్కడం పూర్వజన్మ సుకృతం. కన్నతల్లి కన్నా మిన్నగా, అపురూపంగా పెంచిందామె. కృష్ణుడి ఆలయాల్లో యశోద జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. మందిరాలను కనువిందుచేసేలా అలంకరిస్తారు. ప్రత్యేక పూజలు, భజనలు ఏర్పాటు చేస్తారు. యశోద స్వచ్ఛమైన మాతృ హృదయానికి ప్రతీక. కృష్ణుడి పట్ల ఆమెకున్న ప్రేమ, అనురాగం, ఆత్మీయత, త్యాగనిరతి అనిర్వచనీయం.

ఎలా చేయాలి..

ఈ రోజున ఉదయాన్నే స్నానం చేసి, పూజామందిరాన్ని తీర్చిదిద్దాలి. ఎర్రటి వస్త్రాన్ని పరచి, యశోద ఒడిలో కృష్ణుడు కూర్చున్న చిత్రాన్ని ఏర్పాటుచేసి కుసుమాలతో అలంకరించాలి. నైవేద్యాలు సమర్పించి.. చిన్ని కృష్ణుని లీలలను స్మరించాలి. యశోదాకృష్ణులను పూజించి.. హారతి ఇవ్వాలి. పూజానంతరం అతిథులకు ప్రసాదం పంచాలి. ఆవులకు అరటిపండ్లు తినిపించాలి. ఇలా చేయడం వల్ల సకల శుభాలూ చేకూరతాయని విశ్వసిస్తారు.

» జ్ఞానులకు హృదయం కుడి వైపున.. «



ఆశ్రమంలో తన చుట్టూ ఉన్న భక్తులతో అనేక ఆధ్యాత్మిక విషయాలను పంచుకునేవారు రమణ మహర్షి. ఒక సందర్భంలో రమణులు... 'సాధారణ వ్యక్తులకు హృదయం ఎడమ వైపున ఉంటుంది. కానీ జ్ఞానులకు కుడి వైపున ఉంటుందని గ్రహించాను. అష్టాంగ యోగం, శీతోపనిషత్తులు ఇందుకు ప్రామాణికం. జ్ఞానులకు కుడి వైపున ఉండే హృదయాన్ని చేతనా హృదయం అంటారు. చిన్నారుల్ని మీరెవరని అడిగితే.. ఛాతీ కుడి వైపున చేతిని తాకించి తమ పేరు చెబుతారు. పిల్లలు దైవ సమానులు, వాళ్ల మనోహృదయం కుడివైపునే ఉంటుందన్నమాట. ఆధ్యాత్మిక విషయాలను అర్థం చేసుకోవాలంటే ప్రామాణిక గ్రంథాలను అధ్యయనం చేయాలి. ఆయా అంశాలను అంతర్దృష్టితో పరిశీలించి చూసి, స్వానుభవంతో విశ్లేషించాలి. పెద్దలతో చర్చించాలి. అప్పుడే మనం గ్రహించిన విషయాల్లో ఎంత నిజం ఉందో స్పష్టమవుతుంది. ఎందరో పెద్దలు 'నిన్ను నువ్వు తెలుసుకో' అన్నారు. నేను అనే భావం ఎక్కడ పుట్టిందో అదే హృదయం. నేను అనేది అహాన్ని సూచించే పదంగా పండితులు చెబుతున్నారు. కానీ అదే పదాన్ని 'నేను అనే అహమే బ్రహ్మ స్వరూపం' అని బృహదారణ్యక ఉపనిషత్తు పేర్కొంది. జగద్గురు ఆదిశంకరాచార్యులు 'అహం బ్రహ్మాస్మి' అన్నారు. ఈ సందర్భంలో హృదయాన్ని ఆత్మ స్వరూపం అనాలి. సూర్యుడు రాత్రి వేళ తన వెలుగును చంద్రుడికి ఇచ్చి ప్రకాశింపజేస్తున్న రీతిలో హృదయమనే సూర్యుడి కాంతి మనసనే చంద్రుణ్ణి ప్రకాశింపచేస్తోంది. మనసులో భేద భావాలు ఉంటే జనన మరణ చక్రం కొనసాగుతూనే ఉంటుంది. అలాంటి వ్యత్యాసాలు లేని జ్ఞానులను మోక్షం వరిస్తుంది. మనసుకు భేద బుద్ధి ఉంది కానీ హృదయానికి ఉండదు. అందుకే అది అన్ని శరీర భాగాలకూ సమ దృష్టితో రక్తాన్ని అందిస్తోంది. భేద బుద్ధి కలిగిన మనసును హృదయంలో లయం చేస్తే భగవత్ సాక్షాత్కారమవుతుంది' అంటూ వివరించారు.

– డా.జయదేవ్ చల్లా

సనాతన విజ్ఞాన సర్వస్వం గరుడపురాణం

గరుడపురాణం... ఈ పేరు వినగానే మనలో భక్తిశ్రద్ధల కంటే భయాందోళనలే ఎక్కువగా కలుగుతాయి. దానికి ప్రధాన కారణం అసలు అందులో ఏముందో తెలియకపోవడమే. దాన్ని గనుక చదివితే.. ఇన్ని అపురూప విషయాలా- అని ఆశ్చర్యం, ఆనందం కలుగుతాయి. గరుడపురాణంలోని విజ్ఞాన ప్రకాశంతో భ్రమలన్నీ పటాపంచలవుతాయి.



గరుడ పురాణం ఇంట్లో ఉంచుకో కూడదు, పగటిపూటే చదవాలి- వంటి అసంబద్ధ ఆలోచనలకు కారణం ఆ గ్రంథం పట్ల అవగాహన లేకపోవడమే. దాదాపు 19 వేల శ్లోకాలు, 314 అధ్యాయాల విజ్ఞాన భాండాగారమిది.

ఎవరు, ఎవరికి చెప్పారు?

గరుడపురాణాన్ని విష్ణుమూర్తి రుద్రునికి, గరుడునికి చెప్పాడు. గరుత్మంతుని నుంచి కశ్యపునికి, అతని నుంచి వ్యాసునికి, వ్యాసుని నుంచి సూతునకు, సూతుని నుంచి శౌనకాది మహర్షులకు.. వారి ద్వారా లోకానికి అందింది. నిరంతర విష్ణు నామస్మరణ వల్ల పరమాత్మ నుంచి నేరుగా జ్ఞానాన్ని పొందడమే కాకుండా, పరమాత్మకు వాహనంగా మారాడు గరుత్మంతుడు. విష్ణువు చెప్పడాన విష్ణుపురాణమనో, రుద్రుడు వినడాన రుద్రపురాణమనో కాకుండా గరుడపురాణం అనడం వెనుక ఆంతర్యం ఉంది. గరుడుడు విషాన్ని హరించే శక్తి గలవాడు. 'అమృతం అంటే కేవలం బ్రహ్మవిద్య, దానికి భిన్నమైనది విషం' అని పేర్కొంది గరుడోపనిషత్తు. మన శరీరాన్ని బాధించే వ్యాధులు, మనసులోని రజస్తమోగుణాలు అనే విషాన్ని నాశనం చేయగలిగినవాడు గరుడుడు. ఆ అజ్ఞానమనే విషాన్ని తొలగించి జ్ఞానకాంతిని నింపే గ్రంథం కాబట్టి ఇది గరుడపురాణం.

ఇందులో ఏముంది?

గరుడపురాణంలో ఏముంది అనేకంటే, లేనిదేమిటో తెలుసుకోవడం సులభం. అంత విస్తృత విజ్ఞానం ఉంది. 14 ఊర్ధ్వ, అధో లోకాలు ఎలా ఉంటాయి? భూమి ఎలా ఉంది? ఎన్ని ద్వీపాలు? వాటిలో ఏముంది- ఇలా సర్వం ఉన్నాయి. జ్యోతిష, సాముద్రిక శాస్త్రాలు, ప్రాణులు, ప్రత్యేకించి మానవజాతి గురించి; మన శరీర భాగాలు, ముఖ లక్షణాలు ఏవెలా ఉంటే ప్రవర్తన, స్వభావం ఎలా ఉంటుంది?; శారీరక లక్షణాలను బట్టి కారణజన్ముడా? సాధారణ వ్యక్తియా? వారి ఆలోచన ఎలా ఉంటుంది? ఏం సాధించగలరు? ఆయుష్షు ఎంత? ఎలాంటి అనారోగ్యం, పరిణామాలు ఎలా ఉంటాయి?- వంటి అనేక విషయాల్ని వివరిస్తుంది. జబ్బుల్లో రకాలు, వాటి నివారణ మార్గాలు; ఔషధ విజ్ఞానం, రోగాల నుంచి రక్షించుకోవడానికి పాటించాల్సిన జీవన విధానం; ఏ కాలంలో ఏం తినాలి? ఎంత తినాలి?; గోవులు, గుర్రాల్లో రకాలు, వాటి లక్షణాలు, వచ్చే సమస్యలు, నివారణలు; రాజనీతి, దండనీతి మొదలైన నీతి శాస్త్రాలు; సక్రమ జీవన విధానాన్ని తెలియజేసే ధర్మశాస్త్రం; రత్నాల స్వరూపస్వభావాల్ని తెలియజేసే అర్థశాస్త్రం; శారీరక లక్షణాల్ని బట్టి కలిగే వికారాల్ని చెప్పే కామశాస్త్రం; పరమాత్మను చేరే మార్గం చూపే మోక్ష శాస్త్రం; వాస్తు శిల్ప శాస్త్రాలు; వర్ణాశ్రమ ధర్మాలు; పితృ దేవతారాధన; మంత్రోపాసన; ప్రాయశ్చిత్తాలు, శ్రాద్ధ కర్మలు; దీక్షలు, వ్రతాలు; తీర్థ మహిమలు, క్షేత్ర మహిమలు- అన్నీ ఉన్నాయి. అంతేనా.. తిథి వార నక్షత్రాల ప్రత్యేకతలు; 24 విష్ణు అవతార కథలు; మనకు కనిపించే స్థూల దేహమే కాకుండా సూక్ష్మ కారణ శరీరాలు వాటి గతులు; పుణ్యాత్ములు దివ్యలోకాలకు, పాపాత్ములు నరక లోకాలకు వెళ్లే విధానం.. ఒక్క మాటలో చెప్పాలంటే సృష్టి మొదలుకొని, సనాతన సంప్రదాయ సమగ్ర స్వరూపాన్ని తెలియజేసే హిందూ విజ్ఞాన సర్వస్వమిది. ఐహిక కోరికల్ని తీర్చి, పారమార్థికతను ప్రసాదించగల ఉద్గ్రంథం గరుడ మహాపురాణం.

ప్రేతకల్పం పేరుతో మరణానంతర క్రియలు, యమలోక వర్ణన, నరకలోకంలోని 16 పురాలు, అక్కడ పాపులకు విధించే శిక్షలు, వైతరణీనది వర్ణన మొదలైనవి 16 అధ్యాయాల్లో ఉన్నాయి. ఇది గరుడపురాణ సారోద్ధారం / గరుడపురాణం పేరుతో ప్రచారంలో ఉన్న కారణంగా ప్రజల్లో ఆందోళనలకు తావిచ్చింది.

గరుడపురాణం ప్రేతకల్పంలో సౌమ్య, శౌరీ, నాగేంద్ర భవన, గంధర్వ, శైలాగమ, క్రౌంచ, క్రూర, విచిత్ర భవన, బహ్వాపద, దుఃఖద, నానాక్రంద, సుతప్త, రౌద్ర, పయోవర్షణ, శీతాఢ్య, బహుభీతి- అనే 16 నరక పురాల వర్ణన, మన కర్మానుసారంగా అక్కడ వేసే శిక్షల వివరాలు ఉన్నాయి.

గరుడపురాణం ప్రకారం- జీవుడు భౌతిక శరీరాన్ని విడిచిన 171వ రోజు యముని సోదరుడు విచిత్రరాజు పరిపాలించే విచిత్ర భవనం పట్టణం చేరతాడు. అక్కడి నుంచి వైతరణీ ప్రారంభమవుతుంది. రక్త మాంస మలమూత్ర శ్లేష్మాలతో దుర్గంధభూయిష్టం, జుగుప్సాకరమైన ఈ నదిని దాటాల్సి ఉంటుంది. వితరణ అంటే దానం చేయడం. వితరణ చేసినవారు దాట గలిగిన నది వైతరణి. దానం.. ముఖ్యంగా గోదానం చేసినవారు ఈ నదిని సులభంగా దాటగలరని పేర్కొంది. జీవించి ఉన్నప్పుడు మనం చేసిన కర్మల్ని అనుసరించి ఈ 16 నరకలోక పురాల్ని దాటుకుంటూ జీవుడు అంగుష్ఠ (బొటనవేలు) ప్రమాణంలో, వాయురూపంలో యాతనాశరీరాన్ని ధరించి కర్మఫలాలను అనుభవిస్తాడు, శ్రాద్ధ కర్మలు సరిగా జరగనివారికి ఈ ప్రయాణం మరింత క్లిష్టమని తెలియజేసింది.

మరణానంతరం.. తిలోదకాలు సమర్పించడం, శుద్ధి.. జరిగిన తర్వాత జీవునిలో దైవదృష్టి కలుగుతుంది. ఈ సమస్త సృష్టి ఒకే భగవత్ స్వరూపమనే అద్వైత అనుభవం జీవునికి కలుగుతుంది- అని చెబుతుంది గరుడపురాణం.

ఈ గ్రంథం ఇంట్లో ఉంచుకోవచ్చా?

శ్రీకృష్ణపరమాత్ముడు- అర్జునుడికి బోధించిన గ్రంథం భగవద్గీత. విష్ణుమూర్తి- రుద్రుడికి బోధించిన గ్రంథం గరుడపురాణం. అందువల్ల ఈ గ్రంథం ఇంట్లో ఉండవచ్చా లేదా అని మనమే నిర్ణయించుకోవచ్చు. గింజలో జీడి ఉంటుందని మధురమైన మామిడిపండును వదులుకోవడం ఎంత అమాయకత్వమో ప్రేతకల్పం అధ్యాయాల్ని తలచుకొని సకల శాస్త్ర సమ్మిళితమైన ఈ గ్రంథాన్ని వదులుకోవడం అంతే అమాయకత్వం. మామిడిపండులోని టెంక మరో వృక్షానికి నాంది పలికితే, గరుడ పురాణంలోని ప్రేతకల్పం అర్థం చేసుకుంటే.. జన్మను ఎలా సార్థకం చేసుకోవాలో అవగతమౌతుంది. కర్మ, భక్తి, జ్ఞాన మార్గాన్ని స్పష్టపరిచిన సనాతన సంప్రదాయ హిందూ విజ్ఞాన సర్వస్వం గరుడపురాణం.

– డా.ఎస్.ఎల్.వి.ఉమామహేశ్వర రావు, త్రిపురాంతకం

ఇస్లాం సందేశం



ఆ ఐదింటినీ ఆచరిస్తే.. జీవితం సార్థకం!

మన జీవితంలో ప్రతీ దశ విలువైంది, ఉత్కృష్టమైంది. ఈ విషయాన్ని సదా గుర్తుంచుకోవాలి. ఇది తెలియక యథాలాపంగా గడిపేస్తుంటారు కొందరు. మనం దేనికి, ఎంత ప్రాధాన్యత ఇవ్వాలో దైవప్రవక్త ముహమ్మద్ (స) సులువైన మాటల్లో తెలియజెప్పారు. 'మీ జీవితంలో ఐదు ముఖ్యమైన అంశాలు గతించిపోక ముందే వాటి విలువను సకాలంలో తెలుసుకోండి. మరణానికి ముందు జీవితం, అనారోగ్యానికి ముందు ఆరోగ్యం, వృత్తికి ముందు ఖాళీ సమయం, వృద్ధాప్యానికి ముందు యవ్వనం, పేదరికానికి ముందు సంపద' ఈ సుప్రసిద్ధమైన హదీసును ఇబ్న్ అబ్బాస్ (రజి) వివరించారు. సమయాన్నెలా సద్వినియోగం చేసుకోవాలో, జీవితంలోని ముఖ్యమైన దశలను ఎలా అర్థం చేసుకుని విచక్షణతో ముందుకు సాగాలో వివరించటానికి ఇస్లామిక్ బోధనల్లో దీన్ని ఒక ప్రాథమిక ప్రణాళికా విధానంగా చెబుతారు.

జీవితంలో ఐదు ముఖ్యమైన దశల నుంచి విలువైన పాఠాలను నేర్చుకోవాలి. పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారకముందే వాటిని సద్వినియోగం చేసుకోవాలి. వాటికి అనుగుణంగా జీవన గమనాన్ని నిర్దేశించుకోవాలి. ఆధ్యాత్మిక వృద్ధి కోసం యవ్వనంలో శక్తిని, ఉత్సాహాన్ని ఉత్పాదకతకు గరిష్ఠంగా ఉపయోగించాలి. ముదిమి వయసులో శారీరక, మానసిక సామర్థ్యాలు అనివార్యంగా క్షీణిస్తాయని గుర్తుంచుకోవాలి. సంపూర్ణ ఆరోగ్యం వెలకట్టలేని కిరీటం లాంటిది. ఆరోగ్యంగా ఉన్నప్పుడే విధులను చక్కగా నిర్వర్తించాలి. దైవారాధనకు తగినంత సమయం కేటాయించాలి. ఒకసారి అనారోగ్యం దాడిచేస్తే మన సామర్థ్యం క్షీణించి కొన్ని పరిమితులు ఏర్పడవచ్చు. ఒక వయసు వచ్చాక.. అనివార్య ప్రాపంచిక బాధ్యతల్లో మునిగిపోతారు. అదనపు బాధ్యతలకు తీరిక ఉండదు. అందుకే వీటన్నింటి కంటే ముందు అందుబాటులో ఉన్న ఖాళీ సమయాన్ని వ్యక్తిగత, ఆధ్యాత్మిక వృద్ధి కోసం సక్రమంగా వినియోగించుకోవాలి. ఆర్థిక వనరుల విషయంలో ఒక ధర్మకర్తలా వ్యవహరించాలి. స్వార్థపూరిత ప్రయోజనాల కోసం సంపదను కూడబెట్టడమే జీవిత పరమార్థం కాకూడదు. వెసులుబాటు ఉన్నప్పుడు ఇతరులకు సాయం చేయాలి. దాతృత్వ కార్యక్రమాలు చేపట్టాలి. జీవనపర్యంతం సమయాన్ని సత్కార్యాల కోసం వెచ్చించాలి. మరణం అన్నిటికీ శాశ్వత ముగింపు వంటిది. ఆ తర్వాత జవాబుదారీతనం ప్రారంభమవుతుందని గుర్తుంచుకోవాలి.

సంపదలు కోల్పోయినా తిరిగి పొందగలం. కానీ యవ్వనం, సమయం, జీవితం దాటిపోతే తిరిగి పొందలేనివి. కొందరు వాటి విలువను గుర్తించకుండా.. కోల్పోయాక చింతిస్తుంటారు. ఇలాంటి పరిస్థితి రాకుండా విచక్షణతో వాటిని సద్వినియోగం చేసుకోవాలి. అంతిమ తీర్పు రోజున ఈ ఐదింటి గురించి ప్రశ్నిస్తారు కాబట్టి.. జవాబుదారీతనంతో వ్యవహరించాలని ఇస్లామిక్ బోధనలు వివరిస్తున్నాయి. ఈ ఐదింటిని సక్రమంగా ఆచరిస్తే జీవితం సార్థకమౌతుందనటంలో సందేహం లేదు.

అందరూ ఒక్కటే!

క్రీస్తు వాణి

ఒకరోజు ఏసు ప్రభువు యూదయ ప్రాంతం నుంచి గలిలయకు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో సుఖారు గ్రామంలోని యాకోబు బావి దగ్గర కొంతసేపు విశ్రాంతి తీసుకుందామని ఆగాడు. అక్కడ యూదులు సమరయుల పై జాతివివక్ష చూపేవారు. ఏసు వెళ్లింది మిట్టమధ్యాహ్నం కావడంతో అక్కడ ఎవరూ లేరు. అంతలో ఒక సమరయ స్త్రీ బావి దగ్గరికి వచ్చింది. సాధారణంగా నీళ్ల కోసం ప్రజలు పొద్దున లేదా సాయంత్రం వస్తారు. కానీ ఆమె బాగా ఎండగా ఉన్నప్పుడు ఎందుకు వచ్చిందంటే.. ఆ సమయంలో అయితే యూదులు ఉండరని. ఏసు ఆమెని చూసి.. 'నాకు దాహం వేస్తోంది. కొన్ని నీళ్లు ఇస్తావా?' అనడిగాడు. అది విన్న ఆమె ఆశ్చర్యంతో 'నేను సమరయ స్త్రీని! అంటే తక్కువ జాతిగా భావిస్తారు. నాతో మీరెందుకు మాట్లాడుతున్నారు? పైగా నేను అనేక పాపాలు కూడా చేశాను' అంటూ దుఃఖించింది. అప్పుడు ఏసు 'నీకు దుఃఖం కలిగిందంటే.. నువ్వు పశ్చాత్తాపం చెందినట్లే. నిన్ను దేవుడు రక్షిస్తాడు. మారు మనసు ఇస్తాడు' (2 కొరింథీ 7:10) అని ఓదార్పుగా మాట్లాడి ఆమె బాధను ఉపశమింపచేశాడు. పశ్చాత్తాపం చెందింది కాబట్టి దేవుడు ఆమెని క్షమించాడు. పాప జీవితం నుంచి విముక్తి కలిగించాడు. అప్పుడు ఆ స్త్రీ 'యూదులు జెరూసలేంలోని మందిరాల్లో మాత్రమే ఆరాధించాలని విశ్వసిస్తారు. కానీ సమరయులమైన మేం దేవుణ్ణి గెరిజీము పర్వతంపై ప్రార్థిస్తున్నాం. మేమేమీ నిన్ను మహోన్నతంగా ఆరాధించడం లేదు కదా! కానీ మాపై నీకెందుకు ఇంత దయ, ప్రేమ?' అని అడిగిందామె 'ప్రదర్శన అవసరం లేదు, మనసారా ఆరాధించేవారు ధన్యులు. స్వార్థ చింతన లేకుండా ప్రార్థన చేయాలి. అందరూ ఒక్కటేనన్న భావనతో మెలగాలి (యోహాను 17:21). అలా ఎవరైతే ఉంటారో వారితోనే నేను ఉంటాను' అని ప్రబోధించాడు ప్రభువు.



ఫిబ్రవరి 8 నుంచి కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం!

తిరుపతిలో వెలసిన త్రిశూలధారి!

తిరుమల శిఖరాలపై కొలువైన కోనేటిరాయుడు ఎంతటి మహిమాన్వితుడో, తిరుమల శిఖరాల ఆదిలో వెలసిన కపిలేశ్వరస్వామి కూడా అంతే మహిమగలవాడు. అందుకే ఆ శ్రీనివాసుడిని దర్శించుకునే భక్తులు ఈ సదాశివుడిని దర్శించుకోకుండా తిరిగి వెళ్లరు. శివకేశవులకు భేదమే లేదనడానికి ఆ శ్రీవేంకటేశ్వరుడు, ఈ శశిభూషణులే సాక్ష్యం. జగన్మాత అయిన పార్వతీదేవి ఈ క్షేత్రంలో కామాక్షిదేవిగా ఆరాధనలు అందుకుంటోంది. శ్రీకామాక్షీ సమేతుడైన ఆ ప్రసన్నమూర్తి లింగాకృతిలో కపిలతీర్థంలో పూజలందుకుంటున్నాడు. కపిలమహర్షి తపోఫలంగా వేంకటాచలం దిగువన ఆవిర్భవించిన కాలకంఠుడు కపిలేశ్వరుడిగా ప్రసిద్ధుడయ్యాడు. పరమభక్తుల ప్రార్థనలకు పరమాత్మ ప్రత్యక్షం కావడమే కాదు స్థిరనివాసం చేసుకొని ఉండిపోతాడని నిరూపించాడు. స్వయంభువుగా వెలసిన ఈ కపిలేశ్వరస్వామి ప్రస్తావన వామనపురాణంలోని శ్రీవేంకటాచల మాహాత్మ్యంలో కనిపిస్తుంది.

పాతాళలోకంలో భోగవతి అన్న పేరుతో ప్రవహించే గంగానది తీరంలో కపిలముని శివారాధకుడై పూజలు చేసేవాడు. మునీశ్వరుడి తపస్సుకు మహాదేవుడు ప్రసన్నుడయ్యాడు. శివలింగరూపంలో దినదిన ప్రవర్ధమానమై తిరుమల క్షేత్ర మూలంలో స్వయంభువుగా ఆవిర్భవించాడు. నానాటికీ పెరుగుతున్న శివలింగాన్ని అర్చించేందుకు శ్రీమహావిష్ణువు గోపాలుడిగా మారాడు. బ్రహ్మదేవుడు ధేనువుగా మారి క్షీరధారలు కురిపించాడు. ఇరువురి సేవ, ప్రార్థనలు ఫలించి పరమేశ్వరుడు వేంకటాద్రి పర్వతమూలంలో ఇంకా పెరగకుండా భక్తుల సౌకర్యార్థం స్థాణువుగా మారిపోయాడు.

చారిత్రక నేపథ్యం

పురాణాల్లో ప్రస్తావించిన ఈ క్షేత్రానికి చారిత్రక నేపథ్యం కూడా ఉంది. క్రీ.శ.11 వ శతాబ్దంలో ఈ కపిలేశ్వరస్వామిని భక్తులు పూజాదికాలతో కొలిచినట్లు ఆధారాలు కనిపిస్తున్నాయి. తిరుపతికి సమీపంలోని కొత్తూరు గ్రామాధికారి మునయదరయ్యన్ అప్పటి మహారాజైన రాజేంద్రచోళుడి కింద పనిచేసే గ్రామపెద్ద. ఆయన కపిలేశ్వరస్వామి ఉనికిని గుర్తించటమే కాదు, గర్భాలయంలోని ముఖమండపాలు నిర్మించినట్లు ఆధారాలున్నాయి. ఆయన ప్రచారంతో స్వామి వైభవం నలుదిశలా వ్యాపించిందని భోగట్టా. 15వ శతాబ్దం నుంచి ఈ కపిలేశ్వరస్వామి కోవెలకు భక్తుల దర్శనం పెరిగింది. విజయనగర మహారాజులైన అచ్యుతరాయలు, సదాశివరాయలు తదితరులు కూడా కపిలేశ్వరస్వామి ఆలయ ఉద్ధరణకు ఇతోధిక సాయమందించినట్లు చరిత్ర కథనం. ఈ క్షేత్రంలో దక్షిణామూర్తి, కాలభైరవస్వామి, మహాశాస్త, వినాయకస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శివభక్తుడైన చండికేశ్వరస్వామి తదితర మూర్తులు కూడా పరివారదేవతలుగా పూజలందుకుంటున్నారు. శ్రీరుక్మిణీసత్యభామాసమేత వేణుగోపాలస్వామి, లక్ష్మీనారాయణుల ఆలయాలు కూడా కపిలేశ్వరస్వామి ప్రాభవాన్ని మరింత ఇనుమడింపజేస్తున్నాయి.

పవిత్ర కపిలతీర్థం

కపిలేశ్వరస్వామి కొలువైన ఈ పుణ్యస్థలిలో మరో విశేషం కపిలతీర్థం. శేషాచల పర్వత సానువుల్లోని అనేక పవిత్ర తీర్థాల నుంచి జాలువారిన జలధారలతో ఈ కపిలతీర్థం ఏర్పడింది. పర్వతమూలంలో వెలసిన ఈ ప్రాచీన తీర్థానికి సుదర్శన చక్రత్తాళ్వారు తీర్థం, చక్రత్తాళ్వారు తీర్థం, ఆళ్వారు తీర్థం అనే పేర్లు కూడా ఉన్నాయి. ఈ నామాల వెనుక ఓ చారిత్రక కథనం ప్రచారంలో ఉంది. విజయనగర చక్రవర్తి, శ్రీవేంకటేశ్వరస్వామి పరమభక్తుడైన అచ్యుతరాయలు ఈ తీర్థంలో పుణ్యస్నానం చేసి ఈ జలధారకు 'సుదర్శనచక్ర తీర్థం' అనే పేరు పెట్టాడు. ఈ పుష్కరిణికి నాలుగు మూలల్లో 'తిరువాళిక్కళ్' పేర్లతో నాలుగు సుదర్శనచక్ర శిలా యంత్రాలను ప్రతిష్ఠించి.. చక్రత్తాళ్వారు తీర్థం, ఆళ్వారు తీర్థం అనే సార్థక నామాలను కల్పించాడు.

ఉమాపతికి ఉత్సవాలు

కపిలేశ్వరస్వామికి ప్రతి సోమవారం డోలోత్సవం జరుగుతుంది. ఈ క్షేత్రంలో ఏటా మార్గశిర త్రయోదశి, చతుర్దశి, పౌర్ణమి రోజుల్లో స్వామికి తెప్పోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. కామాక్షీసమేతుడైన కపిలేశ్వరుడికి ప్రతినెలా మాసశివరాత్రి రోజున సాయంసంధ్యలో కల్యాణోత్సవం జరుపుతారు. ఏటా మాఘమాసంలో పదిరోజుల పాటు కపిలేశ్వరస్వామికి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ ఉత్సవాల్లో భాగంగా దేవదేవేరులను వివిధ వాహనాలపై ఊరేగిస్తారు. మకర, నంది, వ్యాఘ్ర, భూత, తిరుచ్చి, పురుషమృగ వాహనాలపై విహరించడం కపిలేశ్వరస్వామి విశిష్టత.

దశకంఠుని వాహనంపై దేవేశుడు

కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణ రావణాసుర వాహనంపై పరమశివుడు విహరించడం. దశకంఠుడు కనబరచిన భక్తిప్రపత్తులకు శంకరుడు అతనికిచ్చిన వరమిది. ఉత్సవాల్లో ధ్వజావరోహణం తర్వాత కామాక్షీ సమేతంగా కపిలతీర్థ స్వామి లంకాధీశుడి వాహనంపై ఊరేగుతాడు. ఈ సందర్భంగా శివభక్తులు రావణాసురుడు ఆలపించిన శివతాండవ స్తోత్రం పఠిస్తూ పరవశించిపోతారు.




త్రిపురాంతకుడికి త్రిశూలస్నానం

కపిలేశ్వరుడికి నిర్వహించే 'త్రిశూల స్నానం' బ్రహ్మోత్సవాల్లో చివరి వేడుక. ఈ విశేషమైన ఘట్టంలో త్రిపురాంతకుడైన పరమశివుడి త్రిశూల ఆయుధానికి కపిలతీర్థంలో స్నానం చేయించడం ఆనవాయితీ. త్రినేత్రుడి శూలం శివభక్తుల పాపాలను హరించి పునీతులను చేస్తుందని విశ్వాసం. ఈ ఉత్సవంలో స్వామి, అమ్మవార్లను ఓ పల్లకిపైన, త్రిశూలాన్ని మరో పల్లకిపైన ఆసీనులను చేసి కపిలతీర్థానికి తీసుకువెళ్తారు. అక్కడ పూజాదికాలు ఆచరించి త్రిశూలానికి ఆ పుణ్యతీర్థంలో స్నానం చేయిస్తారు. ఈ పరమపవిత్ర కార్యక్రమంతో కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ముగింపు పలుకుతారు.

– మనోజ్ఞ

ఈనాడు సినిమా


మహేశ్ బాబు


రాజమౌళి

'వారణాసి'... ఒక భాగంగానే!

అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'వారణాసి' ఒకే భాగం సినిమాగానే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆ విషయాన్ని హాలీవుడ్ మీడియాకి ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో బయట పెట్టారు దర్శకుడు. తాను తీస్తున్న సినిమాలకి సంబంధించిన కథ, నేపథ్యం మొదలు కొని, చాలా విషయాల్ని బయట పెడుతుంటారు రాజమౌళి. 'వారణాసి' విషయంలో అందుకు భిన్నంగా సినిమాకి సంబంధించిన ఏ విషయం బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకొన్నారు. ప్రచార చిత్రం విడుదల సందర్భంగా నిర్వహించిన వేడుకలో ఇది రామాయణం ఆధారంగా రూపొందుతున్న చిత్రమని మాత్రమే చెప్పారు. రెండు భాగాలుగా వస్తుందంటూ సాగిన ప్రచారానికి తెర దించుతూ... మొదట రెండు భాగాలు అనుకున్నాం కానీ, ఆ వెంటనే ఆ ఆలోచనని పక్కన పెట్టేశామని, మూడు గంటలకు పైగా నిడివితో ఈ సినిమాని ఒకే భాగంగానే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు స్పష్టతనిచ్చారు రాజమౌళి. మహేశ్‌బాబుతో సినిమా పదిహేనేళ్ల కిందటే తీయాలనుకున్నాననీ, కానీ తనకున్న ఒప్పందాల కారణంగా ఇప్పటికి కుదిరిందని తెలిపారు. ఈ సినిమాలో రామాయణంలోని ఓ భాగాన్ని చూపించనున్నట్టు తెలిపారు రాజమౌళి. 25 నిమిషాల పాటు సాగే రామాయణ కాలంనాటి ఆ సన్నివేశాలు ఎప్పటికీ మరిచిపోలేని విధంగా ఉంటాయని కీలక విషయాన్ని చెప్పారు. మహేశ్‌బాబు, ప్రియాంక చోప్రా జంటగా నటించిన ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానుంది.

ఇప్పటికే ఓ పాట పూర్తి చేశాం – ప్రియాంక చోప్రా

ఆరేళ్ల తర్వాత తాను చేస్తున్న భారతీయ సినిమా ఇదే కావడంతో, ఇందులో ఓ మంచి పాట ఉండేలా చూడండని దర్శకుడు రాజమౌళిని కోరినట్టు చెప్పారు కథానాయిక ప్రియాంక చోప్రా. "దర్శకుడు రాజమౌళి ఈ చిత్రంలోని కథానాయిక పాత్ర గురించి చెప్పగానే 'నేను భారతీయ సినిమాలో నటించి చాలా రోజులైంది. మంచి పాట ఉండేలా చూడండి' అన్నా. ఆయన చాలా పాటలు ఉన్నాయని చెప్పారు. మేం ఇప్పటికే చిత్రీకరించిన ఓ పాటలో డ్యాన్స్ చాలా బాగుంటుంది. ఆ పాటని పాడుకుంటూనే ఉన్నా" అన్నారు ప్రియాంక చోప్రా. త్వరలోనే ఈ సినిమాని అంటార్కిటికాలో చిత్రీకరించనున్నారు. ఎన్నో సవాళ్ల మధ్య అక్కడ చిత్రీకరణ చేయడానికి చిత్రబృందం సన్నద్ధమవుతోంది.

రాముడిగా కనిపిస్తా: మహేశ్‌బాబు

చిత్రంలో నాయకానాయికలైన మహేశ్‌బాబు, ప్రియాంక చోప్రాతోపాటు, ప్రతినాయకుడిగా నటిస్తున్న పృథ్వీరాజ్ సుకుమారన్ కలిసి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. అందులో మహేశ్‌బాబు కూడా కొన్ని కీలకమైన విషయాల్ని పంచుకున్నారు. ఈ సినిమా కోసం ఏడాదిపాటు ప్రత్యేకంగా సన్నద్ధమైనట్టు ఆయన చెప్పారు. "నాతో సినిమా చేస్తానని చాలా ఏళ్ల కిందటే చెప్పారు రాజమౌళి. 'ఆర్ఆర్ఆర్' తర్వాత ఆయన కథ చెప్పారు. వినగానే ఆశ్చర్యపోయా. ఇప్పటివరకూ ఆయన ఇలాంటి సినిమాని చేయలేదు. పురాణాలు, కాల ప్రయాణం, సాహస ప్రయాణం... ఇలా ఎన్నో అంశాలున్న కథ ఇది. కీలకమైన ఓ ఎపిసోడ్‌లో నేను శ్రీరాముడిగా కనిపిస్తా. ఆ పాత్ర కోసం నేను శారీరకంగా ప్రత్యేకంగా సన్నద్ధం కావల్సి వచ్చింది. గెటప్పు, నిలబడే విధానం మొదలుకొని అన్ని విషయాలు పక్కాగా ఉండేలా రిహార్సల్స్ చేశాం. రెండు మూడు నెలలు కేవలం వాటికోసమే కష్టపడ్డాం. నేను పరిగెత్తే విధానాన్నీ మార్చారు రాజమౌళి. తొలి షాట్ పూర్తయ్యేవరకూ నాకు భయంగానే ఉండేది. అది పూర్తయ్యాక నమ్మకం కలిగింది. ప్రతి చిన్న విషయంపై ఎంతో శ్రద్ధ పెడుతుంటారు రాజమౌళి. సినిమాపై ఆయనకున్న తపనకి నిదర్శనమే అది" అన్నారు.

చిన్న చిత్రాలకు ప్రోత్సాహం అవసరం

"చిన్న నిర్మాతలు ఎన్నో ఇబ్బందుల్ని ఎదుర్కొంటూ సినిమాల్ని తీస్తున్నారు. చిన్న చిత్రాలకి ప్రోత్సాహం ఎంతో అవసరం. అది దృష్టిలో ఉంచుకునే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకమైన ప్రోత్సాహకం సిద్ధం చేశా"రన్నారు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీగౌడ్. ఆయన ముఖ్య అతిథిగా 'ఎర్రచీర' సినిమా విడుదలకు ముందస్తు వేడుక ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. బేబీ సాయి తేజస్విని కీలక పాత్రలో నటించిన చిత్రమిది. సుమన్‌బాబు ఓ కీలక పాత్రలో నటిస్తూ, ఎన్.వి.వి.సుబ్బారెడ్డితో కలిసి నిర్మించారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాత, నటుడు సుమన్ బాబు మాట్లాడుతూ "సినిమా ఆసక్తికరంగా లేదని ఎవరు చెప్పినా టికెట్ డబ్బులు తిరిగి ఇచ్చేస్తా. ఈ సినిమాపై అంత నమ్మకం ఉంది. కారుణ్య, బేబీ సాయి తేజస్విని నటన ఈ సినిమాకి ప్రధానబలం" అన్నారు. ఈ కార్యక్రమంలో కారుణ్యచౌదరి, వెంకట్రావ్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కారుణ్య, సుమన్‌బాబు

అలియా @ 'హౌస్‌వైఫ్'?


అలియా భట్


యాక్షన్, ప్రేమకథలతో వినోదాలు పంచడమే కాదు.. జీవితానికి దగ్గరగా ఉండే కథల్ని తెరపై ఆవిష్కరించి ప్రేక్షకులకు కనువిప్పు కలిగించే సినిమాలూ ఉంటాయి. ఇప్పుడలాంటి చిత్రంతో ఏడడుగుల బంధం గురించి తెలియజేయడానికి గృహిణిగా మన ముందుకు రాబోతుందట బాలీవుడ్ నాయిక అలియా భట్. ఆమె.. హిందీలో 'దృశ్యం 2'ని తెరకెక్కించిన అభిషేక్ పాఠక్ రూపొందిస్తున్న 'హౌస్‌వైఫ్' అనే చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. వివాహమైన ఓ జంట చుట్టూ ఈ సినిమా ఉంటుందని సమాచారం. "ప్రస్తుతం అభిషేక్ పాఠక్ 'దృశ్యం 3' సినిమా చిత్రీకరణతో బిజీగా ఉన్నారు. అది పూర్తయిన తర్వాత ఆగస్టులో 'హౌస్‌వైఫ్'ను పట్టాలెక్కించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందులో అలియా కథానాయికగా నటించడమే కాకుండా ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరించనుంది. ఈ రిలేషన్‌షిప్ డ్రామాలో మరో కీలక పాత్ర కోసం రాజ్‌కుమార్ రావ్‌తో చర్చలు చేస్తోంది చిత్రబృందం. త్వరలో ఈ ప్రాజెక్టు గురించి అధికారికంగా వెల్లడించనున్నా"రని అలియా సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'లవ్ అండ్ వార్', 'ఆల్ఫా' చిత్రాలున్నాయి.


ధనుష్ చిత్రంలో మమ్ముట్టి



మాతృక మలయాళంలోనే కాదు.. భాషతో సంబంధం లేకుండా కథల్ని ఎంచుకుంటూ ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు అగ్రహీరో మమ్ముట్టి. ఇప్పటికే పలు హిట్ చిత్రాలతో తమిళంలో సందడి చేసిన ఆయన.. ఇప్పుడు మరో తమిళ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ధనుష్, దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి కలయికలో తెరకెక్కుతున్న చిత్రం 'డీ 55' (వర్కింగ్ టైటిల్). ఇటీవలే ఇందులోకి కథానాయికలుగా సాయిపల్లవి, శ్రీలీలకు స్వాగతం పలికింది చిత్రబృందం. ఇప్పుడీ చిత్రంలో మమ్ముట్టి ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు బుధవారం ఎక్స్ వేదికగా ప్రకటించింది. "ఆయన ఒక కథను ఎంచుకుంటే.. అది చరిత్రగా మారుతుంది. 'డీ 55' ప్రపంచంలోకి మమ్ముట్టికి వెల్‌కమ్ చెప్పడానికి మేము చాలా ఉత్సాహంగా ఉన్నామ"ని వ్యాఖ్యల్ని జోడించింది. 2019లో 'పెరంబు' అనే తమిళ చిత్రంతో మెప్పించిన మమ్ముట్టి మళ్లీ ఏడేళ్ల తర్వాత ఈ పరిశ్రమలోకి అడుగుపెట్టడం విశేషం. త్వరలో చిత్రీకరణను ప్రారంభించనున్నట్లు చిత్రవర్గాలు తెలిపాయి.

మార్చిలో ఉస్తాద్... ఏప్రిల్‌లో పెద్ది


రామ్ చరణ్


పవన్ కల్యాణ్

మొదట బాబాయ్ సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్'... ఆ తర్వాత అబ్బాయ్ సినిమా 'పెద్ది'... వరుస నెలల్లో థియేటర్లలో సందడి చేయనున్నాయి. ఈ రెండు సినిమాల విడుదల తేదీలు బుధవారం అధికారికంగా ఖరారయ్యాయి. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా.. హరీశ్‌శంకర్ తెరకెక్కిస్తోన్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' మార్చి 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. దేవిశ్రీప్రసాద్ స్వరాలు సమకూర్చుతున్నారు. ఇప్పటికే చిత్రీకరణని పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్ని చేసుకుంటోంది. 'గబ్బర్‌సింగ్' తర్వాత పవన్‌కల్యాణ్ - హరీశ్ కలయికలో రూపొందుతున్న చిత్రమిది. మార్చి 26న అసలు సిసలైన పవర్‌స్టార్ వేడుకకు సిద్ధంగా ఉండండంటూ అభిమానులకు పిలుపునిచ్చింది చిత్రబృందం. ఇక 'పెద్ది' విషయానికొస్తే... మొదట ఈ సినిమాని మార్చిలోనే విడుదల చేయాలనుకున్నారు. అయితే చిత్రీకరణతోపాటు, నిర్మాణానంతర పనులకు మరికొంత సమయం అవసరం కావడంతో, ఏప్రిల్ 30న విడుదల చేయాలని సినీ వర్గాలు నిర్ణయించాయి. బుధవారం కొత్త తేదీని అధికారికంగా ప్రకటించాయి. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో.. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న చిత్రమిది. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పిస్తున్నాయి. ఇందులో రామ్‌చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ స్వరకర్త. 'పెద్ది' వచ్చే తేదీ మారిందేమో కానీ అతని పట్టుదల ఎప్పటికీ మారదని చిత్ర బృందం తెలిపింది.

అల్లం టీ... పాత ప్రేమ పాటలు


సిద్ధాంత్, మృణాల్

కొన్ని బంధాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలనుకున్నప్పుడు.. వాటిని కామాలు పెట్టి లాగకూడదంటోంది నటి మృణాల్ ఠాకూర్. ఆమె సిద్ధాంత్ చతుర్వేది జంటగా తెరకెక్కిన చిత్రం 'దో దివానే సెహర్ మే'. ఈ చిత్రానికి రవి ఉద్యావార్ దర్శకత్వం వహిస్తున్నారు. సంజయ్‌లీలా భన్సాలీ, ప్రేరణ సింగ్ తదితరులు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ సినిమా అధికారిక ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా ఆవిష్కరించింది. ఈ సినిమాలో.. 'నాకు వంట రాదు.. వర్షం నా దృష్టిలో తేమ మాత్రమే' అంటూ చాలా ప్రాక్టికల్‌గా ఉండే రోషిణి పాత్రలో కనిపించనుంది మృణాల్. 'అన్ని రకాల వంటలు వచ్చు.. నా దృష్టిలో వర్షమంటే ఓ అల్లం టీ.. పాత రొమాంటిక్ సాంగ్స్' అనే శశాంక్ పాత్రలో సిద్ధాంత్ అలరించనున్నాడు. ఇలాంటి భిన్నాభిప్రాయాలతో సరదాగా మొదలైన వారి పెళ్లి చూపుల ప్రయాణం.. వివాహ సమయానికి అర్ధాంతరంగా ముగిసిపోతుందని ట్రైలర్‌తో స్పష్టమవుతోంది. కనీసం నాకు నో ఎందుకు చెప్పావో చెప్పమంటూ హీరోయిన్ వెనుక హీరో తిరిగే సన్నివేశాలతో ఆకట్టుకుంటున్న ఈ ట్రైలర్ ప్రేక్షకులకి సరికొత్త ప్రేమకథను పరిచయం చేసేలా ఉంది. ఈ సినిమా ఈ నెల 20న థియేటర్లలో విడుదల కానుంది.

మహిషాపురం దేవత మారెమ్మ


నాగరాజు, మాధవ్, బాబీ, దీప

బలమైన కథ ఇందులో ఉండటంతో... 'మారెమ్మ' సినిమాతోనే తాను పరిచయం కావాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు మాధవ్. ప్రముఖ కథానాయకుడు రవితేజ సోదరుడు, నటుడు రఘు కుమారుడే మాధవ్. ఆయన కథానాయకుడిగా, మంచాల నాగరాజు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. దీపా బాలు కథానాయిక. మయూర్ రెడ్డి బండారు నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. ప్రముఖ దర్శకుడు బాబీ కొల్లి ముఖ్య అతిథిగా హాజరై టీజర్‌ని విడుదల చేశారు. మహిషాపురం అనే ఊరు, ఆ గ్రామ దేవతైన మారెమ్మ చుట్టూ తిరిగే కథతో ఈ చిత్రం రూపొందింది.

కొత్తతరాన్ని ప్రోత్సహించాలనే..


గోపాలకృష్ణా రెడ్డి

"ప్రేక్షకులు థియేటర్లకు ఆహ్లాదం కోసమే వస్తారు. అలాంటి కథ, సన్నివేశాలున్న సినిమానే మా 'శ్రీచిదంబరం గారు'. గొప్ప అనుభూతిని పంచే ప్రశాంతమైన సినిమా ఇది" అన్నారు నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి. ఆయన శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై చింతా వినీషరెడ్డితో కలిసి నిర్మించిన చిత్రమే 'శ్రీచిదంబరం గారు'. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ఠ జంటగా నటించారు. వినయ్ రత్నం దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ నెల 6న చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా చింతా గోపాలకృష్ణారెడ్డి బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. "కొత్తతరాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ఈ సినిమాని నిర్మించాం. యాక్షన్ గోల లేకుండా, అందమైన ప్రేమకథతో, మనసుని తాకే భావోద్వేగాలతో ఈ చిత్రం సాగుతుంది. రాజమండ్రిలోనే కార్యాలయాన్ని ప్రారంభించి 35 రోజులు మారేడుమిల్లిలో, 10 రోజులు రాజమండ్రిలో చిత్రీకరణ చేశాం. అందమైన లొకేషన్స్ అంటూ మనం పక్క రాష్ట్రాలకు వెళుతుంటాం కానీ, మన దగ్గరే ఇంత అందమైన లొకేషన్లు ఉన్నాయని ఈ సినిమాతో చూపించబోతున్నాం. టిక్కెట్ ధర కూడా రూ.99గానే నిర్ణయించాం. 2 గంటల పాటు స్వచ్ఛమైన వినోదాన్ని పంచే చిత్రమిది".

● "కథని నమ్మి సినిమా చేశాం. విదేశాల్లో ఈ సినిమాని విడుదల చేయాలనే ఆలోచనే మాకు లేదు. కానీ కంటెంట్ చూసి ఓవర్సీస్ నుంచి మాకు కాల్స్ వచ్చాయి. దాంతో అమెరికా, ఇంగ్లండ్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ప్రస్తుతం మా సంస్థలో 'రావు బహద్దూర్' సినిమా రూపొందుతోంది. తదుపరి ఓ కొత్త దర్శకుడితో సినిమా చేస్తున్నాం. ఘన విజయం సాధించిన 'క' సినిమాకి కొనసాగింపుని కూడా త్వరలోనే ప్రకటిస్తాం".

బుల్లెట్ సునీల్


రాజశేఖర్

'అభిప్రాయమే కదా... మార్చేద్దాం' అంటున్నాడు బుల్లెట్ సునీల్. ఇంతకీ ఇతనెవరు? బుల్లెట్ సునీల్ అనే పేరు ఎందుకొచ్చిందో తెలియాలంటే 'బైకర్' చూడాల్సిందే. శర్వానంద్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రమిది. మాళవిక నాయర్ కథానాయిక. ప్రముఖ నటుడు రాజశేఖర్ ఓ కీలక పాత్రని పోషించారు. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహిస్తున్నారు. యు.వి.క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విక్రమ్ సమర్పకులు. ఏప్రిల్ 3న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం రాజశేఖర్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రంలోని ఆయన పాత్రని పరిచయం చేస్తూ రీస్టార్ట్ గ్లింప్స్ పేరుతో ప్రచార చిత్రాన్ని విడుదల చేశాయి సినీ వర్గాలు. రాజశేఖర్ ఇందులో బుల్లెట్ సునీల్ అనే పాత్రని పోషించినట్టు స్పష్టమైంది. 'ఈ స్పోర్ట్ క్రికెట్ కాదు సునీల్... ఎవరూ పట్టించుకోరు. నీ సమయం వృథా చేసుకోవద్దు....' అంటూ మొదలయ్యే ప్రచార చిత్రం మాజీ మోటోక్రాస్ రేసర్ అయిన బుల్లెట్ సునీల్ ట్రాక్‌రికార్డ్‌ని చాటి చెప్పింది. "భారతీయ రేసర్లు అంటే ఓడిపోయేవాళ్లే అనే అభిప్రాయం ఉంది" అనే మాటకి బుల్లెట్ సునీల్ బదులిచ్చే తీరు ప్రచార చిత్రానికి ప్రధాన ఆకర్షణ. ఇందులో శర్వానంద్ బైక్ రేసర్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన ఈ పాత్ర కోసం ప్రత్యేకంగా సన్నద్ధమయ్యారు. బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి, శశాంక్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, ఛాయాగ్రహణం: జె.యువరాజ్, ప్రొడక్షన్ డిజైన్: రాజీవ్, కూర్పు:య అనిల్ కుమార్.పి, కళ: ఎ.పన్నీర్ సెల్వం.

థ్రిల్లింగ్ క్యాట్


అడివి శేష్

జీవీ నాయుడు ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహిస్తోన్న చిత్రం 'క్యాట్'. వీజే బాలు, లావణ్య, కల్యాణి రాణి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోంది. రజనీ గొంగటి నిర్మాత. త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా కాన్సెప్ట్ పోస్టర్‌ని ఇటీవల హీరో అడివి శేష్ విడుదల చేశారు. ప్రేక్షకులను థ్రిల్ చేసేలా ఈ కథ సాగుతుందని చిత్రవర్గాలు తెలిపాయి.

గద్దర్ పురస్కారాలకు జ్యూరీ కమిటీల ఎంపిక

తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ - 2025 ఎంపిక కోసం నాలుగు జ్యూరీ కమిటీల్ని నియమించింది రాష్ట్ర ప్రభుత్వం. సామాజిక సందేశంతో కూడిన చలన చిత్రాలతోపాటు, కొత్తగా ప్రవేశపెట్టిన పలు కేటగిరీల్లో పురస్కారాల ఎంపిక కోసం ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ ఛైర్మన్‌గా 14 మంది సభ్యులతో ఓ జ్యూరీ ఏర్పాటైంది. డా.సి.నారాయణరెడ్డి, అక్కినేని నాగేశ్వరరావు సినీ పురస్కారాలతో పాటు ఇతర ప్రముఖుల పేర్లతో ప్రదానం చేయనున్న పురస్కారాల ఎంపిక కోసం సీనియర్ దర్శకుడు కె.రాఘవేంద్రరావు ఛైర్మన్‌గా నలుగురు సభ్యులతో జ్యూరీ ఏర్పాటైంది. డాక్యుమెంటరీ, లఘు చిత్రాల విభాగానికి సంబంధించి కనకమేడల విజయ్‌కృష్ణ ఛైర్మన్‌గా, ఆరుగురు సభ్యులతో మరొక జ్యూరీ, సినిమాపై ఉత్తమ పుస్తకాలు, ఉత్తమ సినీ విమర్శ విభాగం కోసం ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి ఛైర్మన్‌గా నలుగురు సభ్యులతో జ్యూరీ ఏర్పాటైంది. ప్రతి జ్యూరీ కమిటీకీ తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సభ్యుడిగా, కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు.

ప్రేమ ఓ టార్చర్


మౌనిక, సన్నీ

ప్రముఖ నటుడు, నిర్మాత మాదాల రంగారావు మనవడు సన్నీ మాదాల హీరోగా తెరకెక్కిన చిత్రం 'ఓ టార్చర్‌ప్రేమ'. మౌనిక కథానాయిక. శ్రీకర్‌కృష్ణ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ సినిమా పేరుతో కూడిన ప్రచార చిత్రాన్ని ఇటీవల హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో విడుదల చేశారు. ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దర్శకనిర్మాత మాట్లాడుతూ "ప్రేమలో ఉన్న ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే కథ ఇది. నవ్వులు కూడా పంచుతుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి" అన్నారు. రాజీవ్ కనకాల, శ్రీనివాస్, శ్రీవాణి, జబర్దస్త్ రోహిణి తదితరులు నటించారు.

సీసీఎల్ డివిడెండ్ రూ.2.75



ఈనాడు, హైదరాబాద్: సీసీఎల్ ప్రోడక్ట్స్, డిసెంబరు త్రైమాసికంలో రూ.1,050.56 కోట్ల ఆదాయాన్ని, రూ.100.27 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఈపీఎస్ రూ.7.53గా ఉంది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.758.41 కోట్లు, నికర లాభం రూ.63.04 కోట్లుగా ఉన్నాయి. 2025-26 ఏప్రిల్-డిసెంబరులో ఆదాయం రూ.3,239.41 కోట్లు, నికర లాభం రూ.273.57 కోట్లుగా నమోదయ్యాయి. రూ.2 ముఖ విలువగల ఒక్కో షేరుపై రూ.2.75 మధ్యంతర డివిడెండ్ ఇచ్చేందుకు బోర్డు ఆమోదించింది. దీనికి ఈ నెల 10ని రికార్డు తేదీగా నిర్ణయించారు.

తగ్గిన పోకర్ణ లాభం

ఈనాడు, హైదరాబాద్: పోకర్ణ లిమిటెడ్, డిసెంబరు త్రైమాసికంలో రూ.142.34 కోట్ల ఆదాయంపై రూ.20.37 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.234.38 కోట్లు, నికర లాభం రూ.50.60 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే సమీక్షా త్రైమాసికంలో ఆదాయం, లాభం రెండూ తగ్గాయి. ఏప్రిల్-డిసెంబరులో సంస్థ ఆదాయం రూ.438.77 కోట్లు, నికర లాభం రూ.55 కోట్లుగా ఉన్నాయి.

బెంగళూరులో 52 ఎకరాల కొనుగోలు

రూ.2,097 కోట్లు వెచ్చించిన శ్రీని నిర్మాణ్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన శ్రీని నిర్మాణ్ ప్రైవేటు లిమిటెడ్, బెంగళూరులో నిర్వహించిన వేలంలో 52 ఎకరాల వాణిజ్య స్థలాన్ని దక్కించుకుంది. ఇందుకోసం రూ.2,097 కోట్లు వెచ్చించింది. గోద్రెజ్ ప్రాపర్టీస్, బ్రిగేడ్ సహా 5 ప్రముఖ సంస్థలు ఈ వేలంలో పోటీపడ్డాయి. దేశవ్యాప్త విస్తరణలో భాగంగా, మైహోం కన్‌స్ట్రక్షన్స్ తన అనుబంధ సంస్థ శ్రీని నిర్మాణ్ పేరుతో ఈ వేలంలో పాల్గొంది. ఈ సంస్థకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా జూపల్లి ఐశ్వర్యరావు, భార్గవి వ్యవహరిస్తున్నారు. ఈ వేలం ద్వారా బెంగళూరు డెవలప్‌మెంట్ అథారిటీ (బీడీఏ) ఆశించిన దానికంటే రూ.468 కోట్లు అధికంగా వచ్చాయి.

మిధానికి రూ.158 కోట్ల ఆర్డర్లు

మిశ్ర ధాతు నిగమ్ (మిధాని) కొత్తగా రూ.158 కోట్ల విలువైన ఆర్డర్లు దక్కించుకున్నట్లు తెలిపింది. వీటితో కలిపి, సంస్థ చేతిలో ఉన్న మొత్తం ఆర్డర్ల విలువ రూ.2,590 కోట్లకు చేరింది.


5న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో) కోడి గుడ్లు



హైదరాబాద్	485	తూ/ప గోదావరి	480
వరంగల్	487	విశాఖపట్నం	490
విజయవాడ	505	చిత్తూరు	563

20-30 ఏళ్లలో 30 లక్షల కోట్ల డాలర్లకు

- మన ఆర్థిక వ్యవస్థపై ముకేశ్ అంబానీ
- దేశంలో ఏటా 8-10% వృద్ధి: బ్లాక్‌రాక్ సీఈఓ



ఏఐపై పెట్టుబడులు పెట్టకపోతే నష్టం: లారీ ఫింక్

రాబోయే 20-30 ఏళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ 25-30 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.2,250-2,700 లక్షల కోట్ల)కు చేరొచ్చని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ అంచనా వేశారు. ఈ సమయంలో భారత యువతరానికి అద్భుత పెట్టుబడి అవకాశాలు లభించగలవనీ అన్నారు. భారతీయుల లక్ష్యాలు చూస్తుంటే, భవిష్యత్తులో రిలయన్స్ ఇండస్ట్రీస్ స్థాయిలోని 100 కొత్త సంస్థలు ఉద్భవించొచ్చన్నారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న స్థిర విధానాలు, సంస్కరణల వల్ల ఆర్థిక వృద్ధికి ఢోకా ఉండదని పేర్కొన్నారు. ముంబయిలో బుధవారం జియో-బ్లాక్‌రాక్ ఆధ్వర్యంలో జరిగిన 'ఇన్వెస్టింగ్ ఫర్ ఏ న్యూ ఎరా' చర్చలో అంబానీ ఇంకా ఏమన్నారంటే..

పసిడిలో రూ.5.5 లక్షల కోట్లు పెట్టారు..

'సంప్రదాయబద్ధంగా భారత్ ఒక పొదుపు దేశం. గతేడాదిలో దేశీయులు పసిడిపై 60 బి. డాలర్లు (సుమారు రూ.5.4 లక్షల కోట్లు), వెండిపై 15 బి. డాలర్లు (దాదాపు 1.35 లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టడంపై చింత కలుగుతోంది. దీనివల్ల సంపద వృథాగా పోగుబడి ఉంటుంది. అదే దేశ ప్రగతికి తోడ్పడేలా పెట్టుబడులు పెడితే, సంపద వృద్ధికీ అవకాశం లభిస్తుంది. ఇందుకోసం పొదుపు మొత్తాన్ని క్యాపిటల్ మార్కెట్లలో పెట్టుబడిగా పెడితే, అది కుటుంబ సంపదను పెంచడమే కాదు, దేశ ఆర్థిక వృద్ధినీ వేగవంతం చేస్తుంద'ని ముకేశ్ అన్నారు. బ్లాక్‌రాక్ సీఈఓ లారీ ఫింక్ సైతం ఈ ఆలోచనను సమర్థిస్తూ 'భారత్ వంటి వేగంగా వృద్ధి చెందుతున్న దేశంలో, దీర్ఘకాల ఈక్విటీ పెట్టుబడుల వల్ల సంపద సృష్టి జరుగుతుంద'న్నారు.

విద్య, వైద్యంలో ఏఐతో భారీ మార్పులు

'బలమైన విధానాలు, రాజకీయ స్థిరత్వం, భారీ స్థాయిలో మౌలిక వసతుల అభివృద్ధి, డిజిటల్ విప్లవాలే పునాదులుగా భారత వృద్ధి నడుస్తోంది. క్యాపిటల్ మార్కెట్ల విస్తృతి కారణంగా దీర్ఘకాల పెట్టుబడులకు ఆకర్షణీయ కేంద్రంగా భారత్ మారింద'ని ముకేశ్ అన్నారు. 'విద్య, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో కృత్రిమ మేధ (ఏఐ) ఎంచదగ్గ మార్పు తీసుకువస్తోంది. వచ్చే కొన్నేళ్లలో 20 కోట్ల మంది పిల్లల చదువుకు ఏఐ సహాయం చేస్తుంది. 140 కోట్ల మందికి మెరుగైన ఆరోగ్య సంరక్షణ, సమర్థంగా ప్రజా సేవలు అందించేందుకు ఏఐ ఉపయోగపడుతుంద'న్నారు.

వచ్చే 10 ఏళ్లు, ఆ పైన భారత్ 8-10% వృద్ధిని సాధించగలదని, అందుకే ఇక్కడ తానూ పెట్టుబడులు పెడతానని, భారతీయులూ పెట్టుబడులు పెట్టాలని లారీ ఫింక్ కోరారు. 'విదేశీ మదుపర్ల నుంచి మూలధనం తీసుకురావడాన్ని నేను నమ్మను. అయితే ఏ దేశంలోనైనా రిటైర్‌మెంట్ సేవింగ్స్‌తో నిర్మించిన దేశీయ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు ఉంటాయ'న్నారు. 'ఏఐ బుడగ' అనే అభిప్రాయంపై తనకు నమ్మకం లేదని.. ఒకవేళ అది నమ్మి, ఏఐపై పెట్టుబడులు పెట్టకపోతే చైనా గెలిచి, మనం వెనకబడిపోతామ'న్నారు.

బెంగళూరులో గూగుల్ భారీ క్యాంపస్!

మరో 20,000 మందికి అవకాశాలు



అంతర్జాతీయ టెక్ దిగ్గజం గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్, మనదేశంలో మరింత విస్తరణకు సన్నాహాలు చేస్తుంది. విదేశీ ఉద్యోగులకు వర్క్ వీసా నిబంధనలను అమెరికా ప్రభుత్వం కఠినతరం చేసిన నేపథ్యంలో, కావాల్సిన నిపుణులను చేర్చుకునేందుకు భారత్‌లోనే మరో పెద్ద కార్యాలయ సముదాయాన్ని ఏర్పాటు చేసుకునే దిశగా అడుగులు వేస్తోందని బ్లూమ్‌బర్గ్ న్యూస్ వెల్లడించింది. మన దేశంలో టెక్ హబ్‌గా ఉన్న బెంగళూరులో, కొత్తగా భారీ కార్యాలయం నిర్మించేందుకు స్థలాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. బెంగళూరు వైట్‌ఫీల్డ్ టెక్ కారిడార్‌లోని అలెంబిక్ సిటీలో ఒక ఆఫీస్ టవర్‌ను ఆల్ఫాబెట్ లీజుకు తీసుకుందని సమాచారం. మరో రెండు స్థలాలను కొనుగోలు చేసిందని, వీటి మొత్తం విస్తీర్ణం 24 లక్షల చదరపు అడుగులని చెబుతున్నారు. ఈ మొత్తం స్థలాన్ని పరిగణనలోకి తీసుకుంటే, మొత్తంగా 20,000 మంది అదనపు సిబ్బంది పనిచేసేందుకు వీలవుతుంది. ప్రస్తుతం మన దేశంలో ఆల్ఫాబెట్‌కు 14,000 మంది ఉద్యోగులు ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా కంపెనీలో 1,90,000 మంది పనిచేస్తున్నారు.

పర్యావరణహితంగా గ్రాఫైట్ వెలికితీత

రెయిన్ ఇండస్ట్రీస్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా ఉన్న రెయిన్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ రెయిన్ కార్బన్ జర్మనీ... జీఎంబీహెచ్, ఐరోపా బ్యాటరీ పరిశ్రమ కోసం పర్యావరణ అనుకూల గ్రాఫైట్ వెలికితీత విధానాలను అభివృద్ధి చేస్తోంది. ఇందుకోసం యూఎస్ఈ-జీ అనే మూడేళ్ల పరిశోధనా కార్యక్రమాన్ని ప్రారంభించింది. నార్తర్న్ గ్రాఫైట్, హెచ్‌సీ స్టార్క్ టంగ్‌స్టన్, ఫ్రెడిచ్ షిల్లర్ యూనివర్సిటీ జెనాతో కలిసి చేపట్టిన ఈ ప్రాజెక్టు మొత్తం విలువ రూ.18.16 కోట్లు కాగా, జర్మన్ ఫెడరల్ మినిస్ట్రీ ఫర్ ఎకనామిక్స్ అఫైర్స్, ఎనర్జీ రూ.12.18 కోట్ల వరకు సమకూరుస్తోంది. బ్యాటరీ తయారీలో కీలకమైన గ్రాఫైట్ కోసం చైనాపై ఆధారపడటాన్ని తగ్గించడం, రీసైకిల్ చేసిన బ్యాటరీ భాగాలతో ప్రాసెసింగ్ సాంకేతికతను అభివృద్ధి చేయడం దీని లక్ష్యం.

డ్రోన్ నిరోధక వ్యవస్థల తయారీ

సిగ్మా, ఇంద్రజాల్ మధ్య ఒప్పందం



ఈనాడు, హైదరాబాద్: పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో డ్రోన్ నిరోధక వ్యవస్థల తయారీకి సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (మెగాసాఫ్ట్)తో ఇంద్రజాల్ డ్రోన్ డిఫెన్స్ భారీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం ద్వారా తొలి ఏడాదిలోనే రూ.250 కోట్ల విలువైన ఆర్డర్లు లభించొచ్చని ఈ సంస్థలు వెల్లడించాయి. ఈ ఒప్పందం ప్రకారం, ఇంద్రజాల్ రూపొందించే కౌంటర్-డ్రోన్-వ్యవస్థలకు కీలకమైన రాడార్, సెన్సార్ స్కానింగ్, జామింగ్, స్పూఫింగ్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను సిగ్మా ప్రత్యేకంగా రూపొందించి, సరఫరా చేయనుంది. సిగ్మాకు చెందిన నాస్మిత్ నెట్‌వర్క్ ద్వారా ఐరోపా, నాటో దేశాల మార్కెట్లోకి ప్రవేశించేందుకు ఇంద్రజాల్‌కు వీలు కలుగుతుందని సిగ్మా సీఈఓ సునీల్ కలిదిండి, ఇంద్రజాల్ సహ వ్యవస్థాపకుడు కిరణ్ రాజు తెలిపారు.

✦ విలీనం నేపథ్యంలో ఈనెల 9 నుంచి ఎక్స్ఛేంజీల్లో మెగాసాఫ్ట్ స్థానంలో సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ పేరు కనిపిస్తుందని సంస్థ వెల్లడించింది.

హైదరాబాద్‌లో ఎల్‌పీఎల్ ఫైనాన్షియల్ జీసీసీ

ఈనాడు, హైదరాబాద్: అమెరికాకు చెందిన ప్రముఖ వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థ ఎల్‌పీఎల్ ఫైనాన్షియల్, తన గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్(జీసీసీ)ను హైదరాబాద్‌లో ప్రారంభించింది. ఈ విభాగానికి ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, కంట్రీహెడ్‌గా రమేష్ కాజాను నియమించినట్లు సంస్థ ప్రకటించింది. రాబోయే 3-5 ఏళ్లలో టెక్నాలజీ, ఆపరేషన్స్, డేటా అనలిటిక్స్, రిస్క్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో అనేక మంది నిపుణులను తీసుకోబోతున్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ కేంద్రం ద్వారా అత్యాధునిక సాంకేతికత, ఆవిష్కరణలపై దృష్టి సారించినట్లు ఎల్‌పీఎల్ వెల్లడించింది.

ఐటీ ఫ్రెషర్ల కంటే మా గిగ్‌వర్కర్ల ఆర్జనే అధికం

అర్బన్ కంపెనీ

దేశీయ ఐటీ, ఐటీ ఆధారిత సేవల రంగంలోని ప్రారంభ స్థాయి ఉద్యోగులకు లభిస్తున్న వేతనాలకు మించి తమ ప్లాట్‌ఫామ్ ద్వారా సేవలు అందిస్తున్న గిగ్ వర్కర్లు సంపాదిస్తున్నారని అర్బన్ కంపెనీ తెలిపింది. ఐటీ ఫ్రెషర్ల వేతనాలకు సమానంగా కొందరు ఆర్జిస్తుంటే.. చాలా మంది అంతకుమించే జేబులో వేసుకుంటారని వెల్లడించింది. ఇళ్లలో ప్లంబింగ్, సామగ్రి సర్దడం, శుభ్రం చేయడం వంటి పలు రకాల వృత్తులను తన తాత్కాలిక వృత్తి నిపుణుల (గిగ్ వర్కర్ల) ద్వారా గృహ, వ్యక్తిగత సంరక్షణ సేవలను అర్బన్ కంపెనీ అందిస్తోంది. ఈ తరహా వృత్తి నిపుణుల నెలవారీ సగటు నికర ఆర్జన 7% పెరిగి రూ.28,322కు చేరిందని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని తొమ్మిది నెలల గణాంకాల ఆధారంగా ఈ విషయాన్ని వెల్లడించింది. దీని ప్రకారం..

✦ ఐటీ, ఐటీ ఆధారిత రంగంలో ప్రారంభ స్థాయి ఉద్యోగుల వార్షిక వేతనం సగటు రూ.4 లక్షలని.. అంటే నెలకు సుమారు రూ.33,300 గా పేర్కొంది. తమ భాగస్వామ్య సంస్థల వృత్తి నిపుణుల్లో అత్యధిక సగటు సంపాదన రూ.51,673గా ఉందని, ఇది ఐటీ ఫ్రెషర్లకు అందుతున్న మొత్తంకంటే 60% ఎక్కువని పేర్కొంది. తమ వృత్తి నిపుణుల్లో ఎక్కువగా ఆర్జించే తొలి 20% మంది నెల సంపాదన సగటున రూ.42,418 కాగా.. తొలి 10 శాతం మంది ఆర్జన రూ.47,471; తొలి 5% మందిది రూ.51,673 అని అర్బన్ కంపెనీ వివరించింది.

ఈ ఏడాది రూ.2 లక్షల కోట్ల ఆదాయం: కాగ్నిజెంట్ అంచనా



ఈ ఏడాది (2026)లో తమ ఆదాయం 22.14 - 22.66 బి.డా. (సుమారు రూ.1,99,260 - 2,04,000 కోట్ల)కు చేరుతుందనే అంచనాను, అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగించే ఐటీ సేవల దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ వ్యక్తం చేసింది. 2025 మొత్తానికి ఈ సంస్థ ఆదాయం 7% పెరిగి 21.10 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.90 లక్షల కోట్ల)కు చేరింది. జనవరి-డిసెంబరును ఆర్థిక సంవత్సరంగా ఈ కంపెనీ పరిగణిస్తుంటుంది. గత మూడేళ్లుగా కృత్రిమమేధ (ఏఐ) నైపుణ్యాలపై 3.50 లక్షల మంది ఉద్యోగులకు ఇప్పించిన సాంకేతిక శిక్షణ సత్ఫలితాలు ఇస్తున్నట్లు కాగ్నిజెంట్ సీఈఓ ఎస్.రవికుమార్ తెలిపారు. వీటి ఫలితంగానే 2025లో 28 భారీ కాంట్రాక్టులు లభించాయని, ఈ విభాగ పరిమాణం 2024 కంటే 50% అధికమైందన్నారు.

డిసెంబరు త్రైమాసిక లాభం రూ.5830 కోట్లు: డిసెంబరు త్రైమాసికంలో 648 మిలియన్ డాలర్ల (సుమారు రూ.5830 కోట్ల) నికరలాభాన్ని ఆర్జించింది. 2024 ఇదే త్రైమాసిక లాభం 546 మి.డా (సుమారు రూ.4,914 కోట్ల) కంటే ఇది 18.7% అధికం. అంచనాలకు అనుగుణంగానే ఆదాయం కూడా 5082 మి.డా. (సుమారు రూ.45,730 కోట్ల) నుంచి 4.9% వృద్ధితో 5,333 మి.డా. (సుమారు రూ.48,000 కోట్ల)కు చేరింది.

✦ మొత్తం సిబ్బంది సంఖ్య 3,51,600కు చేరింది. 2024 డిసెంబరుకు ఉన్న ఉద్యోగులతో పోలిస్తే, 14,800 మంది పెరిగారు. ఇటీవలి పన్ను మినహాయింపుల వల్ల అంతర్జాతీయ డేటా కేంద్రాలకు భారత్ కేంద్రంగా మారుతుందని కాగ్నిజెంట్ సీఎఫ్ఓ జతిన్ తెలిపారు.

2 నెలల గరిష్ఠానికి సేవల రంగం

దిల్లీ: దేశీయ సేవల రంగం రాణించింది. ఈ ఏడాది జనవరిలో హెచ్ఎస్‌బీసీ ఇండియా సేవల పీఎంఐ వ్యాపార కార్యకలాపాల సూచీ 2 నెలల గరిష్ఠమైన 58.5 పాయింట్లకు చేరింది. డిసెంబరులో ఇది 58 పాయింట్లే. గిరాకీ పెరుగుదల, కొత్త వ్యాపార లాభాలు, సాంకేతిక పెట్టుబడులు.. సేవల రంగ వృద్ధికి కారణమయ్యాయని నెలవారీ సూచీ వెల్లడించింది. పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) పరిభాషలో 50 పాయింట్ల కంటే పైన నమోదైతే వృద్ధిగానూ, దిగువన నమోదైతే క్షీణతగా పరిగణిస్తారు. 'జనవరిలో పీఎంఐ 58.5 పాయింట్లకు పెరగడాన్ని ఈ రంగంలో స్థిరమైన వృద్ధి ఉండటాన్ని సూచిస్తోంది. కొత్త ఆర్డర్లు, దక్షిణాసియా, ఆగ్నేయాసియా నుంచి పెరిగిన గిరాకీ వంటివి ఇందుకు దోహదం చేశాయ'ని హెచ్ఎస్‌బీసీ చీఫ్ ఇండియా ఆర్థికవేత్త ప్రంజల్ భండారీ వెల్లడించారు.

ఇండిగో సర్వీసుల రద్దు ప్రభావం 10 లక్షల మందిపై: డీజీసీఏ

దిల్లీ: నిర్వహణ సమస్యల కారణంగా 2025 డిసెంబరు తొలివారంలో ఇండిగో రోజూ వందల సంఖ్యలో, తదుపరి పరిమిత సంఖ్యలో దేశీయ విమాన సర్వీసులను రద్దు చేసింది. ఫలితంగా మొత్తం విమాన ప్రయాణికుల్లో 93% మందిపై ప్రతికూల ప్రభావం పడిందని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తెలిపింది. 10.46 లక్షల మందికి పైగా ప్రయాణికులకు పరిహారం, సదుపాయాలు కల్పించేందుకు ఇండిగో రూ.24.27 కోట్లు ఖర్చు పెట్టినట్లు వివరించింది. విమాన సర్వీసుల రద్దు వల్ల ఇబ్బంది పడిన 9.82 లక్షల మంది ప్రయాణికులకు పరిహారం కింద రూ.22.74 కోట్లు ఇచ్చినట్లు తెలిపింది.

✦ డిసెంబరులో దేశీయంగా నిర్వహించాల్సిన మొత్తం విమాన సర్వీసుల్లో 6.92% రద్దయ్యాయి. ఇండిగో నుంచి 9.65% రద్దయినట్లు తెలిపింది. ఫలితంగా దేశీయ విపణిలో ఇండిగో మార్కెట్ వాటా నవంబరు నాటి 63.6% నుంచి డిసెంబరులో 59.6% తగ్గిందని వెల్లడించింది.

✦ దేశీయ విమాన ప్రయాణికుల విపణిలో అత్యధిక వాటా కలిగిన ఇండిగో, అనైతిక వ్యాపార విధానాలను అవలంబిస్తోందని, దీనిపై సవివర దర్యాప్తు జరపాలని కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ) ఆదేశాలు జారీ చేసింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
ఎన్‌హెచ్‌పీసీ	320.60	330.13	2492.83	2616.89
యురేకా ఫోర్బ్స్	9.98	35.03	645.40	597.74
అపోలో టైర్స్	471.00	337.00	7743.00	6928.00
ఆప్టస్ వాల్యూ హౌసింగ్ ఫైనాన్స్	239.00	191.00	569.00	465.00
ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్	278.97	280.15	5906.83	4889.60
సెంచురీ ప్లైబోర్డ్స్	65.05	58.84	1350.08	1140.47
ట్రెంట్	510.11	496.54	5345.06	4656.56
టాటా పవర్	1194.00	1188.00	14269.08	15793.43
కల్పతరు ప్రాజెక్ట్స్	149.05	139.59	6693.76	5742.76
డాక్టర్ అగర్వాల్స్	44.00	28.00	118.00	68.00
ఇమామీ	319.48	278.98	1151.81	1049.48
జైన్ ఇరిగేషన్	(47.88)	(1.22)	1602.86	1362.63
కీస్టోన్ రియల్టర్స్	5.08	29.98	293.95	485.82
బజాజ్ ఫిన్‌సర్వ్	2229.00	2231.00	39708.00	32042.00
ఫుజియామా పవర్ సిస్టమ్స్	67.30	30.00	588.50	338.60
ఓరియంట్ గ్రీన్ పవర్	(21.43)	(22.41)	40.06	40.40
ఎమ్‌క్యూర్ ఫార్మా	231.00	156.00	2363.00	1963.00
టీసీఐ	130.50	118.20	1113.20	1042.20
అపోలో టైర్స్	471.00	337.00	7743.00	6928.00
జైప్రకాశ్ పవర్ వెంచర్స్	4.89	124.65	1211.40	1256.35
మెట్రోపొలిస్ హెల్త్‌కేర్★	42.00	31.00	406.00	323.00

★ 3:1 నిష్పత్తిలో బోనస్ షేర్ల జారీ

ఇంధనం కోసం రష్యా నుంచి వెనెజువెలాకు మారితే.. ఏడాదికి రూ.27,000 కోట్లు ఆదా

- బ్యారెల్‌కు 10-12 డాలర్ల రాయితీ లభిస్తేనే
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక



రష్యా నుంచి మనదేశం దిగుమతి చేసుకుంటున్న ముడిచమురులో కొంత భాగాన్ని వెనెజువెలా నుంచి తెప్పించుకుంటే.. ఇంధన దిగుమతి బిల్లు రూపేణ ఏడాదికి 3 బిలియన్ డాలర్ల (సుమారు రూ.27,000 కోట్ల) వరకు ఆదా అవుతుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రీసెర్చ్ నివేదిక అంచనా వేసింది. రష్యా ముడి చమురుపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, వెనెజువెలా హెవీ క్రూడ్ కొనుగోళ్లను పెంచుకుంటే.. గణనీయ స్థాయిలో వ్యయ ప్రయోజనాలు ఉంటాయని పేర్కొంది. రవాణా ఖర్చులు, ఇతరత్రా వ్యయాలను పరిగణనలోకి తీసుకునే ఈ అంచనా వేస్తున్నట్లు తెలిపింది. 'భారత్ దిగుమతిదార్లు వ్యయ ప్రయోజనం పొందేందుకు సరైన ఎంపిక కావాలంటే.. వెనెజువెలా హెవీ క్రూడ్ బ్యారెల్ ధర కనుక 10-12 డాలర్లు తక్కువకు లభించినా సరిపోతుంద'ని వివరించింది. ఈ ధర ప్రకారం వెనెజువెలా నుంచి హెవీ క్రూడ్‌ను దిగుమతి చేసుకుంటే... భారత ఇంధన బిల్లు ఏడాదికి 3 బిలియన్ డాలర్ల మేర తగ్గుతుందని పేర్కొంది.

✦ నివేదికలో పొందుపరిచిన ఆయిల్ ధరల ప్రకారం.. ప్రస్తుతం వెనెజువెలా హెవీ క్రూడ్ బ్యారెల్ ధర 51 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. భౌగోళికంగా వెనెజువెలా భారత్‌కు చాలా దూరంలో ఉంది. వెనెజువెలాతో భారత్ షిప్పింగ్ దూరం పశ్చిమాసియా దేశాలతో పోలిస్తే 5 రెట్లు, రష్యాతో పోలిస్తే రెట్టింపు ఉంటుంది. అందువల్ల వెనెజువెలా నుంచి భారత్ చమురు దిగుమతులు రవాణాపరంగా వ్యయభరితమే. వెనెజువెలా హెవీ క్రూడ్‌ను, వివిధ గ్రేడ్ ఇంధనాలుగా మార్చేందుకు రిఫైనింగ్, సాంకేతిక వ్యయాలు కూడా ఎక్కువగానే అవుతాయి.

లాభాల్లోకి ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్!

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధం (అక్టోబరు-మార్చి)లో నిర్వహణ లాభాన్ని నమోదు చేయగలమని ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ అంచనా వేస్తోంది. బోయింగ్ 737 ఎన్‌జీ సహా కంపెనీ వద్ద ఉన్న విమానాల కేబిన్ ఇంటీరియర్ల నవీకరణ కోసం 70 మిలియన్ డాలర్ల (సుమారు రూ.637 కోట్లు) పెట్టుబడులు పెట్టే ప్రణాళికలో ఉన్నట్లు కంపెనీ ఛైర్మన్ నిపుణ్ అగర్వాల్ పేర్కొన్నారు. ప్రస్తుతం కంపెనీ వద్ద 100కు పైగా విమానాలుండగా, 2030-31 కల్లా ఈ సంఖ్యను 300కు చేర్చాలన్న లక్ష్యంతో ఉంది. ఇప్పటికే 50 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాల రెట్రోఫిట్ ప్రారంభమైన సంగతి తెలిసిందే.

'బీ787 విమానాల్లో ఇబ్బంది లేదు': కార్యకలాపాల్లో ఉన్న అన్ని బోయింగ్ 787 విమానాల్లో ఇంధన నియంత్రణ స్విచ్(ఎఫ్‌సీఎస్)లను ముందు జాగ్రత్త చర్యగా తనిఖీ చేయగా, ఎటువంటి సమస్యలూ కనిపించలేదని ఎయిరిండియా తెలిపింది. ఆదివారం లండన్ హీత్రూ నుంచి 200 మందికి పైగా ప్రయాణికులతో బెంగళూరుకు బయలుదేరిన డ్రీమ్‌లైనర్ విమానంలో ఇంధన స్విచ్‌లో ఇబ్బందులు వచ్చాయని పైలట్ తెలిపిన నేపథ్యంలో ఈ తనిఖీ చేపట్టింది. ప్రస్తుతం సంస్థ వద్ద 33 బోయింగ్ 787 (డ్రీమ్‌లైనర్) విమానాలుండగా, అందులో 28 కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.

ఇంత ఆలస్యం ఎందుకు?

- సీబీఐ, ఈడీపై సుప్రీం ఆగ్రహం
- అడాగ్, అనిల్ కేసు దర్యాప్తు నేపథ్యం



దిల్లీ: దర్యాప్తుల విషయంలో 'వివరించలేని ఆలస్యం' చేస్తున్నందుకు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)లపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రూ.40,000 కోట్ల మేర బ్యాంకింగ్, కార్పొరేట్ మోసం ఆరోపణలు ఉన్న అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ (అడాగ్), అనిల్ అంబానీ, గ్రూప్ కంపెనీలపై ఒక 'సహేతుక', 'సత్వర' దర్యాప్తు నిర్వహించాలని ఆ ఏజెన్సీలను కోర్టు ఆదేశించింది. ఈ విషయమై ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేసిన ఈఏఎస్ శర్మ భావిస్తున్నట్లుగా, కోర్టు ముందస్తు అనుమతులు లేకుండా అనిల్ అంబానీ దేశం విడిచి వెళ్లరని అనిల్ తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గి కోర్టుకు వివరించారు. అంబానీ, అడాగ్ కంపెనీలపై దర్యాప్తు ప్రగతిని వివరిస్తూ 4 వారాల్లోగా నివేదిక సమర్పించాలంటూ భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ, విపుల్ ఎం పంచోలీతో కూడిన ధర్మాసనం పేర్కొంది. 'ఈడీ, సీబీఐ ఇప్పటికే చాలా సమయం తీసుకున్నాయి. ఇకనైనా దర్యాప్తు వేగవంతం చేస్తాయని భావిస్తు'న్నట్లు ధర్మాసనం పేర్కొంది. దర్యాప్తునకు సీనియర్ అధికారులతో ఒక సిట్ వేయాలనీ ఈడీని కోరింది. సీబీఐ ధోరణినీ బెంచ్ విమర్శించింది. అంతక్రితం చాలా ఆర్థిక సంస్థలు ఫిర్యాదు చేసినా, ఎస్‌బీఐ ఫిర్యాదు అనంతరమే 2025లో ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేశారని గుర్తు చేసింది. ఒక్కో ఆర్థిక సంస్థ లావాదేవీ విడిగా ఉంటుందని, విడివిడిగానే ఎఫ్ఐఆర్‌లు ఉండాలని తెలిపింది.

ఐటీ షేర్లు పడినా.. సూచీలు ముందుకే

ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.30 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.295 కోట్లు

సెన్సెక్స్ ▲ 79 83818 | **నిఫ్టీ ▲ 48 25776**



ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి పెద్ద షేర్లు రాణించడంతో బుధవారం దేశీయ సూచీలు లాభాల్లో ముగిశాయి. బలహీన అంతర్జాతీయ సంకేతాల కారణంగా ఐటీ షేర్లు కుదేలైనా, మార్కెట్లు ముందుకెళ్లాయి. ఎంపిక చేసిన షేర్లలో మదుపర్ల అమ్మకాల వల్ల, సూచీల లాభాలు పరిమితమయ్యాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 15 పైసలు తగ్గి 90.47 వద్ద ముగిసింది. ఇరాన్ ఉద్రిక్తతల నడుమ బ్యారెల్ ముడిచమురు ధర 3% పెరిగి 69.35 డాలర్ల దగ్గర ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్ మినహా మిగతావి లాభపడ్డాయి. ఐరోపా సూచీలు మిశ్రమంగా ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.02 లక్షల కోట్లు పెరిగి రూ.469.16 లక్షల కోట్ల (5.19 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 487 పాయింట్ల (క్రితం ముగింపు 83,739.13) నష్టంతో 83,252.06 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. తదుపరి కోలుకున్న సూచీ, ఇంట్రాడేలో 83,847.53 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 78.56 పాయింట్లు పెరిగి 83,817.69 వద్ద ముగిసింది. నిఫ్టీ 48.45 పాయింట్లు పెరిగి 25,776 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,563.95- 25,818.55 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 23 లాభపడ్డాయి. ఎటర్నల్ 5.22%, ట్రెంట్ 4.98%, ఎన్‌టీపీసీ 2.44%, అదానీ పోర్ట్స్ 2.36%, పవర్‌గ్రిడ్ 2.15%, మారుతీ 2.02%, టైటన్ 1.73%, అల్ట్రాటెక్ 1.71%, భారతీ ఎయిర్‌టెల్ 1.41%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.37% రాణించాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ నష్టపోయాయి. రంగాలవారీ సూచీల్లో.. యుటిలిటీస్ 2.72%, చమురు-గ్యాస్ 2.37%, మన్నికైన వినిమయ వస్తువులు 2.36%, విద్యుత్ 2.18%, ఇంధన 1.91%, వినియోగ 1.56%, లోహ 1.27% పెరిగాయి. ఐటీ 5.49%, ఫోకస్డ్ ఐటీ 5.06% పడ్డాయి. బీఎస్ఈలో 2667 షేర్లు లాభపడగా, 1535 స్క్రిప్‌లు నష్టపోయాయి. 169 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

✦ **భెల్‌కు భారీ ఆర్డరు:** హిందాల్కో ఇండస్ట్రీస్ సంస్థ నుంచి రూ.1200- 1500 కోట్ల శ్రేణిలో ఆర్డరు దక్కించుకున్నట్లు ప్రభుత్వ రంగ సంస్థ భెల్ ప్రకటించింది. ఆదిత్య అల్యూమినియం నుంచి అందిన ఈ ఆర్డరు ప్రకారం, ఒడిశా సంబల్‌పూర్ (లపాంగా)లోని ప్రాజెక్టును భెల్ చేపట్టనుంది.

✦ **ఫ్రాక్టల్ అనలిటిక్స్ ధరల శ్రేణి రూ.857– 900:** కృత్రిమ మేధ సొల్యూషన్స్ అందించే ఫ్రాక్టల్ అనలిటిక్స్ ఐపీఓ ఈ నెల 9న ప్రారంభమై 11న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.857- 900ను నిర్ణయించారు. ఐపీఓ కోసం కంపెనీ విలువను రూ.15,500 కోట్లుగా లెక్కించారు. రిటెయిల్ మదుపర్లు కనీసం 16 షేర్లకు దరఖాస్తు చేసుకోవాలి. ఐపీఓ అనంతరం కంపెనీ షేర్లు ఈనెల 16న ఎక్స్ఛేంజీల్లో నమోదయ్యే అవకాశం ఉంది.

✦ **9 నుంచి అయ్ ఫైనాన్స్ ఐపీఓ:** బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) అయ్ ఫైనాన్స్ రూ.1,010 కోట్ల ఐపీఓ ఈనెల 9న ప్రారంభమై 11న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.122- 129ను నిర్ణయించారు. గరిష్ఠ ధర ప్రకారం కంపెనీ మార్కెట్ విలువ రూ.3,184 కోట్లు అవుతుంది ఇష్యూలో భాగంగా రూ.710 కోట్ల విలువైన తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో రూ.300 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదార్లు విక్రయించనున్నారు.

ఐటీ షేర్లు విలవిల


కృత్రిమ మేధ సంస్థ ఆంత్రోపిక్ తీసుకొచ్చిన సరికొత్త ఏఐ ఆటోమేషన్ టూల్స్ వల్ల, సంప్రదాయ ఔట్‌సోర్సింగ్ సేవలకు గిరాకీ తగ్గొచ్చన్న ఆందోళనలు అంతర్జాతీయంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఐటీ షేర్లు కుదేలయ్యాయి. ఇన్ఫోసిస్ 7.19%, టీసీఎస్ 6.95%, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ 5.51%, హెగ్జావేర్ టెక్నాలజీస్ 4.98%, పెర్సిస్టెంట్ సిస్టమ్స్ 4.69%, హెచ్‌సీఎల్ టెక్ 4.22%, టెక్ మహీంద్రా 4.12%, విప్రో 3.73% చొప్పున నష్టపోయాయి. ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.1.66 లక్షల కోట్లు ఆవిరైంది.

ఆర్‌బీఐ ఎంపీసీ సమావేశాలు ప్రారంభం

కీలక రేట్లను నిర్ణయించే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. సాధారణ బడ్జెట్, భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో ఈ సారి ఆర్‌బీఐ కీలక రేట్ల నిర్ణయంపై మదుపర్లు దృష్టి పెట్టారు. ఎంపీసీ నిర్ణయాలను శుక్రవారం ఉదయం ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించనున్నారు. ఈ సారి కీలక రేట్లను ఆర్‌బీఐ యథాతథంగా ఉంచొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రేట్ల కోతకు అవకాశం లేకపోలేదని మరికొందరు భావిస్తున్నారు.

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



◆ ఏ మాజీ ప్రధాన మంత్రి జయంతిని పురస్కరించుకుని డిసెంబరు 25ను దేశంలో సుపరిపాలనా దినోత్సవంగా నిర్వహిస్తారు? (2014 నుంచి ఈ దినోత్సవాన్ని ఏటా జరుపుతున్నారు. 2025లో ఈ నాయకుడి 101వ జయంతిని నిర్వహించారు.)

జ: అటల్ బిహారీ వాజ్‌పేయీ

◆ 2025, డిసెంబరు 25న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏ భాషలో భారత రాజ్యాంగాన్ని విడుదల చేశారు? (ఈ రాజ్యాంగాన్ని ఓల్‌చికి లిపిలో ప్రచురించారు. ఈ భాష సాంప్రదాయ రచనా విధానమే ఓల్‌చికి లిపి. 2025 సంవత్సరం ఈ లిపికి 100వ వార్షికోత్సవం. భారత్‌లోని అత్యంత పురాతన గిరిజన భాషల్లో ఒకటైన ఈ భాషను ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బిహార్ రాష్ట్రాల్లోని గిరిజన సమాజాలు విస్తృతంగా వినియోగిస్తున్నాయి.)

జ: సంతాలి భాష

◆ 2025-26కు సంబంధించి టేస్ట్ అట్లాస్ రూపొందించిన ప్రపంచంలోని టాప్ 10 అత్యుత్తమ ఆహార నగరాల్లో ఏది అగ్రస్థానంలో నిలిచింది? జ: నేపుల్స్ (ఇటలీలోని ఈ నగరంతోపాటు మిలన్, బోలోగ్నా, ఫ్లోరెన్స్‌లు వరసగా తొలి 4 స్థానాల్లో నిలిచాయి. ముంబయిది ఐదో స్థానం. టాప్ 10 నగరాల్లో స్థానం పొందిన ఏకైక భారతీయ నగరంగానూ ముంబయి నిలిచింది.)

మరింత సమాచారం

స్వచ్ఛమైన ప్రపంచానికి సమష్టి సంకల్పం!

ఆధునిక ప్రపంచ పర్యావరణ సమస్యలకు సరిహద్దులు లేవు. అవి ఏ ఒక్క దేశానికో పరిమితమైనవి కావు. కాలుష్యం, జీవవైవిధ్య నష్టం, వాతావరణ మార్పుల ఫలితాలకు ప్రతి దేశం ప్రత్యక్షంగానే ప్రభావితమవుతోంది. కాలుష్య ఉద్గారాలు, గ్రీన్‌హౌస్ వాయువులతో భూతాపం పెరిగి మానవాళితోపాటు సమస్త జీవరాశి ఉనికి ప్రమాదంలో పడుతోంది. ఈ విపత్కర పరిణామాన్ని ఎదుర్కోవడానికి అన్ని దేశాల మధ్య సమన్వయాన్ని సాధించి, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందిస్తున్నవే ప్రపంచ పర్యావరణ ఒప్పందాలు. ఉద్గారాల తగ్గింపు కోసం తెచ్చిన క్యోటో ప్రోటోకాల్, వాతావరణ మార్పులను అరికట్టేందుకు రూపొందిన ప్యారిస్ ఒప్పందం ఇందులో కీలకమైనవి. సుస్థిర అభివృద్ధి, పర్యావరణ భద్రత కోసం పని చేస్తున్న ఇలాంటి బహుపాక్షిక పర్యావరణ ఒప్పందాల ప్రాధాన్యాలు, ముఖ్య ఉద్దేశాలు, వాటిలోని లోపాలను పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి.



జనరల్ స్టడీస్
పర్యావరణ అంశాలు

పర్యావరణ ఒప్పందాలు

మానవ చర్యల కారణంగా భూవాతావరణంలో కార్బన్ డయాక్సైడ్, మీథేన్ తదితర వాయువుల గాఢత పెరిగి గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ అనే దృగ్విషయం ఏర్పడింది. దాంతో సగటు ప్రపంచ ఉష్ణోగ్రత పెరిగింది. దీన్నే భూతాపం (గ్లోబల్ వార్మింగ్) అంటారు. 1880లో ప్రపంచ రికార్డుల నిర్వహణ ప్రారంభమైనప్పుడు ఉన్న ఉష్ణోగ్రతల కంటే 2016లో సగటు ఉష్ణోగ్రతలు 1.3 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా ఉన్నాయి. చివరి మంచు యుగానికి, నేటి ఉష్ణోగ్రతలకు మధ్య వ్యత్యాసం సుమారు 5 డిగ్రీల సెల్సియస్ ఉంటుందని అంచనా. ఈ భూతాపం భూమి మీద ఉన్న అన్ని జీవరాశులకు ప్రమాదకరం.

వాతావరణంలో మార్పులను ఎదుర్కోవడానికి కార్బన్ డయాక్సైడ్, మీథేన్ లాంటి గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించడమే ఏకైక మార్గం. ఈ దిశగానే ప్యారిస్ ఒప్పందం కుదిరింది. 2015, నవంబరు 30 నుంచి డిసెంబరు 11 వరకు, 195 దేశాల ప్రభుత్వాలు ఫ్రాన్స్‌లోని ప్యారిస్‌లో సమావేశమై ఒప్పందంపై సంతకాలు చేశాయి. 29 ఆర్టికల్స్‌తో కూడిన 32 పేజీల ప్యారిస్ ఒప్పందం ప్రపంచంలో తొలి సమగ్ర వాతావరణ ఒప్పందంగా గుర్తింపు పొందింది. ఫ్రెంచ్ భాషలో ఈ ఒప్పందాన్ని 'ఎల్ ఆకార్డ్ డి ప్యారిస్' అంటారు.



ప్యారిస్ ఒప్పంద సమావేశం(2015)

ప్యారిస్ ఒప్పంద లక్ష్యాలు

★ ప్రపంచ ఉష్ణోగ్రతలు పారిశ్రామిక పూర్వకాలం నాటి 2.0 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే తక్కువగా ఉంచడం.

★ ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పరిమితం చేయడం.

★ వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కొనేలా దేశాల సామర్థ్యాన్ని బలోపేతం చేయడం.

★ 2050 నుంచి 2100 మధ్య ఏదో ఒక సమయంలో చెట్లు, నేల, మహాసముద్రాలు సహజంగా గ్రహించగలిగే స్థాయికి మానవ కార్యకలాపాలు విడుదల చేసే గ్రీన్‌హౌస్ వాయువుల పరిమాణాన్ని పరిమితం చేయాలి.


★ పేద దేశాలు పునరుత్పాదక ఇంధనానికి మారడానికి వీలుగా 'క్లైమేట్ ఫైనాన్స్' రూపంలో ధనిక దేశాలు సహాయం చేయాలి.

★ ఉద్గారాలను తగ్గించడంలో ప్రతి అయిదేళ్లకు ఒక దేశం సహకారాన్ని సమీక్షించాలి.

✦ వాతావరణ మార్పులను ఎదుర్కొనే లక్ష్యంతో 1992లో యునైటెడ్ నేషన్స్ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ (యూఎన్ఎఫ్‌సీసీసీ) పేరుతో సదస్సు జరిగింది. దీనికి కొనసాగింపుగానే 1997లో క్యోటో ప్రొటోకాల్ రూపొందింది. 2005, ఫిబ్రవరి 16న అమల్లోకి వచ్చింది.

✦ 2012, డిసెంబరులో క్యోటో ప్రొటోకాల్ మొదటి నిబద్ధత గడువు ముగిసిన తర్వాత సభ్య దేశాలన్నీ ఖతార్‌లోని దోహాలో సమావేశమై క్యోటో ఒప్పందాన్ని సవరించాయి. ఇందులో 2020 నాటికి ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలను జోడించారు. దీనినే 'దోహా సవరణ'గా పిలుస్తారు.

ప్యారిస్ ఒప్పందం (2015) వర్సెస్ క్యోటో ప్రొటోకాల్ (1997)


క్యోటోలో జరిగిన యూఎన్ఎఫ్‌సీసీసీ పార్టీల మూడో సమావేశం (1997)


వాతావరణ మార్పులను అరికట్టడానికి ప్రపంచ దేశాలన్నీ కుదుర్చుకున్న తొలి సమగ్ర, చారిత్రక ఒప్పందం ప్యారిస్ ఒప్పందం. క్యోటో ప్రొటోకాల్‌లో ఉద్గారాలను తగ్గించడానికి దేశాలు చేసే జాతీయ వాగ్దానాలు స్వచ్ఛమైనవి. అయితే ప్యారిస్ ఒప్పందంలో అన్ని పక్షాలు ఉద్గారాల నియంత్రణకు చట్టపరంగా కట్టుబడి ఉండాలని ఉంది. అలాగే అన్ని పక్షాలు తమ ఉద్గారాల స్థాయిని, వాటి నియంత్రణ ప్రయత్నాలను క్రమం తప్పకుండా నివేదించాలని చెబుతుంది. ★ ప్యారిస్ ఒప్పందానికి అనుగుణంగా 2005 స్థాయి నుంచి 2030 వరకు ఉద్గారాల తీవ్రతను 33%-35% తగ్గించాలని భారత్ లక్ష్యంగా విధించుకుంది. 2030 నాటికి అడవులు, చెట్ల విస్తీర్ణం పెంపు ద్వారా 2.5-3 బిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్‌కు సమానమైన అదనపు కార్బన్ సింక్‌ను సృష్టించాలని నిర్ణయించింది.

2015లో ప్యారిస్‌లో జరిగిన సుస్థిరాభివృద్ధి శిఖరాగ్ర సమావేశంలో యూఎన్ఎఫ్‌సీసీసీ భాగస్వామ్య పక్షాలన్నీ ప్యారిస్ వాతావరణ ఒప్పందంపై సంతకం చేశాయి. ఆ విధంగా క్యోటో ప్రొటోకాల్‌ను ప్యారిస్ ఒప్పందం సమర్థంగా భర్తీ చేసింది.

ప్యారిస్ ఒప్పంద ఫ్రేమ్‌వర్క్‌లు (చట్రాలు)

మిగతా అంతర్జాతీయ పర్యావరణ ఒప్పందాలకు భిన్నంగా ప్యారిస్ ఒప్పందంలో టెక్నాలజీ ఫ్రేమ్‌వర్క్, కెపాసిటీ బిల్డింగ్ ఫ్రేమ్‌వర్క్, పారదర్శక ఫ్రేమ్‌వర్క్ తదితరాలు ఉన్నాయి. గ్రీన్‌హౌస్ ఉద్గారాల పరంగా వీలైనంత త్వరగా లక్ష్యాన్ని చేరుకోవడానికి, మానవ నిర్మిత గ్రీన్‌హౌస్ వాయువుల ఉత్పత్తి, శోషణ మధ్య సమతౌల్యత సాధించడానికి దీర్ఘకాలిక ప్రణాళికను ఈ ఒప్పందం రూపొందిస్తుంది.

ప్రధాన గ్రీన్‌హౌస్ వాయువులు



కార్బన్ డయాక్సైడ్ (CO_2), మీథేన్ (CH_4), నైట్రస్ ఆక్సైడ్ (N_2O), హైడ్రో ఫ్లోరో కార్బన్‌లు, పెర్ఫ్లోరోకార్బన్‌లు, సల్ఫర్ హెక్సాఫ్లోరైడ్ (SF_6).

క్యోటో ప్రొటోకాల్: 1997, డిసెంబరు 11న జపాన్‌లోని క్యోటోలో జరిగిన యూఎన్ఎఫ్‌సీసీసీ పార్టీల మూడో సమావేశంలో క్యోటో ప్రొటోకాల్‌ను ఆమోదించారు. 2005, ఫిబ్రవరి 16న అమల్లోకి వచ్చింది. ఇప్పటివరకు 192 దేశాలు ఈ ఒప్పందాన్ని ఆమోదించాయి. దీని ప్రకారం 37 పారిశ్రామిక దేశాలు, యూరోపియన్ కమ్యూనిటీ 2008-2012 మధ్య అయిదేళ్ల కాలంలో 1990 స్థాయుల నుంచి సగటున 5% ఉద్గారాలు తగ్గించడానికి అంగీకరించాయి.



రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

పదో తరగతి - జీవశాస్త్రం
నియంత్రణ సమన్వయం



ఫైనల్ పరీక్షలు - 2026
ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

2 మార్కులు

1. మొక్కల్లో రసాయన సమన్వయం ఎలా జరుగుతుంది?

జ: 1) మొక్కలు హార్మోన్‌లు లేదా ఫైటోహార్మోన్‌లు అనే రసాయన పదార్థాలను ఉత్పత్తి చేయడం ద్వారా వాటి జీవక్రియలకు సంబంధించిన నియంత్రణను సమన్వయపరచుకుంటాయి. 2) ఆక్సిన్‌లు.. కణాలు పొడవుగా పెరగడానికి సహాయపడతాయి. 3) జిబ్బరెల్లిన్‌లు.. కాండం పెరుగుదలకు దోహదపడతాయి. 4) సైటోకైనిన్‌లు.. కణవిభజనను ప్రేరేపిస్తాయి. 5) అబ్సిసిక్ ఆమ్లం.. మొక్క పెరుగుదలను నిరోధిస్తుంది. 6) మొక్కల్లో హార్మోన్‌లు అవి ప్రభావం చూపే ప్రదేశానికి దూరంగా ఉన్న ప్రదేశంలో సంశ్లేషితమై చర్యాశీల ప్రాంతానికి సరళంగా వ్యాపిస్తాయి.

2. నులితీగెలు ఆధారం చుట్టూ చుట్టుకుంటూ పెరిగేలా ఆక్సిన్‌లు ఎలా ప్రోత్సహిస్తాయి?

జ: 1) నులితీగెలు స్పర్శకు స్పందిస్తాయి. 2) ఇవి ఏదైనా ఆధారానికి దగ్గరగా వచ్చినపుడు, ఆ భాగం ఆధారానికి దూరంగా ఉన్న నులితీగ భాగం, కొన భాగం నుంచి ఆక్సిన్‌లు అక్కడికి చేరడం వల్ల ఆ భాగం వేగంగా పెరుగుతుంది. 3) అక్కడ పెరుగుదల వేగంగా జరిగేలా ఆక్సిన్‌లు ప్రోత్సహిస్తాయి. 4) దీనివల్ల నులితీగ ఆధారం చుట్టూ చుట్టుకుంటూ దాన్ని అంటి పెట్టుకుంటుంది.

3. మెదడు అఘాతాల నుంచి ఏ విధంగా రక్షణ పొందుతుంది?

జ: వివిధ రకాల కార్యకలాపాల నిర్వహణలో ముఖ్యపాత్ర వహించే మెదడును కపాలం అనే ఎముకల పెట్టె, మస్తిష్క మేరు ద్రవం కాపాడతాయి.

కపాలం: కపాలం అనే ఎముకల పెట్టె మెదడును బాహ్య అఘాతాల నుంచి రక్షిస్తుంది.

మస్తిష్క మేరుద్రవం: మెదడు చుట్టూ ఉండే మెనింజస్ అనే పొరల మధ్య మస్తిష్క మేరుద్రవం ఉంటుంది. ఇది ఘాత శోషణి (షాక్ అబ్జార్బర్)గా పనిచేస్తూ యాంత్రిక అఘాతాల నుంచి మెదడును రక్షిస్తుంది.

4. జ్ఞాననాడీ, చాలకనాడీకి మధ్య భేదాలను రాయండి.

జ: **జ్ఞాననాడీ:** 1. జ్ఞాననాడీ జ్ఞానేంద్రియాల్లోని గ్రాహకాల నుంచి సమాచారాన్ని మెదడుకు లేదా వెన్నుపాముకు చేరవేస్తుంది.

చాలకనాడీ: 1. చాలకనాడీ వార్తలను మెదడు నుంచి నిర్వాహక అంగాలకు తీసుకునివెళుతుంది.

5. మొక్కల్లో కింది విధులను నిర్వర్తించే హార్మోన్‌లను తెలపండి.

1) కాండం పెరుగుదల 2) కణ విభజనను ప్రోత్సహించడం 3) ఆకు రాలడం 4) కాండం పొడవుగా అవడం.

జ: 1) కాండం పెరుగుదల - జిబ్బరెల్లిన్‌లు 2) కణ విభజనను ప్రోత్సహించడం - సైటోకైనిన్‌లు, 3) ఆకు రాలడం - అబ్సిసిక్ ఆమ్లం, 4) కాండం పొడవుగా అవడం - ఆక్సిన్‌లు.

ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు



రచయిత: మంగళంపల్లి సత్యనారాయణ మూర్తి


జనరల్ స్టడీస్-ప్రపంచ చరిత్ర

ఏడేళ్లు.. మూడు యుద్ధాలు.. జర్మనీ ఏకం!

ఐరోపాలో పద్దెనిమిది, పందొమ్మిదో శతాబ్దాల్లో వచ్చిన జాతీయవాదం ప్రపంచంలో ప్రజాస్వామ్య దేశాల ఆవిర్భావానికి దారితీసిన గొప్ప పరిణామం. రాచరిక వ్యవస్థలు జాతీయవాద రాజ్యాలుగా పరిణామం చెందడంతో ఐరోపా రాజకీయ ముఖచిత్రం మారిపోయింది. భాష, సంస్కృతి, చరిత్ర ఆధారంగా ప్రజల ఉమ్మడి రాజకీయ, సాంస్కృతిక ఆసక్తులతో జర్మనీ, ఇటలీ ఏకీకరణ జరిగి శక్తిమంతమైన దేశాలుగా నిలిచాయి. ప్రజల స్వయం నిర్ణయాధికారానికి పట్టం కట్టి, ఆధునిక రాజ్యాల ఏర్పాటుకు మార్గాన్ని చూపిన ఐరోపా జాతీయవాద పరిణామాలు, అది తెచ్చిన మార్పులపై పోటీ పరీక్షార్థులకు సమగ్ర అవగాహన ఉండాలి. ఈ పరిణామక్రమంలో జరిగిన పోరాటాలు, అందుకు నేతృత్వం వహించిన వ్యక్తులతో పాటు స్వేచ్ఛ, సమానత్వ భావాలను ప్రపంచానికి పరిచయం చేసిన ఫ్రెంచ్ విప్లవ ప్రాధాన్యాన్నీ గుర్తుంచుకోవాలి.

ఐరోపాలో జాతీయవాద పురోగతి

1. కింది వాటిలో గిసెప్పి మాజినీ గురించి సరైన సమాధానాన్ని గుర్తించండి.



ఎ) 1807లో జెనోవా (ప్రస్తుతం జెనీవా)లో జన్మించాడు.
బి) కోర్బోనరి అనే రహస్య సంఘంలో సభ్యుడు.
సి) మార్సెల్స్, యంగ్ ఇటలీ అనే రహస్య సంఘాలను ఏర్పాటు చేశాడు.
డి) 24 ఏళ్ల వయసులో దేశ బహిష్కరణకు గురయ్యాడు.

1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి
3) బి, సి, డి 4) ఎ, సి, డి

2. "రాజ్యాలు అనేవి సహజసిద్ధమైన మానవ విభాగాలుగా ఉండాలనేదే భగవంతుడి ఉద్దేశం" అని అన్నదెవరు?

1) మాజినీ 2) కవూర్
3) గారిబాల్డీ 4) మెటర్నిచ్


3. "మాజినీ మన సామాజిక వ్యవస్థకు అత్యంత ప్రమాదకరమైన శత్రువు" అని అన్నది?

1) కవూర్ 2) గారిబాల్డీ
3) మెటర్నిచ్ 4) విక్టర్ ఇమ్మాన్యూయేల్

4. "ఫ్రాన్స్ తుమ్మితే ఐరోపాకు జలుబు చేస్తుంది" అని అన్నది?

1) లూయీ ఫిలిప్ 2) లూయీ బ్లాంక్
3) మెటర్నిచ్ 4) గారిబాల్డీ

5. కింది వాటిని పరిగణించండి.


జులై విప్లవం (1830)

ఎ) 1830లో జరిగిన జులై విప్లవం బ్రసెల్స్‌లో తిరుగుబాటుకు దారితీసింది.
బి) యునైటెడ్ కింగ్‌డమ్ ఆఫ్ నెదర్లాండ్స్ నుంచి బెల్జియం విడిపోయింది.

1) ఎ, బి సరికావు
2) ఎ సరైంది, బి సరికాదు
3) ఎ సరికాదు, బి సరైంది 4) ఎ, బి సరైనవి

6. గ్రీకులో స్వతంత్ర పోరాటం జరిగిన సంవత్సరం?

1) 1825 2) 1821 3) 1811 4) 1815

7. కవులు, కళాకారులు ఏ నాగరికతను 'యూరప్ నాగరికతకు ఊయల'గా పేర్కొన్నారు.

1) రోమన్ 2) పర్షియా 3) గ్రీకు 4) చైనా

8. ముస్లిం సామ్రాజ్య వ్యతిరేక పోరాటం కోసం ప్రజాభిప్రాయాన్ని కూడగట్టేందుకు నిధులు సమీకరించి, యుద్ధం చేయడానికి వెళ్లి 1824లో జ్వరంతో మరణించిన ఆంగ్ల కవి?

1) లార్డ్ బైరన్ 2) లార్డ్ విలియం
3) లార్డ్ జోన్స్ 4) హెమిల్టన్


9. గ్రీసును స్వతంత్ర దేశంగా ఎప్పుడు గుర్తించారు?

1) 1823 2) 1832 3) 1842 4) 1867

10. జాతీయవాదం భావనను వృద్ధి చేయడానికి ప్రయత్నించిన సాంస్కృతిక ఉద్యమాన్ని ఏమంటారు?

1) లిబరలిజం 2) రోమాంటిసిజం
3) 1, 2 4) ఫెడరలిజం

11. జర్మనీ తత్వవేత్త- జోహన్‌గాట్ ఫ్రైడ్ హెర్డర్ జర్మనీ సంస్కృతిని ఎక్కడ కనుక్కోగలమని పేర్కొన్నాడు?



1) ధనిక ప్రజల్లో
2) వ్యాపార వర్గం వద్ద
3) సామాన్య ప్రజల్లో
4) పై వారందరి వద్ద

12. కియోస్ వద్ద జరిగిన ఊచకోతను, యూజన్ డెలక్రాయ్ ఎప్పుడు చిత్రించారు?

1) 1824 2) 1825 3) 1834 4) 1835

13. దాస్ ఓల్క్ అంటే..?

1) జానపద గీతాలు 2) జానపద కవితలు
3) జానపద నృత్యాలు 4) పైవన్నీ

14. కింది వాటిని పరిగణించండి.

ఎ) పోలాండ్ స్వతంత్ర దేశంగా లేనప్పటికీ సంగీతం, భాష ద్వారా జాతీయ భావాలు సజీవంగా నిలిచాయి.
బి) కరోల్ కార్పిన్‌స్కీ తన సంగీత ప్రదర్శనలు, సంగీతం ద్వారా పోలోనైజ్, మజుర్కా లాంటి నృత్యాలను జాతీయ చిహ్నాలుగా మార్చారు.


1) ఎ, బి సరైనవి 2) ఎ, బి సరికావు
3) ఎ సరైంది, బి సరికాదు
4) ఎ సరికాదు, బి సరైంది

15. కింది వాటిలో సరైనవి గుర్తించండి.

ఎ) గ్రిమ్స్ జానపద కథలు అనేది ప్రాచుర్యం ఉన్న పేరు.
బి) జర్మన్ నగరమైన హనావులో 1785 లో జాకబ్ గ్రీమ్, 1786లో విల్‌హెల్మ్ గ్రీమ్ సోదరులు జన్మించారు.
సి) వీరు గ్రామాల్లో పర్యటించి జానపద కథలు సేకరించారు.
డి) 33 సంపుటాల జర్మన్ భాషా శబ్ద కోశాన్ని ప్రచురించారు.

1) ఎ, బి, సి, డి 2) ఎ, సి, డి
3) బి, సి, డి 4) ఎ, బి, సి

16. 1848లో దేశాన్ని వదిలి పారిపోయిన ఫ్రాన్స్ రాజు?


లూయీ ఫిలిప్

1) లూయీ బ్లాంక్
2) నేపోలియన్
3) 14వ లూయీ
4) లూయీ ఫిలిప్

17. 1848లో నేషనల్ అసెంబ్లీ ప్రకటనలను గుర్తించండి.

1) ఫ్రాన్స్‌ను రిపబ్లిక్‌గా ప్రకటించింది.
2) 21 ఏళ్లు పైబడిన పురుషులకు ఓటు హక్కు మంజూరు చేశారు.
3) పని హక్కుకు హామీ ఇచ్చారు, ఉద్యోగాల కల్పన కోసం జాతీయ కార్యశాలలను ఏర్పాటు చేశారు.
4) పైవన్నీ

18. సిలేసియాలోని ఒక గ్రామంలో జరిగిన సంఘటనల గురించి వివరించిన పాత్రికేయుడు?

1) విల్‌హెల్మ్ ఊల్ఫ్ 2) విల్‌హెల్మ్ గ్రీమ్
3) జాకబ్ గ్రీమ్ 4) పైవారందరూ

19. జర్మనీ ప్రాంతాల్లో మధ్యతరగతి నిపుణులు, వ్యాపారవేత్తలు, సంపన్నులు, చేతి వృత్తులవారు, రాజకీయ సంఘాలవారు ఏ నగరంలో సమావేశమయ్యారు?

1) బెర్లిన్ 2) ఫ్రాంక్‌ఫర్ట్
3) హాంబర్గ్ 4) మ్యునిచ్

20. నాలుగో ఫ్రెడ్రిక్ విల్ హెల్మ్ ఏ దేశానికి రాజు?

1) జర్మనీ 2) ఫ్రాన్స్
3) ఇటలీ 4) రష్యా

21. "ప్రకృతి పురుషులను, స్త్రీలను వేర్వేరు విధులు నిర్వహించడానికి సృష్టించింది" అని అన్నది?

1) విల్ హెల్మ్ ఊల్ఫ్ 2) విల్ హెల్మ్ గ్రీమ్
3) కార్ల్ వెల్కర్ 4) లూయిస్ ఓట్టో పీటర్స్

22. 'జర్మనీలో రాజకీయ ఉద్యమకారిణి, స్త్రీవాద రాజకీయ సంఘాన్ని స్థాపించింది ఎవరు?

1) కార్ల్ వెల్కర్ 2) లూయిస్ పీటర్స్
3) లూయిస్ ఓట్టో పీటర్స్ 4) పై వారందరూ


23. జర్మనీ జాతీయకరణ ఉద్యమానికి నాయకత్వం వహించింది?

1) ప్రష్యా 2) రష్యా
3) జర్మనీ నేషనల్ అసెంబ్లీ 4) పైవన్నీ

24. ఆస్ట్రియా, డెన్మార్క్, ఫ్రాన్స్‌లతో ఎన్ని సంవత్సరాల్లో, ఎన్ని యుద్ధాలు చేసి జర్మనీ ఏకీకరణ చేశారు?

1) మూడేళ్లు, 7 యుద్ధాలు
2) ఏడేళ్లు, 3 యుద్ధాలు
3) నాలుగేళ్లు, 8 యుద్ధాలు
4) ఎనిమిదేళ్లు, 4 యుద్ధాలు

25. జర్మనీ ఏకీకరణ పూర్తయిన సంవత్సరం, మొదటి రాజు?


మొదటి విలియం

1) 1861 - మొదటి విలియం
2) 1881 - మొదటి విలియం
3) 1871 - మొదటి విలియం
4) 1871 - విక్టర్ ఇమ్మాన్యూయేల్

26. వర్సెయిల్స్‌లోని అద్దాల హాలులో జర్మన్ సమాఖ్య ప్రకటన చిత్రాన్ని ఎన్నో పుట్టిన రోజున చిత్రకారుడు బహూకరించారు?

1) 69వ 2) 60వ 3) 70వ 4) 65వ

27. 19వ శతాబ్దం మధ్యలో ఇటలీలోని రాజ్య భాగాలు, వాటిని పరిపాలించే రాజవంశాన్ని గుర్తించండి.

ఎ) సార్డీనియా - పీడ్మాంట్ - ఇటాలియన్ వంశం
బి) ఆస్ట్రియన్ - హబ్స్‌బర్గ్ రాజవంశం
సి) మధ్యప్రాంతం - పోప్
డి) దక్షిణ ప్రాంతం- బోర్బన్ రాజవంశం

పై వాటిలో సరైనవి గుర్తించండి.

1) ఎ, బి, సి 2) ఎ, బి, డి
3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

28. ఇటలీ ప్రాంతాలను ఏకం చేయడానికి ప్రయత్నించిన ముఖ్యమంత్రి?

1) మాజినీ 2) కవూర్
3) 1, 2 4) ఇమ్మాన్యుయేల్

29. ఇటలీ ఏకీకరణ జరిగిన సంవత్సరం, ఆనాటి రాజు?

1) 1861 - రెండో విక్టర్ ఇమ్మాన్యూయేల్
2) 1761 - రెండో విక్టర్ ఇమ్మాన్యూయేల్
3) 1871 - గారిబాల్డీ 4) 1891 - మాజినీ

30. బ్రిటిష్ దీవుల్లో నివసిస్తున్న ప్రజల ప్రాథమిక గుర్తింపులు?

1) ఇంగ్లిష్ 2) వేల్స్
3) స్కాట్/ఐరిష్ 4) పైవన్నీ


31. ఇంగ్లండ్, స్కాట్‌లాండ్‌ల మధ్య కుదిరిన ఐక్య చట్టం కారణంగా యునైటెడ్ కింగ్‌డమ్ ఆఫ్ గ్రేట్ బ్రిటన్ ఎప్పుడు ఏర్పడింది?

1) 1707 2) 1807 3) 1688 4) 1709

32. ఐర్లాండ్‌ను యునైటెడ్ కింగ్‌డమ్‌లో బలవంతంగా ఎప్పుడు కలిపారు?

1) 1798 2) 1805 3) 1801 4) 1809

33. గారిబాల్డీ గురించి సరైనవి గుర్తించండి.



ఎ) ఇటాలియన్ స్వతంత్ర సమరయోధులు.
బి) 1833లో యంగ్ ఇటలీలో చేరారు.
సి) 1834లో పీడ్‌మాంట్‌లో జరిగిన రిపబ్లిక్ తిరుగుబాటులో పాల్గొన్నారు.
డి) 1848 వరకు ప్రవాసం (అజ్ఞాతం)లో జీవించారు.

1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి
3) బి, సి, డి 4) ఎ, సి, డి

34. ఫ్రెంచ్ విప్లవ కాలంలో ఎర్ర టోపీ, తెగిన సంకెళ్లు దేనికి చిహ్నం?

1) సమానత్వం 2) సమన్యాయం
3) స్వేచ్ఛ 4) పైవన్నీ

35. 'మేరియాన్' చిత్రం ఏ దేశానికి సంకేతం?

1) ఇంగ్లండ్ 2) ఫ్రాన్స్
3) అమెరికా 4) జర్మనీ

36. జర్మనీ ఓక్ అనేది దేనికి గుర్తు?

1) త్యాగం 2) స్వేచ్ఛ
3) వీరత్వం 4) పైవన్నీ

37. బాల్కన్స్‌లో ఎక్కువ భాగం ఏ సామ్రాజ్య నియంత్రణలో ఉంది?

1) ఒట్టోమన్ 2) బ్రిటిష్
3) ఫ్రాన్స్ 4) జర్మనీ



రచయిత: గద్దె నరసింహారావు

సమాధానాలు

1-2; 2-1; 3-3; 4-3; 5-4; 6-2; 7-3; 8-1; 9-2; 10-2; 11-3; 12-1; 13-4; 14-1; 15-1; 16-4; 17-4; 18-1; 19-2; 20-1; 21-3; 22-3; 23-1; 24-2; 25-3; 26-3; 27-4; 28-2; 29-1; 30-4; 31-1; 32-3; 33-2; 34-3; 35-2; 36-3; 37-1.

మానవ ప్రమేయంతో సంబంధం లేకుండా ప్రకృతి నుంచి లభించే ముడి పదార్థాలు, శక్తి రూపాలను సహజ వనరులు అంటారు. ఇవి వస్తుసేవల ఉత్పత్తికి ఉపయోగపడతాయి. ఆవరణ వ్యవస్థలు - జీవరాశుల అభివృద్ధికి, మానవ సమాజాల సాంఘిక, ఆర్థిక మనుగడకు ఈ వనరులు ఎంతో కీలకం. దేశాల అభివృద్ధిలో ఇవి చోదక శక్తిలా పనిచేస్తాయి. ఆధునిక మానవుడు తన అవసరాల కోసం ఈ వనరులను విచక్షణారహితంగా వాడటంతో ప్రకృతిలో వాటి పరిమాణం తరిగిపోతోంది. ఫలితంగా వాతావరణ కాలుష్యంతోపాటు అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. మానవ మనుగడే ప్రశ్నార్థకం అవుతోంది. సహజ వనరుల వర్గీకరణ, అడవులు - వాటి ప్రాముఖ్యత, నిర్మూలన వల్ల కలిగే సమస్యలు మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.



మానవ మనుగడకు అవసరం.. ఆర్థిక వృద్ధికి కీలకం!

అభివృద్ధి, పర్యావరణ సమస్యలు: సహజ వనరులు - అటవీ సంపద

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ ఎకానమీ

సహజ వనరులు - నిర్వచనాలు

వనరులు అంటే మనకు ఉపయోగపడేవి అని అర్థం. తరతరాలుగా మానవజాతి అభివృద్ధి క్రమంలో వివిధ రకాల వనరులు కీలకంగా వ్యవహరించాయి. తాము కనుక్కున్న వాటిని ప్రగతికి అనుకూలంగా మార్చుకుని ఉపయోగించారు. వనరుల వెలికితీత, కేటాయింపు, వాటి సద్వినియోగంపైనే ఆర్థికాభివృద్ధి, మానవుడి మనుగడ ఆధారపడి ఉన్నాయి.

ఉదా: నీరు, భూమి, బొగ్గు, ఖనిజాలు, పంటలు, జంతువులు, అడవులు మొదలైనవి.

❖ పర్యావరణంలో భాగంగా ఉండి ప్రకృతిలో సహజంగా లభిస్తూ మానవుడి అవసరాలను తీర్చే వాటన్నింటినీ సహజ వనరులుగా నిర్వచిస్తారు. వీటిలో కొన్నింటికి ఆర్థిక విలువలు ఉంటే, మరికొన్నింటికి ఆర్థికేతర విలువలు ఉంటాయి.

❖ ఒక ప్రదేశంలో నిర్ణీత సమయంలో మానవ అవసరాలను తీర్చగలిగే సాధనలే వనరులు. ప్రకృతి వివిధ రూపాల్లో వనరుల సంపదను కలిగి ఉంటుంది. మానవుడు తన మనుగడకు, సుఖ జీవనానికి ఉపయోగించే ప్రతి వస్తువు సహజ వనరుల ద్వారా లభించిందే. ముడి పదార్థంగా లభించిన ఈ సహజ వనరులను మూలధనం, సాంకేతిక విజ్ఞానంతో మనిషి తనకు ఉపయోగపడే వస్తువులుగా తయారు చేసుకున్నాడు.

❖ భూమిపై ఉన్న సమస్త ప్రాణుల సుస్థిర మనుగడకు ప్రకృతి అందించిన పదార్థాల సమాహారమే సహజ వనరులు.

> సహజ వనరులు నిష్క్రియాత్మకంగా ప్రకృతిలో నిక్షిప్తమై ఉంటాయి. ఇవి ఒక దేశ అభివృద్ధికి ప్రత్యక్షంగా సహాయపడవు. మూలధన సాంకేతిక విజ్ఞానంతో మానవుడు తన సంక్షేమానికి వీటిని వినియోగించుకోవాలి. భారతదేశం, బ్రెజిల్, అర్జెంటీనా లాంటి దేశాల్లో సహజ వనరులు ఎక్కువగా ఉన్నప్పటికీ ఆర్థికాభివృద్ధి తక్కువగా ఉంది. జపాన్, ఇంగ్లండ్, స్విట్జర్లాండ్ మొదలైన దేశాల్లో వనరులు తక్కువగా ఉన్నా ఆర్థికాభివృద్ధి ఎక్కువ. దీన్నిబట్టి సహజ వనరులకు, ఆర్థికాభివృద్ధికి మధ్య సహసంబంధం ఉన్నట్లు కచ్చితంగా చెప్పలేం. నిరంతర పరిశోధన, నూతన వనరుల అన్వేషణను ప్రతి దేశంలోనూ ప్రోత్సహించాలి. వనరుల నిర్వహణలో జీవ వైవిధ్యం, ఆవరణ సంతులనాన్ని సాధించడానికి అందరూ ప్రయత్నించాలి.

వర్గీకరణ

మన్నిక, పునరుద్ధరణ వ్యూహం ప్రాతిపదికన సహజ వనరులను కింది విధంగా వర్గీకరించారు.

పునరుద్ధరించగల సహజ వనరులు: ఒకసారి వినియోగించాక మళ్లీ సమకూర్చుకోగలిగిన లేదా సృష్టించుకోగలిగిన వనరులను పునరుద్ధరించగల సహజ వనరులు అంటారు. వీటినే ప్రవాహ వనరులు అని కూడా పిలుస్తారు. ఇవి ప్రకృతిలో పరిమితి లేకుండా లభిస్తాయి.

ఉదా: నీరు, అడవులు, మత్స్య సంపద, జంతువులు.

✦ వీటిని ఉపయోగించేటప్పుడు తిరిగి సృష్టించుకునే సామర్థ్యానికి విఘాతం ఏర్పడితే, మళ్లీ పునరుత్పత్తి చేయడానికి సంఘటిత దృక్పథం (ఇంటిగ్రేటెడ్ అప్రోచ్) అవసరం. ఎందుకంటే ఒక వనరు ఉపయోగించే విధానం మరొక వనరుపై ప్రభావాన్ని కలిగి ఉంటుంది.

పునరుద్ధరించలేని సహజ వనరులు: వీటిని అంతరించిపోయే స్వభావం ఉన్న వనరులు అని కూడా అంటారు. ఒక నిర్ణీత సమయంలో వీటి పరిమాణం స్థిరంగా ఉంటుంది.

ఉదా: ఖనిజాలు, బొగ్గు నిల్వలు, పెట్రోలియం, గ్యాస్ నిల్వలు.

✦ ఈ వనరులను తిరిగి సృష్టించుకోగల అవకాశం ఉండదు. వినియోగ ప్రక్రియలో ఇవి శాశ్వతంగా అంతరించిపోతాయి.

ప్రవాహ వనరులు: వీటిని నిరంతరం లభించే వనరులుగా చెప్పొచ్చు. క్షీణత సమస్య ఉండదు.

ఉదా: గాలి, భూమ్యాకర్షణ, సౌరశక్తి, వాయుశక్తి.

✦ ఈ వనరులపై వాతావరణ కాలుష్య ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

పునఃచక్రీకరణ చేయగలిగే వనరులు: కొన్ని ఖనిజ వనరులను పునఃచక్రీకరణ చేయొచ్చు. ఇవి మొదట ఒక రూపంలో లభ్యమై తిరిగి వేరొక రూపంలో ఉపయోగానికి అందుబాటులో ఉంటాయి.

ఉదా: రాగి, వెండి, బంగారం మొదలైనవి.

✦ కొన్ని వనరులు ఒకే వినియోగంతో నశించి, పునఃచక్రీకరణకు అవకాశాన్ని కలిగి ఉండవు.

ఉదా: గ్యాస్, విద్యుత్ శక్తి, పెట్రోలియం లాంటివి.

➤ అటవీ వనరులు

అడవులు గొప్ప సహజ వనరులు. మానవ ఆర్థిక కార్యకలాపాలపై వీటి ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

✦ ఇండియా స్టేట్ ఫారెస్ట్ రిపోర్ట్ 2023 ప్రకారం, మన దేశంలో నమోదైన మొత్తం అటవీ ప్రాంతం (ఆర్ఎఫ్ఏ) 8,27,357 చ.కి.మీ. అలాగే భారతదేశ భౌగోళిక ప్రాంతం 25.17% అడవులు, చెట్లతో నిండి ఉంది.

✦ మన దేశంలో అడవులను ఉష్ణమండల సతత హరితారణ్యాలు, ఆకురాల్చే అడవులు, ఉష్ణమండల చిట్టడవులు, పర్వతీయ అడవులు, చిత్తడి అడవులు, మడ అడవులుగా వర్గీకరించారు.

➤ అడవుల వాణిజ్యీకరణ

ఆదాయార్జనకు అడవులను, అటవీ వనరులను హెచ్చు స్థాయిలో ఉపయోగించడాన్ని అడవుల వాణిజ్యీకరణ అంటారు. ఇది ఆంగ్లేయుల పాలనాకాలంలో మన దేశంలో మొదలైంది. వారు అడవుల నుంచి లభించే కలప, టేకు, రోజ్‌ఉడ్, దేవదారు మొదలైనవి ఎగుమతి చేసి గరిష్ఠ లాభాలు గడించారు. స్వాతంత్ర్యానంతరం కూడా ఇదే పద్ధతి కొనసాగింది.

▮ ఈ క్రమంలో పెద్దఎత్తున అడవుల నరికివేత, విధ్వంసం జరిగాయి. ఎంతగా అంటే మన దేశంలో అడవుల విస్తీర్ణం 1900లో 7000 మిలియన్ హెక్టార్లు ఉండగా 2000నాటికి అది 2,300 మిలియన్ హెక్టార్లకు క్షీణించింది.

▮ అడవుల నుంచి లభించే వివిధ ముడి పదార్థాలతో మన దైనందిన జీవితంలో ప్రత్యక్ష, పరోక్ష వాడకానికి అనేక వస్తువులు తయారు చేస్తారు. మార్కెట్ డిమాండ్ ఎక్కువైన కొద్దీ ఉత్పత్తి పెంచేందుకు అడవుల విధ్వంసం జరుగుతుంది.

▮ పరిమిత వాడకంతో సహజసిద్ధంగా పునరుత్పన్నం చెందే శక్తి అడవులకు ఉంది. ఈ వినాశక చర్యల కారణంగా అనేక రకాల వృక్ష, జంతు జాతులు అంతరిస్తున్నాయి.

అడవుల నిర్మూలన వల్ల కలిగే సమస్యలు

వన్య ప్రాణులు, ఆదివాసులు ఆవాసాలను కోల్పోతున్నారు. ఉపాధి, ఆహార కొరత ఏర్పడుతోంది.

- వెనుకబడిన తెగలు, గ్రామీణ పేదలు, చేతివృత్తులవారికి ఉపాధి అవకాశాలు తగ్గి, ఆయా వర్గాల్లో పేదరికం పెరుగుతుంది.
- వృక్షాల సాంద్రత, పచ్చదనం తగ్గి వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయి.
- వాతావరణంలో తేమ తగ్గుతుంది. జలాశయాలు, నదులు నీటిమట్టం దగ్గర హెచ్చు ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.
- భూగర్భ జలాల వాడకం పెరిగి వాటి పరిమాణం, నాణ్యత తగ్గుతాయి. దీంతో భూఅంతర్భాగంలో పొరల మధ్య ఖాళీ (Vaccum) ఏర్పడుతుంది. కొండ చరియలు విరిగిపడటం, భూకంపాలు లాంటివి దీని ఫలితమే.
- ధృవ ప్రాంతాల్లో మంచు కరిగి, సముద్ర మట్టాలు పెరుగుతాయి. తీర ప్రాంతాల్లో భూమి కోతకు గురవుతుంది.
- వాతావరణంలో సహజవాయు మార్పిడి ప్రక్రియ మందగిస్తుంది. కిరణజన్య సంయోగక్రియ సరిగ్గా జరగదు. గాలిలో కార్బన్ డైఆక్సైడ్ పరిమాణం పెరిగి, ఆక్సిజన్ లభ్యత తగ్గుతుంది.
- అడవుల నరికివేత హెచ్చు స్థాయిలో కొనసాగితే 2100 నాటికి భూగోళం నివాసయోగ్యానికి పనికిరాదని శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

912 Word of the Day

Vogue

Telugu meaning: వాడుక, ధోరణి
English meaning: The word 'vogue' (వోగ్) is a noun that refers to something that is popular or fashionable at a particular time.
Synonyms: Fashion, Trend
Antonyms: Unpopular, Old-fashioned
Usage: **1.** Online learning has come into vogue after the rapid growth of digital technology.
2. Wearing traditional clothes during festivals is still in vogue in many parts of India.

Current Affairs



The Defence Research and Development Organisation (DRDO) successfully demonstrated the Solid Fuel Ducted Ramjet (SFDR) technology from the Integrated Test Range (ITR), Chandipur, off the coast of Odisha on 3 February 2026. This marks a significant milestone in India's missile development programme and places the country among a select group of nations possessing this advanced propulsion technology.



Indian-origin climate scientist Veerabhadran Ramanathan has been awarded the 2026 Crafoord Prize in Geosciences by the Royal Swedish Academy of Sciences. Often described as the "Nobel of Geosciences," the prize recognises Ramanathan's decades of research on super-pollutants and atmospheric brown clouds, which have reshaped understanding of global warming.

India and Tanzania held the fourth meeting of the Joint Defence Cooperation Committee (JDCC) in Zanzibar on 3 February 2026. During the meeting, both sides discussed a wide range of areas for collaboration, including military training, service-to-service engagement, maritime security and defence industry cooperation. The discussions reflected the shared interest of the two countries in enhancing defence preparedness and regional security.

The 13th edition of the joint military Exercise KHANJAR between India and Kyrgyzstan began at Misamari in Sonitpur district of Assam on 3 February 2026. This aims to enhance interoperability between the Special Forces of both nations, with a focus on joint operations in urban warfare and counter-terrorism scenarios under the United Nations mandate. The 14-day-long military exercise concludes on 17 February. India and Kyrgyzstan organising joint military exercises annually since 2011, with venues alternating between the countries to reflect deepening defence ties.

For more Current Affairs: Scan QR code

స్వాతంత్ర్యోద్యమంలో వీర వనితలు

స్టడీ జోన్



భారత స్వాతంత్ర్యోద్యమంలో పురుషులతోపాటు మహిళలు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడారు. ఆంగ్లేయుల అరాచకాలను ఎండగట్టడం, ప్రజలను సమీకరించడం, ధర్నాలు నిర్వహించడం, నిరసనలు చేపట్టడం లాంటి అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీరు కేవలం స్వరాజ్య పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడమే కాక లింగ సమానత్వం, సామాజిక నిబంధనలు - కట్టుబాట్లను పునర్నిర్మించడంలోనూ కీలకంగా వ్యవహరించారు. దేశ చరిత్రలో స్త్రీ ఔన్నత్యాన్ని భారత స్వాతంత్ర్యోద్యమం మరోసారి చాటిచెప్పింది. పోటీ పరీక్షల నేపథ్యంలో నాడు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన వీరవనితల గురించి ముఖ్య విషయాలు తెలుసుకుందాం..!

ఝాన్సీ లక్ష్మీబాయి: డల్హౌసీ ప్రకటించిన రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని అమలుపరిచిన బ్రిటిషర్లు ఈమె దత్తపుత్రుడు దామోదరరావును సంస్థానాధీశుడిగా అంగీకరించకుండా ఝాన్సీ రాజ్యాన్ని ఆక్రమించారు. దాంతో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటులో పాల్గొన్నారు. బ్రిటిష్ దళాలతో గ్వాలియర్ యుద్ధంలో పాల్గొని, అదే యుద్ధంలో వీరమరణం పొందారు.

సావిత్రిబాయి పూలే: ప్రముఖ సంఘసంస్కర్త జ్యోతి రావు పూలే భార్య. లింగవివక్షకు వ్యతిరేకంగా కుల రహిత సమాజం, సార్వత్రిక విద్య కోసం ఈ దంపతులు అవిశ్రాంత పోరాటం చేశారు.

అనిబిసెంట్: ఐర్లాండ్‌కు చెందిన ఈమె దివ్యజ్ఞాన సమాజ సేవ కోసం భారత్‌కి వచ్చారు. 1916, సెప్టెంబరులో హోమ్‌రూల్ లీగ్ స్థాపించి, స్వపరిపాలనను డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమం నడిపారు.


మేడం బికాజీ కామా: దాదాభాయ్ నౌరోజీ, శ్యాంజీ కృష్ణవర్మల నుంచి ప్రేరణ పొంది స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. ఎందరో విప్లవకారులకు మార్గదర్శిగా నిలిచారు. 'ఫ్రీ ఇండియా సొసైటీ'ని స్థాపించారు.

సరోజినీ నాయుడు: బొంబాయి (1915), లఖ్‌నవూ (1916) కాంగ్రెస్ మహాసభల్లో పాల్గొన్నారు. 1925, డిసెంబరులో కాన్పూర్‌లో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు అధ్యక్షత వహించిన తొలి భారతీయ మహిళగా నిలిచారు. స్వతంత్ర భారతదేశ తొలి మహిళా గవర్నరుగా చేశారు.

తమ పోరాట పటిమతో ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన విప్లవకారులైన మహిళల గురించి పూర్తి సమాచారం ఈబుక్ రూపంలో సిద్ధంగా ఉంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఉచితంగా అందుకోండి.

జనరల్ స్టడీస్ - సైన్స్ అండ్ టెక్నాలజీ

జీవవైవిధ్య సదస్సులు



జీవజాతుల మధ్య విభిన్నతలను తెలిపేదే జీవవైవిధ్యం. ప్రకృతి అనేక ప్రత్యేకతలకు నెలవు. పర్యావరణ సమతౌల్యత దెబ్బతింటే జీవవైవిధ్యంలో పలు మార్పులు కలుగుతాయి. ఆధునిక జీవన విధానం జీవవైవిధ్యానికి ఆటంకం కలిగిస్తోంది. దీన్ని గాడిన పెట్టేందుకు అంతర్జాతీయ సమాజం కృషి చేస్తోంది. దీనికోసం సదస్సులు నిర్వహిస్తూ, అవసరమైన లక్ష్యాలను రూపొందిస్తోంది. ఇందులో భాగంగా భారత్ తన వంతు సహాయం అందిస్తోంది. పోటీపరీక్షార్థులు జీవవైవిధ్యంపై జరిగిన సదస్సులు, వాటిలో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలుతీరు తదితరాలపై దృష్టి సారించాలి.

జీవవైవిధ్యం అనే పదాన్ని మొదటిసారిగా 1986లో వాల్టర్ రోసెన్ అనే శాస్త్రవేత్త వినియోగించారు. కన్వెన్షన్ ఆన్ బయోలాజికల్ డైవర్సిటీ (CBD) - యూఎన్‌డీపీ ఆధ్వర్యంలో 1992లో రియోడిజనీరోలో జరిగిన సదస్సులో జీవవైవిధ్యంపై అంతర్జాతీయ సమాజం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం 196 దేశాల ఆమోదంతో 29 డిసెంబరు 1993 నుంచి అమల్లోకి వచ్చింది.

ముఖ్యమైన జీవవైవిధ్య కాప్ సదస్సులు

- కాప్ 1
- ఎక్స్‌టెండెడ్ వన్ సదస్సు EXCOP 1
- కాప్ 5
- కాప్ 6
- కాప్ 10
- కాప్ 11
- కాప్ 15
- కాప్ 16

కాప్ సదస్సులు ఎప్పుడు, ఎక్కడ జరిగాయి - వాటిలో చేసిన ముఖ్య తీర్మానాలు, లక్ష్యంగా నిర్దేశించుకున్న అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Assistant Professor Jobs

The National Institute of Technology Calicut (NITC) is inviting applications for Assistant Professor positions in various departments on a contractual basis. The total no. of posts is 17. Eligible candidates can apply online before 20 February 2026.

Posts in Hindustan Copper Limited

Hindustan Copper Limited (HCL), Khetri Complex, is inviting online applications for the Chargeman (Electrical), Electrician posts. The total number of posts is 18. The last date for online applications is 25 February 2026.

Assistant Professor jobs

Atal Bihari Vajpayee - Indian Institute of Information Technology and Management (ABV-IIITM) Gwalior, is inviting applications for Assistant Professor positions in various departments on a contractual basis. The total no. of posts is 22. Eligible candidates can apply offline before 25 February 2026.

Did You Apply..?

Today (February 5) is the last date for the following Jobs

☛ Indian Army Recruitment 2025 - 66th Short Service Commission - 350 posts. ***Qualification:*** B.E./B.Tech.

☛ Project Engineer posts at BEL. ***Eligibility:*** BSc, BE/BTech.

☛ JRF posts at IIT BHU. ***Eligibility:*** BE/B.Tech/ME/M.Tech.

For more information and other notifications - scan QR code

Arrangement of Words in Dictionary Order

1. Arrange the given words in the order in which they occur in the dictionary and then choose the correct sequence.
I. Sign II. Solid
III. Scene IV. Simple
A) III, I, II, IV B) III, IV, I, II
C) III, I, IV, II D) III, IV, II, I
E) I, IV, II, III

2. Arrange the given words in alphabetical order and mark one that comes first.
A) Cloud B) Middle
C) Grant D) Chain
E) Chair

3. Arrange the given words in alphabetical order and mark the one that comes in the middle.
A) Hobby B) Holiday
C) Hoarse D) Hollow
E) Hobble

4. Arrange the given words in the alphabetical order and mark the one that comes last.
A) Abandon B) Actuate
C) Accumulate D) Achieve
E) Accept

Bank Exams
Reasoning

Directions (Qs. 5 - 7): In each of the following questions, arrange the given words in the sequence in which they occur in the dictionary and then choose the correct sequence.

5. I. Select II. Seldom III. Send
IV. Selfish V. Seller.
A) I, II, IV, V, III B) II, I, V, IV, III
C) II, I, IV, V, III D) II, V, IV, I, III
E) IV, V, III, I, II

6. I. Wrinkle II. Wriggle III. Writhe
IV. Wretch V. Wrath
A) IV, V, I, II, III B) V, IV, II, I, III
C) IV, II, V, I, III D) V, II, I, III, IV
E) V, III, II, I, IV

7. I. Liver II. Long III. Late
IV. Load V. Luminous
A) III, I, II, IV, V B) III, I, II, V, IV
C) III, I, V, IV, II D) III, I, IV, II, V
E) III, II, I, IV, V

8. If the first five words in the sentence, "Meeta's mother meets me many times" are rearranged in the alphabetical order which will be the middle word?
A) Meeta B) Mother C) Meet
D) Me E) Many

9. If the words in the sentence, "She showed several sample snaps" are rearranged in the alphabetical order, which will be the middle word?
A) Snaps B) Sample C) Several
D) Showed E) She

10. After arranging the following words according to dictionary order, which word will come at 'Fifth' position?
A) Popular B) Population
C) Populace D) Pope
E) Poppy

11. Select the option that represents the correct order of the given words as they would appear in an English dictionary.
1. Variance 2. Violence
3. Vanquish 4. Vampire
5. Valiant 6. Victorious
A) 4, 5, 3, 1, 2, 6 B) 5, 3, 4, 1, 6, 2
C) 5, 4, 3, 1, 6, 2 D) 4, 3, 5, 2, 1, 6
E) 5, 1, 2, 6, 3, 4

12. Select the option that represents the correct order of the given words as they would appear in an English dictionary.
1. Strident 2. Student
3. Shirking 4. Stuffy
5. Spider 6. Spawn
A) 3, 6, 5, 1, 2, 4 B) 3, 5, 6, 1, 2, 4
C) 3, 6, 5, 1, 4, 2 D) 3, 5, 6, 1, 4, 2
E) 3, 1, 2, 4, 5, 6, 2

13. Select the option that represents the correct order of the given words as they would appear in an English dictionary.
1. Warriors 2. Warehouse
3. Warcraft 4. Warranty
5. Wardrobe 6. Wardenship
A) 3, 6, 5, 2, 1, 4 B) 3, 5, 6, 2, 1, 4
C) 3, 5, 6, 2, 4, 1 D) 4, 5, 2, 1, 6, 3
E) 3, 6, 5, 2, 4, 1

14. Select the option that represents the correct order of the given words as they would appear in an English dictionary.
1. Monorail 2. Monument
3. Monopoly 4. Monster
5. Monitor 6. Monsoon
A) 3, 6, 1, 4, 2, 5 B) 5, 1, 3, 6, 4, 2
C) 5, 3, 1, 4, 6, 2 D) 5, 3, 1, 6, 4, 2
E) 3, 4, 2, 6, 1, 5

15. If words are arranged according to the dictionary order from left to right, which word is second from the right end?
A) FIX B) LAN
C) FOG D) COW
E) ROW

Scan the QR code for Key

These model questions were prepared by ***Rajesh Madhu, Asst. Prof. of Mathematics.***

ఇదిగో నరవణె పుస్తకం.. ప్రధాని వస్తే ఇస్తా

- చైనా ట్యాంకులపై రాజ్‌నాథ్ స్పందించలేదు
- సముచితమైనదేదో చేయండని నరవణెకు ప్రధాని చెప్పారు
- ప్రశ్నల నుంచి ప్రభుత్వం తప్పించుకుంటోంది: రాహుల్

దిల్లీ: సరిహద్దులో చైనా యుద్ధట్యాంకులు వచ్చాయన్న విషయాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీల దృష్టికి భారత సైన్యాధిపతి తీసుకువెళ్లినా వారిద్దరి నుంచి తగిన స్పందన కరవైందని లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శించారు. లద్దాఖ్ ఘర్షణపై భారత సైన్యం మాజీ అధిపతి నరవణె రాసిన పుస్తకం గురించి రెండ్రోజులుగా ప్రస్తావిస్తూ వస్తున్న ఆయన బుధవారం ఆ పుస్తకాన్ని వెంట తీసుకుని పార్లమెంటుకు వచ్చారు. ఈ పుస్తకమే విడుదల కాలేదన్నట్లు ప్రభుత్వం చెబుతోందని, ఇది ఉందన్న విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ''కైలాస్ పర్వతం వద్దకు చైనా ట్యాంకులు వచ్చాయని నరవణె ఫోన్లో రాజ్‌నాథ్ సింగ్‌కు చెప్పారు. దానిపై మంత్రి తొలుత స్పందించలేదు. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్, జాతీయ భద్రత సలహాదారుడు అజీత్ డోభాల్ కూడా ఆయనకు సమాధానం ఇవ్వలేదు. రెండోసారి రాజ్‌నాథ్‌కు ఆయన ఫోన్‌చేస్తే పైవారిని కనుక్కొని చెబుతానన్నారు. 'చైనా దళాలు వచ్చినట్లయితే నన్ను అడగకుండా వాటిపైకి కాల్పులు జరపకండి' అని పై నుంచి ఆదేశాలు వచ్చాయి. ఏది సముచితమైతే అది చేయండంటూ ప్రధాని సందేశం ఇవ్వడం ఆయన తన బాధ్యత నుంచి తప్పించుకోవడాన్ని సూచిస్తోంది. ఆ వ్యాఖ్యతో ఒంటరినైనట్లు సైన్యాధిపతి భావించారు. పుస్తకంలో నరవణె రాసిన ఈ విషయాలను నేను పార్లమెంటులో చెబుతాననే వారు భయపడుతున్నారు'' అని రాహుల్ చెప్పారు. కీలక సమయంలో ఆర్మీ చీఫ్ నిరీక్షించాల్సి వచ్చిందని, ప్రధాని బాధ్యత నుంచి వైదొలగారని విమర్శించారు.

కొనసాగిన రగడ

పుస్తకంలోని అంశాలపై లోక్‌సభలో రగడ కొనసాగింది. ప్రభుత్వ తీరుపై విపక్ష సభ్యులు నిరసనలు తెలిపారు. ఆ పుస్తకాన్ని రాహుల్ ప్రదర్శించారు. నరవణె, రాజ్‌నాథ్‌సింగ్‌ల ఫొటోలతో కూడిన బ్యానర్లు, పోస్టర్లను విపక్ష సభ్యులు ప్రదర్శించారు. దీనిని స్పీకర్ ఓం బిర్లా తప్పుబట్టారు. అమెరికాతో ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ విపక్ష మహిళా ఎంపీలు ప్రధాని స్థానం వద్దకు బ్యానర్లతో వెళ్లేందుకు సిద్ధమైన సమయంలో సభ గురువారానికి వాయిదాపడింది. ఆ సమయంలో సభలో మోదీ లేరు. సమావేశాల సమయంలో ప్రతిపక్షాల గొంతు నొక్కడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని ఎంపీ ప్రియాంకాగాంధీ విమర్శించారు.

అమెరికాకే లబ్ధి: ఖర్గే

అమెరికాతో ఒప్పందం గురించి ప్రభుత్వం ద్వారా కాకుండా ఆ దేశాధ్యక్షుడి ద్వారా ఎంపీలు తెలుసుకోవాల్సి రావడం అవమానకరమని రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే అన్నారు. ఒప్పందం వల్ల



అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు మన దేశంలోకి వచ్చిపడతాయని, దీని వల్ల ఆ దేశ రైతులకే లాభమని చెప్పారు. మాజీ ప్రధాని దేవెగౌడ మాట్లాడుతూ మోదీ సర్కారుపై ప్రశంసలు కురిపించారు. మోదీ మౌనమే భారత్-అమెరికా ఒప్పందాన్ని సాకారం చేస్తోందని చెప్పారు. ప్రధాని మౌనానికి ఎంతో శక్తి ఉందన్నారు. ''నేనిప్పుడు జీవిత చరమాంకంలో ఉన్నాను. తాగునీటికి సంబంధించిన పెద్ద సమస్యను పరిష్కరించాలని కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ నేతల్ని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాను'' అని భావోద్వేగంతో మాట్లాడారు.

✦ మంగళవారం ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్‌ను 'యార్' అని సంబోధించిన విపక్ష సభ్యులపై దళిత ఎంపీలు లోక్‌సభ స్పీకరుకు ఫిర్యాదు చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



కేంద్ర సహాయమంత్రి రవనీత్ సింగ్ బిట్టూపై రాహుల్ వ్యాఖ్యలను నిరసిస్తూ దిల్లీలో ఆందోళన చేస్తున్న భాజపా శ్రేణులు

కాంగ్రెస్ కార్యాలయం వద్ద నిరసన

రాహుల్ వ్యాఖ్యలను నిరసిస్తూ దిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం సమీపంలో భాజపా శ్రేణులు ఆందోళన నిర్వహించాయి. [illegible] ఓ వర్గాన్ని ఆయన కించపర్చారని దిల్లీ భాజపా అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ ఆరోపించారు.

మూడోవంతు సిబ్బందిని తొలగించనున్న 'వాషింగ్టన్ పోస్ట్'

వాషింగ్టన్: వ్యయ భారాన్ని తగ్గించుకునే పునర్వ్యవస్థీకరణ చర్యల్లో భాగంగా మూడో వంతు సిబ్బందిని తొలగిస్తున్నట్లు అమెరికాకు చెందిన ప్రముఖ మీడియా సంస్థ 'వాషింగ్టన్ పోస్ట్' పేర్కొంది. పుస్తకాలు, క్రీడల విభాగాన్ని మూసివేస్తున్నామని, న్యూస్‌రూమ్ పాత్రికేయులతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న కార్యాలయాల్లోని సిబ్బంది సంఖ్యను తగ్గిస్తున్నామని పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ మాట్ ముర్రే బుధవారం వెల్లడించారు. ఈ మేరకు సిబ్బందికి ఈమెయిల్ సందేశాలు పంపిస్తున్నామన్నారు. బిలియనీర్, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ప్రస్తుతం ఈ పత్రిక యజమాని.

రాజ భవనాన్ని ఖాళీ చేసిన ఆండ్రూ

లండన్: ఎప్‌స్టీన్ ఫైళ్ల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూ మౌంట్‌బాటెన్-విండ్సర్ రాజ భవనాన్ని ఖాళీ చేశారు. విండ్సర్ క్యాజిల్ ఎస్టేట్‌లోని రాయల్ లాడ్జ్ నుంచి ఆయన వెళ్లిపోయారు. రాజు ఛార్లెస్ 3 సోదరుడైన 65 ఏళ్ల ఆండ్రూ.. రాజ ప్రాసాదాన్ని ఖాళీ చేశారు. ఈ విషయాన్ని బకింగ్‌హాం ప్యాలెస్ ధ్రువీకరించింది.

ఎప్‌స్టీన్ ఫైల్స్ వల్లే బిల్‌గేట్స్‌తో బంధం ముగిసింది: మిలిందా




ఇంటర్నెట్ డెస్క్: ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం దర్యాప్తులో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌కు సంబంధించిన పలు విషయాలు వెల్లడవడంపై ఆయన మాజీ భార్య మిలిందా స్పందించారు. బిల్‌గేట్స్ ఇతర మహిళలతో సన్నిహితంగా ఉన్నట్లు తెలియడంతో తీవ్రమైన మానసిక క్షోభ అనుభవించానని అన్నారు. ఆ కారణంగానే తమ వైవాహిక జీవితానికి ముగింపు పలికినట్లు తెలిపారు. తన జీవితంలో ఆ సమయం చాలా బాధాకరమైందని మిలిందా పేర్కొన్నారు. తమ బంధాన్ని కాపాడుకోవడానికి కావాల్సిన విలువలను బిల్‌గేట్స్ నిలబెట్టుకోకపోవడం వల్లే ఆయనతో విడాకులు తీసుకున్నట్లు తెలిపారు. తాజాగా ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బిల్‌గేట్స్ గురించి బయటకు వచ్చిన విషయాలపై ఆయనే సమాధానం చెప్పుకోవాలని, తాను కాదని వ్యాఖ్యానించారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో బాధితులుగా ఉన్న మహిళలకు న్యాయం లభిస్తుందని ఆశిస్తున్నానన్నారు. మూడు దశాబ్దాల వివాహ బంధానికి స్వస్తి పలుకుతూ బిల్‌గేట్స్-మిలిందా దంపతులు 2021లో విడాకులు తీసుకున్న సంగతి గమనార్హం.



తుర్కియే విమానం ఇంజిన్‌లో మంటలు... కోల్‌కతాలో అత్యవసర ల్యాండింగ్

కోల్‌కతా: నేపాల్ రాజధాని కాఠ్‌మాండూ నుంచి ఇస్తాంబుల్‌కు వెళ్తున్న ఓ తుర్కియే విమానం కుడి ఇంజిన్‌లో మంటలు వెలువడటంతో కోల్‌కతాలో అత్యవసరంగా దిగింది. ఆ సమయంలో విమానంలో 11 మంది సిబ్బంది సహా 236 మంది ప్రయాణికులు ఉన్నారు. బుధవారం మధ్యాహ్నం 1.15 గంటలకు కాఠ్‌మాండూ నుంచి బయల్దేరిన ఏ330-300 విమానం (టీహెచ్‌వై727)లో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుడి ఇంజిన్ నుంచి మంటలు ఎగసిపడ్డాయి. వెంటనే అప్రమత్తమైన పైలట్ 'పాన్ పాన్' అంటూ అంతర్జాతీయ రేడియో విపత్తు సిగ్నల్‌ను పంపించారు. విమానం గాల్లో ఉన్న సమయంలోనే మధ్యాహ్నం 1.51 గంటలకు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం 2.30 గంటలకు కోల్‌కతాలోని ఎన్ఎస్‌సీబీఐ విమానాశ్రయంలో విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులంతా క్షేమంగా ఉన్నట్లు విమానయాన మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

సామాజిక శాస్త్రవేత్త యాండ్రే బెతెయిల్ అస్తమయం



దిల్లీ: ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త, రచయిత యాండ్రే బెతెయిల్(91) వార్ధక్య సంబంధ ఆరోగ్య సమస్యలతో మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు బుధవారం ముగిశాయని కుమార్తె రాధా బెతెయిల్ తెలిపారు. బెతెయిల్ 2003 నుంచి దిల్లీ విశ్వవిద్యాలయంలో సామాజిక శాస్త్ర గౌరవ ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఆయన తండ్రి ఫ్రాన్స్ దేశస్థుడు కాగా, తల్లి భారతీయురాలు. తన జీవితకాలంలో ఆయన రాజకీయ సామాజిక శాస్త్రం, మత సామాజిక శాస్త్రం వంటి అనేక అంశాలపై పుస్తకాలు రాశారు. ఆయన రచించిన 'కులం, వర్గం, అధికారం' (క్యాస్ట్, క్లాస్ అండ్ పవర్) తదితర పుస్తకాలు బహుళ పాఠకాదరణ పొందాయి. 2005లో ఆయనకు పద్మభూషణ్ అవార్డు లభించింది. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ 2013లో గౌరవ డాక్టరేట్ అందించింది.

జమ్మూలో ఆపరేషన్ కియా.. ఇద్దరు ఉగ్రవాదుల హతం

జమ్మూ: భద్రతా బలగాలు జమ్మూకశ్మీర్‌లోని ఉధంపుర్ జిల్లాలో దాదాపు 20 గంటలు జరిపిన ఆపరేషన్‌లో ఇద్దరు పాకిస్థానీ ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిలో జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందిన టాప్ కమాండర్ రుబానీ అలియాస్ అబు మావియా కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రం రామ్‌నగర్-బసంత్‌గఢ్ ప్రాంతంలో సైన్యం, పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సంయుక్త బృందాలు ఉగ్రవాదులను గుర్తించి ఆ ప్రాంతమంతటా తనిఖీలు నిర్వహించాయి. గుహలో దాక్కున్న ఉగ్రవాదులను తప్పించుకోకుండా అడ్డుకొని హతమార్చాయి. ఈ ఆపరేషన్‌కు 'కియా' అని పేరు పెట్టారు. హతమైన ఉగ్రవాదుల నుంచి పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.

✦ మరోవైపు జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలో కొనసాగుతున్న ఆపరేషన్ త్రాషి-1లో భాగంగా చట్రూ అటవీ ప్రాంతంలో బుధవారం మరో ఉగ్రవాదిని భద్రతా దళాలు హతమార్చాయి. హతుడు పాకిస్థాన్‌కు చెందినవాడని అధికారులు అనుమానిస్తున్నారు.

లిబియా ఒకప్పటి నియంత గడాఫీ కుమారుడి హత్య



సయిఫ్

కైరో: లిబియా ఒకప్పటి నియంత గడాఫీ కుమారుడు సయిఫ్ అల్ ఇస్లాం గడాఫీ(53) హత్యకు గురయ్యారు. ఈ హత్య గురించి సయిఫ్ రాజకీయ సలహాదారులు మీడియాకు వెల్లడించారు. నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు ముసుగులు ధరించి జింటాన్‌లోని గడాఫీ ఇంట్లోకి చొరబడ్డారని, నిఘా కెమెరాలను ధ్వంసం చేసి. . ఆ తర్వాత ఆయనను కాల్చి చంపారన్నారు. ఈ హత్య వెనక ఎవరున్నారో తెలియరాలేదు. ఈ ఘటనకు కొన్ని రోజుల ముందు తన భద్రత గురించి సయిఫ్ తన స్నేహితుడి వద్ద ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇక, గడాఫీ మరణం తర్వాత లిబియా రాజకీయాల్లో సయిఫ్ చురుగ్గా ఉన్నారు.

సునేత్ర ఇంటికి శరద్ పవార్



అజిత్ పవార్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న శరద్ పవార్

బారామతి: ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ బుధవారం మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి సునేత్రా పవార్ ఇంటికి వెళ్లారు. ఇటీవల విమాన ప్రమాదంలో మరణించిన తన అన్న కుమారుడు, సునేత్ర భర్త, మాజీ ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్‌కు ఆయన ఈ సందర్భంగా నివాళి అర్పించారు. మరోవైపు అజిత్ పవార్ కుమారులైన పార్థ్ పవార్, జయ్ పవార్‌లు బుధవారం శరద్ పవార్‌ను కలిశారు. బారామతిలో పవార్ కుటుంబం స్థాపించిన విద్యాసంస్థ విద్యా ప్రతిష్ఠాన్‌లో ఈ సమావేశం జరిగింది. దాదాపు గంటన్నర పాటు వారు మట్లాడుకున్నారు. అయితే వారి సంభాషణ ఏ విషయంపై జరిగిందన్నది బహిర్గతం కాలేదు.

ఫడణవీస్‌కు ఆ హక్కు లేదు: శరద్ పవార్

ఎన్సీపీ చీలిక వర్గాల పునరేకీకరణ ప్రక్రియతో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు ఎలాంటి సంబంధం లేదు కాబట్టి ఆయనకు ఆ విషయంపై మాట్లాడే హక్కు లేదని శరద్ పవార్ పేర్కొన్నారు. చీలిక వర్గాల విలీనంపై చర్చలను అజిత్ పవార్, ఎన్సీపీ(ఎస్పీ) నేత జయంత్ పాటిల్ ప్రారంభించారని శరద్ పవార్ పేర్కొన్నారు. నిజంగా విలీన చర్చలు జరిగివుంటే అజిత్ పవార్ ఆ విషయాన్ని తనకు చెప్పేవారని ఫడణవీస్ చెప్పిన నేపథ్యంలో పవార్ ఈ విధంగా స్పందించారు.

'రాహుల్ మాట్లాడేందుకు అనుమతి ఇవ్వాల్సింది'

సైనిక బలగాల మాజీ ప్రధానాధికారి ఎం.ఎం.నరవణె రాసిన పుస్తకంలోని కొన్ని పంక్తుల్ని లోక్‌సభలో చదివి వినిపించేందుకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అనుమతించి ఉండాల్సిందని, ఆయన్ను అడ్డుకోవడం సరికాదని పవార్ పేర్కొన్నారు.

ఇంకా ప్రచురితం కాని తన పుస్తకంలో నవరణె దేశ భద్రతకు సంబంధించిన కొన్ని ఆందోళనకర అంశాలను ప్రస్తావించారని, దానిపైన లోక్‌సభలో చర్చ జరిగి ఉంటే, ప్రజలకు అనుమానాలు తొలగి స్పష్టత వచ్చి ఉండేదని పవార్ అభిప్రాయపడ్డారు.

పుతిన్, ట్రంప్‌లకు జిన్‌పింగ్ ఫోన్

- బంధం బలోపేతంపై చర్చ

బీజింగ్: చైనా అధినేత షీ జిన్‌పింగ్.. బుధవారం రష్యా, అమెరికా అధ్యక్షులు పుతిన్, ట్రంప్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. పుతిన్‌తో మాట్లాడిన కొద్ది గంటల్లోనే ఆయన ట్రంప్‌తోనూ మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇలా ఒకే రోజు కొద్ది గంటల వ్యవధిలో జిన్‌పింగ్ ఇద్దరు అగ్ర నేతలతో మాట్లాడటం అరుదు. రష్యా, చైనాల మధ్య బంధాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్న నేపథ్యంలో పుతిన్‌తో చర్చలు జరిపినట్లు సమాచారం. రెండు దేశాల మధ్య సంబంధాల బలోపేతానికి భారీ ప్రణాళిక అవసరమని పుతిన్‌తో జిన్‌పింగ్ అన్నారు. అలాగే జపాన్‌తో సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో ట్రంప్‌తో జిన్‌పింగ్ మాట్లాడినట్లు భావిస్తున్నారు. కాగా ఇరాన్ అంశంపై జిన్‌పింగ్‌తో చర్చించానని ట్రంప్ తెలిపారు. తైవాన్ పైనా, ఏప్రిల్‌లో తన చైనా పర్యటనపైనా చర్చించామని వెల్లడించారు. వాణిజ్య అంశాలూ చర్చకు వచ్చాయని తెలిపారు. ఇరాన్ విషయంలో తమకు సహకరించాలని జిన్‌పింగ్‌ను ట్రంప్ కోరినట్లు తెలిసింది.

✦ అమెరికాతో రష్యా 'స్టార్ట్' అణు ఒప్పందం గడువు తీరిపోతున్న నేపథ్యంలోనూ ఈ చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొత్త ఒప్పందంలో చేరాలని చైనాను అమెరికా కోరుతోంది. అయితే తమవద్ద రష్యా మాదిరిగా భారీ అణ్వాయుధాలు లేవని, అందుకే ఒప్పందంలో భాగం కాబోమని చైనా స్పష్టంచేస్తోంది.

గుండె పోటును ముందే పసిగట్టే సాధనం

- ఒడిశా విద్యార్థిని ఆవిష్కరణ

కటక్: హృద్రోగ సంబంధ అత్యవసర పరిస్థితిని ముందే పసిగట్టి హెచ్చరిక జారీ చేసే ఒక వినూత్న సాధనాన్ని దేబాశ్రితా దాస్ అనే విద్యార్థిని రూపొందించారు. ఆమె ఇక్కడి రావెన్ షా విశ్వవిద్యాలయంలో ఐటీ విభాగంలో మూడో సంవత్సరం చదువుతున్నారు.



కృత్రిమ మేధ సాయంతో పనిచేసే ఈ హృదయ రక్షక సాధనం ఒక మాస్క్‌లా ఉంటుందని, ఇది గుండె పోటు రావడానికి 30 నిమిషాల ముందే రోగిని అప్రమత్తం చేస్తుందని దేబాశ్రిత విశదీకరించారు. ఈ సాధనాన్ని తాకడం ద్వారా ఉత్తేజితం చేయవచ్చు. ఇది రోగిని హెచ్చరించడంతోపాటు అతని కుటుంబ సభ్యులు, డాక్టర్లు, అంబులెన్స్ సర్వీసును కూడా అప్రమత్తం చేస్తుంది. తద్వారా సత్వరం చికిత్స చేపట్టేందుకు వీలు కల్పిస్తుంది. ఈ సాధనం తక్షణం రోగికి ఆక్సిజన్ అందేలా చేస్తుంది. ఈ కారణంగా గ్రామీణ, మారుమూల ప్రాంతాల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. హార్ట్ గార్డ్‌ను రూపొందించేందుకు ఆమె రెండేళ్లపాటు కష్టపడ్డారు. దీనికి ఐఐటీ బాంబే నుంచి సాంకేతిక సహకారం అందింది. సాధనం ఏమేరకు పనిచేస్తుందన్న విషయంపై ప్రాథమిక పరీక్షలు పూర్తయ్యాయి. ఈ పరికరాన్ని పూర్తిగా అభివృద్ధి చేసేందుకు ఇంకా రూ.6 లక్షల వరకూ అవసరమవుతాయని ఆమె తెలిపారు. ఈ సాధనం మార్కెట్‌లోకి విడుదలయ్యాక, దీని ధర రూ.25 వేల వరకూ ఉంటుందని దేబాశ్రిత తెలిపారు.

ట్రంప్ అణు మెలిక

'న్యూ స్టార్ట్'లోకి చైనాను లాగే ప్రయత్నం • నేటితో ముగియనున్న ఒప్పందం



వాషింగ్టన్: ప్రపంచంలో అత్యధిక అణ్వాయుధాలున్న దేశాలు అమెరికా, రష్యా. ఈ రెండింటి వాటాయే దాదాపు 80 శాతం. అందుకే గతంలో ఈ రెండు దేశాలు అనేక ద్వైపాక్షిక అణ్వాయుధ నియంత్రణ ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. వాటిలో కీలకమైంది న్యూ స్టార్ట్. ఈ వ్యూహాత్మక ఆయుధాల తగ్గింపు ఒప్పందం గడువు గురువారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో రెండు దేశాలు కొత్త ఒప్పందాన్ని కుదుర్చుకుంటాయా, రద్దు చేసుకుంటాయా.. అన్న చర్చ మధ్య మరో కీలక అంశం తెరపైకి వచ్చింది. అదే న్యూ స్టార్ట్‌లోకి చైనా కూడా చేరాలని ట్రంప్ చేస్తున్న ప్రతిపాదన. మరిందుకు డ్రాగన్ అంగీకరిస్తుందా..?

ఏమిటీ న్యూ స్టార్ట్?

న్యూ స్టార్ట్ అంటే వ్యూహాత్మక ఆయుధాల తగ్గింపు ఒప్పందం. అమెరికా, రష్యాల మధ్య ప్రస్తుతం అమల్లో ఉన్న ఏకైక అణ్వాయుధ నియంత్రణ ఒప్పందమిదే. 2010లో దీనిపై నాటి అమెరికా, రష్యా అధ్యక్షులు బరాక్ ఒబామా, దిమిత్రి మెద్వదెవ్ సంతకాలు చేశారు. ఇది అమల్లోకి వచ్చింది మాత్రం 2011లో. ఈ ఒప్పందంలో భాగంగా రెండు దేశాలు 1550కి మించి వార్ హెడ్‌లను మోహరించకూడదు. 700 క్షిపణులు, బాంబర్లకే పరిమితం కావాలి. 2021లో ఈ ఒప్పందాన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగిస్తూ రెండు దేశాలు నిర్ణయం తీసుకున్నాయి. ఇప్పుడు ఆ గడువు ముగియనుంది.

రద్దా.. పొడిగింపా?

2021లో ఈ ఒప్పందం గడువు తీరే సమయంలో.. న్యూ స్టార్ట్ కొనసాగుతుందా, రద్దవుతుందా అనే విషయంలో పెద్ద చర్చ జరిగింది. ఇది రద్దైతే ప్రపంచవ్యాప్తంగా అణు పోటీ పెరుగుతుందన్న ఆందోళన నాడు ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమైంది. పొడిగింపునకు రెండు దేశాలు అంగీకరించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతమూ దాదాపు అదే పరిస్థితి. ఎందుకంటే ఒప్పంద పునరుద్ధరణపై ఇప్పటివరకు అటు అమెరికా నుంచి.. ఇటు రష్యా నుంచి ఎలాంటి సంకేతాలు వెలువడలేదు. అయితే న్యూ స్టార్ట్‌పై గతేడాది రష్యా అధ్యక్షుడు పుతిన్ కీలక వ్యాఖ్య చేశారు. మరో సంవత్సరం ఒప్పందం పొడిగించుకోవడానికి తమ దేశం సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. దీనిపై అమెరికా స్పందించలేదు. దీంతో అనుమానాలు తలెత్తాయి.

ట్రంప్ వ్యూహం

వెనెజువెలా, గ్రీన్‌లాండ్ అంశాల్లో వివాదాస్పదంగా వ్యవహరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు న్యూ స్టార్ట్ విషయంలోనూ తలదూర్చారు. ఈ ఒప్పందంపై ఇటీవల ఆయన 'న్యూయార్క్ టైమ్స్'తో మాట్లాడుతూ, 'న్యూ స్టార్ట్' స్థానంలో రష్యాతో కొత్త ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. 'గడువు ముగిస్తే ముగిసిపోనీ.. మేమింకా మెరుగైన ఒప్పందాన్ని కుదుర్చుకుంటాం' అని పేర్కొన్నారు. దీంతో ప్రతిష్టంభన తొలగిపోయిందని అనుకున్నారంతా. అంతలోనే ట్రంప్ మళ్లీ ఓ బాంబు పేల్చారు. ఏ అణుచర్చలు జరిగినా అందులో చైనా భాగస్వామిగా ఉండాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ వ్యాఖ్యే ఇప్పుడు గుబులు రేపుతోంది. ఇందులోకి బీజింగ్‌ను లాగడం ద్వారా మొత్తం ఒప్పందాన్ని ట్రంప్ ఇరకాటంలో నెడుతున్నారని అంటున్నారు నిపుణులు.

చైనా అంగీకరిస్తుందా..

అమెరికా, రష్యా అంత స్థాయిలో చైనా దగ్గర అణ్వాయుధాలు లేకపోయినా.. ఆ దేశమూ ఇటీవల దూకుడు పెంచింది. ఈ పరిణామం ట్రంప్ యంత్రాంగాన్ని కలవరపరుస్తోంది. అందుకే ద్వైపాక్షిక ఒప్పందంగా ఉన్న 'న్యూ స్టార్ట్‌ను త్రైపాక్షికంగా మార్చాలని ట్రంప్ భావిస్తున్నారు. న్యూ స్టార్ట్‌లోకి చైనాను చేర్చడం ద్వారా ఆ దేశ అణ్వాయుధాలపై నియంత్రణ విధించాలన్నది ఆయన ప్రణాళిక. ఈ పరిణామాలను బీజింగ్ కూడా గమనిస్తోంది. రష్యా, అమెరికా ఆయుధ నియంత్రణ ఒప్పందాల్లో తమ దేశం భాగస్వామి కాబోదని గతంలో చాలా సార్లు చైనా పేర్కొంది. ఇప్పుడూ అదే వైఖరితో ఉంది. అమెరికా, రష్యా మధ్య 'న్యూ స్టార్ట్' ఒప్పందం కుదరకపోతే ప్రపంచవ్యాప్తంగా అణ్వాయుధ పోటీ మొదలవుతుందని చైనాకు తెలుసు. ఆ సమయానికి తాను కూడా పూర్తి రేసులో ఉండేలా సన్నాహాలు చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో న్యూ స్టార్ట్‌పై రానున్న రోజుల్లో ట్రంప్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది కీలకం కానుంది.

నేపాల్ నుంచి నేరుగా దిల్లీకి కొత్త బస్సు సర్వీసు ప్రారంభం

కాఠ్మాండూ: నేపాల్‌లోని బేని మున్సిపాలిటీ నుంచి నేరుగా దిల్లీకి వెళ్లే బస్సు సర్వీసు బుధవారం ప్రారంభమైంది. నేపాల్‌లోని ప్రసిద్ధ హిందూ - బౌద్ధ క్షేత్రమైన ముక్తినాథ్ ఆలయాన్ని సందర్శించాలనుకునే భారతీయులకు ఈ సర్వీసు వరం కాబోతోంది. నేపాల్‌లోని గండకి రాష్ట్రం, ముస్టాంగ్ జిల్లాలో విష్ణుమూర్తి ఆలయమైన ముక్తినాథ్ దేవస్థానాన్ని బౌద్ధులు అవలోకితేశ్వరాలయంగా పిలుస్తారు. ఇక్కడి స్వామిని బౌద్ధ, హిందూ మతవర్గాలకు చెందిన ప్రజలు సమష్టిగా పూజిస్తారు. అపూర్వమైన ఈ ఆలయానికి చేరే బస్సు సర్వీసును భారత-నేపాల్ స్నేహానికి సూచనగా మాడర్న్ ఎరా టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థ ఏర్పాటు చేసింది. గతంలో ముక్తినాథ్ ఆలయ సందర్శనకు వెళ్లే భారతీయులు ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ప్రయాణం సాగించాల్సి వచ్చేది. తాజా బస్సు సర్వీసుతో ఆ కష్టాలు తీరినట్టైంది. ముక్తినాథ్-అవలోకితేశ్వర ఆలయ పరిసరాల్లో 108 నీటి బుగ్గలు, సహజంగా ఏర్పడిన అగ్నిగుండం ఉన్నాయి.



గాజాలోని ఖాన్‌యూనిస్‌లో ధ్వంసమైన శరణార్థి శిబిరం

గాజాలో కొనసాగుతున్న మారణకాండ

- ఇజ్రాయెల్ కాల్పుల్లో మరో 24 మంది మృతి

డెయిర్ అల్-బలా: గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనకు గురవుతూనే ఉంది. మంగళవారం రాత్రి నుంచి ఇజ్రాయెల్ నిర్వహించిన దాడుల్లో దాదాపు 24 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. ఇందులో ఐదు నెలలు, 10 రోజుల వయసున్న శిశువులూ ఉన్నారు. ఈ మరణాలపై ఇజ్రాయెల్ అధికారి ఒకరు వివరణిచ్చారు. హమాస్ మిలిటెంట్లనే లక్ష్యంగా చేసుకొని దాడులు నిర్వహించామని తెలిపింది. గతేడాది అక్టోబరు 10న కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అప్పటి నుంచి ఇజ్రాయెల్ దాడుల్లో 530 మంది పాలస్తీనియన్లు మృతి చెందారు.

అబుధాబీలో రష్యా, ఉక్రెయిన్ రెండో విడత చర్చలు

కీవ్: రష్యా, ఉక్రెయిన్ మధ్య రెండో రౌండ్ చర్చలు యూఏఈ రాజధాని అబుధాబీలో బుధవారం ప్రారంభమయ్యాయి. దాదాపు నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా మధ్యవర్తిత్వంతో ఈ రెండు దేశాలు గత నెలలో అబుధాబీలోనే తొలి రౌండ్ చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. ఈ రెండో రౌండ్ చర్చలు గురువారమూ కొనసాగనున్నాయి. గాజా కాల్పుల విరమణ ఒప్పందంలో కీలక పాత్ర పోషించిన ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్, పశ్చిమాసియా అమెరికా రాయబారి విట్కాఫ్‌లే ఈ చర్చలకూ అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తున్నారు.

ఏ దేశం నుంచైనా భారత్ చమురు కొనొచ్చు

- ఆ దేశానికి స్వేచ్ఛ ఉంది: రష్యా



దిమిత్రి పెస్కోవ్

మాస్కో: ప్రపంచంలోని ఏ దేశం నుంచైనా భారత్ చమురును కొనుగోలు చేయవచ్చని, ఆ దేశానికి ఆ స్వేచ్ఛ ఉందని రష్యా స్పష్టం చేసింది. విభిన్న ముడి చమురు సరఫరాదారులను ఆ దేశం ఆశ్రయించడం కొత్తేమీ కాదని పేర్కొంది. 'భారత్‌కు రష్యా ఒక్కటే చమురును సరఫరా చేయడం లేదన్న విషయం మాతోపాటు అంతర్జాతీయ ఇంధనరంగ నిపుణులందరికీ తెలుసు. ఆ దేశం ఎప్పటి నుంచో ఇతర దేశాల నుంచీ చమురును కొనుగోలు చేస్తోంది. అందువల్ల భారత్ చమురు కొనుగోళ్లను నిలిపేయడం కొత్త విషయంగా తోచడం లేదు' అని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వ్యాఖ్యానించారు.

✦ భారత్, రష్యాల మధ్య హైడ్రోకార్బన్ల వాణిజ్యం ఇద్దరికీ లాభదాయకమని రష్యా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మారియా జఖరోవా తెలిపారు.

'పూర్తిగా ఆపలేవు'

రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారతీయ రిఫైనరీలు పూర్తిగా ఆపలేవని ఆ దేశ జాతీయ ఇంధన భద్రతా నిధి నిపుణుడు ఐగోర్ యుష్కోవ్ స్పష్టం చేశారు. 'అమెరికా ఎగుమతి చేసే షేల్ చమురు తక్కువ గ్రేడ్‌లు కలిగి ఉంటుంది. గ్యాస్ కూడా తక్కువ కండెన్సేట్‌తో ఉంటుంది. వాటితో పోలిస్తే రష్యా భారీ, సల్ఫర్ అధికంగా ఉండే యూరల్స్‌ను సరఫరా చేస్తుంది. తక్కువ గ్రేడ్లు ఉండే చమురును అమెరికా నుంచి భారత్ అధిక ధరకు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అంటే ప్రత్యామ్నాయం అంత సులభం కాదని అర్థమవుతోంది. పైగా రష్యా రోజుకు 15 లక్షల నుంచి 20 లక్షల బ్యారెళ్ల చమురును సరఫరా చేస్తోంది. అంత పరిమాణంలో అమెరికా చేయలేదు' అని యుష్కోవ్ వ్యాఖ్యానించారు. 2022లో భారత్ అమెరికా, ఇతర దేశాల నుంచి చమురు కొనడంవల్ల బ్యారెల్ ధర 120 డాలర్లకు పెరిగిందని వివరించారు.

పాపం.. క్యాండీ అనుకొని పేలుడు పదార్థం నమిలింది

ఈటీవీ భారత్: రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లా రామ్‌గఢ్ పోలీస్‌స్టేషను పరిధిలోని చౌకీ బాస్ గ్రామంలో దారుణం జరిగింది. అక్షు (3) అనే బాలిక టాఫీ క్యాండీ అనుకొని పేలుడు పదార్థాన్ని నమలడంతో.. అది నోట్లో పేలి బుగ్గ, దవడ భాగాలు తీవ్రంగా గాయపడ్డాయి. హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా.. రక్తసిక్తమై పరిస్థితి విషమంగా ఉన్న బాలికకు వైద్యులు శస్త్రచికిత్స చేశారు. దుకాణదారు క్యాండీకి బదులుగా పేలుడు పదార్థం ఇచ్చినట్లు మంగళవారం జరిగిన ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు రామ్‌గఢ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుకాణదారును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు రామ్‌గఢ్ డీఎస్పీ పింటూ కుమార్ తెలిపారు.



ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌కు లోకేశ్ అభినందనలు

ఈనాడు, అమరావతి: లోక్‌సభ స్పీకర్ స్థానానికి ఉన్న గౌరవాన్ని మరింత పెంచారని మంత్రి లోకేశ్. . తెదేపా ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌ని కొనియాడారు. సభాధ్యక్ష స్థానాన్ని ఉద్దేశించి ఎలా పడితే అలా సంబోధించడానికి వీల్లేదని కాంగ్రెస్ సభ్యులకు ప్యానెల్ స్పీకర్ హోదాలో ఉన్న కృష్ణప్రసాద్ స్పష్టం చేయడాన్ని ఆయన ప్రస్తావించారు. 'వాటీజ్ దిస్ యార్' అని వ్యాఖ్యానించిన కాంగ్రెస్ సభ్యుడికి హితవు పలికిన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఖజానా శాఖ డైరెక్టర్ పోస్టులో పద్మజకు పూర్తి అదనపు బాధ్యతలు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఖజానా శాఖ డైరెక్టర్ మోహన్‌రావు పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ఆ శాఖ అదనపు డైరెక్టర్, పే అండ్ ఎకౌంట్స్ అధికారి కె.పద్మజను ఇన్‌ఛార్జిగా నియమించారు. ఆమె బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

దివ్యాంగ బ్యాక్‌లాగ్ పోస్టుల్ని మార్చి లోపు భర్తీ చేయాలి

మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి



దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ అధికారులతో సచివాలయంలో సమీక్షిస్తున్న మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న దివ్యాంగ బ్యాక్‌లాగ్ పోస్టుల్ని మార్చి లోపు భర్తీ చేయాలని అధికారులను దివ్యాంగ, వృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. త్రిచక్ర వాహనాల (రెట్రోఫిటెడ్ వాహనాలు) పంపిణీకి గాను లబ్ధిదారుల ఎంపికను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. సచివాలయంలో ఆయన బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. 'దివ్యాంగుల పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలి. 100 శాతం సీట్లు భర్తీ కావాలి. ఈ పాఠశాలల్లో ఏవైనా మరమ్మతు పనులుంటే.. వెంటనే చేయాలి. ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలి. మెనూ అమలులో రాజీపడొద్దు. వయోవృద్ధులకు సహాయ పరికరాలు ఎక్కువ మందికి పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలి' అని సూచించారు.

ప్రజల్లో సంతృప్త స్థాయి పెంపే లక్ష్యం

అధికారులతో మంత్రి శ్రీబాల వీరాంజనేయస్వామి

ఈనాడు, అమరావతి: ప్రజల్లో సంతృప్తి శాతం పెంపే లక్ష్యంగా స్వర్ణ గ్రామ, వార్డు సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని ఆ శాఖ మంత్రి శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. సచివాలయంలో బుధవారం సంబంధిత విభాగంలో ఉద్యోగుల హేతుబద్ధీకరణ, పదోన్నతులు, మూడంచెల వ్యవస్థపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. 'స్వర్ణ వార్డు, గ్రామం కార్యాలయాలపై పర్యవేక్షణకు జిల్లా, మండలానికో అధికారి చొప్పున డిప్యుటేషన్‌పై నియమించాం. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. సిబ్బంది పనితీరుపైనా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నాం' అని మంత్రి అన్నారు.

అధికారం పోయినా జగన్‌కు జంగిల్‌రాజ్ మనస్తత్వం పోలేదు

తెదేపా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: అధికారం పోయినా.. వైకాపా అధ్యక్షుడు జగన్‌కు జంగిల్‌రాజ్ మనస్తత్వం పోలేదని తెదేపా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రభుత్వ ఆస్తుల్ని ధ్వంసం చేయడం, పారిశ్రామికవేత్తల్ని తరిమేయడం, రాజకీయ ప్రత్యర్థుల్ని హతమార్చడం వంటి చెడు సంప్రదాయాలకు రాష్ట్రంలో బీజం వేసింది వైఎస్ కుటుంబమేనని ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పులివెందులలో జగన్ అరాచకాలకు తాము ప్రత్యక్ష బాధితులమని రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. వాళ్లే బూతులు తిడుతూ, దాడులు చేస్తూ.. మళ్లీ రాష్ట్రంలో ఏదో జరిగిపోతోందంటూ భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రూ.2,123 కోట్లతో 1,392 గ్రామీణ రోడ్ల అభివృద్ధి

సవరించిన అంచనాలకు పరిపాలన అనుమతులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రూ. 2,123 కోట్ల నాబార్డు రుణం, సాస్కీ నిధులతో నాలుగు వంతెనలు సహా 1,392 గ్రామీణ రహదారుల అభివృద్ధికి సంబంధించి సవరించిన అంచనాలకు ప్రభుత్వం పరిపాలన అనుమతులిచ్చింది. 26 జిల్లాల్లోని 157 గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 4,122 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి సవరించిన అంచనాలను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ప్రతిపాదించింది. వీటిని ఆమోదించడంతో పాటు వెంటనే తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. నాలుగు వంతెనలు సహా 1,299 రహదారుల అభివృద్ధి పనులకు ప్రభుత్వం మొదట అనుమతించింది. దీనిపై పలువురు ఎమ్మెల్యేలు ఎక్కువ రోడ్ల అభివృద్ధికి మొదట మంజూరు చేసిన రహదారులను విభజించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీంతో రోడ్ల సంఖ్య 1,299 నుంచి 1,392కి పెరిగింది. అదనంగా మరో 93 రోడ్ల అభివృద్ధికి వీలుగా ఇంజినీర్లు అంచనాలు సవరించారు. రాష్ట్ర గ్రామీణ రహదారుల పటిష్ఠత కార్యక్రమం కింద పనులు చేపట్టనున్నారు.

మంత్రి గొట్టిపాటి తరఫున ఆదాయ పన్ను చెల్లింపు

ఈనాడు, అమరావతి: మంత్రి గొట్టిపాటి రవికుమార్ తరఫున రూ.1,04,990లు ఆదాయ పన్నుగా చెల్లించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ మొత్తాన్ని చెల్లించేందుకు అనుమతించింది.

ఏపీలో రూ 12,967 కోట్ల రైల్వే ప్రాజెక్టులు పూర్తి

- రూ.34,680 కోట్ల పనుల కొనసాగింపు

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు రూ. 12,967 కోట్ల విలువైన 10 రైల్వే ప్రాజెక్టులు పూర్తయ్యాయని, ఇప్పుడు రూ.34,680 కోట్ల విలువైన మరో 16 ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. బుధవారం లోక్‌సభలో తెదేపా ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, పుట్టా మహేష్‌కుమార్‌లు అడిగిన వేర్వేరు ప్రశ్నలకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు. గత నాలుగేళ్లలో 15 కొత్త లైన్లు, 50 డబ్లింగ్ లైన్లకు సర్వే పనులు చేపట్టినట్లు వివరించారు. వీటి మొత్తం పొడవు 6,985 కిలోమీటర్లని వెల్లడించారు. 2025 ఏప్రిల్ 1 నాటికి ఆంధ్రప్రదేశ్‌కు 4,499 కిలోమీటర్ల పొడవైన 12 కొత్త లైన్లు, 27 డబ్లింగ్ పనులు మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. వాటి విలువ రూ.70,232 కోట్లని వెల్లడించారు. అందులో 1,178 లైన్లు ప్రారంభమయ్యాయని, అందుకోసం రూ. 28,039 కోట్లు ఖర్చు చేసినట్లు రైల్వేమంత్రి చెప్పారు. గుంటూరు డివిజన్‌లో రవాణా సౌకర్యాలను సులభతరం చేయడానికి గుంటూరు-గుంతకల్లు (401 కి.మీ.), గుంటూరు-బీబీనగర్ (239 కి.మీ.) డబ్లింగ్ పనులు, గుంటూరు యార్డ్‌కు మల్టీ ట్రాకింగ్, ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు మధ్య 57 కి.మీ. పొడవైన కొత్తలైన్ల నిర్మాణ పనులు మొదలుపెట్టినట్లు చెప్పారు. ఈ మొత్తం ప్రాజెక్టుల విలువ రూ.9,353 కోట్లని తెలిపారు. ఇందులో గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ పనులు 357 కి.మీ. పూర్తయ్యాయని, మిగిలిన పనులు జరుగుతున్నాయన్నారు. అమరావతి లైన్ కోసం భూసేకరణ ప్రక్రియ చేపట్టినట్లు వివరించారు. గుంటూరు-బీబీనగర్ డబ్లింగ్ పనులు కూడా కొనసాగుతున్నాయన్నారు. రూ.3,796 కోట్ల విలువైన భద్రాచలం-కొవ్వూరు (119 కి.మీ.) కొత్త లైన్ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్రాలు 50:50 నిష్పత్తిలో వ్యయాన్ని పంచుకొనే పద్ధతిలో మంజూరు చేశామని, అందులో ఇప్పటివరకు భద్రాచలం-సత్తుపల్లి (56 కి.మీ.) మధ్య లైన్ నిర్మాణం పూర్తయిందని వివరించారు.

ఏపీలో 14.35 లక్షల టన్నుల సామర్థ్యం గల గోదాములు

కేంద్ర పరిధిలోకి వచ్చే ఆహార ధాన్యాల నిల్వల కోసం ఆంధ్రప్రదేశ్‌లో ఎఫ్‌సీఐకి 14.35 లక్షల టన్నుల సామర్థ్యంగల గోదాములు ఉన్నట్లు కేంద్ర ఆహారం, ప్రజాపంపిణీ వ్యవహారాలశాఖ సహాయమంత్రి నిముబెన్ జయంతిభాయ్ బంభానియా తెలిపారు. ఇవికాకుండా ఎఫ్‌సీఐ కేంద్ర గోదాముల కార్పొరేషన్ నుంచి 39.38 లక్షల టన్నుల సామర్థ్యంగల గోదాములను అద్దెకు తీసుకొందని వెల్లడించారు. బుధవారం లోక్‌సభలో రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం ఇచ్చారు. ఎఫ్‌సీఐకి కాకినాడ పరిధిలో 90,132 టన్నులు, రాజమండ్రిలో 1,05,792 టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములు ఉన్నట్లు వివరించారు. కేంద్ర గోదాముల కార్పొరేషన్‌కు రాజమండ్రిలో 51,895 టన్నులు, కాకినాడలో 29,943 టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్న గోదాములు ఉన్నట్లు చెప్పారు.

2,51,753 కి.మీ. ఓఎఫ్‌సీ నిర్మాణం పూర్తి

ఆంధ్రప్రదేశ్‌లో 2,51,753 కిలోమీటర్ల పొడవైన ఓఎఫ్‌సీ నిర్మాణం పూర్తయినట్లు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆయన లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఈ విషయం చెప్పారు. రాష్ట్రంలో 2,759 గ్రామాలు 4జీ కనెక్షన్ల పరిధిలోకి వచ్చినట్లు వెల్లడించారు.

వెంకన్నతో రాజకీయాలు చేస్తే రాజకీయ వినాశనమే

- వైకాపా నేతలకు తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి హెచ్చరిక



ఈనాడు, దిల్లీ: తిరుమల ప్రసాదం తయారీకి ఉపయోగించే నెయ్యిని కల్తీ చేసి మహాపాపానికి ఒడిగట్టిన వైకాపా నాయకులు స్వామివారితో రాజకీయం చేస్తే రాజకీయ వినాశనం తప్పదని గుర్తుంచుకోవాలని తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి హెచ్చరించారు. వైకాపా హయాంలో లడ్డూ తయారీకి వాడింది అసలు నెయ్యే కాదు, అది రసాయనం మాత్రమేనని సిట్ తేల్చిన తర్వాత కూడా బుకాయించడం వారి దిగజారుడుతనానికి పరాకాష్ఠ అన్నారు. ఈ అంశం నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి పచ్చగా ఉన్న రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇదంతా తాడేపల్లి ప్యాలెస్ పథకం ప్రకారమే నడుస్తోందని ఆరోపించారు. ఆయన బుధవారం ఇక్కడ ఏపీ భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. 'చేసిన పాపాలకు శిక్షిస్తూ రాష్ట్ర ప్రజలు వైకాపాను 11 స్థానాలకు పరిమితం చేసినా సిగ్గు లేకుండా స్వామి వారితో రాజకీయాలు చేస్తున్నారు. అసలు చిన్నప్పన్న ఎవరు? వైవీ సుబ్బారెడ్డి హయాంలో నెయ్యి సరఫరా విషయంలో మార్పులు ఎందుకు చేశారు అన్నదానికి సమాధానం చెప్పకుండా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంలో జరిగిన రూ.కోట్ల అవినీతి నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి నోటికొచ్చినట్లల్లా మాట్లాడి, అందులోకి కులరాజకీయాలు తీసుకొస్తున్నారు. తమ పార్టీవారిని రోడ్ల మీదికి వదిలేసి ఇష్టమొచ్చినట్లు మాట్లాడించి, మళ్లీ అక్కడేదో సమస్య ఉన్నట్లు సృష్టిస్తున్నారు. అందుకోసమే ఓ మహానాయకుడు గుంటూరుకు వెళ్లారని రాష్ట్ర ప్రజలు అనుకుంటున్నారు. ఐదేళ్లపాలనలో రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన జగన్ ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తుంటే ఓర్వలేకపోతున్నారు. ఏపీకి పెట్టుబడుల ప్రవాహం ఇలాగే సాగితే వైకాపాకు పుట్టగతులుండవనే భయంతో రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని చూపే కుట్రకు తెరతీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నలభై రోజుల్లోనే జగన్ బృందం దిల్లీకొచ్చి రాష్ట్రపతి పాలన పెట్టాలని నానాయాగీ చేసింది. ఇప్పుడు అదే డ్రామాను మళ్లీ మొదలుపెట్టింది' అని భానుప్రకాశ్‌రెడ్డి ధ్వజమెత్తారు.

రాయలసీమ ఎత్తిపోతలను మీరే నిలిపేశారని చెప్పగలరా?

- తెదేపా నేత రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలోనే రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపేశామని ప్రజలకు చెప్పగలరా? అని ఆ పార్టీ నేతల్ని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. రాయలసీమకు ద్రోహం చేసి ఇప్పుడు దీక్షల పేరుతో నాటకాలాడుతున్నారని విమర్శించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. "ఎన్జీటీ ఆదేశాల మీద అప్పట్లో కౌంటర్ వేయకుండా ఇప్పుడు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. రాయలసీమకు చెందిన సుమారు 102 ప్రాజెక్టుల్ని రద్దు చేశారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చంద్రబాబు అక్రమ అరెస్ట్ నాడే ప్రజాస్వామ్యం ఖూనీ

ఎంపీ కలిశెట్టి



ఈనాడు, దిల్లీ: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో నిజంగా ప్రజాస్వామ్యం ఖూనీ అయింది చంద్రబాబునాయుణ్ని అక్రమ కేసులో అరెస్టు చేసి 53 రోజులు జైల్లో పెట్టినప్పుడేనని గుర్తుచేశారు. జగన్ తన హయాంలో జరిగిన ప్రజాస్వామ్య వధపై రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఆయన బుధవారం సాయంత్రం ఇక్కడ ఏపీ భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. స్కిల్ కేసులో చంద్రబాబు ఏ తప్పూ చేయలేదని ఈడీ ఇటీవల ఛార్జిషీట్‌లో పేర్కొనడం ద్వారా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాస్వామ్యాన్ని ఎలా ఖూనీ చేశారో న్యాయస్థానానికి చెప్పిందన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లూ రాష్ట్రమంతా రావణకాష్ఠం సృష్టించిన విషయాన్ని జగన్ మరిచిపోయినా ప్రజలు మరిచిపోరన్నారు. నోరుపారేసుకొనేవారిని, దాడులు చేసేవారిని మంత్రి పదవులిచ్చి ప్రోత్సహించిన వ్యక్తి ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలోనే అత్యంత సీనియర్ నాయకుడైన చంద్రబాబుపై అంబటి రాంబాబు చేసిన జుగుప్సాకరమైన వ్యాఖ్యలను వెనకేసుకురావడం ద్వారా ప్రజాస్వామ్యం, నైతిక విలువలకు తాను ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో జగన్ చెప్పకనే చెప్పారని ఎద్దేవా చేశారు.

మధ్యవర్తిత్వం లేకుండా సూట్ కుదరదు

- రాకియాతో వివాదంపై తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన పయనీర్

ఈనాడు, హైదరాబాద్: వాటాల బదలాయింపునకు సంబంధించిన రస్ అల్ ఖైమా ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (రాకియా)తో వివాదంపై పెన్నా గ్రూపునకు చెందిన పయనీర్ అల్యూమినియం ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆన్‌రాక్) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. రెండు కంపెనీల మధ్య ఏదైనా వివాదం ఉన్నపుడు మధ్యవర్తిత్వం లేకుండా సివిల్ కోర్టులో నేరుగా సూట్ వేయడానికి వీల్లేదని పేర్కొంది. అయినప్పటికీ కింది కోర్టు మధ్యవర్తిత్వాన్ని మినహాయించి నేరుగా రాకియా సూట్‌ను స్వీకరించడాన్ని సవాలు చేస్తూ పయనీర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. రాకియా తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ వాటాల బదలాయింపునకు సంబంధించి పయనీర్‌కు, రష్యన్ అల్యూమినియం కంపెనీ రసూల్ మధ్య వాటాల మార్పిడి జరిగిందన్నారు. రాకియా ప్రమేయం లేకుండా వాటాల బదలాయింపు జరిగిందని, తదుపరి బదలాయింపు జరగకుండా ఆదేశాలివ్వాలని కింది కోర్టును ఆశ్రయించామన్నారు. పయనీర్ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ వాణిజ్య కోర్టుల చట్టంలోని సెక్షన్ 12ఎ ప్రకారం మధ్యవర్తిత్వం తప్పనిసరన్నారు. మధ్యవర్తిత్వం నిబంధనను కింది కోర్టు మినహాయించడం సరికాదన్నారు. ఇక్కడ పిటిషన్‌పై విచారణ ముగిసేదాకా కింది కోర్టులో తదుపరి ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. వాదనలను విన్న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరిస్తూ విచారణను కొనసాగించవచ్చని, అయితే తీర్పును వెలువరించరాదంటూ కింది కోర్టుకు ఆదేశాలు జారీ చేసింది.

రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనపై కసరత్తు

హోంమంత్రి అనిత, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడితో చర్చలు

ఈనాడు, అమరావతి: త్వరలో జరగనున్న శాసన సభ సమావేశాల్లో 2026-27 ఆర్థిక సంవత్సరానికిగానూ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శాఖలవారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగా ఆయా శాఖల మంత్రులు, అధికారులతో పయ్యావుల సమీక్షలు చేపట్టారు. మంగళవారం ఈ సమీక్షలు ప్రారంభం కాగా.. బుధవారం రాష్ట్ర హోం, వ్యవసాయ శాఖలపై ఆయన సమీక్షించారు. ఆ శాఖలు ఎంత బడ్జెట్ ప్రతిపాదించాయి? అంత మొత్తం ఎందుకు అవసరం అన్న అంశాలపై చర్చిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆ శాఖలకు కేటాయించిన బడ్జెట్‌లో ఎంత ఖర్చు చేశారు? ఈ ఆర్థిక సంవత్సరం మార్చి నెలాఖరునాటికి ఎంత ఖర్చు చేయనున్నారన్న అంశాలను ఆర్థికశాఖ పరిగణనలోకి తీసుకుంటోంది. అదే సమయంలో ప్రభుత్వ ప్రాధాన్యాలు, ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు. .పథకాల అమలును పరిశీలనలోకి తీసుకుంటున్నారు.

◆ హోం శాఖకు అవసరమైన నిధుల కేటాయింపులపై ఆ శాఖ మంత్రి వంగలపూడి అనిత, కార్యదర్శి విజయ్‌కుమార్, అడిషనల్ డీజీ మధుసూదన్ ఐజీ రవిప్రకాష్ తదితరులతో పయ్యావుల కేశవ్ సమావేశమయ్యారు. పోలీసుశాఖలో మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరికరాల వినియోగం, సిబ్బంది అవసరాలు తదితర అంశాలను హోంమంత్రి వివరించారు.

వ్యవసాయశాఖ బడ్జెట్‌పై ..

వ్యవసాయశాఖ బడ్జెట్‌కు సంబంధించిన అంశాలపై వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అధికారులతో ఆర్థికమంత్రి కేశవ్ సమీక్షించారు. రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయ ఉత్పాదకత వృద్ధి, ఆధునిక సాంకేతికత అమలు, పశు సంవర్ధక రంగ విస్తరణ వంటి అంశాలకు బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలని అచ్చెన్నాయుడు ఈ సందర్భంగా కోరారు. వ్యవసాయ అనుబంధశాఖలకు ముఖ్యమైన కార్యాలయ భవనాలు, మౌలిక వసతుల కల్పన, ప్రతిపాదిత ప్రాజెక్టుల అమలుకు అదనపు నిధులు అవసరమని వివరించారు.

పంప్డ్ విద్యుత్తు ప్రాజెక్టులో అవుకు రిజర్వాయర్‌కు అనుమతి

ఈనాడు, అమరావతి: అవుకు పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టు కోసం ప్రస్తుతం ఉన్న ఆ జలాశయాన్ని దిగువ రిజర్వాయర్‌గా వినియోగించుకునేందుకు జలవనరుల శాఖ అనుమతిచ్చింది. కొన్ని నిబంధనల మేరకు వాడుకునేందుకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులిచ్చారు. జలవనరుల శాఖకు ఎంఎస్ న్యూ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు, మేనేజింగ్ డైరెక్టర్ లేఖ రాయడంతో సదరు ప్రతిపాదనను పరిశీలించారు. పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టు కోసం దిగువన కొత్తగా జలాశయం నిర్మించాలంటే రూ.1,405 కోట్ల ఖర్చవుతుందని, అందువల్ల ప్రస్తుతం జలవనరుల శాఖ ఆధ్వర్యంలో ఉన్న అవుకు రిజర్వాయర్‌ను వినియోగించుకునేందుకు అనుమతి కోరారు. ఈ రిజర్వాయర్ మొత్తం నిల్వను మరో 0.532 టీఎంసీల మేర కార్పొరేషన్ తమ సొంత ఖర్చులతో పెంచుకోవాలి. ఇలా చేస్తే ప్రస్తుతం ఉన్న నీటి అవసరాలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

నిబంధనలు ఇవీ..

◆ రిజర్వాయర్ మట్టికట్ట దెబ్బతినకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో జలవనరుల శాఖ ఆకృతుల విభాగం చీఫ్ ఇంజినీరు సూచనలు పాటించాలి ◆ పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టు నిర్వహిస్తున్న సమయంలో రిజర్వాయర్ లీకేజీలు, ఇతర సమస్యలు, గేట్లను వారే పర్యవేక్షిస్తూ అవసరమైతే వెంటనే వాటిపై దృష్టి సారించి పరిష్కరించాలి. ◆ ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ జలవనరుల శాఖకు నివేదిక సమర్పించాలి ◆ ఈ రిజర్వాయర్ కింద ఉన్న సాగు, తాగునీటి అవసరాలే తొలి ప్రాధాన్యం ◆ ఆకస్మిక వరదలు, ఎక్కువ ప్రవాహాలు వచ్చే సమయంలో జలవనరుల శాఖ అధికారులతో ప్రాజెక్టు అధికారులు సమన్వయం చేసుకోవాలి.

అక్రమ కేసులు, ఘర్షణలతో ప్రజాసమస్యలను పక్కదారి పట్టిస్తున్నారు

- వామపక్షాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అక్రమ కేసులు, ఘర్షణలతో ప్రజాసమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని వామపక్ష పార్టీల నాయకులు విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, గుజ్జుల ఈశ్వరయ్య, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ప్రసాద్, రామకృష్ణ, టి.హరినాథ్ (సీపీఐఎంఎల్ లిబరేషన్), జానకిరాములు(ఆర్ఎస్‌పీ), సుందరరామరాజు(ఫార్వర్డ్‌బ్లాక్), ఖాదర్‌బాషా, చంద్రశేఖర్ (ఎంసీపీఐయూ), అమర్‌నాథ్(ఎస్‌యూసీఐసీ), సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మోహన్‌బాబు విశ్వవిద్యాలయం విద్యార్థి నేతల కిడ్నాప్, ఉద్యమకారులపై అక్రమ కేసులు, ఫిబ్రవరి 12న చేపట్టనున్న సమ్మె అంశాలపై చర్చించారు. అనంతరం శ్రీనివాసరావు, ఈశ్వరయ్య మాట్లాడుతూ.. "రాష్ట్రంలో తెదేపా, వైకాపా నాయకులు తిట్టుకుంటూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారు. అసలు రాష్ట్రంలో చట్టబద్ధపాలన జరుగుతోందా అనే అనుమానం వస్తోంది. దోచుకుంటూ కార్పొరేట్లకు భూములు కట్టబెడుతూ ప్రశ్నించిన వారిని జైళ్లల్లో వేస్తున్నారు. మోహన్‌బాబు వర్సిటీలో బౌన్సర్లను పెట్టి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను బెదిరించడం చట్టవిరుద్ధం. వర్సిటీని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. మోహన్‌బాబు, ఆయన కుమారుడు విష్ణును అరెస్టు చేయాలి. అనకాపల్లిలో రైతు సంఘం నాయకుడు అప్పలరాజును పీడీ యాక్టు కింద అరెస్టు చేసి, ములాఖత్‌కూ అనుమతి ఇవ్వడం లేదు. దేశంపై 50% పన్నులు విధించిన ట్రంప్ 18శాతానికి తగ్గిస్తే ఆనందపడుతున్నారు. అదే దిగుమతులకు అసలు పన్నులే ఎత్తేశారు" అని విమర్శించారు.

దళితులకు దక్కాల్సిన భూమిని ఆక్రమించిన పెద్దిరెడ్డి బంధువులు

తెదేపా కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: దళితులకు దక్కాల్సిన మూడెకరాల భూమిని అధికారుల సహకారంతో వైకాపా నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బంధువులు ఆక్రమించి అందులో వ్యాపార సముదాయాలు నిర్మించారని చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం రెడ్డివారిపల్లెకు చెందిన వెంకటరమణ వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. బాధితుల నుంచి రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ ఎస్.రాజశేఖర్ ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. స్థల వివాదంలో తన కుటుంబ సభ్యులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా దుర్గికి చెందిన సుబ్బారావు ఫిర్యాదు చేశారు. నకిలీ పత్రాలతో తన భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని గోవర్ధన్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు.

రాజీవ్ రతన్ దంపతులకు రాహుల్‌గాంధీ శుభాకాంక్షలు

ఈనాడు-అమరావతి: రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పి.రాజీవ్ రతన్, మీనా దంపతులకు ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల వివాహమైన కొత్త దంపతులిద్దరూ రాహుల్‌ని బుధవారం దిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా వ్యక్తిగత విషయాలతోపాటు ఏపీలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పరిణామాలపై రాహుల్ చర్చించారని రాజీవ్ రతన్ తెలిపారు. ప్రజా సమస్యలు, పార్టీ పరిస్థితులపైనా ప్రత్యేకంగా మాట్లాడారని వివరించారు.



పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

పాల కల్తీ గురించి ప్రభుత్వానికి తెలుసా?

లోక్‌సభలో వైకాపా ఎంపీ ప్రశ్న

ఈనాడు, దిల్లీ: 'దేశవ్యాప్తంగా సేకరించిన పాల నమూనాల్లో 68-70% వరకు భద్రతా ప్రమాణాలను అనుగుణంగా లేవని, కొన్ని రాష్ట్రాల్లో ఇది 100 శాతంగా ఉందంటూ ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్వేల్లో తేలిన ఫలితాల గురించి ప్రభుత్వానికి తెలుసా?' అని వైకాపా ఎంపీ మద్దిల గురుమూర్తి బుధవారం లోక్‌సభలో ప్రశ్న వేశారు. ఒకవేళ తెలిసి ఉంటే దాని వివరాలేంటని అడిగారు. ఇందుకు కేంద్ర ప్రజాపంపిణీ వ్యవహారాలశాఖ సహాయమంత్రి బీఎల్ వర్మ సమాధానమిస్తూ 98% నమూనాలు సురక్షితంగా ఉన్నట్లు చెప్పారు. "పాలతోపాటు, కల్తీకి అవకాశం ఉన్న వస్తువులపై ఎఫ్ఎస్ఎస్ఏఐ ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతుంది. 2023లో మొత్తం 36 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 756 జిల్లాల నుంచి 10,216 నమూనాలు సేకరించింది. ఇందులో 4,878 నమూనాలు సంఘటిత రంగానికి సంబంధించినవి (ప్యాక్డ్ నమూనాలు), 5,248 నమూనాలు అసంఘటిత రంగానికి సంబంధించినవి (విడిపాల నమూనాలు). ఈ సర్వేలో 98% నమూనాలు మనుషులు ఉపయోగించడానికి వీలుగా సురక్షితంగా ఉన్నట్లు తేలింది. 421 నమూనాలు గంజి, సోడియం క్లోరైడ్, ఫారిన్ ఫ్యాట్, సుక్రోస్‌తో కల్తీ అయినట్లు తేలింది" అని కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు.

తెలుగు సహా అన్ని భాషల్లో సంసద్ టీవీ ప్రసారాలు

ఈనాడు, దిల్లీ: పార్లమెంటు సమావేశాలను అన్ని భాషల్లోని వారి దగ్గరకు తీసుకెళ్లడానికి లోక్‌సభ సచివాలయం సంసద్ టీవీ ప్రసారాలను తెలుగుతోసహా అన్ని ప్రాంతీయ భాషల్లోకి తీసుకొచ్చింది. పార్లమెంటు ఉభయ సభల్లో సభ్యులు చేసే ప్రసంగాలను ఈ టీవీ ప్రసారాల ద్వారా ఆయా ప్రాంతీయ భాషల్లోకి ఏకకాలంలో అనువాదం చేస్తారు. సభల్లో సభ్యులు చేసే ప్రసంగాలు అన్ని ప్రాంతీయ భాషల్లో వినిపించనుంది. దీనివల్ల ప్రజలు తమ మాతృభాషల్లో పార్లమెంటు ప్రసారాలను వినడానికి అవకాశం ఉంది. ప్రస్తుతం సభలో రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్లో పొందుపరిచిన 22 భారతీయ భాషల్లో దేంట్లోనైనా సభ్యులు మాట్లాడేందుకు వీలు కల్పించారు. వారు మాట్లాడేటప్పుడు మిగతా సభ్యులకు అర్థమయ్యేలా ఆ ప్రసంగాలను హిందీ, ఇంగ్లిష్‌లోకి అనువదిస్తూ వస్తున్నారు. ఇప్పుడు ఆ అనువాదాన్ని ప్రాంతీయ భాషలకూ విస్తరించారు. సంసద్ టీవీని యూట్యూబ్ లింక్ ద్వారా చూసుకోవచ్చని లోక్‌సభ సచివాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఆక్రమణలో ఉన్న భూములు, క్వార్టర్లు ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకోండి

శ్రీశైలం ప్రాజెక్ట్ విషయంలో రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శికి హైకోర్టు ఆదేశం



ఈనాడు, అమరావతి: నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాజెక్ట్‌కు సంబంధించి ఆక్రమణలో ఉన్న భూముల, క్వార్టర్లను ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. నిబద్ధత కలిగిన అధికారిని రెండు వారాల్లో నియమించాలని, ఆక్రమణల తొలగింపు విషయంలో సహజ న్యాయసూత్రాలను పాటించి, ఆక్రమణదారులకు నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని స్పష్టం చేసింది. ఖాళీ చేయించేందుకు తీసుకున్న చర్యల వివరాలను కోర్టు ముందు ఉంచాలంటూ విచారణను మార్చి 18కి వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌ల ధర్మాసనం బుధవారం ఈమేరకు ఉత్తర్వులిచ్చింది. నంద్యాల జిల్లా సున్నిపెంట గ్రామం శ్రీశైలం ప్రాజెక్ట్‌కు సంబంధించి జలవనరుల శాఖ పరిధిలోని భూములు ఆక్రమణలో ఉన్నాయని, పలు క్వార్టర్లను సైతం అనధికారికంగా వినియోగిస్తున్నారని పేర్కొంటూ న్యాయవాది డి.కాశీరావు హైకోర్టులో పిల్ వేశారు. ప్రాజెక్ట్ నిర్మాణం కోసం పనిచేసే కార్మికుల కోసం క్వార్టర్లు నిర్మించారని, దశాబ్దాలు గడుస్తున్నా వాటిని ఖాళీ చేయడం లేదన్నారు. 121 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయన్నారు. ఖాళీ చేయించడానికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు.

బీసీ జనాభా లెక్కల కోసం పిల్

కౌంటర్ వేయాలని ప్రభుత్వానికి కోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: బీసీ జనగణన జరిపిన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటూ దాఖలైన పిల్‌పై బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. కౌంటర్ వేయాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌ల ధర్మాసనం బుధవారం ఈమేరకు ఉత్తర్వులిచ్చింది. బీసీ జనగణన, వర్గీకరణ చేపట్టకుండా రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించబోతున్నారని, ముందుకెళ్లకుండా ప్రభుత్వాన్ని నిలువరించాలని కోరుతూ ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు హైకోర్టులో పిల్ వేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. బీసీ జనగణన చేపట్టాలని హైకోర్టు తీర్పులు ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బీసీల జనాభా లెక్కింపు జరగని కారణంగా వారి సంఖ్యకు అనుగుణంగా స్థానిక ఎన్నికల్లో సీట్లు కేటాయించడం లేదన్నారు.

న్యాయవాదుల సంఘాల కార్యవర్గం ఎన్నికల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించండి

- హైకోర్టులో పిల్ దాఖలు
- ప్రతివాదులకు నోటీసులు జారీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని అన్ని జిల్లా న్యాయవాదుల సంఘాల కార్యవర్గం ఎన్నికల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించేలా ఆదేశాలు జారీ చేయాలంటూ దాఖలైన పిల్‌పై హైకోర్టు స్పందించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలుచేయాలని ఏపీ బార్ కౌన్సిల్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను ఏప్రిల్ 1కి వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌ల ధర్మాసనం బుధవారం ఈమేరకు ఉత్తర్వులిచ్చింది.

◆ జిల్లాల్లోని అన్ని న్యాయవాదుల సంఘాల కార్యవర్గ ఎన్నికల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించేలా ఆదేశాలు జారీచేయాలని హైకోర్టు న్యాయవాది తోట సునీత వ్యాజ్యం దాఖలు చేశారు. బుధవారం జరిగిన విచారణలో ఆమె నేరుగా వాదనలు వినిపించారు.

అంతర రాష్ట్ర బదిలీలకు వివరాలు సేకరణ

ఈనాడు, అమరావతి: అంతర రాష్ట్ర బదిలీల్లో భాగంగా గతంలో తెలంగాణ రాష్ట్రానికి వెళ్లేందుకు సమ్మతి ఇచ్చిన ఉద్యోగుల నుంచి పాఠశాల విద్యాశాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. విద్యా శాఖలో పని చేస్తున్న 229మంది అంతర రాష్ట్ర బదిలీలకు ఐచ్ఛికాలు ఇచ్చారు. వీరిలో సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లు, ఎంఈవోలు, సహాయ సంచాలకులు ఉన్నారు. స్పౌజ్, వ్యక్తిగత, మెడికల్, లోకల్ కేటగిరీల కింద బదిలీల్లో వెళ్లేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియలో కొంత జాప్యం జరిగినందున కొంతమంది ఉద్యోగులు పదవీ విరమణ చేయడం, పదోన్నతి పొందడం, తెలంగాణకు వెళ్లేందుకు ఇష్టపడకపోవడంలాంటి కారణాలు ఉన్నందున మొదటి జాబితాను నవీకరించేందుకు పాఠశాల విద్యాశాఖ వివరాలు సేకరిస్తోంది. వివరాలను తక్షణమే పంపించాలని సూచించింది. ప్రత్యేక ఫార్మెట్లు ఇచ్చింది. వివరాల సేకరణ అనంతరం తుది జాబితాను రెండు, మూడు రోజుల్లో తెలంగాణకు రాష్ట్ర ప్రభుత్వం పంపించనుంది. ఇప్పుడు కొత్తగా ఎవ్వరినీ అనుమతించరాదని జిల్లా స్థాయి అధికారులకు సూచించింది. కొత్త వారికి సైతం అవకాశం కల్పించాలని ఏపీటీఎఫ్ అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ కోరారు.

అక్రమాలను ఎండగట్టి.. దిద్దుబాటుకు సిట్ సిఫార్సు

- ఈ-రివర్స్ టెండరింగ్ వ్యవస్థను రద్దు చేయాలి
- కొనుగోళ్లకు ప్రత్యేక మాన్యువల్ రూపొందించాలి
- నెయ్యి సేకరణ వ్యవస్థపై ప్రభుత్వానికి పలు సిఫార్సులు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించే నెయ్యి కొనుగోళ్లలో జరిగిన అక్రమాలు, అవకతవకలను సిట్ ఎండగట్టింది. ప్రభుత్వానికి రాసిన లేఖలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలను వెల్లడించింది. లోపాలు సరిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించింది. సిట్ చేసిన సూచనలివి..

వ్యవస్థాగత లోపాలు..

◆ ఆవు నెయ్యి సేకరణలో మూల ధర (బేస్ ప్రైస్) నిర్ధారించకుండా ఈ-రివర్స్ ఆక్షన్ టెండరింగ్ ప్రక్రియ వల్ల తక్కువ రేట్లకు కోట్ చేశారు. ఈ ధరలే కల్తీ నెయ్యి సరఫరాకు దారితీశాయి.

◆ నెయ్యి టెండర్ల నిబంధనలను చాలాసార్లు సవరించారు. 2019 ఆగస్టు వరకు నిబంధనలు కఠినంగా ఉండగా.. 2020 ఫిబ్రవరిలో మార్చారు. పాల కొనుగోలు నిబంధనను తొలగించారు. దీంతో ఈ కేసులో నిందితులైన భోలేబాబా ఓరోగానిక్ డెయిరీ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీవైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్, మాల్‌గంగా తదితర ప్రైవేటు డెయిరీలకు టెండర్లు దక్కాయి. వీటి ధరలతో సహకార డెయిరీలైన కేఎంఎఫ్, సేలం, మదురై, విశాఖ లాంటివి పోటీ పడలేకపోయాయి.

◆ డెయిరీలు టెండర్ నిబంధనల కోసం తప్పుడు, కల్పిత డాక్యుమెంట్లు సమర్పించి, అర్హత సాధించాయి. వాటి వాస్తవికతను ధ్రువీకరించాలని పేర్కొన్నా కొనుగోలు విభాగం పట్టించుకోలేదు.

◆ తితిదేలోని డెయిరీ/నెయ్యి నిపుణులను సిఫార్సుల ఆధారంగా అడ్‌హాక్ పద్ధతిలో నియమించారు. వీరు సరఫరాదారులతో కుమ్మక్కై తప్పుడు నివేదికలు ఇవ్వడంతో అర్హత లేని డెయిరీలు టెండర్లు పొందాయి.

◆ సాంకేతిక మదింపు కమిటీలో ఉన్నవారే ప్లాంట్ల తనిఖీ కమిటీలోనూ సభ్యులు.

◆ ఏఆర్ డెయిరీ ద్వారా తితిదేకు పంపిన నెయ్యి ట్యాంకర్లు.. తొలుత ఏపీలో శ్రీవైష్ణవి డెయిరీ నుంచి బయలుదేరి అక్కడినుంచి తమిళనాడు దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీ మీదుగా తితిదేకు వెళ్లినట్లు తేలింది. మాల్‌గంగా డెయిరీ ద్వారా సరఫరా చేసిన నెయ్యి ట్యాంకర్లను ఉత్తరాఖండ్‌లో భోలేబాబా డెయిరీ నుంచి మహారాష్ట్రలోని మాల్‌గంగా డెయిరీ మీదుగా తితిదేకు పంపారు.

◆ నెయ్యి కల్తీని గుర్తించేందుకు తితిదేలోని ప్రయోగశాలలో చాలా పరిమిత పరీక్షా సదుపాయాలున్నాయి. బీటా సిటోస్టెరాల్, ఫ్యాటీ యాసిడ్ ప్రొఫైల్ లాంటి కల్తీలను గుర్తించేందుకు అవసరమైన సామగ్రి లేదు.

◆ నెయ్యి ట్యాంకర్ నంబర్లనే నమూనా కోడ్‌లుగా ఉపయోగించి, నమూనాలను అంతర్గత, బయటి ప్రయోగశాలలకు పంపుతున్నారు.

◆ తితిదే ల్యాబ్, బయట ప్రయోగశాల తిరస్కరించిన నెయ్యి ట్యాంకర్లు తితిదేకు తిరిగి చేరాయి. ఇవి ఇలా తిరిగిరాకుండా పర్యవేక్షించే వ్యవస్థ లేదు.

◆ తితిదేకు నెయ్యి, లడ్డూ ప్రసాదాల నాణ్యతపై అనేక ఫిర్యాదులు అందినా, వాటిని సకాలంలో సమర్థంగా పరిష్కరించలేదు.

దిద్దుబాటు చర్యలకు సూచనలు..

◆ ఆవు నెయ్యి సేకరణకు బెంచ్‌మార్క్ ప్రైసింగ్, కఠిన నాణ్యతాప్రమాణాలు నిర్ధారించే పద్ధతులను అమలుచేయాలి.

◆ నెయ్యి టెండర్ షరతులను నిపుణుల అధ్యయనం ఆధారంగా సవరించాలి.

◆ టెండర్ డాక్యుమెంట్లు నిజమైనవేనని నిర్ధారించే విధానం రూపొందించాలి.

◆ డెయిరీ/నెయ్యి నిపుణుల ఎంపిక, వారి విధులు, బాధ్యతలను పేర్కొంటూ మార్గదర్శకాలు రూపొందించాలి.

◆ పారదర్శకతను పెంచేందుకు సాంకేతిక మదింపు కమిటీ, ప్లాంట్ల తనిఖీ కమిటీల సభ్యులు వేర్వేరుగా ఉండేలా చూడాలి. తుది ఒప్పందం కంటే ముందే విజిలెన్స్ నివేదిక పొంది, డెయిరీల కార్యకలాపాలు, వాటి పరపతి, పూర్వ చరిత్రను క్రాస్‌చెక్ చేయాలి.

◆ సాంకేతిక మదింపు, ప్లాంట్ తనిఖీలకు వర్తించేలా సమగ్ర ఫార్మాట్లను నిర్దేశించాలి. వీటిని రూపొందించేటప్పుడు ఎఫ్ఎస్ఎస్ఏఐ మార్గదర్శకాల వంటివాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. దీంతో నాణ్యతకు భరోసా లభిస్తుంది.

◆ నెయ్యి ట్యాంకర్ల కదలికను మూలస్థానం నుంచి తితిదే వరకు పర్యవేక్షించేందుకు ట్రాకింగ్ ఉండాలి.

◆ ఆధునిక పరికరాలు, అర్హత గల సిబ్బందితో ప్రయోగశాలను ఉన్నతీకరించాలి.

◆ నమూనాల సమగ్రత, గోప్యతను కాపాడేందుకు లోపరహితమైన శాంపిల్ కోడింగ్ వ్యవస్థను రూపొందించాలి.

◆ నెయ్యి ట్యాంకర్లను తిరస్కరించగానే ఆహార భద్రత అధికారులకు సమాచారం ఇవ్వాలి. క్రిమినల్ ఫిర్యాదు నమోదుచేయాలి.

◆ నెయ్యి నాణ్యతపై పోటు కార్మికులతో పరస్పర సంప్రదింపుల వ్యవస్థను ఏర్పాటుచేయాలి. నెయ్యి కొనుగోలు, నిల్వ, ప్రసాదాల తయారీ సిబ్బంది అందరికీ ఆహార భద్రత ప్రమాణాలు, కల్తీ గుర్తింపుపై తప్పనిసరిగా శిక్షణ ఇవ్వాలి.

◆ ఫిర్యాదులపై బాధ్యత నిర్ధారణతో పాటు దిద్దుబాటు చర్యలు తీసుకోవడానికి పారదర్శక, సమర్థ ఫిర్యాదు పరిష్కార వ్యవస్థను ఏర్పాటుచేయాలి.

◆ నెయ్యి, ఇతర ఉత్పత్తులకు థర్డ్‌పార్టీ నాణ్యత సర్టిఫికేషన్లు తప్పనిసరి చేయాలి. మోసపూరిత చర్యలను ప్రారంభదశలోనే గుర్తించేందుకు తితిదేలోని విజిలెన్స్ పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి.

◆ గిడ్డంగుల్లో నెయ్యి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. నాణ్యతను కాపాడేందుకు ఆధునిక నిల్వ సదుపాయాలుండాలి.

పరిపాలన పరంగా మార్పులు

◆ తితిదే ఏటా రూ.500 కోట్ల విలువైన సరుకులు కొంటోంది. ఇందులో నెయ్యి సేకరణకు రూ.250 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇందులోని అన్ని భాగస్వామ్యపక్షాల పాత్ర, బాధ్యతలు తెలియజేస్తూ.. ప్రత్యేక కొనుగోళ్ల మాన్యువల్ రూపొందించాలి.

◆ తితిదేలో ఈ-నోట్ ప్రొపోజల్స్ జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ సిద్ధం చేస్తుండగా, ఇవి తగిన సమీక్ష లేకుండా ప్రాసెస్ అవుతున్నాయి. ఫైల్ ఆరంభం నుంచి తుది ఆమోదం లభించే వరకు ప్రతి స్థాయిలో ఎవరి బాధ్యతలేంటో పేర్కొని, పారదర్శకత ఉండేలా విధానాలు సంస్కరించాలి.

◆ కొనుగోళ్ల విభాగంలో సిబ్బంది తక్కువగా ఉన్నారు. సిబ్బందిని పెంచాలి.

◆ కొనుగోళ్ల విభాగం జనరల్ మేనేజర్ పోస్టు తితిదే ఇంజినీరింగ్ విభాగం నుంచి భర్తీచేస్తున్నారు. నైపుణ్యం ఉన్నవారిని డిప్యుటేషన్‌పై తీసుకొని జీఎంగా నియమించాలి.

◆ తితిదేలో గుర్తింపు పొందిన ఆహార భద్రతాధికారి లేరు. కొనుగోళ్లలో సహాయం చేసేందుకు, ప్లాంట్ తనిఖీలు, సరుకు నమూనాల సేకరణకు డిప్యుటేషన్‌పై ఆహార భద్రతాధికారిని తీసుకోవాలి.

◆ ప్రస్తుతమున్న ఫైనాన్స్ అడ్వైజర్, చీఫ్ అకౌంట్స్ అధికారి (ఎఫ్ఏ-సీఏఓ).. తితిదేలో విధుల్లో చేరినప్పటి నుంచి పదోన్నతులు పొందారు. ఆ కేడర్‌కు సమానమైనవాళ్లు లేరు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో అనుభవం ఉన్నవారిని డిప్యుటేషన్‌పై తీసుకొని ఎఫ్‌ఏ-సీఏవో పోస్టు భర్తీచేయాలి.

గురుకులాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

ఈనాడు, అమరావతి: పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి డా. బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా సిబ్బంది కృషి చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరంలో గురుకులాల్లో 100 శాతం ప్రవేశాలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. తాడేపల్లిలోని గురుకుల విద్యా సంస్థ కార్యాలయం నుంచి డీసీవోలు, ప్రిన్సిపాళ్లతో మంత్రి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పది, ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెరిగితే డీసీవోలు, ప్రిన్సిపాళ్లను సన్మానిస్తామని, తగ్గితే మెమోలు జారీ చేస్తామని స్పష్టం చేశారు. 'గురుకులాల్లో ప్రవేశాలపై విస్తృత ప్రచారం కల్పించాలి. ప్రభుత్వ కార్యాలయాలు, స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి. ప్రవేశాల పెంపునకు ఆయా జిల్లాల కలెక్టర్లు, స్థానిక ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాలి' అని సూచించారు.

ఆయిల్‌పామ్ ఓఈఆర్ 20.01%

ఈనాడు, అమరావతి: ఆయిల్‌పామ్ గెలలకు 2025 నవంబరు నుంచి 2026 అక్టోబరు వరకు 20.01% ఓఈఆర్ (ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో), నట్స్ రికవరీ 10.08% చొప్పున నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీని ప్రకారం టన్నుకు 2025 నవంబరులో రూ.19,598, డిసెంబరులో రూ.19,699, ఈ ఏడాది జనవరిలో రూ.20,680 చొప్పున రైతులకు లభిస్తుందని ఉద్యానశాఖ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. తెలంగాణలో జనవరి ధర టన్నుకు రూ.20,456 ఉందని వివరించారు. ఓఈఆర్ ప్రకటించడంపై సీఎం చంద్రబాబుకు ఆయిల్‌పామ్ రైతుల సంఘం అధ్యక్షుడు బొబ్బా వీరరాఘవరావు కృతజ్ఞతలు తెలిపారు.

జగన్ పాలనలోనే జంగిల్‌రాజ్

తెదేపా నాయకులు

ఈనాడు, అమరావతి: జగన్ పాలనలోనే రాష్ట్రంలో జంగిల్‌రాజ్ నడిచిందని, విపక్ష నేతలపై దాడులు పరాకాష్ఠకు చేరాయని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ధ్వజమెత్తారు. సభ్యత, సంస్కారం లేకుండా సీఎం చంద్రబాబును అసభ్య పదజాలంతో దూషించిన అంబటి రాంబాబుకు 'సౌమ్యుడు, మంచివాడు' అని జగన్ సర్టిఫికెట్ ఇవ్వడాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. అరాచక శక్తులకు మద్దతుగా నిలవడం జగన్‌కు కొత్త కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సీడాప్ ఛైర్మన్ దీపక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబులతో కలిసి ఆయన మాట్లాడారు. "బాధితుల్ని పరామర్శించనివ్వకుండా చంద్రబాబు ఇంటి గేట్లకు తాళ్లు కట్టించిన చరిత్ర జగన్‌ది. విశాఖ, తిరుపతి విమానాశ్రయాల్లో ఆయనను అడుగు పెట్టనివ్వలేదు. శస్త్రచికిత్స చేయించుకున్న మరుసటి రోజే అచ్చెన్నాయుణ్ని అరెస్టు చేసి 14 గంటలు డొక్కు జీపులో తిప్పారు. కొల్లు రవీంద్ర, ధూళిపాళ్ల నరేంద్ర, దేవినేని ఉమామహేశ్వరరావు.. ఇలా ఎందరో తెదేపా నాయకుల మీద తప్పుడు కేసులు పెట్టించారు. వైకాపా ప్రభుత్వంలో మేం 18 సార్లు డీజీపీ అపాయింట్‌మెంట్ అడిగాం. కనీసం ఆయన ముఖం కూడా చూపించలేదు" అని వర్ల రామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. దీపక్‌రెడ్డి, అశోక్‌బాబు.. జగన్‌పై విమర్శలు గుప్పించారు.

సీసీ కెమెరాలున్నా మాస్ కాపీయింగ్

- తెలంగాణ ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల్లో అక్రమాలు

ఈనాడు, హైదరాబాద్: ఇంటర్‌మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా.. మాస్ కాపీయింగ్ కొనసాగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 2 నుంచి 1440 కేంద్రాల్లో రోజూ రెండు విడతలుగా ప్రాక్టికల్స్ జరుగుతుండగా... ఈ మూడు రోజుల్లో 20 కళాశాలల్లో మాస్ కాపీయింగ్ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఆ ల్యాబ్‌లకు ఎగ్జామినర్లుగా వెళ్లిన వారిని విధుల నుంచి తొలగించారు. ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాల్లో 900 వరకు ప్రైవేట్ కళాశాలల్లోనే ఉన్నాయి. అన్నిచోట్లా 6 నుంచి 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి... ఇంటర్ బోర్డు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించారు. పరిశీలనకు 70 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్ గుర్తించిన కళాశాలల్లో విద్యార్థులు పరస్పరం మాట్లాడుకుంటూ... గుంపులుగా చేరి ప్రయోగాలు చేస్తున్నా.. ఎగ్జామినర్లు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఇన్విజిలేటర్లు ల్యాబ్‌ల నుంచి బయటకు వచ్చి ఫోన్లు చూసుకోవడం, ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు నటించడం లాంటివి చేస్తున్నారు. ఒకవేళ కాపీయింగ్‌ను గుర్తించినా ముఖ్యమైన కాల్ ఉందని బయటకు వచ్చానని వివరణ ఇచ్చుకోవడానికి అలా చేస్తున్నట్లు సమాచారం. ఈ ఇన్విజిలేటర్లను ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వార్షిక పరీక్షలతో పాటు జవాబుపత్రాల మూల్యాంకనం విధుల్లోకి తీసుకోవడం లేదని బోర్డు అధికారి ఒకరు స్పష్టంచేశారు.

పర్యాటక రంగానికి బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించాలి

మంత్రి కందుల దుర్గేష్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పర్యాటక రంగానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్, మార్కెటింగ్ కల్పించడంతో పాటు వివిధ పర్యాటక ఉత్సవాల నిర్వహణకు 2026-27 బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించాలని ఆ శాఖ మంత్రి కందుల దుర్గేష్ కోరారు. పర్యాటక రంగం అభివృద్ధిపై ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో దుర్గేష్ బుధవారం సమావేశమయ్యారు.

ఎంఎస్ఎంఈ పార్కులకు రూ.90 కోట్లు

ఈనాడు, అమరావతి: అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధికి రూ.90 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ ఐఐసీ వీసీఎండీని ప్రభుత్వం ఆదేశించింది.

సెకండరీ హెల్త్ కార్యదర్శిగా శేఖర్

ఈనాడు, అమరావతి: సెకండరీ హెల్త్ సంచాలకుల కార్యాలయ కార్యదర్శిగా ఎస్.కె.శేఖర్ నియమితులయ్యారు. సెలక్షన్ కమిటీ సిఫార్సును పరిశీలించిన ప్రభుత్వం జాయింట్ సెక్రటరీగా ఉన్న శేఖర్‌కు పదోన్నతి కల్పించింది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఘనంగా వన దేవతల తిరుగువారం జాతర



న్యూస్‌టుడే, మేడారం (తాడ్వాయి): సమ్మక్క-సారలమ్మ మహాజాతర ముగింపు పూజలు బుధవారం ఘనంగా జరిగాయి. తాడ్వాయి మండలం మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయాల్లో శుద్ధి కార్యక్రమాలు నిర్వహించి, దేవతలకు దూపదీప నైవేద్యాలు సమర్పించి జాతర పూజలను ముగించారు. ముగింపును పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

దురలవాటుగా మారుతున్న మితిమీరిన కొనుగోళ్లు

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- 'సంపద సృష్టికి శతకోటి మార్గాలు' పుస్తకావిష్కరణ



సంపద సృష్టికి శతకోటి మార్గాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు.. చిత్రంలో విజయ్‌కుమార్, తుమ్మల కిశోర్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: సంపదను సృష్టించే మేధస్సు మన దేశంలో ఉందని, అందుకే ప్రపంచం మొత్తం మనవైపు చూస్తోందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. బ్యాంకింగ్ రంగ నిపుణుడు, రచయిత తుమ్మల కిశోర్ రాసిన 'సంపద సృష్టికి శతకోటి మార్గాలు' పుస్తకాన్ని బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ప్రస్తుతం మితిమీరిన కొనుగోలు తత్వం ఒక దురలవాటుగా మారుతోందని హెచ్చరించారు. సంపద సృష్టికి, ఆదాయాన్ని పెంచుకునేందుకు మార్గాలు, పొదుపు-మదుపునకు అవకాశాలు, కేంద్ర ప్రభుత్వం, వివిధ బ్యాంకులు అందిస్తున్న అనేక పథకాల గురించి ఈ పుస్తకంలో వివరంగా ఉన్నాయన్నారు. ఈ పుస్తకాన్ని కిశోర్.. దివంగత రామోజీరావుకు అంకితం ఇవ్వడం ఎంతో సముచితమని అభినందించారు. ఎమెస్కో ప్రచురణల సంస్థ అధినేత విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆర్థిక విధానాల వంటి అంశాలపై పుస్తకాలు వస్తున్నా.. ప్రజలకు నేరుగా ఉపయోగపడే ఇలాంటి పుస్తకాలు రాసేవారు తక్కువ అని, అందులో తెలుగులో మరీ తక్కువని అన్నారు. రచయిత తుమ్మల కిశోర్ మాట్లాడుతూ పొదుపు, మదుపు విధానాల్లో ఈ 15, 20 ఏళ్లలో చాలా మార్పులు వచ్చాయన్నారు. మదుపు చేయడంలో తెలివిగా వ్యవహరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఈనాడు సంపాదకులు ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తెలుగునాట ఆర్థిక అక్షరాస్యతకు కృషి చేస్తున్న వారిలో తుమ్మల కిశోర్ అత్యంత ముఖ్యులన్నారు. "సమాజ ప్రగతికి పొదుపు, ఆర్థిక క్రమశిక్షణ ఎంతో ముఖ్యం. పిల్లలకు చిన్నప్పటి నుంచి సైన్స్ వంటి విషయాలు బోధిస్తాం కానీ జీవితంలో అత్యంత ముఖ్యమైన ఆర్థిక విషయాలు బోధించాలి" అని అన్నారు. తెలంగాణ ఈనాడు సంపాదకులు డి.ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ.. "మన సమాజంలో విద్యావంతుల్లో కూడా ఆశించిన స్థాయిలో ఆర్థిక అక్షరాస్యత లేదు. పొదుపు, మదుపు మీద అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగ జీవితం తొలినాళ్ల నుంచే పొదుపు, మదుపు అలవాటు చేసుకోవాలి. అప్పుడే జీవితం సాఫీగా గడుస్తుంది" అని అన్నారు. సీనియర్ పాత్రికేయుడు వల్లీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది రోజు 'గద్దర్' అవార్డుల ప్రదానం

సినీ పరిశ్రమకు కేంద్రంగా హైదరాబాద్ • అక్కినేని, సినారె పేరుతో ప్రత్యేక పురస్కారాలు • తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



గద్దర్ అవార్డుల జ్యూరీ సభ్యులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఈనాడు, హైదరాబాద్: ఈ ఏడాది ఉగాది పండగ రోజున గద్దర్ సినిమా అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడానికి తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ నెల 6 నుంచి గద్దర్ అవార్డుల కోసం స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అక్కినేని నాగేశ్వరరావు, డా.సి.నారాయణరెడ్డి పేర్లతో ప్రత్యేక అవార్డులు అందించనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన గద్దర్ అవార్డుల జ్యూరీ సభ్యుల సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ... "తెలుగు సినీ పరిశ్రమకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. దేశంలోని అన్ని భాషల సినిమాల చిత్రీకరణకు హైదరాబాద్ అనుకూలం. సినీ ప్రపంచ మార్కెట్‌కు నగరం కేంద్రంగా మారుతోంది. దీనికి సంబంధించిన బ్లూప్రింట్‌ను తయారు చేస్తున్నాం. ఇక్కడ చిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందితే టెక్నీషియన్లు, రైటర్లు, డైరెక్టర్లు, ఇతర విభాగాల్లో స్థానిక యువతకు ఉపాధి లభిస్తుంది. సినీ ప్రముఖులతో సంప్రదింపులు జరిపి ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా జ్యూరీ సభ్యులను ఎంపిక చేశాం. కమర్షియల్ అంశాలతోపాటు సామాజిక సందేశం ఉన్నవాటిని అవార్డుల ఎంపికకు పరిగణనలోకి తీసుకుంటే మంచి సినిమాలను ప్రోత్సహించినట్లు అవుతుంది" అని భట్టి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ ప్రియాంక, కిశోర్ బాబు, తనికెళ్ల భరణి, కేఎస్ రామారావు, రోజారమణి, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిద్రమత్తులో రసాయన ద్రావణం తాగిన వ్యక్తి

చికిత్స పొందుతూ మృతి

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే: నిద్రమత్తులో ఉన్న ఓ వ్యక్తి మంచినీళ్లు అనుకొని రసాయన ద్రావణం తాగి మృతిచెందిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా ఎల్లగిరి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. కైతాపురానికి చెందిన గుడ్డెటి రవి(43) ఎల్లగిరి శివారులోని కోళ్ల ఫారంలో పని చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి దాహం వేయడంతో నిద్రమత్తులో ఉన్న రవి.. మంచి నీళ్లు అనుకొని కోళ్ల షెడ్డు ఫ్లోర్‌ను శుభ్రం చేసే సర్మోలిన్ అనే రసాయన ద్రావణం ఉన్న సీసాను తీసుకొని తాగారు. కొద్దిసేపటి తర్వాత కడుపులో మంట వస్తుందని చెప్పడంతో అక్కడ పని చేసేవారు ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందారు.

రాష్ట్ర సచివాలయంలో ఆర్వో ప్లాంట్ నిర్మాణానికి రూ.1.50 కోట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సచివాలయాన్ని ప్లాస్టిక్‌రహితంగా మార్చేందుకుగాను ప్రభుత్వం నిధులు కేటాయించింది. 1000 ఎల్‌పీహెచ్ ఆర్వో ప్లాంట్ల నిర్మాణం, ఇతర పనుల కోసం నిధులు మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లకు బదులు పునర్వినియోగ గాజు సీసాలను వాడాలని నిర్దేశించింది. బాటిల్ స్టెరిలైజేషన్ యూనిట్లు, ఇతర మౌలిక సదుపాయాల కోసం ఈ నిధులు వినియోగించనున్నారు.

రూ.1.40 కోట్ల బిల్లుకు రూ.30 లక్షల లంచం

- అనిశా వలలో జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోన్ ఎస్ఈ చిన్నారెడ్డి
- రూ.15 లక్షలతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు



పట్టుబడిన నగదుతో కూకట్‌పల్లి జోన్ ఎస్ఈ చిన్నారెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ ప్రవీణ్‌కుమార్

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: పాత బిల్లుల విడుదలకు లంచం తీసుకుంటూ జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోన్ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ) పొద్దుటూరి చిన్నారెడ్డి అవినీతి నిరోధక శాఖ(అనిశా) అధికారులకు చిక్కాడు. బుధవారం తన కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ బాలసాని ప్రవీణ్‌కుమార్ ద్వారా రూ.15 లక్షలు తీసుకుంటుండగా... అనిశా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనిశా రంగారెడ్డి రేంజ్ ఏసీపీ ఆనంద్‌కుమార్ కథనం ప్రకారం... కూకట్‌పల్లి, మూసాపేట, అల్వాల్ సర్కిళ్ల పరిధిలోని చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించడంతోపాటు వాటి నిర్వహణ పనులు చేసినందుకు గతేడాదికి సంబంధించిన రూ.1.40 కోట్ల బిల్లు పెండింగులో ఉంది. నిధులు విడుదల చేయాలంటూ గుత్తేదారు ఎస్ఈని సంప్రదించగా...రూ.30 లక్షల లంచం రెండు విడతలుగా ఇచ్చేలా డిమాండ్ చేశారు. మొదటి విడత లంచం సొమ్ము రూ.15 లక్షలతో గుత్తేదారు బుధవారం మధ్యాహ్నం ఎస్ఈ కార్యాలయానికి వచ్చారు. ఎస్ఈ సూచన మేరకు కంప్యూటర్ ఆపరేటర్ ప్రవీణ్‌కుమార్ డబ్బులు తీసుకుంటుండగా అనిశా అధికారులు పట్టుకున్నారు. అనంతరం ఇద్దరినీ అదుపులోకి తీసుకుని..నాంపల్లి అనిశా కోర్టులో హాజరుపరిచినట్లు ఏసీపీ ఆనంద్ కుమార్ తెలిపారు.

✦ ఎస్ఈ కార్యాలయంతోపాటు పేట్‌బషీరాబాద్‌లోని చిన్నారెడ్డి నివాసంలోనూ రాత్రివరకు అనిశా తనిఖీలు నిర్వహించింది. ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే టోల్‌ఫ్రీ నంబరు 1064 లేదా వాట్సప్ నంబరు 9440446106కు సమాచారం ఇవ్వాలని సూచించింది.

ప్రభుత్వ సేవలకు..మనమిత్ర!

- వాట్సప్ గవర్నెన్స్‌కు మంచి స్పందన
- 50 లక్షలకు పెరిగిన యూజర్లు
- సెల్‌ఫోన్ ద్వారా ప్రభుత్వ సేవలు

ఈనాడు, అమరావతి: వివిధ ప్రభుత్వ విభాగాల ద్వారా సేవలు పొందేందుకు ప్రజలు పడుతున్న ఇబ్బందులకు 'మనమిత్ర' వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పరిష్కారం చూపినట్లు ప్రభుత్వం తెలిపింది. వివిధ శాఖల నుంచి ధ్రువీకరణలు.. పన్నుల చెల్లింపు..ఇతర సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా.. మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా సులువుగా పొందే వెసులుబాటు ఏర్పడిందని పేర్కొంది. దీంతో లక్షల మంది వారి సెల్‌ఫోన్ల నుంచే వాట్సప్ గవర్నెన్స్ ద్వారా సేవలు పొందుతున్నారని తెలిపింది. దీనికి ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోందని.. ప్రస్తుతం వినియోగించుకుంటున్న వారి సంఖ్య 50 లక్షలు దాటిందని వెల్లడించింది. వారికి అందిన సేవలు, చేసిన లావాదేవీలు 2.5 కోట్లకు పైగా ఉన్నాయని పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో వాట్సప్ గవర్నెన్స్‌ను ప్రభుత్వం ప్రారంభించిన విషయం తెలిసిందే.

సేవల కోసం.. 95523 00009

మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌరులు సేవలు పొందేందుకు ఫోన్‌లో 95523 00009 నంబరు సేవ్ చేసుకోవాలి. వాట్సప్ ద్వారా ఈ నంబరుకు 'హాయ్' అని మెసేజ్ పంపాలి. అందులో ప్రభుత్వం అందించే సేవలన్నీ కనిపిస్తాయి. అవసరమైన సేవలు తెలుసుకుని..వాటిని సులభంగా క్షణాల్లో పొందొచ్చు.

◆ ఏలూరుకు చెందిన కిశోర్.. బెంగళూరులో సీఏగా పనిచేస్తున్నారు. గతంలో ఆయన ఏలూరులోని తన ఆస్తి పన్నులు చెల్లించేందుకు పనులు మానుకుని ఒకట్రెండు రోజులు ఇక్కడికి రావాల్సి వచ్చేది. ఇప్పుడు బెంగళూరులో ఉండి తన మొబైల్ ఫోన్‌లోనే పన్నులు చెల్లిస్తున్నారు.

◆ పల్నాడు జిల్లా నాదెండ్లకు చెందిన సరళ.. హైదరాబాద్‌లో పనిచేస్తోంది. ఆమెకు ఇక్కడ ఉన్న ఆస్తికి పన్ను కట్టాలన్నా.. రెవెన్యూ సేవలు పొందాలన్నా పనులు మానుకుని నాదెండ్లకు రావాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు.

◆ అనకాపల్లి మండలం మామిడిపాలెంకు చెందిన సురేశ్ ఒక ప్రైవేటు కంపెనీలో మేనేజర్.. ఏదైనా ధ్రువీకరణ కావాలన్నా.. పన్ను చెల్లించాలన్నా సెలవు పెట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు తన పనులకు ఇబ్బంది లేకుండా సేవలు పొందుతున్నారు.

ఇంటి నుంచే.. 1,000 సేవలు!

వాట్సప్ గవర్నెన్స్ ద్వారా వివిధ శాఖలకు చెందిన సుమారు వెయ్యికి పైగా సేవలు అందించాలన్నది లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం 900కు పైగా సేవలు అందుతున్నాయి. ఆర్టీసీ బస్సులకు రిజర్వేషన్లు మొదలు.. ఆస్తిపన్ను, నీటి పన్ను, కరెంటు బిల్లుల చెల్లింపులు, పింఛన్, రిజిస్ట్రేషన్ సేవలు, తల్లికి వందనం, ఓబీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణలు, ప్రభుత్వం నిర్వహించే వివిధ ప్రవేశ పరీక్షల హాల్ టికెట్లు, పరీక్షల ఫలితాలూ వాట్సప్ గవర్నెన్స్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆయా సేవల కోసం ఫోన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

రెవెన్యూ సేవలూ సులభతరం

రెవెన్యూశాఖకు సంబంధించి 1-బీ అడంగల్ ప్రతిని ఇందులోనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీని ద్వారా ఈ-పట్టాదారు పాసుపుస్తకం పొందడంతో పాటు..తమ ఆస్తులకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు అందుతాయి. ఈ సేవలు పొందేందుకు గతంలో రెవెన్యూ అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది.


* తిరుమల సహా రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో ఆర్జిత సేవలు, దర్శనాల టికెట్ల బుకింగ్ కోసం వాట్సప్ గవర్నెన్స్ సేవలు వినియోగించుకోవచ్చు. ఆలయాలకు కానుకలు కూడా ఈ-హుండీ ద్వారా పంపవచ్చు.

తెలుగు.. వాయిస్ ద్వారా సేవలు పొందవచ్చు

మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ ఆంగ్లం, తెలుగు భాషల్లో పనిచేస్తుంది. వాట్సప్‌లో అక్షరాలు టైప్ చేయడం తెలియని వారు.. తమకు ఏం సేవలు అవసరమనేది వాయిస్ ద్వారా కూడా చెప్పవచ్చు.

అన్న చేతిలో మహిళా న్యాయవాది హత్య

- తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో ఘటన



మొయినాబాద్, న్యూస్‌టుడే: ఆస్తి వివాదం ఓ మహిళా న్యాయవాది ప్రాణాలను బలిగొంది. అందరూ చూస్తుండగానే ఆమె సొంత సోదరుడు.. మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి కత్తితో చెల్లెలి గొంతుకోసి దారుణంగా అంతమొందించాడు. నిందితుడు గతంలోనూ హత్యాయత్నం చేసినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని సహచర న్యాయవాదులు ఆరోపించారు. పోలీసుల తీరును నిరసిస్తూ హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. చేవెళ్ల, రాజేంద్రనగర్ ప్రాంతాల నుంచి న్యాయవాదులు వందల సంఖ్యలో తరలిరావడంతో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లికి చెందిన గొటిక శాంతయ్యకు ఇద్దరు భార్యలు (వెంకటమ్మ, మల్లమ్మ) ఉన్నారు. పెద్ద భార్యకు ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. వీరిలో పెద్ద కుమార్తెకు వివాహమైంది. చిన్న కుమార్తె స్వప్న(25), కొడుకు రాజు మధ్య ఆస్తి తగాదా నడుస్తోంది. (శాంతయ్య కొన్నేళ్ల క్రితమే చనిపోగా ఆస్తులు వెంకటమ్మ, మల్లమ్మ పేర్ల మీద బదిలీ అయ్యాయి). చేవెళ్ల కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న స్వప్న.. కేతిరెడ్డిపల్లిలోని ఎకరం భూమిని విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. బుధవారం పొలం వద్ద కొలతలు తీసి హద్దులు పాతారు. విషయం తెలుసుకున్న అన్న రాజు... మరో ఇద్దరితో కలిసి ఘటనా ప్రదేశానికి వచ్చాడు. ఇద్దరి మధ్య వివాదం పెరగడంతో.. వెంట తెచ్చిన కత్తితో స్వప్న గొంతు కోశాడు. దీంతో అక్కడికక్కడే ఆమె చనిపోయారు. ఘటన జరిగిన సమయంలో వారి తల్లి వెంకటమ్మ అక్కడే ఉన్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇన్‌స్పెక్టర్ జి.పవన్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది వచ్చారు. మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు.

కార్పొరేట్ స్కిల్స్

కార్పొరేట్ సంస్థల్లో పై స్థాయికి చేరుకోవడానికి కేవలం నైపుణ్యాలే ప్రామాణికం కావు. ఎన్నో అంశాలు ప్రభావితం చేస్తాయి. వాటిలో అత్యంత ముఖ్యమైంది మనోనిబ్బరం. అంటే ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ భావోద్వేగాలకు లోనుకాకుండా సహనంతో సవాళ్లను స్వీకరించాలి. విమర్శలు, తప్పులకు కుంగిపోకుండా ముందుకెళ్లాలి. ప్రతిభావంతులైన ఉద్యోగులెందరో మనోనిబ్బరం లేకపోవడంతో రాణించలేకపోతున్నారు. అందువల్ల యువ ఉద్యోగులు ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలి.



మనోనిబ్బరం కార్పొరేట్ సోపానం

గణేష్ ఒక సాధారణ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ పూర్తిచేశాడు. ఆ తర్వాత ఒక బహుళ జాతి సంస్థలో మేనేజ్‌మెంట్ ట్రెయినీగా చేరాడు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన అతడికి కార్పొరేట్ పరిభాష, సీనియర్స్ ఉపయోగించే సాంకేతిక పదాలు అర్థమయ్యేవి కావు. ఆంగ్ల సంభాషణల్లోని లోతు మొదట్లో తెలిసేది కాదు. ఫలితంగా తొలి ప్రాజెక్టును నిర్ణీత గడువు లోగా పూర్తి చేయలేకపోయాడు. కార్పొరేట్ వాతావరణం, పని ఒత్తిడి, అంచనాల భారం అతడిపై ప్రభావం చూపాయి. ప్రాజెక్టులో జరిగిన తప్పుల కారణంగా టీమ్ లీడర్ బహిరంగంగానే అతడి సామర్థ్యాలపై సందేహం వ్యక్తపరిచారు. దీంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన గణేష్ ఉద్యోగం మానేయాలని నిర్ణయించుకున్నాడు. ఇదే విషయాన్ని టీమ్ లీడర్‌కు తెలిపాడు.

తప్పులు జరుగుతున్నాయంటే అది కెరియర్‌కు ముగింపు కాదని, నేర్చుకునేందుకు ఒక అవకాశం అని టీమ్ లీడర్ అతడికి చెప్పారు. భావోద్వేగాలను అదుపులో పెట్టుకుని సహనంతో సవాళ్లను ఎదుర్కొనే శక్తిని పెంచుకోవాలని ధైర్యం నూరిపోశారు. కార్పొరేట్ సంస్థల్లో విజయం సాధించాలంటే మనోనిబ్బరంతో, అవరోధాలను అధిగమించి నిలదొక్కుకునే లక్షణం పెంపొందించుకోవాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. కెరియర్ సంక్షోభాలను వ్యూహాత్మకంగా ఎదుర్కొనేందుకు సహనం అవసరమని చెప్పారు. మరో అవకాశం తీసుకుని ప్రయత్నించమని టీమ్ లీడర్ అతడిని ప్రోత్సహించారు. ఈ మాటలన్నీ గణేష్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. అతడు తక్కువ వ్యవధిలోనే అదనపు నైపుణ్యాలను పెంపొందించుకొని మెరుగైన పనితీరు ప్రదర్శించాడు. కొన్నేళ్లకే టీమ్ లీడర్‌గా పదోన్నతి పొందాడు. గణేష్ విజయంలో విద్యార్హతల కంటే మనోనిబ్బరమే కీలక పాత్ర పోషించింది.

ఎక్కడ నేర్చుకోవాలి?

ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుని లక్ష్యాలు ఎలా సాధించాలి? ఉత్పాదకత పెంచే విధానాలు, పని పద్ధతులపై కార్పొరేట్ సంస్థలు శిక్షణ ఇస్తాయి. కార్పొరేట్ ఉద్యోగి రోజువారీ విధి నిర్వహణలో ఎదురయ్యే విమర్శలు, తిరస్కరణలు ఎలా ఎదుర్కోవాలో ఏ కళాశాలలూ, సంస్థలూ నేర్పవు. ఎవరికి వారే తెలుసుకోవాలి. ఈ విషయాల్లో అవగాహన లేకపోవడంతో చాలా మంది యువ ఉద్యోగుల కెరియర్ మధ్యలోనే ఆగిపోతోంది. వాళ్లు ఎంత ప్రతిభావంతులైనప్పటికీ నిరాశతో ఉద్యోగాన్ని వదిలేస్తున్నారు. యువ ఉద్యోగులు వృత్తిలో ఎదురయ్యే పొరపాట్ల నుంచి నేర్చుకుని ముందుకు సాగాలి. తాత్కాలిక అపజయాన్ని శాశ్వత పరాజయంగా భావించకూడదు. ఇదే మీ నిజమైన మనోనిబ్బరానికి నిదర్శనం.

మనోనిబ్బరం సిలబస్‌లో భాగం కాదు కాబట్టి మేనేజ్‌మెంట్ పాఠాల్లో ఈ అంశాలను నేర్పరు. వ్యాపారంలో భావోద్వేగాల కంటే ఫలితాలే ముఖ్యం. అందువల్ల కార్పొరేట్ సంస్థలూ ఇలాంటి వాటిపై దృష్టి సారించవు. కానీ, ఉద్యోగ విజయంలో అత్యంత కీలకమైన అంశాల్లో ముఖ్యమైంది మనోనిబ్బరమే. ఇది ఉన్న ఉద్యోగులు పరాజయం నుంచీ పాఠాలు నేర్చుకుని, కార్పొరేట్ నిచ్చెనలో పై మెట్లకు చేరుకుంటారు.

మనోనిబ్బరం లోపించిన ఉద్యోగులు చిన్న విమర్శలకే మానసికంగా అలసిపోతారు. పని విధానాలపై వచ్చే ప్రతిస్పందనను వ్యక్తిగత దాడి గానూ భావిస్తారు. ఫలితంగా ఏ సంస్థలోనూ నిలకడగా కొనసాగలేరు. దీంతో తరచూ ఉద్యోగాలు మారాల్సి వస్తుంది. రెజ్యూమెలో అస్థిరత ఏర్పడి వృత్తిలో స్తబ్ధతకు దారితీస్తుంది.

మౌన సూత్రం

కార్పొరేట్ కెరియర్ ఒక సుదీర్ఘ ప్రయాణం. ఇక్కడ ప్రతిభతో మీరు ఒక మెట్టు అధిరోహిస్తే మనోనిబ్బరం మిమ్మల్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది. విఫలమవడం తప్పు కాదు, కానీ వైఫల్యం చెందిన ప్రతిసారీ ఒక కొత్త పాఠంతో మళ్లీ లేవడమే నిజమైన విజయం. బిజినెస్ స్కూల్స్ నేర్పని అసలైన కార్పొరేట్ విజయ రహస్యం ఇదే.

– దొరైరాజ్
సీనియర్ జనరల్ మేనేజర్, ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్



ఏమిటీ నైపుణ్యం?

సాంకేతిక నైపుణ్యాలు, మంచి శిక్షణతో యువ ఉద్యోగార్థులు కార్పొరేట్ సంస్థల్లో కొలువులు సంపాదిస్తారు. కాలేజీల్లో వ్యాపార వ్యూహాలు, నాయకత్వ పాఠాలూ నేర్పుతారు. అయితే ఏ కాలేజీ నేర్పని ముఖ్యమైన జీవన నైపుణ్యం మనోనిబ్బరం. దీని ద్వారా ఉద్యోగులు పరాజయం నుంచీ పాఠాలు నేర్చుకుని కార్పొరేట్ రంగంలో ముందుకు సాగగలరు. దెబ్బతిన్న చోటే మళ్లీ శక్తిమంతంగా నిల్చుని, కష్టాలను ఎదుర్కొనే మానసిక దృఢత్వం సంతరించుకోగలరు. కార్పొరేట్ సంస్థల్లో చేపట్టిన ప్రాజెక్టులు కొన్నిసార్లు విఫలమవుతాయి. దీంతో ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించవచ్చు. ఇలాంటి సందర్భాల్లో భావోద్వేగాలకు లోనుకాకుండా మనోనిబ్బరంతో ముందుకు సాగేవారికే విజయం సాధించే అవకాశాలు ఎక్కువ.

విద్యార్థి దశలో ప్రతి ప్రయత్నానికీ ఒక విలువ ఉంటుంది. కానీ ఉద్యోగిగా కార్పొరేట్ సంస్థలో చేరిన తర్వాత వాస్తవాలు ఇందుకు భిన్నంగా ఉంటాయి. కొన్నిసార్లు ప్రాజెక్ట్ విజయంలో మీరు కీలక పాత్ర పోషించినా ప్రశంసలు టీమ్ లీడర్‌కే దక్కవచ్చు. మీ ప్రస్తావనే రాకపోవచ్చు. ఈ పరిణామంతో మీరు నిరుత్సాహానికి లోనైతే కెరియర్‌లో ఎదుగుదల ఆగిపోతుంది. ఇలాంటి అనుభవాలను వృత్తిగత జీవితంలో ఒక భాగంగా తీసుకోవాలి. మీ వృత్తిలో నైపుణ్యత పెంచుకుంటూ పనిచేస్తే, తదుపరి విజేత మీరే అవుతారు.

పదో తరగతి చదువుతున్నాను. ఉన్నత విద్యలో ఆసక్తి లేదు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్(ఏటీసీ)లో చేరితే వెంటనే ఉపాధి లభిస్తుందా, అక్కడ ఎలాంటి కోర్సులు నేర్పుతారు, ప్రవేశం ఎలా లభిస్తుంది. - రమేష్

ఏటీసీల్లో ఎలాంటి కోర్సులు?

■ ఇటీవల కాలంలో కొంతమంది విద్యార్థులు పదో తరగతి పూర్తయ్యాక సంప్రదాయ విద్య కంటే నేరుగా ఉద్యోగానికి అవసరమైన నైపుణ్య ఆధారిత శిక్షణ వైపు ఆసక్తి చూపిస్తున్నారు. ఇలాంటి వారికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లు అందుబాటులో ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐలను ఏటీసీలుగా మార్చే ప్రయత్నం చేస్తూ ఉంది. ఇవి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను నేర్పించి, శిక్షణ పూర్తయిన వెంటనే ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తాయి. భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, స్కిల్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో అనేక గుర్తింపు పొందిన కేంద్రాలు ఈ విధమైన శిక్షణను అందిస్తున్నాయి.

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్‌లో సాధారణంగా పరిశ్రమలకు అవసరమైన హై డిమాండ్ టెక్నికల్ కోర్సులు ఉంటాయి. ముఖ్యంగా రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, సీఎన్‌సీ మెషిన్ ఆపరేషన్ అండ్ ప్రోగ్రామింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ మెయింటెనెన్స్, మెకట్రానిక్స్, పీఎల్‌సీ/స్కాడా సిస్టమ్స్, హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఇండస్ట్రియల్ వెల్డింగ్, ఆటోమొబైల్ సర్వీసింగ్ లాంటి కోర్సులు ఎక్కువగా అందుబాటులో ఉంటాయి. కొన్ని కేంద్రాలు డ్రోన్ టెక్నాలజీ, త్రీడీ ప్రింటింగ్, ఇండస్ట్రియల్ రోబోట్ ఆపరేషన్ లాంటి ఆధునిక విభాగాల్లోనూ శిక్షణ ఇస్తున్నాయి. ఈ కోర్సుల వ్యవధి సాధారణంగా 1–2 ఏళ్లు ఉంటుంది.

✦ ఏటీసీల ముఖ్యమైన ప్రత్యేకత ప్లేస్‌మెంట్ అసిస్టెన్స్. అనేక కేంద్రాలు పరిశ్రమలతో ఒప్పందాలు కుదుర్చుకొని శిక్షణ పూర్తయ్యాక క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయి. విద్యార్థి నైపుణ్యాలు, ప్రాక్టికల్ పరిజ్ఞానం బాగా ఉంటే ట్రెయినీ టెక్నీషియన్, మెషిన్ ఆపరేటర్, జూనియర్ ఎలక్ట్రీషియన్, సర్వీస్ టెక్నీషియన్ లాంటి ఉద్యోగాల్లో చేరవచ్చు. శిక్షణలో చూపిన ప్రతిభతోనే అవకాశాలు ఉంటాయని గుర్తుంచుకోవాలి.



✦ సాధారణంగా పదో తరగతి మార్కులతో ఏటీసీల్లో ప్రవేశం పొందవచ్చు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రం ఆప్టిట్యూడ్ టెస్టు లేదా ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ప్రభుత్వ పథకాలతో నడిచే కేంద్రాల్లో ఫీజు నామమాత్రంగా ఉంటుంది.

✦ చదువుకోవడం కంటే ప్రాక్టికల్‌గా పని చేయడం ఇష్టపడే వారికీ, త్వరగా ఉపాధి పొందాలనుకునే వారికీ, భవిష్యత్తులో స్వయం ఉపాధి (వర్క్‌షాప్, సర్వీస్ సెంటర్) ప్రారంభించాలనుకునే వారికీ ఏటీసీలు ఎంతో అనుకూలం.

ఉన్నత విద్యలో ఆసక్తి లేకపోయినా, ఏటీసీల్లో నైపుణ్యాలు సంపాదిస్తే మంచి కెరియర్ నిర్మించుకోవచ్చు. సరైన కేంద్రాన్ని ఎంచుకొని, కోర్సు నాణ్యత, సర్టిఫికేషన్ గుర్తింపు, ప్లేస్‌మెంట్ రికార్డు లాంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకోండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

బీఈసీఐఎల్‌లో

బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● ఖాళీలు: 154.

విభాగాలు: జూనియర్ టెక్నీషియన్, అసిస్టెంట్ ఇంజినీర్, సెక్యూరిటీ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్, చీఫ్/ సీనియర్ డైటీషియన్, చీఫ్/ జూనియర్ మెడికల్ రికార్డ్ ఆఫీసర్, మెడికల్ రికార్డ్ టెక్నీషియన్, చీఫ్ మెడికల్ సోషల్ సర్వీస్ ఆఫీసర్, సూపర్‌వైజింగ్ మెడికల్ సోషల్ సర్వీస్ ఆఫీసర్, మెడికో సోషల్ వర్కర్, సైకియాట్రిక్ సోషల్ వర్కర్, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్, చీఫ్ ఫార్మసిస్ట్, ఫార్మసిస్ట్ గ్రేడ్-1, చైల్డ్ సైకాలజిస్ట్, కోడింగ్ క్లర్క్, సీఎస్ఎస్‌డీ ఆఫీసర్, సూపర్‌వైజర్, అటెండెంట్, ఈఈ, హెల్త్ ఎడ్యుకేటర్, డ్రెస్సర్, మెకానిక్, మేనేజర్, లీగల్ అసిస్టెంట్, లైబ్రేరియన్, ఎంటీఎస్.. తదితర విభాగాల్లో ఖాళీలు ఉన్నాయి.

అర్హత: సంబంధిత విభాగంలో టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ, డిగ్రీ(సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్), పీజీతో పాటు పని అనుభవం ఉండాలి.

వేతనం: పోస్టులను అనుసరించి నెలకు రూ.17,000 నుంచి రూ.1,00,000 వరకు.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.295. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు ఫీజు లేదు.

పోస్టు ద్వారా దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: ఫిబ్రవరి 18.

చిరునామా: బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్), బీఈసీఐఎల్ భవన్, సీ-56/ఏ-17, సెక్టార్-62, నోయిడా-201307 (ఉత్తర్‌ప్రదేశ్)

ఎంపిక: స్కిల్ టెస్ట్/ ఇంటర్వ్యూతో. **వెబ్‌సైట్:** https://www.becil.com/Vacancies

ప్రాజెక్ట్ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్), గోరఖ్‌పూర్.. తాత్కాలిక ప్రాతిపదికన పలు విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● ప్రాజెక్ట్ రిసెర్చ్ సైంటిస్ట్-II (నాన్-మెడికల్) - 04
● ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-III - 02
● సీనియర్ ప్రాజెక్ట్ అసిస్టెంట్ - 01
● డేటా ఎంట్రీ ఆపరేటర్ - 01

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ/ పీహెచ్‌డీ (బయోస్టాటిస్టిక్స్, పాపులేషన్ జియోగ్రఫీ/ డెమోగ్రఫీ) ఉండాలి.

వయసు: 30 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి.

వేతన శ్రేణి: నెలకు రూ.29,200 - 80,400. **ఎంపిక:** ఇంటర్వ్యూతో

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 21.02.2026

ఇంటర్వ్యూ తేదీ: ఫిబ్రవరి 23

వేదిక: మ్యూనిటీ అండ్ ఫ్యామిలీ మెడిసిన్ విభాగం, అకడమిక్ బ్లాక్, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, గోరఖ్‌పూర్.

వెబ్‌సైట్: https://aiimsgorakhpur.edu.in/current-notices/

యంగ్ ప్రొఫెషనల్స్

ఇండియన్ అగ్రికల్చర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఏఆర్ఐ), దిల్లీ.. తాత్కాలిక ప్రాతిపదికన పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● రిసెర్చ్ అసోసియేట్: 03
● యంగ్ ప్రొఫెషనల్-2: 10
● ల్యాబ్ అసిస్టెంట్: 03

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం ఉండాలి.

వేతనం: నెలకు రిసెర్చ్ అసోసియేట్‌కు రూ.61,000 - 67,000, యంగ్ ప్రొఫెషనల్-2కు రూ.42,000, ల్యాబ్ అసిస్టెంట్‌కు రూ.30,000.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 14.

ఎంపిక: ఇంటర్వ్యూతో.

వెబ్‌సైట్: https://www.iari.res.in/bms/announcements/jobs.php

ఇంటర్న్‌షిప్స్

హైదరాబాద్‌లో

కంటెంట్

సంస్థ: యాక్ట్‌అండ్‌గెస్
నైపుణ్యాలు: కేన్వా, కంటెంట్ రైటింగ్, ఇన్‌ఫ్లుయెన్సర్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.5,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 21
☛ https://tinyurl.com/mt9xzmnd

కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్

సంస్థ: అహం ఫౌండేషన్
నైపుణ్యాలు: కేన్వా, కంటెంట్ రైటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఈమెయిల్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ఎంఎస్-ఆఫీస్, రిసెర్చ్ అండ్ అనలిటిక్స్
స్టైపెండ్: రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 21
☛ https://tinyurl.com/2ysxf8ct

సేల్స్

సంస్థ: థిక్ షేక్ ఫ్యాక్టరీ ప్రై.లి.
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, మార్కెటింగ్, సేల్స్, సేల్స్ మేనేజ్‌మెంట్, సేల్స్ సపోర్ట్
స్టైపెండ్: రూ.8,000-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 21
☛ https://tinyurl.com/3ujrp377

ఇంటీరియర్ డిజైనర్

సంస్థ: డీడబ్ల్యూపీ ఇంటీరిక్స్ ప్రై.వి.
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ఆటోక్యాడ్, ఆటోడెస్క్ 3డీస్ మ్యాక్స్, ఆటోడెస్క్ రెవిట్, ఎన్‌స్కేప్, గూగుల్ స్కెచప్, లుమియన్, ఎంఎస్-ఆఫీస్, వి-రే
స్టైపెండ్: రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 20
☛ https://tinyurl.com/28c3hhfj

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: సాయి ప్రవంతి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.12,000-15,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 19
☛ https://tinyurl.com/4fcdzavc

గుంటూరు, విజయవాడల్లో

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: రాగ్ డిజైన్ స్టూడియో
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, క్రియేటివ్ సూట్, ఇలస్ట్రేటర్, ఇన్‌డిజైన్, ఫొటోషాప్, లైట్‌రూమ్ సీసీ, ప్రీమియర్ ప్రో, కోరల్‌డ్రా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్
స్టైపెండ్: రూ.5,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 22
☛ https://tinyurl.com/ywry8j5p

ఫీల్డ్ సేల్స్

సంస్థ: అడామ ఇండియా ప్రై.లి.
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, మార్కెట్ రిసెర్చ్, తెలుగు మాట్లాడటం
స్టైపెండ్: రూ.7,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 14
☛ https://tinyurl.com/3xr7ycw5

డిప్యూటీ మేనేజర్లు

ఎగ్జిమ్ బ్యాంక్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన 20 డిప్యూటీ మేనేజర్ (బ్యాంకింగ్ ఆపరేషన్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంబీఏ/ సీఏ అర్హతలతో దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో నియామకాలు ఉంటాయి.

మొత్తం ఉద్యోగాల్లో అన్‌రిజర్వ్‌డ్‌కు 10, ఎస్సీకి 3, ఎస్టీకి 1, ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు 5, ఈడబ్ల్యూఎస్‌కు 1 కేటాయించారు.

ఎంపిక: ప్రొఫెషనల్ నాలెడ్జ్-సబ్జెక్టివ్ టెస్టుతో ఎంపిక చేస్తారు. ఈ పరీక్షకు 100 మార్కులు. ప్రశ్నపత్రంలో రెండు విభాగాలు ఉంటాయి. పార్ట్-1లో ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్ నుంచి ఒక ప్రశ్న అడుగుతారు. దీనికి 40 మార్కులు. పార్ట్-2లో 8 ప్రశ్నలు వస్తాయి. వీటిలో ఏవైనా 6 ప్రశ్నలకు సమాధానాలు రాస్తే సరిపోతుంది. ఈ విభాగానికి 60 మార్కులు. వ్యవధి రెండున్నర గంటలు.

✦ రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో ప్రతిభతో తుది నియామకాలుంటాయి. రాత పరీక్షకు 70 శాతం, ఇంటర్వ్యూకు 30 శాతం వెయిటేజీ ఇస్తారు.

✦ రాత పరీక్ష ఫిబ్రవరిలో నిర్వహించవచ్చు. వివరాలు వెబ్‌సైట్‌లో ఉంచుతారు.



అర్హత: 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ, ఫైనాన్స్/ ఇంటర్నేషనల్ బిజినెస్/ ఫారిన్ ట్రేడ్ స్పెషలైజేషన్‌తో పీజీ లేదా సీఏ ఉండాలి. బ్యాంకులు/ ఆర్థిక సంస్థల్లో ఏడాది పాటు పనిచేసిన అనుభవం, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.

వయసు: 31.12.2025 నాటికి 21 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీలకు రూ.600. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మహిళలకు రూ.100.

వేతన శ్రేణి: నెలకు రూ.48,480-85,920. మూలవేతనానికి అదనంగా ఉచిత వసతి/హెచ్ఆర్ఏ, హౌసింగ్, వెహికల్, పర్సనల్ కంప్యూటర్, చిల్డ్రన్ ఎడ్యుకేషన్ లోన్లు.. మొదలైన సదుపాయాలు ఉంటాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15.02.2026

వెబ్‌సైట్: https://www.eximbankindia.in/careers

మల్టీ టాస్కింగ్ స్టాఫ్

సెంట్రల్ రోడ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఆర్ఆర్ఐ), న్యూదిల్లీ.. మల్టీ టాస్కింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. రాత పరీక్షతో నియామకాలు ఉంటాయి.

పోస్టు: మల్టీ టాస్కింగ్ స్టాఫ్

ఖాళీలు: 10

అర్హత: పదోతరగతి/ తత్సమానం. ఇంటర్మీడియట్ పూర్తిచేసినవారికి ప్రాధాన్యం.

వయసు: 25 సంవత్సరాలు మించరాదు.

వేతన శ్రేణి: నెలకు రూ.18,000-56,000

ఎంపిక: రాత పరీక్ష ఓఎంఆర్/ కంప్యూటర్ బేస్డ్ మల్టిపుల్ ఛాయిస్ విధానంలో.. పదోతరగతి స్థాయిలో నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో 150 ప్రశ్నలతో ఉంటుంది. వ్యవధి రెండున్నర గంటలు.



పరీక్షలో: నాలుగు సెక్షన్ల నుంచి ప్రశ్నలు ఉంటాయి. జనరల్ ఇంటెలిజెన్స్-25 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్-25, జనరల్ అవేర్‌నెస్-50, ఇంగ్లిష్ లాంగ్వేజ్-50 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకూ మూడు మార్కులు. తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. పరీక్షలో ప్రతిభతో నియామకాలుంటాయి.

వివరాలు

దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మహిళలు/ మాజీ సైనికోద్యోగులకు ఫీజు లేదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 23.02.2026

వెబ్‌సైట్: http://www.crridom.gov.in/

ఐఐటీ గోవాలో

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గోవా (ఐఐటీజీ) ఒప్పంద ప్రాతిపదికన అసిస్టెంట్ రిజిస్ట్రార్, టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగాలను ప్రకటించింది.

● అసిస్టెంట్ రిజిస్ట్రార్-1 ● టెక్నికల్ అసిస్టెంట్-04

అర్హత: సంబంధిత విభాగంలో 50 శాతం మార్కులతో డిగ్రీ/ పీజీ (కెమిస్ట్రీ/ సీఎస్ఈ/ ఫిజిక్స్)తో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

ఎంపిక: ఇంటర్వ్యూతో

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 20.02.2026

వెబ్‌సైట్: https://iitgoa.ac.in/non-teaching-position-regular/

అసిస్టెంట్ ప్రొఫెసర్లు

జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్(జిప్మర్), పుదుచ్చేరి.. ఒప్పంద ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

● అసిస్టెంట్ ప్రొఫెసర్: 10

విభాగాలు: క్లినికల్ ఇమ్యునాలజీ, ఎండోక్రైనాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ (సర్జికల్), మెడిసిన్(హెమటాలజీ), నియోనెటాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, డెర్మటాలజీ. **అర్హత:** సంబంధిత విభాగంలో ఎండీ/ డీఎం/ ఎంసీహెచ్‌తో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: 21.02.2026 నాటికి 50 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

వేతనం: నెలకు రూ.1,42,506.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 21.02.2026 **ఎంపిక:** ఇంటర్వ్యూతో

వెబ్‌సైట్: https://jipmer.edu.in/announcement/jobs

జూనియర్ ఇంజినీర్లు

బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్), నోయిడా.. ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ ఇంజినీర్, సూపర్‌వైజర్, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● జూనియర్ ఇంజినీర్: 03
● సూపర్‌వైజర్: 02
● మల్టీ టాస్కింగ్ స్టాఫ్: 01

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్, ఐటీఐ, డిగ్రీ (సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్)తో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: 40 సంవత్సరాలు మించరాదు.

వేతనం: జూనియర్ ఇంజినీర్‌కు రూ.55,000, సూపర్‌వైజర్‌కు రూ.42,000, మల్టీ టాస్కింగ్ స్టాఫ్‌కు రూ.27,000. **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.295. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు ఫీజు లేదు.

పోస్టు ద్వారా దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 18.02.2026

చిరునామా: బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్), బీఈసీఐఎల్ భవన్, సీ-56/ఏ-17, సెక్టార్-62, నోయిడా-201307 (ఉత్తర్‌ప్రదేశ్).

ఎంపిక: స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూతో

వెబ్‌సైట్: https://www.becil.com/Vacancies

గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గోవా (ఐఐటీజీ) గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ (జనరల్ స్ట్రీమ్) ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. ● గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ (జనరల్ స్ట్రీమ్)- 03 **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ ఉండాలి. **స్టైపెండ్:** నెలకు రూ.12,300. **ఎంపిక:** ఇంటర్వ్యూతో

ఇంటర్వ్యూ తేదీ: 17.02.2026

వేదిక: అడ్మిన్ బ్లాక్, ఐఐటీ గోవా, జీఈసీ క్యాంపస్, ఫార్మాగుడి, పోండా, గోవా.

వెబ్‌సైట్: https://iitgoa.ac.in/non-teaching-position-regular/

సీనియర్ ఇంజినీర్లు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), బెంగళూరు యూనిట్.. సీనియర్ ఇంజినీర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ● సీనియర్ ఇంజినీర్: 04

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ లేదా ఎంఈ/ఎంటెక్‌తో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: 01.02.2026 నాటికి 32 ఏళ్లు ఉండాలి.

వేతన శ్రేణి: నెలకు రూ.50,000 - 1,60,000.

దరఖాస్తు ఫీజు: రూ.600. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, ఈఎస్ఎంలకు ఫీజు లేదు.

ఎంపిక: రాత పరీక్ష/ఇంటర్వ్యూతో

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 24.02.2026

వెబ్‌సైట్: https://bel-india.in/job-notifications/